ISSN 2278-3423

Anveshi
RESEARCH CENTRE FOR WOMEN'S STUDIES

# సమకాలీన రాజకీయాలపై బ్రాడ్‌షీట్

# లైంగికత, వేధింపులు: విశ్వవిద్యాలయాల్లో మారుతున్న జండర్ రాజకీయాలు

*సంచిక : 6&7 (త్రైమాసికం)* | *తెలుగు & ఇంగ్లీష్* | *డిసెంబర్ 2013* | *విరాళం : 25 రూ.*

<u>విషయసూచిక</u>


- సంపాదకీయం
- చరిత్రని సందర్శిస్తున్నాం *-అస్మా రషీద్, మధుమిత సిన్హా*
- లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు : అంతర్-వర్గ బురదలోకి ప్రవేశించగలవా? *-కె.సి.బిందు*
- జండర్, విద్యాప్రపంచం *-కె.సునీతా రాణి*
- సమానత్వం *-సల్మా అహ్మద్ ఫరూఖీ*
- మనల్ని వదలిపోని మనువు *-మిరప మాధవి*
- ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు *-బి.సత్తమ్మతో ఇంటర్వ్యూ*
- యూనివర్సిటీల్లో దళిత విద్యార్థినుల పరిస్థితి గురించిన ఆలోచనలు *-సౌజన్య*
- మహిళా విద్యార్థి వేదిక-గమనాన్వేషణ *-రేఖా పప్పు*
- విలింగ లైంగికత, లైంగిక హింస *-సామియా వాసా*
- వక్రీకృత దర్పణాలు : లైంగిక హింస *-పర్నాల్ చిర్మూలే*
- జండర్ చైతన్యం కోసం, అందరినీ కలుపుకునిపోయే ప్రయత్నం: ఒక విమర్శనాత్మక పరిశీలన *-అనూ ఆంటోనీ, గ్రీష్మా జస్టిన్ జాన్*
- లైంగిక న్యాయం పట్ల 'ఆదరణ' : కొన్ని ప్రశ్నలు *-చందు*
- పోస్టుమార్టం పోస్ట్‌పోన్ అవుతూనే వుంది!! *-చల్లపల్లి స్వరూపరాణి*
- ఐడెంటిటి కార్డు *-ఎస్.జోసెఫ్*
- దళితేతర స్త్రీలు! కులం పని చేస్తుంది! దళిత ఫెమినిస్టు మానిఫెస్టో
- సంవాద్ లక్ష్యాల, ఉద్దేశాల పరిచయం
- ఒక తల్లీ కూతుళ్ళ సంభాషణ *-లీలా గౌతమ్, గీతా రామస్వామి*
- హైదరాబాదులో మహిళల అర్థరాత్రి కవాతు: ఒక నివేదిక *-మరనాథా వహ్‌లాంగ్, మాడభూషి తేజస్విని*
- ఎస్.ఎమ్.ఎస్‌లతో వేధింపులు *-జనని*
- హైదరాబాదులో నాగా విద్యార్థులు- క్యాంపస్ రాజకీయాలు *-ఎలికా అస్సుమి*
- కనిపించని వేధింపులు - దృష్టి లోపం గల ఒక స్త్రీ దృక్పథం *-రీమ్ శంషుద్దీన్*





*ఇది 2013 జనవరి 5న జరిగిన మిడ్ నైట్ మార్చ్ ఆహ్వాన పోస్టర్ పైన వున్న చిత్రం. వారు దీన్ని అమెరికాలో జరిగిన 'టేక్ బాక్ ది నైట్' కార్యక్రమ (అంతర్జాల) పోస్టర్ నుండి తీసుకున్నారు. అందరికి కృతజ్ఞతలతో...*


- కుచ్ కుచ్ హోతాహై *-అంజలి పాధియాత్*
- క్యాంపస్‌లో స్త్రీ పురుషుల అస్తిత్వ రూపకల్పన : 'సై' మరియు 'హ్యాపీడేస్' చిత్రాలలో ఆకర్షణ, అధికారం *-వెన్నెల*
- యూనివర్సిటీ క్యాంపస్‌లలో మారుతున్న కోరికల, హింసల చిత్రపటం *-అపర్ణా నంద కుమార్*

- ఫోటో ఫీచర్ - *అచుత్ అజిత్, రియా దే, యాన్ జార్జ్*


***ప్రత్యేక సంపాదకులు :*** *మధుమితా సిన్హా, అస్మా రషీద్*

***సంపాదకులు:*** *ఎ. సునీత, ఆర్. శ్రీవత్సన్, ఎమ్.ఎ.మోయిద్*

***అడ్వయిజరీ బోర్డ్:*** *షీలా ప్రసాద్, అయేషా ఫరూకీ, రమా మెల్కోటే, కె.సజయ, పి.మాధవి, బి.శ్యామసుందరి, సూజీ థారు, వీణా శత్రుఘ్న, డి.వసంత, కె.లలిత, ఎన్.వసుధ, గోగు శ్యామల, ఉమ భృగుబండ, వి.ఉష.*

***ప్రొడక్షన్:*** *ఏశాల శ్రీనివాస్, తాడేపల్లి శ్రీలక్ష్మి*

***ప్రచురణ సంస్థ : అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్,*** 2-2-18/49, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ, అంబర్‌పేట్, హైదరాబాదు-13.

వ్యాసాలలోని సమాచారం, దృక్పథాలు, అభిప్రాయాలు, వ్యాసకర్తలవి, ప్రత్యేక సంపాదకులవి

# సంపాదకీయం

ఈ సంచికలో "లైంగికత, వేధింపులు : విశ్వ విద్యాలయాల్లో మారుతున్న జండర్ రాజకీయాలు" అనే అంశంపై ఒక చర్చను మీ ముందుకు తీసుకువస్తున్నాము. క్యాంపస్‌లలో జండర్ విషయాలపై సహానుభూతిని పెంచడానికి ఇది ఒక ప్రయత్నం. సామాన్యంగా వినిపించే అభిప్రాయాలు, పక్షపాత ధోరణులు, మూసపోసిన సిద్ధాంతాలకు భిన్నంగా ఉండే వ్యాసాలను మేము ఎంచుకున్నాము. వ్యాసాలు కూడా భిన్న స్థానాల నుండి, దృక్పథాల నుండి రాయబడినవి. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న అనేక సంఘర్షణలకు విశ్వవిద్యాలయాలు సారవంతమైన క్షేత్రంగా రూపొందుతున్నాయి. ఆ పోరాటాలు అస్థిత్వానికి, సమానత్వానికి మరియు భిన్నత్వానికి మధ్యకావచ్చు; యూనివర్సిటీ యంత్రాంగ నియంత్రణకు, విద్యార్థులు తమ ఎదుగుదలకు కోరే స్వేచ్ఛకు మధ్య కావచ్చు: కొంత మంది విద్యార్థుల కుండే సామాజిక ఆధిక్యతలకు, అవి లేని వారికి మధ్య కావచ్చు; ప్రేమకు, బాధకు, స్నేహానికి, దౌర్జన్యానికి మధ్య కావచ్చు. ఈ కారణంగానే లైంగికత, వేధింపులపై చర్చలను యూనివర్సిటీ క్యాంపస్ నేపథ్యంలో చర్చించడం జరిగింది. అయితే మేము ఎంచుకున్న అంశాన్ని యూనివర్సిటీలలోని సామాజిక, రాజకీయ నేపథ్యంలో పరిశీలించినపుడు క్యాంపస్‌లలో బలపడుతున్న కులతత్వ ధోరణులు, కుల ఘర్షణలు, హాస్టల్ పరిపాలనా వ్యవహారాలు, నేరపూరితం చేయబడుతున్న విద్యార్థి రాజకీయాలు, లైంగిక న్యాయం పట్ల పాలనా యంత్రాంగ అలసత్వ ధోరణులు వంటి ఎన్నో వివాదాస్పద విషయాలను పరిశీలించి, విశ్లేషించవలసి వచ్చింది.

ఈ సంచిక తీసుకురావాలన్న ఉద్దేశ్యం జనవరి 2013లో జరిగిన 'అర్ధరాత్రి హైదరాబాద్ కవాతు'లో మేము పాల్గొన్న తరువాత కలిగింది. ఈ మార్చ్ ఏ సమయంలోనైనా స్త్రీలు స్వేచ్ఛగా బహిరంగ ప్రదేశాలలో తిరిగే అవకాశాలు ఉండాలనే అంశంపై దృష్టి కేంద్రీకరించటం కోసం నిర్వహించబడింది. ఈ సందర్భంలో ఇఫ్‌ఎల్‌యూ విద్యార్థులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బందితో వేధింపులు, రక్షణకు సంబంధించిన అంశాలపై చర్చిస్తున్నప్పుడు ఆ చర్చలన్నీ క్యాంపస్‌లో అప్పటికే జండర్ రాజకీయాల గురించి జరుగుతున్న పెద్ద సంవాదాలు, చర్చల్లోకి మమ్మల్ని లాక్కెళ్ళాయి. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వారు, ఢిల్లీలో పారా మెడికల్ విద్యార్థినిపై అత్యాచార సందర్భంలో ఉవ్వెత్తున రేగిన ప్రజా నిరసనల తరువాత, 'విశ్వ విద్యాలయాల్లో జండర్ సమానత్వం' పై ఒక అంచనాకు వచ్చేందుకు ఒక 'టాస్క్‌ఫోర్స్' ను నియమించి హైదరాబాదులోని నాలుగు విశ్వవిద్యాలయాలను (ఉస్మానియా, ఇంగ్లీషు మరియు ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, మౌలానా ఆజాద్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాదు యూనివర్సిటీలు) సందర్శించటానికి వచ్చినపుడు మా ఆలోచనలకి ఒక రూపం వచ్చింది. ఈ టాస్క్‌ఫోర్స్ ఉద్దేశం యూనివర్సిటీలలో స్త్రీల రక్షణ, భద్రత, సమానత్వం కోసం కావలసిన సూచనలనివ్వటం. అన్వేషి రిసెర్చ్ సెంటర్ ఫర్ విమెన్స్ స్టడీస్‌ను వారి సందర్శనని అనుసంధానించమని అడిగారు. ప్రతి యూనివర్సిటీకి ఉండే ప్రత్యేక నేపథ్యాన్ని, సందర్భాన్ని అర్థం చేసుకునేందుకు టాస్క్‌ఫోర్స్ వచ్చే ముందు, విద్యార్థులను, అధ్యాపకులను, బోధనేతర సిబ్బందిని చాలాసార్లు కలిసి చర్చలు జరిపాము. అప్పుడు ఈ సంచిక ఆలోచన బలపడింది. వారు వచ్చి వెళ్ళిన తరువాత ఈ సంచిక కోసం ఆ సందర్భంలో వచ్చిన చర్చలని, అంశాలని తరచి చూసుకుంటే కలవరపాటు కలిగించే అనేక విషయాలు ఎదురయ్యాయి. లోతైన ఆలోచన, సరైన ప్రణాళిక లేకుండా విశ్వవిద్యాలయాల్లో మొదలుపెట్టిన డిగ్రీ కోర్సులు, దానివల్ల విద్యార్థులకు ఎదురయ్యే సమస్యల దగ్గర నుండి వైద్య సదుపాయాల లోపం, సరైన సమయంలో అవసరమయిన సలహా, సహకారాలు అందించే ఫిర్యాదుల కమిటీ లేకపోవటం, లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీ (జిఎస్‌క్యాష్) కమిటీకి తగినంత ప్రచారం లేకపోవడం వరకు అనేక అంశాలు ఆ సమయంలో మేము స్పృశించవలసి వచ్చింది. అయితే ఈ సంపుటి ముఖ్య లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని విషయ సంక్లిష్టతని, తీవ్రతని తుడిచిపెట్టకుండా ఈ నాలుగు విశ్వవిద్యాలయాల్లో జండర్ రాజకీయాలకి మా పరిధిని కుదించుకుని, ఆయా క్యాంపస్‌లలో సమానత్వ, స్వేచ్ఛా రాజకీయాలకు, రోజువారీ లైంగిక వేధింపుల అనుభవాలకు మధ్య జరుగుతున్న వివిధ రకాల సంఘర్షణాత్మక సంవాదాలపై దృష్టి కేంద్రీకరించదలచుకున్నాము. ఈ బ్రాడ్‌షీట్‌లో చర్చించిన అంశాలలో హైదరాబాదు బయటి వారికొక్కడా ఉపయోగపడే విషయాలున్నాయని మేం భావిస్తున్నాము.

'లైంగికత'కు సంబంధించిన సమస్యల పరిష్కారం అంత తేలిక కాదు: ఆయా వివాదాలలో చిక్కుకున్న వ్యక్తులకు వాటి వల్ల జరిగే నష్టంలో గానీ, వారా వివాదాన్ని చూసే తీరులోగానీ, వ్యక్తీకరించే పద్ధతుల్లో గానీ చాలా తేడాలుంటాయి. అంతేకాక, యూనివర్సిటీ క్యాంపస్‌లలో ఈ అంశం పాలనా నిబంధనలకు, 'ఉడుకు రక్తమున్న పడుచు యువత'కు మధ్య సంఘర్షణాంశంగా కూడా తయారయింది. వీటన్నిటి మధ్య సయోధ్య కుదర్చాలంటే ప్రత్యేక సమస్యలొచ్చినపుడు సరైన పరిష్కారాలివ్వటమే సరిపోదు. భిన్నాభిప్రాయాలను ఒక చోటకు తెచ్చి పరస్పర గౌరవంతో చర్చలు జరిపించగల దక్షత ఉన్న పాలనా యంత్రాంగం కూడా యూనివర్సిటీలలో ఉండటం అత్యంత అవసరం.

లైంగికత సమస్యలను, సమానాధికార రాజకీయాలను విశ్లేషించేటప్పుడు యూనివర్సిటీలోని "హాస్టల్" ఒక కీలకమైన వేదికగా కనిపిస్తుంది. ఆడపిల్లలు ఈనాడు ఎక్కువగా పెద్ద చదువుల కోసం వెళ్లడానికి హాస్టల్ సౌకర్యం ఒక ముఖ్య కారణం. మా స్నేహితురాలు, సహాధ్యాయి సునీత చదువుకునే అమ్మాయిల జీవితంలో హాస్టల్ ఎంత ముఖ్యమైన పాత్ర వహిస్తుందో ఆసక్తికరమైన ఉదాహరణలతో చెప్పింది. ఆడపిల్లలు మొదటిసారి జీన్స్ వేసుకోవటం, జుట్టుకు రంగు వేసుకోవటం, అర్ధరాత్రి వరకు రాజకీయ చర్చలు చేయడం, సెకండ్ షో సినిమాలు చూడడం, తొలి ప్రేమ అనుభవం, ఇవన్నీ కూడా అమ్మాయిలు అనుభవించేది మొదటిసారిగా హాస్టల్‌లోనే. అయితే సమాజ అవగాహనలో అమ్మాయిల హాస్టళ్లు ఒక రకమైన లైంగిక స్వేచ్ఛకు ప్రతీకగా లేదా కఠినమైన క్రమశిక్షణ చట్రంలో బిగించి ఆడపిల్లల ప్రవర్తనను నియంత్రించే స్థలాలుగా పేరు పొందాయి. చాలా వరకు ఆడపిల్లల హాస్టళ్లలో సాయంత్రం బయట ఉండే సమయానికి ఆంక్షలు ఉంటాయి. అదే మగ పిల్లల హాస్టళ్లకి ఇది వర్తించదు. వారి విషయంలో అటువంటి నిబంధనలు అనవసరం, అసాధ్యం అనుకుంటారు.

మనం గమనించవలసిన ఇంకొక ముఖ్యమైన మార్పు గత పది సంవత్సరాలలో పై చదువుల కోసం వస్తున్న విద్యార్థి వర్గాలలో వచ్చింది. ముఖ్యంగా వెనుకబడిన వర్గాల, కులాల నుండి వచ్చే విద్యార్థుల సంఖ్య ఎక్కువైంది. అయితే విశ్వవిద్యాలయాల్లో ఈ విధంగా వివిధ నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థుల సంస్కృతి, అలవాట్లు, అభిరుచులు తెలుసుకుని అర్థం చేసుకునే ప్రయత్నం పెద్దగా జరగలేదు. దీంతో పై చదువులను హక్కుగా, వారసత్వంగా భావించే విద్యార్థి వర్గాలకు, కొత్తగా ఇందులోకి అడుగుపెడుతున్న వర్గాలకు మధ్య సంఘర్షణ అనివార్యం అయింది. కొత్తగా వచ్చి చేరుతున్న విద్యార్థుల సాంఘిక, రాజకీయ నేపథ్యం వారిని విశ్వవిద్యాలయాల్లో ఇమడలేని వారిగా చేస్తుందని, వారందుకే హింసకు పాల్పడతారని, వక్ర రాజకీయాలకు పాల్పడతారని చాలా మందిలో ఒక ప్రబల నమ్మకం ఉంది. మేము టాస్క్ ఫోర్స్ తరఫున వెళ్లినపుడు అనేక విద్యార్థి సంఘాలు కులాల ప్రాతిపదికన ముఖ్యంగా దళిత, బహుజన, ఆదివాసి వర్గాల వారి కోసం ఏర్పడినవి కనిపించాయి. ఇవి కాకుండా వామపక్ష భావాలను సమర్థించే సంఘాలు,

మితవాద పక్ష సంఘాలు కొన్ని ఉన్నాయి. అయితే ఈ సంఘాలు వేటిలో కూడా నిర్ణయాత్మక అధికార హోదాల్లో స్త్రీ సభ్యులు లేరు. ఈ లోపం వలన విద్యార్థి రాజకీయాలు 'మగవాళ్ళ వ్యవహారం'గా మారిపోయాయి. స్త్రీలు, పురుషులు సమానంగా చర్చించుకునే వేదిక లేకుండా పోయింది. యూనివర్సిటీలలో మేము కలిసిన అమ్మాయిలు అనేక మంది ఈ పరిస్థితిని గర్హించారు. వారు చెప్పినదాని ప్రకారం ముఖ్యమైన నిర్ణయాలన్నీ రాత్రుళ్లు మగపిల్లల హాస్టళ్లలో జరిగిపోతాయి. అయితే యూనివర్సిటీ అధికారుల వద్దకు గాని, మీడియా ముందుకు గాని వెళ్లేటప్పుడు సంఘంలోని స్త్రీ సభ్యులను వెంట రమ్మని ప్రోత్సహించడం జరుగుతుంది. ఆడవాళ్లు కూడా ఉండడం వలన ఈ సంఘాల విలువ పబ్లిక్‌లో పెరుగుతుంది. సంఘాలలో ప్రజాతంత్ర ధోరణి ఉన్నట్టు పేరు కూడా వస్తుందని కాబోలు! అయితే ఇందులో ఒక చిన్న చిక్కుముడి ఉంది. మధ్య తరగతి అమ్మాయిలు సాధారణంగా ఈ విద్యార్థి సంఘాలను పిడివాద, అనాగరిక సంస్థలుగా భావించి దూరంగా ఉంచడం జరుగుతుంటుంది. ఇటువంటి పట్టణ మధ్య తరగతి (స్త్రీల) నిర్లిప్తతకి, ఎంతో కాలంగా వీటన్నిటికీ దూరంగా పెట్టుబడి వ్యవస్థలోకి ఇప్పుడిప్పుడే ప్రవేశించిన వర్గాలకి వ్యవస్థ నుండి, వ్యక్తుల నుండి ఎదురవుతున్న ఈ నిర్లిప్తత పట్ల పెరుగుతున్న అసహనం, కోపానికీ మధ్య ఒక మధ్యే మార్గం కనిపెట్టడం చాలా కష్టతరమైన పని. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలంటే ఇటువంటి దారి చూపగల గ్రూపులను తయారు చెయ్యాలి. ఇవి అధికార సంఘాల వలె కాక వ్యక్తులకు దగ్గరగా ఉండే విధంగా పని చెయ్యాలి. వీటిలో విద్యార్థులు, అధ్యాపకులు, పాలనా యంత్రాంగం తరఫు వ్యక్తులు, అందరి భాగస్వామ్యం ఉండాలి. ఈ గ్రూపులు తీవ్ర విభేదాలను, ఉద్రిక్తతను తగ్గించే మాధ్యమాలుగా పని చెయ్యాలి. ఈ విధమైన చర్యలు చేపట్టకపోతే నేటి విశ్వవిద్యాలయ రాజకీయాలు, ఇంకా లోతుగా కుల, వర్గ, మత, భాషా వర్గీకరణలో కూరుకుపోయే ప్రమాదం ఉంది.

గత రెండు దశాబ్దాలలో స్త్రీవాద సిద్ధాంతాల వలన స్త్రీలకు లభించిన స్వేచ్ఛ వారి జీవితాలలో వచ్చిన లోతైన మార్పులు దృష్టిలో పెట్టుకుని విశ్వవిద్యాలయాలను నిజమైన ప్రజాతంత్రవ్యవస్థలుగా పునర్నిర్మించుకోవాలి. ఇక్కడ కావలసింది కేవలం స్త్రీలకు రక్షణ కల్పించటం మాత్రమే కాదు, 1970, 80 దశకాలలో స్త్రీవాద పోరాటాల వలన సాధించిన విజయాలను గుర్తు చేసుకుని వాటి పైన కొత్త సౌధాలను నిర్మించుకోవాలి. ఆడపిల్లలకు ప్రత్యేకమైన హాస్టళ్లు, స్కాలర్‌షిప్‌లు, విద్యార్థి రాజకీయాలలో చురుకుగా పాల్గొనడం, అలాగే విశ్వవిద్యాలయ పాలనా వ్యవస్థలో స్త్రీల సంఖ్య గణనీయంగా పెరగడం, ఇవన్నీ స్త్రీవాద ధోరణులు బలపడడం వలన జరిగిన పరిణామాలే. స్త్రీవాద సిద్ధాంతాలపైన యూనివర్సిటీలలో కొత్త కోర్సులు, ప్రతి యూనివర్సిటీలో లైంగిక వేధింపుల నివారణ కమిటీ ఉండాలన్న నిర్బంధం, ఇవన్నీ కూడా స్త్రీవాద ఉద్యమాల ఫలితమే. ఈ ప్రయోజనాలన్నీ కాపాడుకుంటూ ఛాందస ధోరణులున్న పాలనా యంత్రాంగాన్ని ఏ విధంగా ఎదుర్కోవాలన్నది మన ముందున్న ప్రశ్న. ఉదాహరణకు, యూనివర్సిటీలోని లైంగిక వేధింపుల నివారణ కమిటీలు తప్పు జరిగాక చేపట్టే చర్యల మీద ఎక్కువ ధ్యాస పెడతాయి కాని లింగ బేధాలు, అసమానతలకు సంబంధించిన అంశాల పట్ల అవగాహన పెంచే ప్రయత్నం చెయ్యవు. పాలనా యంత్రాంగాన్ని, విద్యార్థి సంఘాలను, ఇతర విద్యార్థులను, అధ్యాపకులను జాగృతం చేసే చర్యలపై ఎక్కువ దృష్టి పెట్టవు. ప్రస్తుత నేపథ్యంలో ఎవరు వేధింపులకు గురవుతున్నారు? ఎవరి వలన? సమస్యను ఏవిధంగా అర్థం చేసుకోవాలి? పరిష్కరించడానికి ఏ మార్గం ఎంచుకోవాలి? అన్నిటికన్నా సముచితమైన పరిష్కారం ఏమిటి, అది ఎలా తెలుస్తుంది? వంటి అనేక అంశాలను మనం మరింత లోతుగా పరిశీలించాలి.

ఇంట్లో, బయటా కూడా కుట్ర పూరితమైన నిశ్శబ్దం నుండి బయటపడి, వీధుల్లో కూడా నిరసన ప్రకటిస్తూ, మీడియాలో స్త్రీలపై అత్యాచారాలు, వేధింపుల గురించి విస్తృత ప్రచారం చేసే స్థాయికి పరిస్థితులు మారాయి. తమపై జరిగే అత్యాచారాలకు తామే బాధ్యులమనే ఆరోపణలను ఖండిస్తూ, నేడు స్త్రీలు నిర్భయంగా తమ స్వేచ్ఛను నిర్ణయాలను ప్రకటిస్తున్నారు. అయితే ప్రాంత, కుల వర్గ రాజకీయాలలో ఇరుక్కుని ఉన్న లింగ వివక్ష సమస్యల పరిష్కారాల కోసం మనం ఇంకా దారులు వెతుకులాడుతున్నాం. ఈ బ్రాడ్‌షీట్ సంపుటి జండర్ సమస్యలపై నేడు యూనివర్సిటీ క్యాంపస్‌లలో, బయటా జరుగుతున్న చర్చలకు ఒక కొత్త కోణం జత చేస్తుందని మా నమ్మకం. క్యాంపస్‌లలో మారుతున్న నేపథ్యాలను కేవలం లింగ బేధాల గురించే కాక స్త్రీలు, పురుషులు అనే బృందాలలోని అంతర్గత భేదాలను దృష్టిలో పెట్టుకుని స్వేచ్ఛ, సమానతలపై తాజా ఆలోచనలు మొదలవుతాయని మా ఆకాంక్ష. ఇందులో ఎంచుకున్న కవిత్వం, వ్యాసాలు అన్నీ కూడా విశ్వవిద్యాలయాల గురించి మనకున్న సాధారణ అవగాహనలోని, ప్రత్యేకంగా జండర్ పట్ల ఉన్న చీలికలను బయటపెడుతూ ఒక నూతన సంభాషణకు నాంది పలుకుతాయని మేము ఆశిస్తున్నాము.

**– మధుమితా సిన్హా మరియు అస్మా రషీద్**
ఇఎఫ్ఎల్‌యులో అధ్యాపకులు
**అనువాదం : శ్యామసుందరి**









# జండర్‌ను అనువదించటంలోని సమస్యలు

ఈ సంకలనంలో జండర్ అన్న పదాన్ని అనువదించేటప్పుడు, సందర్భాన్ని బట్టి లింగం, లింగ వివక్ష, లింగ భేదం, లైంగిక వివక్ష అన్న పదాలు, పద బంధాలు వాడటం జరిగింది. ఇన్ని వాడినా సరే, ఇబ్బంది కరంగాను, అసంపూర్ణం గాను అనిపిస్తోంది. వ్యాసకర్తల భావాలని తెలుగులోకి పెట్టటం కష్టంగా ఉందనే ఆలోచన ఈ సంకలన అనువాదకులకి వచ్చినందు వల్ల పాఠకులతో మా ఆలోచనలు పంచుకుంటున్నాము.

జండర్‌కి తెలుగులో వాడుతున్న పదం, లింగం. అయితే లింగం అంటే వ్యక్తులకు 'సమాజ సిద్ధంగా' పుట్టుకతో సంక్రమించే 'సెక్స్' అనే భావన ప్రధానంగా ఉంది. ఉదాహరణ, లింగ నిర్ధారణ పరీక్షలు అన్న పదబంధం: ఇంగ్లీషులో జండర్ స్త్రీలని స్త్రీలుగా, పురుషులని పురుషులుగా మార్చే సమాజ ప్రక్రియలను, ఆ ప్రక్రియల్లో వుండే అసమానతలను, హింసను, వివక్షను సూచించటానికి రెండు దశాబ్దాల క్రింద వాడటం మొదలైంది. సెక్స్ పదం – దాని పరిమితులు అర్ధమయిన తరుణంలో జండర్ పదం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పదాన్ని ఒక క్రియా రూపంలో (జండరింగ్), వ్యవస్థీకృత రూపంలో (జండర్డ్), మారుతూ వున్న నిర్మాణ రూపంలో (ఛేంజింగ్ జండర్) వాడే అవకాశాలు వున్నాయి. దీని చుట్టూ ఏర్పడిన సిద్ధాంత పనిముట్లు 'పితృస్వామ్యం' గురించిన సిద్ధాంతంలో స్త్రీలు, పురుషుల మీదనే దృష్టి కేంద్రీకరించటాన్ని విమర్శించి, స్త్రీత్వం పైనే కాక, పురుషత్వాన్ని అర్ధం చేసుకునే ప్రయత్నాలు అవసరమని, పితృస్వామ్యం పురుషులని కూడా వాడుకుంటుందని సూత్రీకరించాయి. ఈ విశ్లేషణ స్త్రీలు, పురుషులు అన్న రెండు వర్గాలు కాక, అనేక లింగాలు ఉంటాయని, అందరి దృక్కోణం నుండీ సమాజాన్నీ, పితృస్వామ్య స్వరూపాలని విమర్శించటం అత్యంత అవసరం అన్న దృక్పథాన్ని ముందుకు తీసుకురావటంలో ఉపయోగపడింది.

తెలుగులో పితృస్వామ్య సిద్ధాంతం చుట్టూ జరిగిన చర్చ వేరే దిశలో జరిగింది. మొదట వర్గానికి, పురుషాధిపత్యానికి వున్న సంబంధం చుట్టూ, ఆ తరువాత పితృస్వామ్యం చుట్టూ, ఇప్పుడిప్పుడే కులానికి, పితృస్వామ్యానికి ఉన్న సంబంధాలని అర్ధం చేసుకునే దిశగా చర్చ నడుస్తోంది. స్త్రీలూ, పురుషులూ అన్న 'వర్గాల' (కేటగిరి)లో కులము, వర్గము, జాతీయత మొదలైన సాంఘిక నిర్మాణాలు సృష్టించే అంతర్గత భేదాలపై జరిగిన చర్చ గత రెండు దశాబ్దాలలో కొన్ని పదాలని అందరికీ సుపరిచితం చేసింది. అగ్రకుల స్త్రీలు, సవర్ణ స్త్రీవాదం దళిత పితృస్వామ్యం, దళిత స్త్రీవాదం, వీటిలో కొన్ని. అయితే ఇప్పటికీ స్త్రీలు, పురుషులు అన్న వర్గ వర్ణనలు (భేదాలు ఉన్నప్పటికీ) నిలకడ గానే వున్నాయి. కాబట్టి జండర్ అన్న పదం తెలుగులో అంత ప్రాచుర్యం పొందలేదు. పొందిన చోట్ల, దీనిని 'స్త్రీ' అన్న పదానికి ప్రత్యామ్నాయంగా వాడటం జరుగుతోంది. (ఒక

| ఆంగ్ల పదం | తెలుగు పదం |
|---|---|
| Altemate Sexuality | ప్రత్యామ్నాయ లైంగికతలు |
| Choice of Sexuality | లైంగికతను ఎంచుకోవటం |
| Desire | ఆకర్షణీయత, ఆకర్షణ, కోరిక, వాంఛ |
| femininity | స్త్రీత్వం, ఆడతనం |
| Figure of the Upper Caste Women | అగ్రకుల స్త్రీ మూర్తి |
| Fluidity of Gender | లైంగికతలో వచ్చే మార్పులు |
| Gender | లింగం, లింగ బేధం, లింగ వివక్ష, జండర్ |
| Gender Role | స్త్రీలు, పురుషులకు సమాజమిచ్చిన పాత్రలు, స్త్రీ–పురుష పాత్రలు |
| Gender Sensitivity | లింగ స్పృహ, సున్నితత్వం, జండర్ స్పృహ, లింగ బేధాల గురించిన అవగాహన |
| Hetero Sexuality | విలింగ లైంగికత |
| Homo Sexuality | స్వలింగ లైంగికత |
| Masculinity | పురుషత్వం, మగతనం |
| Politics of Gender | లింగ రాజకీయాలు, లైంగిక రాజకీయాలు, జండర్ రాజకీయాలు |
| Sexual Harassment | లైంగిక వేధింపులు |
| Sexual Orientation | లైంగిక తీరులు |
| Sexual Violence | లైంగిక హింస, దౌర్జన్యాలు |

స్వచ్ఛంధ సంస్థ నిర్మాహకులు, తమ దగ్గరున్న స్త్రీ కార్యకర్తల్ని పరిచయం చెయ్యటానికి – మా దగ్గర ఇద్దరు జండర్‌లు ఉన్నారు అని మా స్నేహితుడితో అన్నారు).

ఇంకో పక్క, పితృస్వామ్యం అన్న పదానికి వున్న బలమైన సిద్ధాంత భూమిక, రాజకీయ స్ఫురణ 'జండర్–లింగం' అన్న పదానికి ఏర్పడ లేదు కూడా. స్త్రీ–పురుష అన్న కేటగిరీలలో ఇమడని వ్యక్తుల 'లింగాన్ని'– మూడవ జండర్‌గా, అంటే స్త్రీగా పుట్టి పురుషులుగా బ్రతకాలనుకునే వారు, పురుషులుగా పుట్టి స్త్రీత్వాన్ని ఇష్టపడే వారు, ప్రత్యామ్నాయ లైంగికతలతో బతకాలనుకునే వారి అస్తిత్వాలని ఇముడ్చుకునే శక్తి ఈ పదానికి సమకూరలేదు. అలాగే, 'లైంగికత' అన్న పదం ఇప్పటికీ ప్రధానంగా స్త్రీ పురుషుల మధ్య ఆకర్షణను, సంబంధాలను, బేధాలను మాత్రమే సూచిస్తుంది అందువల్లే 'హెటిరో సెక్షువాలిటి' అన్న పదానికి తెలుగులో ఏ పదం వాడుకలో లేదు. అయితే లైంగికత అన్న పదం వ్యక్తుల తీరుల్ని సూచిస్తుందేమో కాని, హెటిరో సెక్సువాలిటి అన్న పదంలాగా వ్యవస్థీకృతం అయిన నిర్మాణాన్ని సూచించే అర్ధాన్ని పొందలేదు. విలింగ లైంగికత అన్న పదం ఇటువంటి అర్ధాన్ని సంతరించుకోవాలి.

అదే విధంగా, హోమోసెక్షువాలిటి అన్న పదానికి తెలుగులో ఉపయోగించే 'స్వలింగ సంపర్కం' అన్న పద బంధం ఒక వ్యక్తి పెట్టుకున్న సంబంధాన్ని సూచిస్తుంది కానీ సంబంధాల్లో లేని వ్యక్తుల జీవనశైలిని, తీరుల్ని, వారి అస్తిత్వాలన్నీ సూచించదు. గత రెండు దశాబ్దాలుగా జరుగుతున్న ఈ చర్చ తెలుగులోకి రాకపోవడం వల్ల, లేదా తెలుగులో తమ జీవితాలని వ్యక్తీకరించుకునే ప్రయత్నం వారు చేయకపోవటం ఈ పదానికి సరైన తెలుగు పదం వాడుకలో లేదు. అయితే విలింగ లైంగికతకు చెందని కాటగిరీలు: గే (పురుషునికి–పురుషునికి మధ్య), లెస్బియన్ (స్త్రీకి–స్త్రీకి మధ్య), ట్రాన్స్–జండర్ (సమాజమిచ్చిన లింగ అస్తిత్వాన్ని ఒప్పుకోని వ్యక్తులు–ఒక లింగంలో పుట్టి ఇంకో లింగానికి చెందాలని అనుకోవడం, శారీరకంగా మార్పులు చేసుకోవటంతో సహా) బై–సెక్సువల్ (స్త్రీలు, పురుషులు ఇద్దరితో శారీరక సంబంధాలు పెట్టుకునే వ్యక్తులు) కోసం పదాలు వెతకటానికి మేము ప్రయత్నించలేదు.

రెండు భాషా/సిద్ధాంతా/చర్చా ప్రపంచాలలో వున్న ఈ తేడాల వల్ల ప్రాచుర్యంలో వున్న పదాలు నచ్చని అనువాదకులు ఇంగ్లీషు పదాలనే వాడినప్పుడు అలాగే వుండనిచ్చాము. పాఠకుల సౌలభ్యం కోసం పదాలు, వాటి తెలుగు అనువాదాలు క్రింద ఇచ్చాము. వీటిపై చర్చ జరిగి సరైన, నిర్దిష్టమైన అర్ధాలున్న పదాలు భవిష్యతులో వాడుకలోకి వస్తాయని మేము ఆశిస్తున్నాం.

**– సంపాదక బృందం తరపున ఎ. సునీత**

# చరిత్రని సందర్శిస్తున్నాం

## హైదరాబాద్‌లో ఉన్న మూడు విశ్వవిద్యాలయాలలో స్త్రీల సంఘాలు

(కె.లలిత, రేఖాపప్పు, ఎ.సునీత, కావ్య కృష్ణ, స్వాతి మార్గరేట్‌లతో చేసిన చర్చలనాధారంగా రాసిన వ్యాసం)

■ అస్మా రషీద్, మధుమితా సిన్హా

లైంగిక హింస, ఇతర హింసలు, అన్యాయాలని వ్యతిరేకిస్తూ, స్త్రీలకి రక్షణ కోరుతూ చాలా మంది ఎప్పటినుండో చేస్తున్న పోరాటాలే మనకీరోజు ఈ విషయాల మీదున్న అవగాహనకి మూలాలు. అవే ఇప్పుడు జరుగుతున్న పోరాటాలని కూడా రూపుదిద్దుతున్నాయి. విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో లింగ వివక్షతకి వ్యతిరేకంగా జరిగిన పోరాటాల గురించి అందరం ఎంతో కొంత వినే ఉంటాం కానీ, వాటిలో పాల్గొన్న వ్యక్తుల మాటల ద్వారా విషయాలని తెలుసుకుని మనమెంత దూరం ప్రయాణించామో (చేసి ఉంటే) అర్థం చేసుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో ఉపయోగకరమని భావిస్తూ అటువంటి చరిత్ర ఈ రోజు జరుగుతున్న పోరాటాలకి స్ఫూర్తినిస్తుందనే నమ్మకంతో మేము ఈ చర్చని మీ ముందు పెడుతున్నాం.

ఈ ప్రయత్నంలో భాగంగా మేము గత నాలుగు దశాబ్దాలలో విద్యార్థులు చేపట్టిన పోరాటాలలో భాగస్వాములుగా ఉన్న ఐదుగురు వ్యక్తులతో ఈ విషయాల గురించి చర్చించాం వారు :

కె.లలిత: ప్రగతిశీల మహిళా సంఘం, ఉస్మానియా విశ్వవిద్యాలయం 1970లలో

రేఖాపప్పు : మహిళా విద్యార్థి వేదిక, హైద్రాబాద్ యూనివర్సిటీ, 1990లలో

ఎ.సునీత : హైద్రాబాద్ యూనివర్సిటీ 1990ల మధ్య

కావ్య కృష్ణ : సంవాద్, ఇఫ్ఎల్ యూనివర్సిటీ

స్వాతి మార్గరేట్ : 2010 ఆలీసమ్మ కలెక్టివ్, హైద్రాబాద్ యూనివర్సిటీ, 2000లలో

వారెదుర్కున్న సవాళ్ళు, అధిగమించలేని అడ్డంకుల గురించి చెప్పమని అడిగాము.

**ఆరంభం**

చిన్నదో పెద్దదో ఏ సంఘటన ఐనా అందులో మన స్నేహితులకి సంబంధించినదైనప్పుడు మనం దాన్ని గురించి పట్టించుకొంటాం....పాల్గొంటాం. అందుకే మా మొదటి ప్రశ్న 'పాల్గొనటం' ఎప్పుడు ప్రారంభించారని?

**కె.లలిత :**

ప్రగతిశీల మహిళా సంఘం ఒక అధ్యయన బృందం గ్రూపుగా మొదలైందని, దానిలో భాగంగా తాము సోషలిస్టు స్త్రీవాదులైన బెట్టి ఫ్రైడన్, షూలామిత్ ఫైర్‌స్టోన్, జెర్మైన్ గ్రీర్ రచనలని చదివేవారమన్నారు. వాటితో పాటు చదివిన మార్క్సిస్టు, మావోయిస్టు సాహిత్యం లైంగిక రాజకీయాల పట్ల, వేధింపుల పట్ల తమ ఆలోచనల్ని ప్రభావితం చేసాయన్నారు. ఇంతా చేస్తే 40 మంది అబ్బాయిల మధ్య పట్టుమని అరడజను అమ్మాయిలు కూడా లేమని, ఇంగ్లీషు మాట్లాడుతూ క్యాంటిన్‌కి వెళ్ళి చాయ్ తాగటానికి, టేబుల్ టెన్నిస్ ఆడటానికి 'ధైర్యం' చేసినందుకు, 'రాడికల్స్', ఆధునిక స్త్రీలు', 'బరితెగించిన వాళ్ళు', 'ఫార్వర్డ్' అని పేరు తెచ్చుకున్నామన్నారు. ఒంటరిగా తిరగటానికి సంకోచించి గుంపుగానే తిరిగినా, తాము క్యాంపస్‌లో 'కొట్టొచ్చినట్లు' కనపడేవారమన్నారు.

**రేఖా పప్పు:**

మాకున్న గుర్తింపు కూడా కొంత వరకూ లలిత చెప్పిన విషయాలతో పోలి ఉంది అన్నారు రేఖా పప్పు. 1990లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థి ఎన్నికల సందర్భంలో, అభ్యర్థిగా నిలిచిన ఒక అమ్మాయి కోసం పెట్టిన పోస్టర్ వివాదాస్పదమయ్యింది. ఆ పోస్టర్ మీద ఎవరో బూతు మాటలు రాసారని, అదే సమయంలో హాస్టల్ విద్యార్థినుల రక్షణ కోసం నియమించబడ్డ సెక్యూరిటీ గార్డులే వారిని 'వేశ్యల'నటంతో బాగా అలజడి చెందిన విద్యార్థులు ఆవిషయమై విద్యార్థుల జనరల్ బాడీ మీటింగ్ పెట్టడానికి దారి తీసింది. ఆ మీటింగ్‌లో తమల్ని పరిచయం చేసుకోవాల్సి వచ్చినప్పుడు అమ్మాయిల్లో కొందరు తమని వ్యక్తులుగా పరిచయం చేసుకోకుండా మేము 'మహిళా విద్యార్థి వేదిక' సభ్యులం అన్నారు. ఆ సంస్థల్లో చురుగ్గా పాల్గొన్న వాళ్ళలో చాలా మంది ఇంగ్లీష్ విభాగానికి చెందినప్పటికీ, మరి కొందరు సైన్స్, సోషల్ సైన్స్ విద్యార్థినులు కూడా ఉండేవారు.

**సునీత**

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో చేరక ముందు తనకు రాజకీయాలతో అంత పరిచయం, ఏ రకమైన సంఘాలలో సభ్యత్వం ఉండేది కాదన్నారు సునీత. WSF గురించి తమ విన్నది కానీ 1994 నాటికి అది అంత చురుకుగా పని చేయటం లేదన్నారు. రాజకీయ శాస్త్ర విభాగంలో చేరినందువల్లో, లేదా తనకి పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుల ప్రభావితం మూలానో మానవ హక్కుల సమస్యల నుద్దేశించి పని చేసే సంస్థలకే చేరువయ్యారు. 1994లో లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన క్రికెట్ పోటీని చూద్దామని వెళ్ళిన సామాజిక శాస్త్ర విభాగానికి చెందిన అమ్మాయిల్ని, వారి సొంత క్లాస్ మేట్సే అక్కడ వేధించడం జరిగినప్పుడు క్యాంపస్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన ఒక చర్చా కార్యక్రమం సందర్భంలో విద్యార్థినులపై జరిగే 'వివక్షత' హింసల గురించి ఏదైనా చేయాలనే ఆలోచనకి తనలో నాంది పలికిందన్నారు సునీత. ఆ రోజుల్లో తన స్నేహితులు, క్లాసుమేట్లు అయిన అబ్బాయిలు ఆ అమ్మాయిల నుద్దేశించి వాడిన భాష ఎంతో కలవరపరిచిందనీ అని, తను 'ప్రగతిశీల విద్యార్థి వేదిక' లో చేరడానికి దారి తీసిందని అన్నారు.

> **స్వాతి మార్గరేట్**
>
> *కుల వ్యవస్థకి అతీతమనుకున్న ఉన్నత కుల స్త్రీవాద రాజకీయాలు తమకున్న 'కులపెట్టుబడి'ని తరచి చూసుకోవాలి...లేకపోతే 'హింస'కి ఉన్న బహు ముఖాల గురించిన అవగాహన పొందడానికి ఆస్కారం ఉండదు.*

**స్వాతి మార్గరెట్**

తను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎమ్.ఎ. చదవడానికి చేరినప్పుడు రెండు వైవిధ్యమైన విషయాలు కలవరపరిచాయి అన్నారు స్వాతి :

(1) కులమనేది తన అస్తిత్వానికున్న మౌలిక అంశమని తాను పెద్దయ్యేటప్పుడు వచ్చిన అవగాహన

(2) దళిత, బహుజన, స్త్రీవాద సాహిత్యం గురించి తాను డిగ్రీ చదివేటప్పుడు జరిగిన చర్చలు. ఆ క్యాంపస్‌లో తనకి లభించిన స్నేహాలు, పరిచయాలు తన కలవరాన్ని వ్యక్తీకరించటానికి, పంచుకోవడానికి కొంత వరకూ ఉపయోగించాయి. 'దళిత విద్యార్థు'ల కోసం అప్పటికే ఉన్న సంఘాలు కూడా దళిత స్త్రీలు తమ సమస్యల్ని చర్చించుకోవడానికి అవకాశాలు కల్పించాయి. అయితే దళిత విద్యార్థులు తమని "మా స్త్రీలు" అనీ, సహాయం కోసం వారిని అర్థించవచ్చని మాత్రమే భావించేవారు. అంటే, దళిత 'విద్యార్థిను'లని ఆలోచించే శక్తి, మేధోపరమైన శక్తి ఉన్న స్త్రీలుగా పరిగణించలేదని; రచనలు చేయాల్సి వచ్చినపుడూ, ఇతర మేధోపరమైన అంశాల గురించిన చర్చల్లో దళితేతర స్త్రీలని మాత్రమే సంప్రదించే వారని స్వాతి పేర్కొన్నారు. నిజానికి దళిత విద్యారులకే కాక దళితేతర స్త్రీవాదులకి కూడా దళిత స్త్రీల పట్ల చిన్న చూపు ఉండేదని తమ మధ్య సంబంధాలు ఎప్పుడూ అంతంత మాత్రంగా ఉండేవి అన్నారు స్వాతి.

**కావ్యకృష్ణ**

ఇంగ్లీషు మరియు ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీలో సంవాద్ ఏర్పడిన పరిస్థితులను వివరిస్తూ, హాస్టల్

సమస్యల గురించి యూనివర్సిటీ యంత్రాంగంతో జరిపిన పోరాటాలు; కులం, జండర్ గురించి ఏడెనిమిది

> **కావ్యకృష్ణ**
>
> *జండర్ అంశాల మీద LGBT అంశాల మీద పని చెయ్యటం గురించి ఇ.ఎఫ్.ఎల్ క్యాంపస్‌లో వచ్చిన స్పందన: 'అసలు విషయం ఏంటో వాళ్ళకే అర్థం కాలేదు. అసలు సమస్య లేదు.....వాళ్ళు కేవలం ఉందని అనుమానిస్తున్నారు అంతే'*

మంది పరిశోధక విద్యార్థులు కలిసి వ్యాసాలు, పుస్తకాలు చదవటం తోడ్పడ్డాయిన్నారు. కేవలం 'స్త్రీల సమస్యలపై' మాత్రమే దృష్టి కేంద్రీకరించకుండా, జండర్‌కు సంబంధించిన అంశాలు అంటే ప్రత్యామ్నాయ లైంగికతలైన గే, లెస్బియన్, బై సెక్సువల్, ట్రాన్స్‌జండర్‌లను అర్థం చేసుకోవటానికి, ముఖ్యంగా లైంగికత అంటే ఏమిటో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించిందీ బృందం. పోరాడటానికి అధ్యయన మార్గం సరైందని భావించారు. అయితే ప్రారంభంలో బాగా విజయ వంతమైన, అందరి మెప్పుదలా పొందే కార్యక్రమాల తరువాత – కుటుంబ హింస, క్యాంపస్‌లో లైంగిక వేధింపులు వంటి అనేక సమస్యల పరిష్కారాలను వెతకటంలోకి సంవాద్ వెళ్ళిపోయింది. సమస్య లోతుల్లోకి వెళ్ళి, తీవ్రంగా, నెలల తరబడి, నిర్విరామంగా పని చేసిన క్రమంలో దాన్నుండి వచ్చే మానసిక, ఇతర వత్తిళ్ళు సంవాద్ ముఖ్య సభ్యులపై ప్రభావం చూపాయి. వారు లైంగికత గురించి, ప్రత్యామ్నాయ లైంగికత గురించి లేవనెత్తిన అంశాల పట్ల 'నిశ్శబ్దమే' ఇతరుల నుండి జవాబుగా లభించింది. ఎవరూ వాటిపై దృష్టి పెట్టటానికి సిద్ధపడకపోవటం వలనో, ఎవరికీ వాటి గురించి అర్థం కాక పోవటం వలనో ఈ పరిస్థితి ఏర్పడి ఉండొచ్చని తన అభిప్రాయం. సమస్యలపై పని చేసే విద్యార్థి సంఘాలు తమ సభ్యుల్ని వారి సంఘాల్లోకి లాక్కోవాలని ప్రయత్నించటం కూడా తమపై వత్తిడిని పెంచిందని కావ్యకృష్ణ అన్నారు.

## II. చర్చలకి విశ్వవిద్యాలయాల్లో లభించిన వాతావరణం – వేదికలు

కె.లలిత అభిప్రాయంలో 70వ శతాబ్ధంలో విద్యార్థి సంస్థలన్నీ కూడా (వామపక్ష సంఘాలైనా, కానివైనా) నైతికతకి ప్రాధాన్యం ఇస్తూ వివిధ విషయాల మీద పోరాటాలు చేసేవి. స్త్రీలకి పురుషులకి మధ్య సమాజంలో ఉన్న వ్యత్యాసాల గురించిన అవగాహన ఉన్నప్పటికీ, స్త్రీలు సతీసావిత్రుల్లాగా ఉండాలనీ, వారి రక్షణ బాధ్యత తమ మీద ఉన్నట్లూ ప్రవర్తించేవారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల విద్యార్థులని సమీకరించడం కోసం తమ సభ్యులు ఆర్.టి.సి బస్సుల్లో తిరిగే వారనీ, దాని వల్ల చెడ్డ పేరు కూడా వచ్చిందని చెప్పారు. అయితే చాలా మంది విద్యార్థులు వాళ్ళ సొంత కాలేజీ క్యాంపస్‌లు వదిలి బహిరంగ ప్రదేశాల్లో జరిగే సభలకి రావడానికి చొరవ చూపించే వారు కాదనీ చెప్పారు. ఇళ్ళు వదిలి వచ్చిన అమ్మాయిలకి కాలేజీ క్యాంపస్‌లు ఇళ్ళ వలెనే ఉండాలనే భావన చాలా బలంగా ఉండేది. అప్పటికీ ఇప్పటికీ ఉన్న ముఖ్య మార్పుల్లో ఒకటి : ఆడపిల్లలు పెద్ద సంఖ్యలో ఇళ్ళు వదిలి పెట్టి బయట ప్రపంచంలోకి రావడం. రెండోది స్త్రీల పట్ల ఎలా ప్రవర్తించాలి అనే విషయంలో సాంస్కృతికంగా వచ్చిన మార్పులు. ఉదాహరణకి ప్రేమించుకోవడం అనే విషయంలో మరియు సమాజంలో స్త్రీల పాత్ర గురించిన అవగాహనలో అప్పటికీ ఇప్పటికీ చాలా మార్పులొచ్చాయి.

1990ల మొదట్లో, హైదరాబాదు విశ్వవిద్యాలయం నగరానికి సుదూరంలో ఉన్న ఒక ద్వీపం లాగా ఉండేదన్నారు రేఖ. వేధింపుల ఘటనలు, వాటి గురించి మాట్లాడే మాటలు స్త్రీలని ఒక దగ్గరికి తెస్తాయని, అయితే రాజకీయ చైతన్యం ఉన్న అమ్మాయిల మీద అందరి దృష్టి చాలా ఎక్కువగా పడుతుందన్నారు. ఉదాహరణకు నైతిక విషయాల పట్ల అంతగా పట్టింపులేని మధ్యతరగతి అబ్బాయిలకి కుడా మహిళా వేదిక సభ్యులు, ప్రగతిశీల సంఘం సభ్యులతో కలిసి తిరగడం నచ్చేదికాదు అని చెప్పారు. దళిత సమస్యలని చర్చించడం పట్ల ఉండే అయిష్టత కూడా దీనికి కారణమయివుంటుంది. లలిత వాళ్ళ సంఘ సభ్యుల రాడికల్ పోరాట సూర్తికి కారణం వాళ్ళకి అప్పటి వామపక్ష సంఘాలతో ఉన్న పరిచయాలు, సంబంధాలు అయి ఉండవచ్చు. 1990 నాటికి ఈ 'రాడికల్ నెస్' నీరుగారిపోయి ప్రధాన స్రవంతి మార్గంలోకి వెళ్ళి పోయిందేమో అన్నారు రేఖ.

యూనివర్సిటీ క్యాంపస్ చాలా మంది అమ్మాయిలకి కొత్త పద్ధతులను, విషయాలను నేర్చుకుని ప్రాక్టీస్ చేసే ప్రదేశమని సునీత అన్నారు. అవి దుస్తుల్లో మార్పులు (ఉదా. జీన్స్, టీ షర్టులు వేసుకోవడం) కావచ్చు లేదా కొత్త రకమైన స్నేహాలు కావచ్చు. నగర పొలి మేరల్లో నుంచీ, చిన్న చిన్న పట్టణాల్లో పెరిగి ఇక్కడికి వచ్చిన విద్యార్థులకి యూనివర్సిటీ క్యాంపస్ ఎన్నో రకాలుగా తమని తామే సవాలు చేసుకుంటూ ఎదగటానికి కల్పించే ప్రత్యేక ప్రదేశం అని తన అభిప్రాయం. అయితే సరైన మార్గమేదని తెలుకోవడానికి నిరంతరం చర్చ, సంభాషణలు అత్యంత అవసరం. మనసుకి నచ్చిందే సరైన మార్గమని భావించకుండా, ఏ చర్యలు ఎందుకు చేపటుతున్నామనే విషయాన్ని గురించి ఆలోచించాలి. తరగతులు, పరీక్షలు, ఎసైన్‌మెంట్లలో మునిగిపోయి ఉన్నప్పుడు కూడా, బయటి ప్రపంచం ఒకటుందని, దాని తీరుతెన్నులను కూడా గమనిస్తూ నడవాలని గుర్తుంచుకోవాలి.

ఇక ఇఎఫ్ఎల్ విశ్వవిద్యాలయం కొస్తే దీన్లో స్త్రీల సమస్యలనేవీ లేవనీ, స్త్రీలకి విపరీతమైన స్వేచ్ఛ స్వతంత్రాలు, రక్షణ ఉన్నాయి కాబట్టి, దీన్ని జండర్ సెన్సిటివ్ క్యాంపస్ అనే భావన ఉండేది, కానీ నేను దాంతో ఏకీభవించను అంటూ మొదలుపెట్టారు కావ్యకృష్ణ. సంవాద్ వేదిక మొదలుయిన రోజుల్లో ఇఎఫ్ఎల్‌లో సక్రమంగా పనిచేసే క్యాష్ లేదన్నారు. విద్యార్థి సంఘాలు, విశ్వవిద్యాలయ యంత్రాంగం ఎవరూ కూడా స్త్రీల సమస్యల మీద దృష్టి పెట్టాలి అనుకొనేవారు కాదన్నారు. హాస్టల్లో అమ్మాయిలు వాళ్ళ గదుల ముందున్న తాడు మీద ఉతికిన అండర్‌వేర్ ఆరవేసుకోవడం కూడా తప్పని భావించిన వార్డెన్, ఆమె చేసిన మందలింపుల గురించి ప్రస్తావించారు. 'పెళ్ళి కావాల్సిన పిల్లలు, మీరు సర్దుకుపోవడం నేర్చుకోవాలి. ఇలా బరితెగించి ప్రవర్తిస్తే ఎట్లా?' అనేవారు! కావ్య దృష్టిలో వసతి గృహాలని జైళ్ళలాగా బంధించి ఉంచే బదులు మొత్తం క్యాంపస్‌లో స్త్రీలకి ఏ విధంగా రక్షణ కల్పించాలి అనే విషయం పట్ల ఆలోచించాల్సిన అవసరం ఉంది. ఒక వ్యక్తి ఇంకొక వ్యక్తి వైపు కొన్ని నిముషాలు చూసాడని వారిని శిక్షించడం అన్యాయం. మనం చేయాల్సింది విశ్వవిద్యాలయ క్యాంపస్ ఆడపిల్లలకీ, మగపిల్లలకీ కల్పించే అవకాశాల గురించి చర్చించడం; పరస్పర అంగీకారంతో ఆ స్పేస్‌ని మలుచుకోవడం అన్నారు. ఆ స్థలం అందరికీ అనుకూలంగా ఉండాలి కానీ ఏదో ఒక ప్రత్యేక సముదాయానికి మాత్రమే ఆ స్పేస్ మీద పెత్తనం ఉంటే ఎలా అని ప్రశ్నించారు కావ్య.

స్వాతి జ్ఞాపకాల్లో హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని హాస్టల్స్ కులహంకారంతో నిండి ఉండేవి. పొద్దున్న లేవగానే స్నానం గదుల కోసం బారులు కట్టేటప్పుడు ఈ దళిత స్త్రీల పొడు మొఖాలు చూడాల్సి వస్తోందని బాధపడే అమ్మాయిలు, వాళ్ళు ముఖం పక్కకి తిప్పుకోవడం ఎలా మర్చిపోగలను? ఒకప్పుడు నవ్వొచ్చేదేమో కానీ ఇప్పుడు మాత్రం కాదు. ఇక తిండి విషయానికి వచ్చేసరికి ఇంకో రకమైన వివక్ష – తన దగ్గరి స్నేహితురాలైన ఇంకో దళిత స్త్రీ చేపల కూర చాలా బాగా వండేది. కానీ చాలా మందికి ఆ "కంపు" పడేది కాదు. వాళ్లు వండుకునే క్యాబేజీ కంపు గురించి వాళ్ళకి తట్టదని స్వాతి స్నేహితురాలు అనేది. తినకూడనిది వండట్లేదు కదా? అసలు జీవితమంటేనే దుర్భరమైన కంపు అనే విషయం ఆ అమ్మాయిల మనస్సుకి ఎప్పుడైనా తాకిందా? మాంసాహార సమస్య కాదు అది కుల సమస్య. ఎందుకంటే కొంత మంది రష్యా దేశం నుండి వచ్చిన అమ్మాయిలు రకరకాల మాంసాహారాన్ని తినే వారు కానీ దళిత స్త్రీలనుభవించిన వివక్షత వారి మీద ఉండేది కాదు.

వీటన్నిటి కంటే దుర్భరమైన కుల వివక్ష పెద్ద కులాలకి చెందిన అమ్మాయిలు మాత్రమే మేధోపరులనీ, దళిత స్త్రీలు మాత్రం ఆలోచించగలిగే సామర్థ్యం లేని స్త్రీలనే అభిప్రాయం. దీనికి ఒక ఉదాహరణ : విద్యార్థి సంఘాల ఎన్నికల్లో స్త్రీలకి కొన్ని పదవులు కేటాయించాలి అనుకొన్న సందర్భం. ఎస్.సి, ఎస్.టి, ఇతర వెనకబడిన వర్గాల స్త్రీలకి కూడా వేరు వేరుగా రిజర్వేషన్ ఉండాలి అని దళిత విద్యార్థినులు కోరుకొన్నారు. సరే, అభిప్రాయ సేకరణ చేద్దామని నిర్ణయించారు. మెజార్టీ సమర్థించలేదు. కానీ కనీసం ఈ భావన చర్చనీయాంశం అయినందుకు దళిత స్త్రీలు ఆనందపడ్డారు. అగ్ర కులాలకి చెందిన అమ్మాయిలు ఎలాగూ రిజర్వేషన్లకి మద్దతు ఇస్తున్నారు కాబట్టి వారి మాటకే విలువ

ఉంటుంది కాబట్టి వాళ్ళ అభిప్రాయాలకే కట్టుబడి ఉండవచ్చు కదా, మీరీ విషయాన్ని ఓటుకి పెట్టడం దండగ అని తోటి దళిత విద్యార్థులు అన్నప్పుడు తనకీ, తన దళిత స్నేహితురాళ్ళకి కల్గిన బాధ, క్షోభని ఎప్పటికీ మర్చిపోలేను అన్నారు స్వాతి. ఇక్కడ విషయం ఒట్టి సంఖ్యలేనా? 2/3 మెజారిటీ ఓట్లు వచ్చాయా లేదా అని మాత్రమేనా? రిజర్వేషన్లు ఉండాలి అనే వాదనకి ఒక ప్రత్యేకమైన రాజకీయాలని ముందుకు తీసుకువచ్చే శక్తి లేదా? ఆ రాజకీయాల పట్ల నిబద్ధత ఉండొద్దా?
ఈ సంఘటన గురించి ఆ తర్వాత ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురించబడిన వ్యాస రచనలో దళిత స్త్రీలకి ఏమాత్రం పాత్ర లేదు. విద్యార్థినుల మధ్య ఆ రోజుల్లో ఉన్న సంబంధాలు హృదయానికి సంబంధించినవి కావు – పూర్తిగా రాజకీయపరమైనవి. ఇటువంటి వాతావరణంలో మేం ఆలీసమ్మ కలెక్టివ్‌ని ఏర్పరిచాం అన్నారు స్వాతి.

## III. హింస - రక్షణ

ఈ మధ్య కాలంలో స్త్రీల మీద జరిగే హింస, వారికి కల్పించాల్సిన రక్షణ పథకాల గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. వీటి మీద మాట్లాడమన్నప్పుడు లలిత ఇలా అన్నారు : మన చుట్టూ ఉన్న సంస్థల్లో మార్పులు రావాలనుకోవడం ఒక ఎత్తైతే, రక్షణ కావాలనుకోవడం ఇంకొకటి. ఈ మధ్య తను గ్రామీణ ప్రాంతాలకి ఫీల్డ్ ట్రిప్‌లో వెళ్ళాల్సి రావడం అక్కడికి, తనతోపాటు వచ్చిన యుక్త వయసు సహాధ్యాయులైన స్త్రీలు చిన్న లాగులు వేసుకొని పని చేయడం, ఫీల్డ్‌లో వారి స్థానిక గైడ్స్ ఆ స్త్రీల వైపు చూడకుండా ఉండడానికి పడిన అవస్థలని గుర్తుకు తెచ్చుకున్నారు లలిత. సందర్భాలకి అనుగుణంగా ప్రవర్తించడం, అదే సమయంలో మనస్సుని కుంచితం చేసుకోకూడదనే తపన – ఈ రెంటి మధ్య సామరస్యం ఉండాలంటే ఎంతో లోతుగా ఆలోచించాల్సి ఉంటుంది అని అన్నారు.

ఈ విషయం గురించి మగవాళ్ళతోనే కాదు ఆడవాళ్ళతో చర్చించడం కూడా అంత సులభం కాదు అని లలితా, కావ్య ఇద్దరూ అభిప్రాయపడ్డారు. స్త్రీలకి "రక్షణ కల్పించడం" అనే ఆలోచనారీతికి రాజకీయపరంగా కాలం చెల్లింది అన్నారు రేఖ. స్త్రీలు స్వతంత్రంగా, క్షేమంగా ఉండే పరిస్థితులు కల్పించాలి కానీ, వారెంత సేపూ ముందు పొంచి ఉన్న 'ప్రమాదాల' గురించి ఆలోచిస్తూ భయభ్రాంతులవ్వకుండా చూడాలి. ఏదైనా బయట ప్రపంచంలో ఉండే వాతావరణం, ఆలోచనా దృక్పథాలు విశ్వవిద్యాలయాల్లో కూడా ప్రతిబింబిస్తూ ఉంటాయని, మన ఇష్టాయిష్టాలకి, మన చుట్టూ అందరూ ఆమోదించే స్థానిక విలువలను బేరీజు వేసుకుంటూ నడవాలని అన్నారు రేఖ.

అబ్బాయిలూ – అమ్మాయిలూ కలిసి చదువుకోగలిగే విద్యా సంస్థలు ఎక్కువ అవడం, సమాజంలో సంస్కృతి శృంగారపూరితంగా మారటం, ఇద్దరి మధ్య స్నేహాలకి వచ్చిన ఆమోదం, ఎఫ్.ఎమ్ రేడియో మరియు ఇతర సాధనాల ద్వారా కులాసాగా కబుర్లు చెప్పుకునే, వినే అవకాశాలు పెరగడంతో స్త్రీలు పురుషుల మధ్య దగ్గరి తనానికి సమాజంలో ఇదివరకటి కంటే మెరుగైన స్థానం లభించిందని సునీత అభిప్రాయపడ్డారు. అయితే యూనివర్సిటీలలో, పల్లెలు చిన్న పట్నాల నుంచి పెద్ద నగరాల్లోకి వచ్చి స్థిరపడుతున్న విద్యార్థుల సంఖ్య క్రమంగా ఎక్కువ అవడం కొత్త బోధనా సిబ్బంది, బోధన పరిశోధనలకు కావాల్సిన వనరులకి తగిన నిధులు లేకపోవడంతో యాజమాన్యాలు సతమతమవుతున్నాయి. నిధుల కొరత నెదుర్కొంటూ 'మంచి ఫలితాలు' ఎలా చూపించాలో తెలియని పరిస్థితుల్లో క్రమశిక్షణా మార్గాల వైపు మొగ్గుచూపుతూ విద్యార్థుల పట్ల కఠిన వైఖరి చూపుతున్నారు. యుక్త వయస్సుదాటి కొత్త ప్రపంచంలో అడుగేసిన విద్యార్థులు చేసే ప్రయోగాలు అసలు 'స్నేహం' అనే క్లిష్టమైన అంశం గురించి ఏ విధంగా ఆలోచించాలో, మాట్లాడాలో అన్న ఆలోచనతో కలిపి చేయాలని అందరూ అభిప్రాయపడ్డారు.

స్వాతి మాట్లాడుతూ స్త్రీల మీద జరిగే హింస, అత్యాచారాల మీద చర్చలు ఏదైనా ఒక సంఘటన సందర్భంలోనే జరుగుతున్నాయి. హత్య, అత్యాచారం గురించి దేశమంతా వణికిపోవటం బాధాకరం, కానీ రోజు వారీ జరిగే హింస గురించి సరైన చర్చలు జరగడం లేదు. అంటే హత్యలు, అత్యాచారాల గురించి ఆలోచించాల్సిన అవసరం లేదనిచెప్పటం నా ఉద్దేశ్యం కాదు. రోజువారీ జరిగే సంఘటనల గురించి చర్చలు ఎందుకు జరగడం లేదని ప్రశ్నిస్తున్నాను అన్నారు స్వాతి. చల్లపల్లి స్వరూపరాణి 'వంటగది' మీద రాసిన కావ్యం గురించి ప్రస్తావిస్తూ స్వాతి ఇలా అన్నారు. రచయిత్రి తల్లికి అసలు వంటగది అనేదే లేదు అంటే సమస్యలనేవి ఎంతో వైవిధ్యంతో కూడి ఉంటాయి.

**కె.లలిత**

*అది ఈవ్ టీజింగ్ కాదు........ తమాషా కాదు, లైంగిక పరమైన అంశం, వేధించడం, దాడి చేయడం, హింసించటం.*

వాటికి కారణాలు కూడా ఒకే రకంగా ఉండవు. కొన్ని సంస్థాగతమైనవైతే, మరికొన్ని రాజకీయమైనవో, చారిత్రకమైనవో అవ్వొచ్చు. యూనివర్సిటీ హాస్టల్లో ఎదురుపడిన స్త్రీవాదానికి తన గురించి తనకి సమస్యలనేవి లేకపోవడం కలవరపరుస్తోందంటారు స్వాతి. స్త్రీవాదానికి కులం నుండి విముక్తి దొరక్కపోవడం ఒక సమస్య కాదా? స్త్రీవాదానికి దళిత వాదానికి ఉన్న సమస్యాపూరితమైన సంబంధంలో ముఖ్య అంశం: దళిత పురుషులకి, అగ్రవర్ణ స్త్రీలకి ఉన్న ఆధిక్యతలు, ఆ ఆధిక్యతలతో రూపొందిన రాజకీయ సంబంధాలు తెరమరుగున ఉండిపోవటం. ఉన్నత వర్గ స్త్రీవాదులు తమకున్న కుల ఆధిక్యత గురించి పరిశీలన చేసుకోవాలి. కుల ఆధిక్యత ఎన్ని రూపాలలో స్త్రీల జీవన మార్గాలని, గుణాత్మకంగా ప్రభావితం చేస్తోంది, ఎవరు ఎటువంటి మార్గాలని ఎన్నుకో గలుగుతున్నారు, ఎవరు జీవితంలో గెలుస్తున్నారు, ఎవరు ఓడిపోతున్నారు లాంటి విషయాలని క్షుణ్ణంగా, ఆత్మశుద్ధితో పరిశీలించాలి. ఈ విషయాలని బట్టబయలు చేసి, చర్చించినప్పుడే 'హింస' యొక్క బహుకోణాల గురించిన అవగాహన మనకి లభించే అవకాశం కలుగుతుంది.

*ఈ చర్చల్లో పాల్గొన్న అందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు. అందరితో కలిసి జరిపిన చర్చలో పాల్గొన లేకపోయినా తన అభిప్రాయాలను మాతో పంచుకొన్న స్వాతి మార్గరెట్‌కి మా ధన్యవాదాలు.*

**అనువాదం : డి. వసంత**






# లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు: అంతర్-వర్గ బురదలోకి ప్రవేశించగలవా?

■ కె.సి.బిందు

లైంగిక దౌర్జన్యాల నెదిరిస్తూ విసృతంగా పట్టణాల్లో జరిగే ప్రదర్శనలూ, ముసుగేసి మీడియాలో ఇరవై నాలుగ్గంటలూ చూపే నేరస్థుల మొహాలూ – ఇవి ప్రస్తుతం మనమున్న సందర్భం. లైంగిక హింస గురించి మనం నిరంతరం చేసిన జపంలోంచి (ఒక రకంగా చెప్పాలంటే మన ఫెమినిస్టులు చేసిందే) పుట్టుకొచ్చిన భూతం, మొన్నటి వరకు ఢిల్లీలో, ఇప్పుడు బొంబాయిలో స్త్రీలపై దౌర్జన్యాలు చేసే 'మృగాళ్ళ' రక్తం కోసం (కనీసం వాళ్ళ మగతనాన్ని నాశనం చేయటానికి) వీధుల్లో అరుస్తూ తిరుగుతోంది.

ఈ రకంగా జరిగే ప్రజా ప్రదర్శనల్ని తీసిపారేయటం స్త్రీవాద ఉద్యమానికి కష్టమే. కాని వాటిని మనస్ఫూర్తిగా ఆహ్వానించటం కూడా అంతే కష్టం. అప్పటి వరకూ చలనంలేని జడపదార్థంలా ఉండిపోయిన న్యాయ యంత్రాంగం, హఠాత్తుగా గంతేసి ఆచరణలోకి దూకటాన్ని ఆహ్వానించకుండా ఉండలేం, అలాగే అనుమానించకుండా ఉండలేం కదా? అసలు మగతనం (మాస్కులినిటీ) అనే భావనతో వచ్చే సమస్యలని పక్కకి పెట్టగలమా? కానీ, ఇక్కడ కనిపించే పురుషత్వం కేవలం 'బడుగు వర్గాల'ది. అంతేకాక వారిని మూర్తీభవించిన క్రూరత్వానికి చిహ్నంలా చూపించడం సమస్యాపూరితం కాదా? బాధితురాలికి అండగా నిలబడకుండా ఉండటం ఎలా సాధ్యం? అలాగని ఇంగ్లీషు మీడియాలో ప్రత్యక్షమయ్యే పోరాట పటిమగల భయపడని స్త్రీత్వం (నిర్భయ) కేవలం నగర సవర్ణ మహిళదని కూడా (అన్ని సార్లు బాధితురాలు సవర్ణ మహిళ కాకాపోయినా, మీడియా అలాగే చిత్రిస్తుంది) గుర్తించకుండా ఉండలేం కదా?

నగరాల్లో ఈ "విసృత ప్రదర్శనల" చుట్టూ ఏర్పడిన నీటి బుడగకు రంధ్రం చేసిన అరంధతీరాయ్, ఈ సమస్యకు పునాదిగా సామాజికార్థిక నిర్మాణాన్ని చర్చలో ప్రవేశ పెట్టింది. మారిపోతున్న లైంగిక దాడులు, దౌర్జన్యాలు అర్థం చేసుకోవాలంటే, గ్రామాల నుంచి నగరాలకి వలసపోతున్న బడుగువర్గాల గురించి, వారిపై జరుగుతున్న సంస్థాగత, ఆర్థిక, సాంస్కృతిక దాడుల గురించి అవగాహన ఏర్పరుచుకోవాలి.

"బడుగు వర్గాలని నేరస్వభావులుగా చిత్రీకరించే ఆలోచన; వారు స్వతహాగానే హింసాపూరిత స్వభావం గల వర్గాలు అనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. కాని వాస్తవానికి నగరాల్లో జరిగే హింసంతా వారిపైన జరిగేదే. వారి జీతాలు తగ్గించి వారు చెల్లించాల్సిన ధరలు పెంచి, వారి ఊపిరిని కొంచెం కొంచెం పీల్చేస్తున్నవి ఈ నగరాలే! అమాయక నిస్సహాయ ఉన్నత వర్గ స్త్రీల మీద విచక్షణారహితంగా లైంగిక దౌర్జన్యాలు చేసే బడుగు వర్గాల హింసాపూరిత పురుషత్వాన్ని (ఇంగ్లీషు దినపత్రికలు చెప్పకుండా చెప్పేది ఈ విషయాన్నే) లైంగిక దౌర్జన్యాలు, తర్వాత హత్యలు చేసి న్యాయ వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్న అహంకార, అధికారయుత పురుషత్వాల నేపథ్యంలో చూడటం అలవాటు చేసుకోవాలి". (అరుంధతీరాయ్ తో డేవిడ్ బార్స్‌మియన్ ఇంటర్వ్యూ. "కార్పొరేట్ పవర్, ఉమెన్ ఎండ్ రెసిస్టెన్స్ ఇన్ ఇండియా టుడే" హెచ్.టి.టి.పి. / ఈవ్ రెవ్యూ.ఆర్గ్/ఇష్యూ/ 90)

అరుంధతీ రాయ్ "హింస" గురించి చేసిన ప్రతిపాదనకి నా ఉద్దేశంలో ఇంకొక విషయాన్ని జతపరచాలి. అది, ప్రభుత్వ సంక్షేమ పథకాలలోకి (ఉదాహరణకి రిజర్వేషన్ల విధానం) పెద్దసంఖ్యలో వచ్చి చేరుతున్న జనం వల్ల నగరాల్లో, ముఖ్యంగా నగర విశ్వవిద్యాలయాల వంటి సంస్థాగత ప్రదేశాల్లో విభిన్న ప్రపంచాలకు చెందిన వ్యక్తులు పరస్పరం తారసపడుతున్నారు. చాలా చర్చల్లో ఈ వివిధ ప్రపంచాల వ్యక్తుల కలయికను లైంగికపరమైనదిగా చూడటమే కాక, హింసాయుతమైన లైంగిక ప్రవర్తనగా మాత్రమే అర్థం చేసుకోవటం జరుగుతోంది.

### పనిచేసేచోట లైంగిక వేధింపుల గురించి సమీక్ష : 2013లో విశ్వవిద్యాలయాల నేపథ్యం

పనిచేసే చోట లైంగిక వేధింపుల నిరోధ చట్టాన్ని సమీక్షించటానికి ఇదే సరైన సమయం. చట్టమొక్కటే కాదు. మరీ ప్రత్యేకంగా విద్యా సంస్థల్లో ఆ చట్టం వినియోగం, ఆచరణలని సమీక్షించాలి. ఆఫీసుల్లో లైంగిక దౌర్జన్యాల్ని మట్టుపెట్టడానికి స్త్రీవాదులు చేసిన పోరాటాల కృషికి నిలువెత్తు నిదర్శనం – విశాఖ వర్సెస్, అదర్స్ కేసులో న్యాయస్థానం తీర్పు. స్త్రీవాద ఉద్యమం సాధించిన గొప్ప విజయంగా దీనికి గుర్తింపు వచ్చింది. దీని ఫలితంగా విద్యా సంస్థలలో స్థాపితమైన కమిటీలు ఇప్పటి వరకూ పేరే లేకుండా పోయిన దురాచారానికి మొదటిసారిగా 'లైంగిక వేధింపులు' అన్న పేరుని ఇచ్చి దీని గురించి కనీసం ప్రచారం చేయటానికి ఉపయోగపడ్డాయి.

పైన చెప్పిన సందర్భాలలో మనల్ని ఫెమినిస్టులుగా న్యాయం చేయమని ఆహ్వానిస్తే మనం ఏం చేయాలి? ఫెమినిస్టులుగా మనం ఆ సందర్భాలలో ఎదురయ్యే వైరుధ్యాల్ని ఎదుర్కోవటం రాను రానూ ఇబ్బందికరంగా తయారువుతోంది. లైంగిక వేధింపులు ఏ పరిస్థితుల్లో ఎదురవుతాయో అర్థం చేసుకోవటానికి ఏ అవగాహనలు అవసరమౌతాయి? కులం, వర్గం, జాతి, లింగం – వీటన్నింటికున్న పరస్పర క్లిష్ట సంబంధాల గురించి అంతర్-వర్గ విశ్లేషణ (ఇంటర్ సెక్షనాలిటి) అన్న ఒక అసంపూర్ణ సిద్ధాంత సూత్రం ఎంత వరకు ఉపయోగం? ఇప్పటికే విద్యా సంస్థల్లో వేగంగా మారిపోతున్న ఆడ, మగ పిల్లల జనాభా నిష్పత్తి ఒక కొత్త పరిస్థితిని కల్పించటం మనం చూస్తున్నాం. అందులోనూ సోషల్ సైన్స్ విభాగాల్లో కులం, వర్గాల వారీగా ఆడ, మగల మధ్య పెద్ద స్థాయిలో అంతరాలు ఏర్పడటం మనకు ప్రస్తుతం కనిపిస్తోంది.

'వివిధ' రకాల యువత మధ్య పరస్పర సంబంధాలకు ఈ మార్పుల వల్ల, కొత్త అవకాశా లేర్పడుతున్నాయి. కాని అటువంటి సంబంధాల నేర్పరుచుకోవటానికి వారికి అందుబాటులో ఉన్న పనిముట్లు, నైపుణ్యాలు కేవలం మీడియా ద్వారా లభ్యమయ్యేవే అనటంలో సందేహం లేదు. ప్రాంతీయ మీడియాలో అందేవి ఒక రకం అయితే, జాతీయ స్థాయి ఇంగ్లీషు మీడియాలో లభించేది ఇంకొక రకం. ఆ అవకాశాలు, అసంపూర్ణతల్ని సరిగ్గా అర్థం చేసుకోవాలంటే యువతరానికి వారి కుటుంబాలలో పరస్పరం ఉన్న సంబంధాలనే కాకుండా, కుల వర్గాల ప్రాతిపదికతో ఒకరితో ఒకరు ఏర్పరచుకునే సాంఘిక సంబంధాలను కూడా పరిశీలించాలి. అంటే నగర నేపథ్యంలో పుట్టి పెరిగి పెద్ద పెద్ద మాల్స్ చుట్టూ నిరంతరం తిరిగే యువతకు, చిన్న చిన్న పట్టణాల నుంచి, గ్రామాల నుంచి వచ్చే యువతకు మధ్య జరిగే పరస్పర సంఘర్షణల్ని అర్థం చేసుకోవటం. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే యువత కూడా మితిమీరిపోతున్న వినియోగదారీ సంస్కృతి బయట ఉన్నా దాని ప్రభావానికి గురవుతున్నారు. విశ్వవిద్యాలయాల్లోనే ఇటువంటి భిన్న కులాల, వర్గాల యువత ఒకరికొకరు తారసపడతారు అదీ ముఖ్యంగా సోషల్ సైన్స్ విభాగాలలోనే.

ఈ సందర్భాలలో ఫెమినిస్టులుగా మనం ఎందుకు నిస్సహాయతకు గురవుతున్నాం? అగ్ర వర్ణ, కులాలకు చెందిన నగర వాతావరణంలో పెరిగిన మనకు ఈ సందర్భాలనర్థం చేసుకునేందుకు తగిన సూత్రీకరణలు కరవయినందుకా? అందుకే బడుగు వర్గాల నుండి కులాల నుంచి వచ్చే యువతులు సంస్థాగత చట్రాల్లోకి, నిర్మాణాల్లోకి లాగబడుతున్న పద్ధతుల్ని అర్థం చేసుకోలేకపోతున్నాయా? మన దృష్టి లోపం వల్ల నిశ్శబ్దానికి లోనై ఈ బడుగు వర్గాల మీద వారి శరీరాల మీద జరిగే హింసను కనుమరుగు చేయటానికి దోహదం చేస్తున్నామా? సమాజపు అంచులలో నుంచి వచ్చే యువత పైన జరుగుతున్న హింస గురించి వెలువడుతున్న రిపోర్టులు సవర్ణ స్త్రీల స్త్రీవాదాన్ని అనుమానంతో, అపనమ్మకంతో చూస్తున్నట్టు తోస్తుంది. సమాజపు అంచుల్లో నిరంతరం క్లిష్టమైన పరిస్థితులలో తలపడే అస్థిత్వాలను, సెక్సిజం ఉట్టిపడుతున్నట్టున్న 'కమ్యూనిటీ సెంటిమెంట్లను" ఏ విధంగా అర్థం చేసుకోవాలో తెలియక తికమకపడటం సవర్ణ స్త్రీల వంతు. కొన్ని దశాబ్దాల క్రితం మన శత్రుశిబిరంలో ఉన్న 'సెక్సిస్ట్ గ్రూపులు' మనకు గుర్తొస్తున్నారా? లేదా?

విచిత్రంగా, అసలైన "అధికారం" తలెత్తినపుడు మనం పూర్తి నిశ్శబ్దంలోకి ఎట్లా జారుకుంటాం? విద్యా సంస్థల్లో అధికారం చేతిలో ఉన్న మగవాళ్ళు (అగ్రకులం) ఒక విద్యార్థినిని గానీ, ఉపాధ్యాయ స్త్రీని గానీ లైంగిక వేధింపులకు గురి చేసినపుడు ఆ స్త్రీలకు అండగా విద్యార్థులు ఇతర వర్గాలు ఉద్యమించకుండా ఏ కమిటీలు పనిచేయవని మనకు తెలుసు. అందుకే ఈ కమిటీలు సమస్యలకు అసలైన పరిష్కారాలు వెతకలేరనేది రుజువవుతుంది. కింది స్థాయి స్త్రీలు (కొన్నిసార్లు పురుషులు కూడా) అధికారం కలిగి ఉన్న పురుషులకు సెక్సువల్ ఊడిగం చేయాలని డిమాండు చేసి, వేధించిన సందర్భాల్లో ఆ దురాగతాల చుట్టూ గోడకట్టినట్టు వుండే సంస్థాగత 'నిశ్శబ్దా'న్ని ఏ కమిటీలు ఛేదించలేవు సరికదా ఆ కమిటీలు నిర్దేశించే 'చైతన్యం కల్గించే' కార్యక్రమాలేవీ ఆ నిశ్శబ్దాన్ని చీల్చలేవు అన్న గుర్తింపు మనసును కల్చి వేస్తుంది. అధికారంలో ఉన్న మగాడు చేసే దౌర్జన్యాల కేసుల్లో "లైంగిక వేధింపుల కమిటీలు" నిరంతరం వాటి స్వయం ప్రతిపత్తిని కోల్పోతుండటం మనం చూస్తూనే ఉన్నాం. సంస్థల మేనేజ్‌మెంటులో వ్యతిరేకత ఉన్న సందర్భాలలో లేదా రాజకీయ ఉద్యమ శక్తుల అండదండలతో మాత్రమే నేరస్థులకి శిక్ష పడే అవకాశాలుంటాయి. కమిటీలో రాజకీయస్పృహ వున్న వ్యక్తులు సభ్యులు వున్నా, లేకపోయినా, లైంగిక వేధింపుల కమిటీలు వాటంతట అవే పనిచేయలేవనేది వాస్తవం.

ఈ కారణాలన్నిటి వల్ల వ్యక్తులుగానైనా, ఒక గ్రూప్‌గానైనా లైంగిక వేధింపుల పట్ల మన స్పందనలో ఒక రకమైన స్తబ్ధతకు, నిశ్శబ్దానికి దారితీస్తుందనటంలో సందేహం లేదు. కమిటీలో పని చేసే క్రమంలో, ఫెమినిస్టులు బాధ్యత వహించినపుడయినా సరే, కేవలం హక్కుల చట్రంలో చేసే శిక్షల పరిమితులు బహిర్గతమౌతాయి. ఫెమినిస్టు అనుభవం ముసుగులో "నీ గురించి నీ కంటే నాకు బాగా తెలుసు" అనే నిపుణుల హేయమైన పొగరుబోతు ప్రవర్తన ప్రదర్శితమౌతుంది కౌన్సిలింగ్ రూపంలో.

వీటన్నింటినీ చూస్తే నాకు తట్టేవి మరిన్ని ప్రశ్నలే! సంస్థలలో "ఫెమినిస్టు కౌన్సిలింగ్" సాధ్యపడేదేనా? ఒక పక్క ఆధిక్యతననుభవిస్తూనే, బాధితుల రాజకీయ పరిస్థితిని వ్యక్తీకరించటం సాధ్యమేనా? ఏ రూపంలో సాధ్యం? నీతులు చెప్పకుండా కార్యాచరణకు మనను తీసుకెళ్ళ గలిగే భాష ఏది? పితృస్వామ్యం గుప్పిట్లో లేని భాషంటూ ఏదైనా ఉందా? వివిధ అవగాహనలను ఇముడ్చుకుంటూ, భిన్న స్థానాలనుండి వ్యక్తీకరించే 'పొలిటిక్సు'ను అర్థం చేసుకునే క్రమంలో మన ముందుకొచ్చే సవాళ్ళేమిటి? అన్నింటినీ ఒకే తాటకీడ్చే విశ్వజనీన చట్టాలు ఎట్లా ఉపయోగపడతాయి? ఫెమినిస్టు స్థానాలనాక్రమించిన మతోన్మాద కులాధిక్య శక్తులను స్వేచ్ఛగా వదిలేయటం ఎట్లా? రోజువారి జీవితంలో అంతకంతకూ ఛిద్రమౌతున్న సాంఘిక జీవనంలో ప్రత్యేకతను చాటుకుంటూ మిగిలి పోవటమేనా మనం చేయగలిగేది? ఇటువంటి సందిగ్ధాలతో రోజులు గడిపితే మనకు భవిష్యత్తంటూ మిగులుతుందా?


కె.సి.బిందు టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ముంబాయిలో అధ్యాపకురాలు


**అనువాదం : కె.లలిత**

# జండర్, విద్యాప్రపంచం

## ■ కె.సునీతా రాణి

**జండర్‌ని** మిగిలిన ఎన్నో ముఖ్యమైన, వాస్తవికమైన అంశాల లాగా, విద్యా ప్రపంచం నిశిత చర్చకు దూరంగా పెట్టింది. జండర్ అంశాల మీద ప్రత్యేకంగా అధ్యయనం చేసే విద్యా విభాగాలలో తప్ప, మిగిలిన విభాగాల్లో జండర్ అంశాన్ని నిర్లక్ష్యంగా చూస్తారు. అధ్యయనంలో, బోధనలో దానిని ఖండిస్తారు. ఈ విధంగా విద్యావేత్తలకు జండర్ కనిపించకపోవటం, ఇంకా ఘాటుగా చెప్పాలంటే దాని పట్ల తిరస్కార భావం ఉండటం, ఆలోచించాల్సిన విషయమే.

సుప్రీం కోర్టు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పుణ్యమా అని విద్యా సంస్థలలో, ఇతర సంస్థలలో, వేధింపులను నిరోధించే వ్యవస్థను ఏర్పాటు చేయటం తప్పని సరి అయింది. అయితే ఈ విధానం అమలు చేసే వ్యవస్థలు, వాటి నిర్మాణాల పని తీరు, పెద్ద సవాళ్ళుగా మారుతున్నాయి. కొన్ని విశ్వవిద్యాలయాలలో ఈ కమిటీలకు మహిళలే అధ్యక్షత వహించాలి అని మార్గదర్శకాలు ఉన్నప్పటికీ పురుషులైన వైస్‌ఛాన్సలర్‌లు (కులపతులు) ఈ వేధింపుల నిరోధక కమిటీలకు అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని విశ్వవిద్యాలయాలలో ఈ కమిటీలు ఉన్నాయి కానీ అవి పని చేయటం లేదు. మరికొన్ని విశ్వ విద్యాలయాలు ఒకే వ్యక్తికి, మహిళా అధ్యయన కేంద్రాల అధ్యక్షతను, ఆడపిల్లల వసతి గృహాలకు వార్డన్‌షిప్‌ను, వేధింపుల నిరోధక కమిటీని అధ్యక్ష పదవినీ అప్పచెప్పాయి. కొన్నింటిలో ఈ కమిటీలు కేవలం ఫిర్యాదుల కమిటీలుగా మాత్రమే వ్యవహరిస్తున్నాయి. వీటన్నింటిలో మనం అధికారుల జోక్యం, స్త్రీల అస్తిత్వానికి సంబంధించి వివక్షత, ప్రశ్నించిన గొంతులను మూగబోయేటట్లు చేసే ధోరణి చూడవచ్చు.

లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీల (క్యాష్) పని తీరులో, చాలా రకాల సమస్యలు, సైద్ధాంతికమైనవీ, పరిపాలనకు సంబంధించినవీ కనిపిస్తాయి. క్యాష్ ఎదుర్కునే మొదటి సవాలు, విశ్వవిద్యాలయ వ్యవస్థలలో దాని హోదాకు సంబంధించింది. విశ్వవిద్యాలయాలలో ఉండే మిగిలిన వ్యవస్థలతో పోల్చి చూస్తే, దీనికి దర్శనీయత, దీనిని గురించిన అవగాహన రెండూ తక్కువ. క్యాష్ ధ్యేయాలు, ఆదర్శాలు అపరిచితంగా ఉండటం వల్ల, ఇవి నిరర్థకమైనవని లేదా ఆచరణయోగ్యం కావనే అభిప్రాయం కూడా ఉంది. దీనిని ఫిర్యాదుల, శిక్షల కమిటీగా చూడటం వలన, దీని పట్ల భయం, అనుమానం ఏర్పడి, దీనిని దూరంగా పెట్టడం కూడా జరుగుతోంది. కొందరు దీనిని 'సెక్స్'కి సంబంధించిందని, ప్రధానంగా 'లైంగికత' అన్న అంశం గురించి పనిచేస్తుందనే కారణంతో అవహేళన కూడా చేస్తారు. దీనిని మలినమైన, కళంకిత (అంటరానిదైన) ప్రదేశంగా భావించి, 'మర్యాదస్తులకు' తగనిదని భావిస్తారు. క్యాష్ ఒక పోలీసుస్టేషన్‌గానో, న్యాయస్థానంగానో మారిపోకుండా జాగ్రత్తపడాల్సిన అవసరం ఉంది. పరిపాలనా యంత్రాంగాల పని తీరులో ఆలస్యం వలన మాత్రమే కాక, అంతర్లీనంగా దీని పట్ల ఉన్న కళంకిత భావం వలన కూడా అలా జరిగే అవకాశం ఉంది.

విశ్వవిద్యాలయ పరిపాలనాయంత్రాంగంలో భాగంగా క్యాష్‌ను అధికారం గల నిర్మాణంగా పరిగణించడం జరుగుతుంది. ఇది విశ్వవిద్యాలయ పరిపాలనా యంత్రాంగం వలన ప్రభావితం కాకుండా, స్వతంత్ర ప్రతిపత్తితో వ్యవహరించాల్సి వున్నప్పటికీ, పాలనాయంత్రాంగంలో భాగమవ్వటం వలన ఇది విద్యార్థుల నుంచి దూరంగా జరిగిపోయే ప్రమాదముంది. ఈ కమిటీలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది సభ్యులుగా ఉంటారు కాబట్టి, ఇది విశ్వవిద్యాలయం అధికార వ్యవస్థలో భాగంగా చూడబడుతుంది. సభ్యులు ఏ వర్గానికి చెందిన వారైతే వారి పట్ల పక్షపాతంతో వ్యవవహరిస్తారేమో అన్న భయం ఉంటుంది. కమిటీలో విద్యార్థి ప్రతినిధులు కూడా ఉండటం వలన, కమిటీ నిర్ణయాలను విద్యార్థులు ప్రభావితం చేస్తారేమో అన్న భయం కూడా లేకపోలేదు. ఈ రకంగా, నిరంతరం సభ్యుల అస్తిత్వాన్ని, సైద్ధాంతిక దృక్పథాలను ప్రశ్నించడం జరుగుతోంది. క్యాష్ జండర్ అంశాలపైన ఫిర్యాదులున్నప్పుడు, వాటికి విచారణ, శిక్షించడం అవసరమైనప్పుడు మాత్రమే, సమస్యలపై దృష్టి పెడ్తోంది కాబట్టి దానిపట్ల అపనమ్మకం అనుమానం, అసౌకర్యం, దాపరికం ఏర్పడుతున్నాయి. ఇక్కడ జండర్ ఆత్మ పరిశీలనకు, అవగాహనకు, చైతన్య వంతం కావటానికి అవసరమైన అంశంగా కాకుండా, ఒక గడ్డు పరిస్థితిలో చర్చనీయాంశంగా మాత్రమే చూడబడుతోంది.

క్యాష్ రెండు రకాల పరీక్షలను ఎదుర్కొంటుంది. మొదటిది, ఫిర్యాదులకు సరైన సమయంలో స్పందించి చర్యలు తీసుకున్నప్పుడు, ఎక్కువగా స్పందిస్తోంది అనీ, నిందితుడిని బలిపశువుగా చేసిందనీ, క్యాష్ భావజాలానికి, ధోరణికీ, వ్యతిరేకంగా ప్రతిస్పందిస్తూ, క్యాష్ నియంతలాగా వ్యవహరిస్తోందని భావిస్తారు. రెండవది, ఫిర్యాదుకు స్పందించటానికి కొంత సమయం తీసుకున్నట్లయితే, క్యాష్ కాలయాపన చేస్తోందని, తన విధులను నిర్వర్తించటం లేదనీ ఫిర్యాదులు చేస్తారు. రెండింటిలోనూ, సందర్భానుసారం ఎంతో కొంత వాస్తవం ఉన్నప్పటికీ ప్రత్యేక పరిస్థితులలో త్వరపడటం,

ఆలస్యం చేయటం రెండింటివలనా లాభాలు, నష్టాలూ ఉంటాయి. ఇటువంటి ప్రతిస్పందనలను ఫిర్యాదు అందుకున్న ప్రతిసారీ ఎదుర్కోవలసి వస్తే, ఆ వ్యవస్థ ఏ విధంగా పనిచేయగలుగుతుంది? ఇది క్యాష్‌ను నిరుపయోగమైన ఆత్మరక్షణ స్థితిలోకి నెట్టివేస్తోంది.

చాలాసార్లు యూనివర్సిటీ వ్యవస్థలో శక్తివంతమైన వర్గాలు, క్యాష్ నిర్వహించే విచారణలో జోక్యం చేసుకొని ఆదేశాలు ఇవ్వటం మొదలుపెడుతాయి. అటువంటప్పుడు, విశ్వవిద్యాలయ పరిపాలనా యంత్రాంగం, క్యాష్ తీసుకునే చర్యల వలన క్యాంపస్‌లో కలిగే అలజడిని నిరసిస్తూ, దానిపట్ల వ్యతిరేక ధోరణిని అవలంబించవచ్చు. కానీ ఏ అలజడీ లేకుండా ఉన్న స్థితిలో మార్పు ఏ విధంగా సాధ్యపడుతుంది? అంటే, క్యాష్‌ను విశ్వవిద్యాలయం యంత్రాంగం ఒకచేత్తో దగ్గరకి తీసుకుంటూ మరో చేత్తో దూరంగా తోసేస్తుంటుందన్నమాట. ఇంత సంక్లిష్టమై, నిరంతరం జాగురూకతతో వ్యవహరించాల్సిన వ్యవస్థను నిర్మించటానికి అవసరమైన డబ్బు, స్థలము, నిర్మాణ వ్యవస్థ, సిబ్బందీ లోపాలు మరొక సమస్య. క్యాష్‌కు సంబంధించిన నిబంధనల విషయంలో వివిధ పరిపాలనా విభాగాల మధ్య సమన్వయ లోపం, అవగాహనా లోపం వీటికి తోడైయ్యింది.

క్యాష్ ఏర్పడటం వలన, ఫిర్యాదుల సంఖ్య పెరగటమే కాక తప్పుడు ఫిర్యాదులకు దారితీసి వాటి వలన అమాయకులు బలవుతారన్న భయం లేకపోలేదు. పురుషులు జండర్ విభజన వలన తాము ఆగ్రహానికి గురవుతామేమోనని అనుమాన పడుతుంటే మహిళలు లైంగిక వేధింపులు బహిరంగ చర్చనీయాంశాలు అవుతాయని చిరాకుపడుతున్నారు! సమాచారాన్ని తొక్కిపెట్టటం, ఆలస్యంగా తీసుకునే నిర్ణయాలు, ఫిర్యాదు చేసే వారిపైన ప్రతికూలమైన ధోరణి కలిగి ఉండటం, క్యాష్ కుండే విశ్వసనీయతను తగ్గించే అవకాశాలున్నాయి.

క్యాంపస్‌లు వివిధ సంస్కృతులను, మతాలను, ప్రాంతాలను, కులాలను, భాషలను, విశ్వాసాలను, అస్తిత్వాలను, జీవన శైలులను, ఒక్కచోటికి తీసుకుని వస్తాయి. ఈ విధంగా కలిసి మెలసి ఉండటం విలువైన అనుభవాలకు దారితీయవచ్చు. అఘాతాలకు, సంఘర్షణకు ఆధారం కావచ్చు. క్యాష్‌కు వచ్చే ఫిర్యాదులను జాగ్రత్తగా పరిశీలిస్తే వాటిలో ఒక క్రమబద్ధమైన నమూనా కనిపిస్తుంది: అదేమిటంటే లైంగిక సంబంధాలు, వేధింపులుగా మారటం. కారణాలు అనేకం; సాంస్కృతిక పరమైన మరియు ఇతర రూపాలలో ఉండే వైవిధ్యాలు వ్యక్తుల మధ్య ఉండే అవగాహనను ప్రభావితం చేస్తాయి. ఊపిరి ఆడనివ్వని ఒంటరితనం, లేమి నుంచి బయట పడటానికి మహిళలు, పురుషులతో ఏర్పరచుకునే అనుబంధాలలో పురుషుడు ఆమె శరీరాన్ని, మనస్సును, జీవితాన్ని నియంత్రించే ప్రయత్నం చేస్తే మళ్ళీ ఊపిరాడని స్థితిలోకే వెళ్తారు. స్త్రీలపైన ఉండే వేరే ఇతర నియంత్రణ నుండి ఇది భిన్నమైందేమీ కాదు కాబట్టి, స్త్రీలకి తాము ఒక రకమైన నియంత్రణ వ్యవస్థ నుంచి, మరొక దానికి మారుతున్నామని మాత్రమే అనిపిస్తుంది. ఈ రకమైన వత్తిడి, పురుషుల ఆధిపత్యానికి, స్త్రీలపై వేధింపులకు, అణచివేతకు, వారి దోపిడీకి దారితీస్తున్నాయి.

జండర్‌కు సంబంధించిన ఇటువంటి చర్చ అనవసరమనీ, ఇప్పటికే అవసరానికి మించి జరుగుతోందనీ, అందరి దృష్టినీ అనవసరంగా ఆకట్టుకుంటోందనీ అభిప్రాయాలు ఉన్నాయి. ఇదిగాక, విద్యాసంస్థలు మౌలికంగా విద్యకు సంబంధించినవనీ విద్యాబోధనే వాటి ప్రధాన లక్ష్యమనే అభిప్రాయం కూడా ఉంది. క్యాష్ కార్యకలాపాలు, బోధనేతర విషయాలుగా, విద్యార్థుల ఏకాగ్రతను భంగం చేసేవిగా, నిరర్థకమైనవిగాను పరిగణించబడుతున్నాయి. ఒక విశ్వవిద్యాలయంలో క్యాష్ నిర్వహించిన ఆత్మసంరక్షణ పద్ధతులను నేర్పే కార్యక్రమానికి చాలా తక్కువ మంది విద్యార్థినులు హాజరయ్యారు. ఈ కార్యక్రమం, విద్యాబోధనకు సంబంధించింది కాదు కనుక, దీనికి సమయం కేటాయించడం వ్యర్థమనే అభిప్రాయంలో ఉపాధ్యాయులున్నారు. ఈ సంఘటనలు కొన్ని కీలకమైన ప్రశ్నలు లేవనెత్తుతాయి. విశ్వవిద్యాలయాలు దేన్ని బోధించాలి? విశ్వవిద్యాలయాలు చేసే విద్యా బోధన విద్యార్థులను ఏకాకులుగా, పరిమితుల్లో ఉండేటట్లు, శక్తిహీనంగా ఎందుకు తయారు చేస్తోంది?

క్యాష్‌ను కేవలం ఒక ఫిర్యాదు కమిటీగా చూసే ధోరణి మారాలి. క్యాంపస్‌లను వేధింపుల నుండి విముక్తి చేయటానికి చొరవగా కార్యక్రమాలు చేపట్టే కమిటీలుగా అవి రూపొందాలి. జండర్ పట్ల అవగాహనా కార్యక్రమాలు, చర్చలు నిర్వహించటం, సమస్యలొచ్చినప్పుడు కౌన్సిలింగ్ నిర్వహించటం, విద్యార్థులకు మార్గదర్శకత్వం (మెంటరింగ్), వెన్నుదన్నుగా నిలబడటం, ఆత్మపరిశీలన చేసుకునేటట్లు కార్యక్రమాలు నిర్వహించటం క్యాష్ కార్యక్రమాల్లో నిర్మాణాత్మక భాగం కావాలి.

ప్రస్తుతం క్యాష్ పని చేస్తున్న వాతావరణాన్ని గమనిస్తే, విద్యావిభాగాల్లో జండర్ గురించి జరుగుతున్న అధ్యయనాలు, పరిశోధన స్థాయిని ఊహించటం కష్టం కాదు. వాటి హోదా, మర్యాద, విశ్వసనీయత నిరంతరం ప్రశ్నించబడుతున్నప్పటికీ వీటి ఆధారంతోటే, జండర్ వివక్షను సవాలు చేయటానికి అవకాశాలున్నాయి. ఈ ఉద్దేశంతో రూపొందిచిన కొన్ని సూచనలను కింద పరిశీలించండి.

నిర్దిష్టమైన కోర్సులలో లింగ భేదాల గురించిన అవగాహనను మౌలికమైన అంశంగా చర్చించటమే కాకుండా, కోర్సుల సిలబస్‌లో మార్పులు చేయడం ద్వారా అన్ని విద్యా విభాగాలలో దీనిని అంతర్గత అంశంగా చేర్చాల్సిన అవసరం ఉంది. ఈ దృక్పథాలు, స్త్రీని నిస్సహాయురాలిగా, బలిపశువుగా, బాధలకు గురిచేయబడుతూ పురుషుని నుండి రక్షణకు అర్హురాలిగా, దాని కోసం వేచి ఉన్న వ్యక్తిలా చిత్రీకరించ కూడదు. ఆరోగ్యవంతంగా, పరస్పర అవగాహనకు దోహదం చేసేవిగా ఉండాలి. లింగ భేదాల ఆధారంగా వ్యక్తులను విడదీయటం వలన లైంగిక వేధింపులను తొలగించలేము. అన్ని రకాల లింగాలకు చెందిన వ్యక్తులను మర్యాదపూర్వకంగా చూడటం ద్వారా మాత్రమే విద్యా సంస్థలలో కానీ, ఆ మాటకొస్తే సమాజం మొత్తంలో గానీ, వేధింపులు లేని వాతావరణాన్ని ఏర్పాటు చేయగలుగుతాము. తరగతులలో బోధనను సామ్రాజ్యవాద ధోరణుల నుండి జాతి, కుల, వర్గ, భాష, ప్రాంతీయతల నుండి విముక్తులను చేసే చర్చలు రచనలు ఎన్నో ఉన్నాయి. వివిధ రకాల విద్యా విభాగాలను ప్రజాస్వామిక పద్ధతులలో, స్వేచ్ఛాపూర్వకమైన వాతావరణంలో బోధించవచ్చు. అయితే, జండర్ గురించి తరగతులలో బోధించి విద్యార్థులను ఈ రకమైన ధోరణుల నుండి విముక్తి చేయటానికి తగినంత చర్చ జరగలేదు. విద్యా విభాగాలలో ఈ చైతన్యం కలిగించటం ద్వారా నిచ్చెనమెట్ల స్వభావంపట్ల అవగాహన కలిగించి క్యాంపస్‌లలో వాతావరణం మెరుగు పరచటం మాత్రమే కాక, విద్యా విభాగాలను పురుషాహంకార ధోరణుల నుండి, పురుషాధిక్య సమాజ పెత్తనం నుండి కూడా విముక్తి చేయవచ్చు.

కె.సునీతా రాణి యూనివర్సిటీ ఆఫ్
హైదరాబాద్‌లో అధ్యాపకురాలు

**అనువాదం : పి.మాధవి**

## ప్రగతిశీల మహిళా సంఘం

పి.ఓ.డబ్ల్యూ

భారతీయ స్త్రీ అంటే అన్ని వేళలా జీవితాంతం ఉత్సాహంగా పురుషుడితో సమాన భాగస్వామిలా నడుచుకునేది అనే భావన నేడు ముక్కలు ముక్కలు చేయబడింది. స్త్రీ సమానత్వం గురించి చట్టం వల్లించే అరిగిపోయి, పాతబడిన ధర్మ పన్నాలు అక్కడక్కడ విసిరి వేసినట్లయింది. కొద్ది మంది నాయకురాళ్ళు ఒక ప్రక్కుంటే, ఇంకో ప్రక్క భయంకర పరిస్థితుల్లో (భూస్వామ్య సంస్కృతి స్త్రీ ఇంటికే పరిమితమవ్వాలని) మెజార్టీ భారతీయ స్త్రీలు ఉన్నారు. పబ్లిక్‌లైఫ్‌లో భాగస్వామి కాకూడదని బోధిస్తుంది. ఇంకో పక్క వేగంగా చొచ్చుకుపోతూన్న విదేశీ సంస్కృతిలో స్త్రీని అలంకరించిన భోగ వస్తువుకంటే మించి చూడట్లేదు. సాహిత్యంలోనూ, కళల్లోనూ అసభ్యత ప్రబలిపోయింది. విశృంఖలమైన పురుషాధిపత్యం అత్యంత అసహ్యమైన అడుగు ముందుకేసి ఈవ్ టీజింగ్‌లకు, అత్యాచారాలకు దారితీస్తోంది. మనలో కొంత మందికి ఇతరులతో సమానంగా మన జీవన భృతి కోసం కూడా పనికి అనుమతించని పరిస్థితి నెలకొని ఉంది. మరి కొంత మందికి పురుషులతో సమానంగా చేసే పనికి తగ్గ సమాన వేతనం లేదు. ఇక ఇంట్లో ఉండే స్త్రీ పరిస్థితి అయితే చెప్పనక్కరలేదు. ఆమె ఇంటికే పరిమితమయ్యి, పొద్దున్నుండి రాత్రి దాకా నడుములు విరిగిపోయేలా చాకిరి చేసినా ఆమెకు స్వతంత్ర్యం గానీ, గౌరవం గానీ లేవు.

(రాధాకుమార్ 'ద హిస్టరీ ఆఫ్ డూయింగ్ పేజీ. 104 నుండి)

**అనువాదం : మిరప మాధవి**

# సమానత్వం

## ■ సల్మా అహ్మద్ ఫరూఖీ

రేపటి యువతరానికి విశ్వవిద్యాలయాలు ఒక శిక్షణా కేంద్రాలు. విశ్వవిద్యాలయాలు విద్యార్థులను ఉద్యోగాలు పొంది, ప్రపంచాన్ని ఎదుర్కొనే విధంగా విద్యావంతులను చేయడంతో పాటు వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి. ఈ విద్యాలయాలలో వివిధ కులాలు, మతాలు, ప్రాంతాలు, వివిధ నేపథ్యాల నుండి వచ్చిన విద్యార్థులుంటారు. ఈ భిన్నత్వాన్ని గుర్తించి గౌరవించాల్సిన బాధ్యత ఉంది. యువ విద్యార్థినులేకాక విద్యార్థులు కూడా వివక్షకు గురవుతారు. గ్రామీణ ప్రాంతం నుండి పట్టణ ప్రాంతానికి వచ్చిన విద్యార్థులకు విద్యార్థినులతో, విద్యార్థినులకు విద్యార్థులతో మాట్లాడేంత ఆత్మవిశ్వాసం ఉండటం లేదు. ఈ ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్ల వారు తమ గ్రామం నుండి వచ్చిన కొద్ది మంది స్నేహితులతో లేదా తమ భాషకు చెందిన వారితో మాత్రమే మాట్లాడుతూ తమను తాము పరిమితం చేసుకుంటున్నారు. తన తోటి సహచరులతో, నూతన విద్యార్థులతో స్నేహం పెరిగే వరకు వీరిలో ఒకరకమయిన అభద్రతా భావం, ఆత్మన్యూనతా భావం ఏర్పడి తమ మీద తమకు విశ్వాసం లేక, ఏదో కోల్పోయిన భావన మరియు అశాంతితో బాధపడుతుంటారు.

బహిరంగ ప్రదేశాలలో అన్ని రకాల వివక్షలు, శత్రుత్వ భావాలు ఉంటాయి. యువతులను పురుషులు జోక్స్ వేసి ఎగతాళి చేస్తూ వారిని తమకంటే తక్కువగా చూస్తున్నారు. యువకులు కూడా అమ్మాయిలతో స్వేచ్ఛగా మాట్లాడటానికి సంకోచిస్తుంటారు. జూనియర్ ఉద్యోగులు సీనియర్ ఉద్యోగుల యొక్క కుట్రపూరితమయిన మాటల వల్ల భయభ్రాంతులకు గురవుతారు. స్త్రీ ఉద్యోగులు తమని పురుష ఉద్యోగులతో సమానంగా చూడాలని నిమ్మళంగా ఈ భావాలను డిమాండ్ చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో లైంగిక వేధింపులపై వేసిన కమిటీల వల్ల చాలా వరకు పనిచేసే ప్రదేశాలలో నియంత్రణ చేసే అవకాశం కలిగింది.

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ఒక అనుకూలమైన, స్నేహపూర్వకమయిన వాతావరణాన్ని కల్పించడం ద్వారా సంస్థలో పనిచేసే ఉద్యోగులందరి గౌరవాన్ని కాపాడటంతో పాటు వారి ఎదుగుదలని ప్రోత్సహిస్తుంది. "పని చేసే ప్రదేశాలలో లైంగిక వేధింపుల" ను ఒక ముఖ్యమయిన అంశంగా గుర్తించి, ఈ విషయంలో ఉద్యోగులకు వారి వ్యక్తిగత, వృత్తి పరమయిన పురోగతి కొరకు రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని ఈ విశ్వవిద్యాలయం నిర్ణయించడం జరిగింది. అదే విధంగా లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పాదాష్ (ప్రివెన్షన్ అగైనెస్ట్ డిస్క్రిమినేషన్ అండ్ సెక్సువల్ హరాస్‌మెంట్) అనే ఒక కమిటీని వేయడం జరిగింది. ఈ కమిటీ లో ఏడుగురు సభ్యులున్నారు. ఇందులో స్త్రీలతో పాటు పురుషులకు సభ్యత్వం కల్పించారు. వీరిలో విద్యార్థులకు, అధ్యాపకులకు, ఇతర ఉద్యోగులకు ప్రాతినిధ్యం కల్పించడం జరిగింది. ఈ కమిటీ మూడు సంవత్సరాల కాలానికి నియమించబడింది. ఈ కమిటీ ముస్లింలలో సాంఘికంగా, ఆర్థికంగా, భాషాపరంగా వెనకబడిన వర్గాల ప్రజలను, విశాఖ తీర్పులో సుప్రీం కోర్ట్ ఇచ్చిన మార్గదర్శకాలను దృష్టిలో ఉంచుకుని పబ్లిక్ ప్రదేశాలలో లైంగిక వేధింపులపై ఒక విధానాన్ని, నియమ నిబంధనలను తయారు చేసి విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక మండలి ఆమోదం కొరకు సమర్పించడం జరిగింది.

ఈ విధానం విశ్వవిద్యాలయంలోని విద్యార్థులు, ఉద్యోగులందరికి వర్తిస్తుంది. ఈ కమిటీ (పాదాష్) లైంగిక వేధింపులపై ఫిర్యాదులు స్వీకరించడంతోపాటు ముందు జాగ్రత్త చర్యలు కూడా తీసుకుంటుంది. ఈ ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా జండర్ చైతన్యం పై సదస్సును, ఉపన్యాసాలను, పోస్టర్, పెయింటింగ్ పోటీలను, మానవహారంను యూనివర్సిటీలో విద్యార్థులకు, ఉద్యోగులకు నిర్వహించడం జరిగింది. ఈ విధమయిన అవగాహన తీసుకురావడానికి జాతీయ సమాజ సేవ (ఎన్.ఎస్.ఎస్) వారితో అనుబంధంగా యూనివర్సిటీలో కార్యక్రమాలు నిర్వహించడం చాలా వరకు ఉపయోగపడింది.

ఈ లైంగిక వేధింపు కేసుల విచారణ సమయంలో కమిటీ ఫిర్యాదుదారుల వివరాలను చాల గోప్యంగా ఉంచుతుంది. ఈ వివరాలు ఫిర్యాదుదారుడికి, సాక్షికి మాత్రమే తెలుస్తాయి. విచారణను సాధ్యమయినంత తక్కువ సమయంలో పూర్తి చేయడం జరుగుతుంది. ఫిర్యాదుదారుడు, దోషిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి కూడా తమ అభిప్రాయాలు తెలియజేసేందుకు అవకాశం ఇవ్వడం జరుగుతుంది.

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో ఉంది. ఇక్కడ ఉర్దూ మీడియంలో బోధించడం జరుగుతుంది. ముస్లిం కుటుంబాల నుండి ఉర్దూ మీడియంలో ఉన్నత విద్యని పూర్తి చేయాలనుకునే వారికి గమ్యస్థానంగా ఉంది. బహుశ ఉర్దూ నేర్చుకునేవారికి విశ్వవిద్యాలయంలో ఉర్దూలో విద్యనభ్యసించే అవకాశం రావడం ఇది మొదటిసారి. ముస్లిం కుటుంబాలకు కూడా వారి స్త్రీలను ధైర్యంగా ఇంటి నుండి దూరంగా యూనివర్సిటీలోకి పంపడం ఒక కొత్త ఆరంభం. ఇటువంటి పరిస్థితుల నుండి వచ్చే అమ్మాయిలను, అబ్బాయిలను కూడా ఆదరించడంతో పాటు రక్షిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ఉంది.

నేను రెండు సంవత్సరాల క్రితం ఈ పాదాష్ కమిటీలో సభ్యురాలిగా నియమించబడ్డాను. ఈ కమిటీ ఒక ప్రత్యేకమయిన సామాజిక నేపథ్యంలో ఇప్పటికీ స్త్రీలను సమానులుగా అంగీకరించని సంప్రదాయక పరిస్థితులలో పనిచేస్తుంది. చాలా సందర్భాలలో స్త్రీలకు తగినంత గౌరవం ఇవ్వడం లేదు. చాలా మంది అమ్మాయిలు కామెంట్‌కు, ప్రశంసకు తేడా గుర్తించడం లేదు. లైంగిక వేధింపులంటే కేవలం శారీరక దాడులే కాదు, స్త్రీ శరీరాన్ని చూపుతూ చేసే హావభావాలు, వ్యాఖ్యలు కూడా లైంగిక వేధింపుల కిందకే వస్తాయి. ఈ యూనివర్సిటీలో పనిచేసే మహిళా ఉద్యోగులు అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు వెంటనే సమాధానం చెప్తారు. ఈ కమిటీ యొక్క రాజ్యాంగం, చేసిన కార్యక్రమాల వల్ల లైంగిక వేధింపులను సహించేదిలేదని ఒక అవగాహన వచ్చింది. ఈ మధ్యకాలంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఈ యూనివర్సిటీని సందర్శించి, ఇక్కడ ఉద్యోగులతో, ఇతర సభ్యులతో మాట్లాడటం ద్వారా వారిలో భద్రతా భావాన్ని పెంచడంతోపాటు, జండర్ సమానత్వాన్ని ప్రోత్సహించింది. ఈ చైతన్యం ఒక మార్పుకు సాధనం. మార్పు ప్రతిసారి మన లోపలి నుండి రాకపోవచ్చు. ఈ మార్పు సుప్రీం కోర్టు సూచనలను పూర్తి చేయడానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలు కొన్ని నిబంధనలను అనుసరించడం ద్వారా కూడా వస్తుంది. యూనివర్సిటీలోని విద్యార్థినులలో, అధ్యాపకులలో, ఇతర ఉద్యోగులలో ఈ కమిటీ ఒక విధమయిన భద్రతా భావాన్ని పెంపొందించింది. ఈ యూనివర్సిటీ యొక్క అత్యున్నత అధికారులు స్త్రీలను పురుషులతో సమానంగా చూస్తారు. అంతకు ముందు ఒక్క పురుషులకు మాత్రమే పరిమితమయిన ఉన్నత పదవులలో మహిళా అధ్యాపకులను నియమించడంలో ఈ ఫిలాసఫీని మనం స్పష్టంగా చూడగలం.

సల్మా అహ్మద్ ఫరూఖీ మౌలానా ఆజాద్ విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలు

**అనువాదం : రాజ్‌కుమార్ ఎలిగెడి**

# మనల్ని వదలిపోని మనువు

■ మిరప మాధవి

హైదరాబాద్ యూనివర్సిటీలో దళిత అమ్మాయిల స్థితి గతులు ఎలా ఉన్నాయి? ఎలా ఉండాలని అమ్మాయిలు కోరుకుంటున్నారు? యూనివర్సిటీలో వీరి సామాజిక స్థితి ఎలా ఉంటుంది? దళిత సంఘాలు, దళితేతర సంఘాలు వీరి పట్ల ఎలా వ్యవహరిస్తున్నారు? ఈ ప్రశ్నల మీద దృష్టి సారించే ముందు ప్రస్తుత పరిస్థితుల్లో దళిత అమ్మాయిల ప్రవేశం యూనివర్సిటీలో ఎలా ఉందో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

గత 15 ఏళ్ళతో పోల్చుకుంటే ప్రస్తుతం యూనివర్సిటీ చదువులకు వచ్చే దళిత అమ్మాయిల సంఖ్య పెరిగింది. అపుడు యూనివర్సిటీ మొత్తం మీద 5 లేదా 10 మంది అమ్మాయిలు మాత్రమే ఉంటే, ఇప్పుడు ప్రతి డిపార్ట్‌మెంట్, ప్రతి డిసిప్లిన్ లోనూ ముగ్గురు నుండి ఐదుగురు అమ్మాయిలు ఉన్నారు. మొత్తం యూనివర్సిటీ మీద చూసుకుంటే ప్రతి సంవత్సరం దాదాపు వంద నుండి రెండువందల వరకు దళిత, ఆదివాసీ అమ్మాయిలు యూనివర్సిటీకి వస్తున్నారు.

వీరంతా అనేక రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుండి వస్తున్నారు. వీళ్ళలో కొంత మంది పట్టణ ప్రాంతాల నుండి మరికొంత మంది గ్రామీణ ప్రాంతాల నుండి వస్తున్నారు. ఏ ప్రాంతం వారైనా వీరు దళితులని తెలియగానే వీరి పట్ల మిగిలిన వారు ప్రవర్తించే తీరు తేడాగా ఉంటుందనేది జగమెరిగిన సత్యం. కాకపోతే కొంత మందికి ఈ వివక్ష రూపం అర్థం అయితే, కొంత మందికి అర్థం కాదు. మానసిక వేదనకు మాత్రం గురవుతారు. యూనివర్సిటీలో వివక్ష రూపం ప్రత్యక్షంగా ఉండదు కాబట్టి ఆ రూపాన్ని అర్థం చేసుకోవడానికి సమయం కూడా పడుతుంది. ముఖ్యంగా దళిత అమ్మాయిలు హాస్టల్స్‌లో, డిపార్ట్‌మెంట్స్‌లో ఇతర విద్యార్థుల దగ్గర, దళిత అబ్బాయిల దగ్గర ఒకవిధమైన లింగ వివక్షని ఎదుర్కొంటూ ఉంటారు.

**హాస్టల్స్‌లో**

దళిత విద్యార్థులందరూ యూనివర్సిటీకి చదువుకోవడానికి వచ్చేవారే. అమ్మాయిల హాస్టల్స్‌లో చూస్తే దళిత, దళితేతర అమ్మాయిలు ఒకరి పట్ల ఒకరు సహృద్భావంతో ఉండడం చాలా అరుదుగా కన్పించే సంఘటన. దళితులని తెలియగానే వీరి మీద దొంగతనాలు మోపడం, లేదా మీరు వేరే వాళ్ళని డిస్టర్బ్ చేస్తున్నారని ఆరోపణలు చేస్తుంటారు. దళితేతర అమ్మాయిలు వీళ్ళని పీడనకు గురి చేసే సందర్భాలు చాలానే ఉంటుంటాయి. కొన్ని బయటకు వస్తే కొన్ని లోలోపలే సర్దుబాట్లు జరుగుతుంటాయి. ఉదాహరణకు దళిత అమ్మాయి, దళితేతర అమ్మాయి కలిసి ఉంటే రూమ్‌లో కామన్ షెల్ఫ్‌లు పంచుకోవటానికి ఇష్టపడకపోవటం, దళిత అమ్మాయి స్నేహితుల్ని రూమ్‌కి రానివ్వకపోవటం, రూమ్ శుభ్రంగా ఉంచే బాధ్యత అంతా ఈ అమ్మాయి మీదే నెట్టివేయడం లాంటి అనేక సంఘటనలు జరుగుతుంటాయి. అటువంటి సమయాలలో దళిత అమ్మాయిలు సీనియర్ అమ్మాయిల, అబ్బాయిల సహాయం తీసుకుంటూ ఉంటారు.

దళిత అమ్మాయిలకు దళితేతర అమ్మాయిలకు విభేదాలు చెప్పుకోదగినంత పైకి కనబడవు గానీ లోలోపల చెప్పుకోలేని విషయాలు లేదా హాస్టల్స్‌లో చాలా చిన్న విషయాలుగా కనబడే సంఘటనలు కూడా తరచూ జరుగుతూనే ఉంటాయి. వీరు దళితేతర అమ్మాయితో కలిసి రూమ్‌మెట్‌గా ఉంటే రూమ్‌లో ఏదైనా మిస్ అయినపుడు వీరే తీసారనో లేదా ఎవరికో ఇచ్చివేసారనో అనుకునే సందర్భాలు చాలా ఉంటుంటాయి. ఇలాంటి ఆరోపణలు దళిత అమ్మాయి దళితేతర అమ్మాయి కలిసివున్నప్పుడు మాత్రమే ఉంటాయి. కానీ దళితేతర అమ్మాయిలు ఇద్దరూ రూమ్ మేట్స్‌గా ఉన్న సందర్భంలో ఏదైనా మిస్ అయినా సాధారణంగా బయటికి రావు. దళిత అమ్మాయిలను అనుమానించినంత త్వరగా దళితేతర అమ్మాయిలను అనుమానించరు.

**డిపార్ట్‌మెంట్లలో లైంగిక వేధింపులు ఎదుర్కొనేటపుడు దళిత అమ్మాయిలు ఏంచేస్తుంటారు?**

దళిత, దళితేతర ఫాకల్టి దగ్గర దళిత విద్యార్థినులు వేధింపులు ఎదుర్కొంటూనే ఉంటారు. దళితేతర ఫాకల్టి దగ్గర లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నపుడు చాలా వరకు వాళ్ళ దగ్గరే కోర్స్ పూర్తి చేయడానికి చూస్తారు. కొన్ని భరించలేని సందర్భాల్లో డిపార్ట్‌మెంట్ హెడ్‌కి ఫిర్యాదు చేయడం జరుగుతుంది. అటువంటి సమయాలలో హెడ్ విద్యార్థిని వేరే గైడ్ దగ్గరకి రికమెండ్ చేయడమో లేదా తను తీసుకోవడమో చేస్తుంటారు.

ఒక్కోసారి దళిత ఫాకల్టి దగ్గరే దళిత అమ్మాయిలు లైంగిక హింసను ఎదుర్కొన్నపుడు అది భరించలేక వేరే వారి సహాయం తీసుకోలేక నలిగి పోతుంటారు. ఇంతేకాక దళిత అమ్మాయిలెవరైనా దళిత ఫాకల్టి మీద లైంగిక హింసకు సంబంధించి ఆరోపణలు చెయ్యాల్సి వచ్చినప్పుడు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తారు. ఎందుకంటే ఇప్పుడిప్పుడే విద్యారంగంలో తమ అస్తిత్వాన్ని నిరూపించుకుంటున్న దళిత ఫ్యాకల్టి కెరియర్ ఇటువంటి ఆరోపణల వలన దెబ్బతినే అవకాశం ఉంటుందని భయపడతారు దళితేతర ఫ్యాకల్టి నుండి దళిత ఫాకల్టిని కాపాడే బాధ్యత కూడ దళిత అమ్మాయిలు తమ నెత్తిమీద వేసుకుంటారు. అంటే కమ్యూనిటీ గురించి దళిత అమ్మాయిలు ఇంత లోతుగా ఆలోచిస్తారు. ఇంతగా ఆలోచించే దళిత విద్యార్థినుల గురించి దళిత అబ్బాయిలు ఏ విధంగా ఆలోచిస్తున్నారు? దళితేతరుల నుండి సమస్య వస్తే ఆలోచించకుండా దళిత అమ్మాయిలకు సహాయసహకారాలు అందించే అబ్బాయిలు దళిత విద్యార్థుల నుండి గానీ ఫ్యాకల్టీ నుండి గానీ సమస్య వచ్చినపుడు కనీసం అంతర్గతంగా కూడా స్పందించడానికి, చర్చించడానికి సిద్ధపడటం లేదు. ఇంతే కాకుండా ఇటువంటి వేధింపులకు పాల్పడిన విద్యార్థులను, ఫ్యాకల్టీని కొన్నిసార్లు వెనకేసుకురావడం కూడా జరుగుతుంది. ఈ అనవసర స్పందన వలన యూనివర్సిటీ సమాజంలో దళిత విద్యార్థులందరూ మరియు దళితులందరూ లైంగిక వేధింపులను సమర్థిస్తారనే తప్పుడు సంకేతాలు వెళుతున్నాయి. ఎవరో ఒక దళిత విద్యార్థి లేదా ఫ్యాకల్టి అనుచిత ప్రవర్తనను విద్యార్థులు అనాలోచితంగా సమర్థించడం వలన కమ్యూనిటీ మొత్తాన్ని నిందించడం జరుగుతుంది.

ఇక అబ్బాయిల దగ్గరికి వచ్చేసరికి స్నేహంలోనూ, ప్రేమ వ్యవహారాల్లోనూ దళిత అమ్మాయిలకు, వీరికి ఘర్షణలు, సంఘర్షణలు చాలా చోటుచేసుకుంటాయి. చాలా మంది దళిత అబ్బాయిలు దళిత అమ్మాయిల దగ్గరకి ప్రేమ పేరుతో దగ్గరకు వచ్చినా పెళ్ళిళ్ళకు సుముఖంగా ఉండటం లేదు. చాలాసార్లు దళిత అమ్మాయిల బలవంతం వల్ల, పోలీస్ కేసులు అయితే తప్ప పెళ్ళిళ్ళు జరగడం లేదు. ఇదే దళిత అబ్బాయిలు దళితేతర అమ్మాయిల దగ్గర ఇలా ప్రవర్తించడానికి భయపడతారు. ప్రేమించుకున్న ప్రతి జంటా పెళ్ళి పేరుతో ఒక్కటవ్వాలని రూల్ ఏమీ లేదు గానీ, ఇప్పుడిప్పుడే ఉన్నత చదువుల కొస్తున్న దళిత అమ్మాయిల కేరీర్‌పై, జీవితాలపై ఇటువంటి ఘర్షణలు ప్రభావం చూపుతున్నాయి.

రోజువారి జీవితంలో అమ్మాయిలు దళిత, దళితేతర అబ్బాయిల దగ్గర లైంగిక వేధింపులు ఎదుర్కొంటునే ఉంటారు. అయితే దళితేతర అబ్బాయిలు వేధింపులకు పాల్పడితే వేధింపులుగా భావించే దళిత అబ్బాయిలు వాళ్ళు వేధించినా వీరు మానసిక క్షోభకు గురవుతుంటారని గుర్తించరు. దళితేతర అబ్బాయిల నుండి వేధింపులు ఎదురైనపుడు ఆ అమ్మాయిలకు అండగా నిలబడ్డ దళిత అబ్బాయిలే ఇక్కడ దళిత అమ్మాయిల పట్ల చిన్న చూపే కలిగి ఉంటున్నారు. ఇక

అసోసియేషన్స్‌లో దళిత అమ్మాయిలు ఉన్నప్పటికీ వారి భాగస్వామ్యం చాలా కొద్ది మాత్రంగానే ఉంటుంది లేదా అస్సలు ఉండక పోవడం వంటివి ఉంటుంటాయి. ఒకవేళ ఉన్నా, అసోసియేషన్స్‌లో నిర్ణయాధికారం అంతా అబ్బాయిలదే అయి ఉంటుంది. ఏ కార్యక్రమానికైనా సమాన స్థాయిలో ఉండవలసిన భాగస్వామ్యం 1:3 ఉండడం చూస్తే యూనివర్శిటీలో దళిత అమ్మాయిలు ఏ మేరకు కుల, లింగ పరంగా వివక్షను ఎదుర్కొంటున్నారో అర్థమవుతుంది.

యూనివర్శిటీకి దళిత అమ్మాయిలు, అబ్బాయిలంతా అందమైన భవిష్యత్తును ఊహించుకునే వస్తారు. కానీ ఇక్కడకి వచ్చాక చదువుతోపాటు ఇక్కడ ఉన్న వివిధ సంస్కృతుల ప్రభావం వీరి మీద కూడా పడుతుందనేది తోసిపుచ్చలేని నిజం. వివిధ దళిత సంస్కృతుల నుండి వచ్చిన అమ్మాయిలు, అబ్బాయిలు యూనివర్శిటీ సంస్కృతిని ఎలా అర్థం చేసుకుంటున్నారు అన్నది ప్రశ్న. దళితేతర విద్యార్థులు ఇక్కడ చెడు ప్రభావాలకు లోనైనప్పటికీ వారికి కొంత సామాజిక వెసులుబాటు ఉంటుంది. కానీ దళిత విద్యార్థులు ఇక్కడ అటువంటి ప్రభావానికి లోనైతే వీరిని వ్యక్తులుగా కాక ఒక వెనుకబడిన కుల సంస్కృతికి ప్రతినిధులుగా చూడటం పరిపాటి. ఎవరైనా ఏదైనా తప్పు చేస్తే అది దళిత కమ్యూనిటీ అంతటికీ ఆపాదించి చూస్తారు. కానీ అందరిలానే అందరిలాంటి ఆశలతోనే వీరు కూడా చదువుతో మారడానికి వస్తారనే విషయాన్ని దళితేతరులు, కొన్నిసార్లు దళితులు, అందరూ మర్చిపోతూ ఉంటారు. సమాజంలో తరాలుగా దళిత కమ్యూనిటీ అణిచివేయబడిన వర్గంగా ఉంది. దళిత అమ్మాయిలు దళితేతర, దళిత అబ్బాయిల దగ్గర అణచివేత వర్గంలో మరింత అణచివేయబడిన వర్గంగా ఉన్నారు.

చదువుకోవటానికి ఇక్కడకు వచ్చిన దళిత అమ్మాయిలు, అబ్బాయిలు కూడా తరాలుగా మోస్తున్న కుల స్వభావానికి, చైతన్యానికి మధ్య యుద్ధం చేస్తున్నారు. ఈ యుద్ధంలో ఎవరూ బయటకు రాలేక పోతున్నారు. ఇద్దరూ క్షతగాత్రులుగానే మిగిలి పోతున్నారు. గ్రామాల నుండి, కుటుంబాల నుండి చదువుకోవటానికి బయటకు వచ్చిన వీరిలో కొంత సంస్కరణవాదం, కులపరమైన అణచివేతను ప్రశ్నించే స్పృహ మొదలవుతుంది. అలా మొదలైన చైతన్యంతో దళిత అబ్బాయిలు దళిత అమ్మాయిలను దళితేతర అమ్మాయిలతో పోల్చి చూసుకోవటం, అమ్మాయిలు కూడా దళితేతర అబ్బాయిలతో పోల్చి చూసుకుంటున్నారు. చదువుకున్న అమ్మాయిలు అన్నింట్లోనూ స్వయంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగారు. కానీ ఈ ఎదుగుదల, ఎదిరించి ప్రశ్నించే తత్వం యూనివర్శిటీలో అబ్బాయిలకు మింగుడు పడడం లేదు. వీళ్ళు అబ్బాయిలను ఎదిరించే ప్రశ్నించే స్థాయికి చేరారని ఫిర్యాదులు అమ్మాయిల పట్ల చేస్తుంటారు. ఇది విన్న దళిత అమ్మాయిలకు చాలా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దళిత అబ్బాయిలు ఏ ఆధారంతో ఈ ఆరోపణలు చేస్తున్నారు? అమ్మాయిలు ఎలా ఉండాలని కోరుకుంటున్నారు? ఏ పరిమితుల్లో, పరిధుల్లో అమ్మాయిలను ఉంచాలని చూస్తున్నారు? యూనివర్శిటీకి దళిత అమ్మాయిలు, అబ్బాయిలు అందరూ సమాన సామర్థ్యాలతోనే వస్తున్నారు. క్లాసుల్లో సబ్జెక్ట్ సమానంగానే నేర్చుకుంటున్నారు. సమానంగానే మార్కులు సంపాదించుకుంటున్నారు. కానీ కలిసి పనిచేసే విషయానికి వచ్చేసరికి ఒకరిని ఒకరు నిందించుకునే పరిస్థితులు ఎందుకు వస్తున్నాయి? ఇలాంటి విషయాల పట్ల ఇద్దరి మధ్య చర్చ అవసరం చాలా ఉంది. పొలాల్లో తమతో పాటు సమానంగా పని చేసిన స్త్రీల వారసత్వమే ఇప్పుడు తమతో సమానంగా చదువుకోవడానికి యూనివర్శిటీకి వచ్చిందని ఎందుకు మర్చిపోతున్నారు? తెలివి, జ్ఞానం, చదువు రంగాల్లో అమ్మాయిల ప్రవేశం పట్ల అబ్బాయిలకేమైనా అభ్యంతరాలున్నాయా? ఒకవేళ అలా ఉండి ఉంటే యూనివర్శిటీలో అమ్మాయిల రిజర్వేషన్ల కోసం వీరు పోరాడేవారు కాదు కదా? ఏది ఏమైనా దళిత అమ్మాయిలు యూనివర్శిటీలో చాలాసార్లు ఒంటరి పోరాటం చేస్తున్నారన్నది దళిత అబ్బాయిలు గమనిస్తున్నారా?

ఈ పరిస్థితికి కారణం దళిత అబ్బాయిల్ని ఇంకా వదిలిపోని మనువా లేక సామాజిక బానిసత్వమా? వీరికి కూడా మనువు చెప్పినట్లు అమ్మాయిలంటే ఇలానే ఉండాలి అనే పరిధులేవైనా ఉన్నాయా? స్త్రీలకి ఎటువంటి అధికారాలు అవసరం లేదు. వీరు అన్ని స్థితులలో ఎవరో ఒకరి మీద ఆధారపడి బతకాలని చెప్పిన మనువుని ఈ రోజు బహిరంగంగా యూనివర్శిటీలో తగలబెడుతున్నారు. కానీ ఆలోచనలు తమకి తెలీకుండానే మెదళ్ళలో ఇంకిపోయేలా చేసిన మనువుకి సమాధి ఎప్పుడు కడతారు?

సమాజంలో అన్ని హింసలను ఎదిరించి యూనివర్శిటీ చదువులకు వస్తున్న దళిత అమ్మాయిలు ఉన్నత విద్యాసంస్థలైన యూనివర్శిటీల్లో తమపై జరిగే లైంగిక వేధింపులను గానీ, వివక్షను అభివ్యక్తీకరించే స్వేచ్ఛగానీ, స్థానం గానీ లేకపోవటం వలన యూనివర్శిటీల్లో వాళ్ల అస్తిత్వం, ఉనికి రెండూ ప్రశ్నార్థకంగానే ఉంటున్నాయి.

*మిరప మాధవి అన్వేషిలో షార్ట్‌టర్మ్ ఫెలో*

## విశాఖ నిబంధనలు / మార్గదర్శకాలు

ఒక సామాజిక కార్యకర్త అయిన యాభై ఏళ్ల భన్వారీదేవి తన గ్రామంలో అమలులో ఉన్న దురాచారమైన బాల్య వివాహాన్ని ఆపడానికి ప్రయత్నించింది అన్న కారణంతో అక్కడి అగ్ర వర్గాలకు చెందిన కొంత మంది మగవాళ్ల చేతిలో ఆమె లైంగిక దాడికి గురయింది. తనకు న్యాయం చేయమంటూ దోషులపై భన్వారీదేవి కేసు పెట్టింది.

ఈ దారుణ అన్యాయాన్ని సహించలేని కొంత మంది మహిళలు, ఎన్.జి.ఓలు భన్వారీదేవి పోరాటానికి మద్దతుగా నిలిచి విశాఖ మహిళా సంఘం తరఫున సుప్రీంకోర్టులో పిటిషన్ వేసారు. (అదే విశాఖ మరియు ఇతరులు వర్సెస్ రాజస్థాన్ ప్రభుత్వం మరియు ఇతరులు, 1997 కేసుగా ప్రాచుర్యం పొందింది). భన్వారీదేవికి న్యాయం చేయడంతోపాటు, స్త్రీలు పనిచేసే ప్రదేశాలలో లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా సరైన చర్యలు తీసుకోవాలని వీరు డిమాండ్ చేసారు. ఈ కేసుపై స్పందిస్తూ సుప్రీంకోర్టు లైంగిక వేధింపుని ఇలా నిర్వచించింది - "ఎలాంటి అసహజమైన మాటలయినా, చేష్టలయినా, ప్రవర్తనయినా లైంగికపరంగా అభ్యంతరకరంగా ఉంటే అది లైంగిక వేధింపు కిందకే వస్తుంది". స్త్రీల పట్ల వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న అంతర్జాతీయ మానవ హక్కుల న్యాయ విభాగం (కన్వెన్షన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ ఆల్‌ఫార్మ్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ ఎగైనెస్ట్ ఉమెన్) తరహాలో సుప్రీం కోర్టు మొదటిసారిగా లైంగిక వేధింపులు నిరోధించడానికి కొన్ని నిబంధనలను ప్రవేశ పెట్టింది. అవే విశాఖ నిబంధనలు. సుప్రీంకోర్టు ఇచ్చిన విశాఖ నిబంధనలలో కొన్ని ఈ క్రింద ఇవ్వబడ్డాయి :

లైంగిక వేధింపులు నిరోధించడానికి తమ సంస్థలో ఉద్యోగస్తుల నడవడికకు సంబంధించి ఒక ప్రవర్తనా నియమావళిని రూపొందించి, అమలు చేయాల్సిన బాధ్యత సదరు కంపెనీ యజమాని తప్పనిసరిగా తీసుకోవాలి.

మహిళల సారధ్యంలో ప్రతీ సంస్థ ఫిర్యాదుల కమిటీలు ఏర్పాటు చేయాలి. దోషులపై చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలి.

మహిళా ఉద్యోగులు తమ హక్కుల గురించి అవగాహన ఏర్పరచుకోవాలి.

అనువాదం : డి.సుజాత

# ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలు

## బి.సత్తమ్మతో ఇంటర్వ్యూ

**సునీత :** ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చే అమ్మాయిల సామాజిక, ఆర్థిక నేపథ్యం ఏమిటి?

**సత్తమ్మ :** అమ్మాయిలు అన్ని కులాల వారు వచ్చినా, ఎక్కువగా దళిత, బహుజన, మైనారిటీ నేపథ్యం నుండి వస్తారు. ఆర్థికంగా – రోజు వారి కూలి చేసే కుటుంబాలు, ఆర్థికంగా చితికి పోయిన కుటుంబాల నుండి వస్తున్నారు. సెలవుల్లో గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసుకుని, కొంత డబ్బు సంపాదించి, తమ యూనివర్సిటీ ఖర్చుల కోసం వాడుకుంటారు. ఇక్కడికి వచ్చిన తరువాత, ఇంటి దగ్గర నుండి డబ్బులు రాని పరిస్థితులలో ఉన్న వాళ్ళు, హాస్టల్‌లో ఉంటూ, క్యాంపస్ దగ్గరగా ఉన్న ప్రాంతాలలో హోం ట్యూషన్లు చెప్పుకుంటారు. పొద్దున్న ఆరు నుండి ఎనిమిది వరకూ, సాయంత్రం ఆరు నుండి ఎనిమిది వరకూ. ఇంకొంత మంది తమ తోటి విద్యార్థినులకు బ్యూటీ పార్లర్‌కు సంబంధించి సేవలు అందించి కూడా కొంత ఆర్థికంగా తమను తాము పోషించుకుంటారు. చాలా మంది డబ్బులయిపోయిన తరువాత బన్ను, బిస్కట్లు, టీ తాగి కూడా ఉంటారు. ఉద్యోగం దొరికితే తప్ప ఊరికి తిరిగి పోలేని పరిస్థితిలోనే చాలా మంది ఉంటారు.

**సునీత :** యూనివర్సిటీ గురించి ఏ రకమైన ఆశయాలతో అమ్మాయిలు వస్తారు?

**సత్తమ్మ :** రక రకాల ఆశయాలతో వస్తారు. ఒకటి, ఉస్మానియా యూనివర్సిటీలో బాగా చదువు చెప్తారు, కాబట్టి ఇక్కడ చదివితే బాగుంటుందని వస్తారు. రెండు, ఇక్కడ గొప్ప వాళ్ళు తయారయ్యారు కాబట్టి, తాము కూడా గొప్ప వాళ్ళుగా తయారవాలనే ఉద్దేశంతో వస్తారు. మూడు, చదువుతోపాటు, ఉద్యోగ అవకాశాలు కూడా మంచిగా ఉంటాయని భావిస్తారు. యూనివర్సిటీ వాళ్ళు అందించే ఉచిత కోచింగ్ కూడా ఒక ఆకర్షణ. బయట డబ్బులు పెట్టి కోచింగ్ తీసుకోలేని విద్యార్థినులు అందుకే యూనివర్సిటీ సీటు కోసం కష్టపడతారు. డి.ఎస్సీ, గ్రూప్ 1, 2, నెట్, స్లెట్, జూనియర్ లెక్చరర్, బ్యాంకింగ్ రంగాల్లో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించే లక్ష్యాలతో వస్తున్నారు. కుటుంబ హింస వల్ల విడాకులు తీసుకున్న అమ్మాయిలు, భర్తని కోల్పోయిన అమ్మాయిలు, పిల్లలున్న అమ్మాయిలు, ఆపేసిన చదువుని తమ భవిష్యత్తు, తమ పిల్లల భవిష్యత్తు కోసం తిరిగి ప్రారంభించిన వాళ్ళు కూడా ఉన్నారు. అంతే కాకుండా, కుటుంబంలో పెద్ద కావటం వల్ల తమ తమ్ముళ్ళ, చెల్లెళ్ళ బాధ్యతలను పూర్తిగా నెత్తికెత్తుకున్న వాళ్ళు చాలా మంది ఉన్నారు.

**సునీత :** హాస్టల్‌లో ఉండే పరిస్థితులేమిటి? ఏ రకమైన సమస్యలు ఎదుర్కుంటారు?

**సత్తమ్మ :** పౌష్టికాహార లోపం చాలా ఉంది అమ్మాయిల్లో. చాలా మంది అమ్మాయిలు రక్తహీనతతో బాధపడుతుంటారు. దూరం కాలేజీల్లో చదివే వాళ్ళు మెస్‌లో భోజన సమయం మిస్ అవుతున్నారు. హాస్టల్‌లో ఇచ్చే ఆహారం ఈ లోపాలు పూడ్చేది కాదు. మంచినీళ్ళు, తాగేనీళ్ళు సరిగా లేవు. ఫిల్టర్లు పాడవుతూ ఉంటాయి. జ్వరాలు, జాండిస్ రావటం, కళ్ళు తిరిగి పడిపోవటం చాలా సాధారణంగా జరుగుతుంటాయి. హాస్టల్‌లో పగలు డాక్టరు ఉన్నా కూడా, రాత్రి పూట ఎవరూ ఉండరు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లల్లో, కాలేజీల్లో రాత్రిపూట నర్సులు ఉంటారు కానీ, 2,700 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్లో ఈ సౌకర్యం కూడా లేదు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో, యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రంలో ట్రీట్ చేసే వసతులు లేవు, కనీసం అంబులెన్స్ కూడా లేదు. విద్యార్థినులు 108 సౌకర్యంపై ఆధారపడు తుంటారు. క్యాంపస్ చుట్టుపక్కల వుండే ఆస్పత్రులకి వెళితే అక్కడ ఆరోగ్య సేవలకి చాల డబ్బులవుతాయి. ఈ రోజువారి సమస్యల గురించి అమ్మాయిలు చాలా వరకు ఒకరి మీద ఒకరు ఆధారపడతారు.

**సునీత :** హాస్టల్‌లో ఉండే అమ్మాయిల గురించి క్యాంపస్‌లో ఉండే అభిప్రాయాలేమిటి?

**సత్తమ్మ :** నేను క్యాంపస్‌లో ఉన్న మూడేళ్ళలో చాలా అభిప్రాయాలు విన్నాను. మొదటిది, హాస్టల్‌కి వచ్చే ముందు అమ్మాయిలు మంచి వాళ్ళే కానీ, వచ్చిన తరువాత చెడిపోతారని. హాస్టల్ అమ్మాయిలు ఒక్క అబ్బాయితో కాకుండా, ఇద్దరు ముగ్గురు అబ్బాయిలతో స్నేహం చేసి, వాడుకుని వదిలేస్తారని చాలా మంది అబ్బాయిలు అంటుండగా నేను విన్నాను. రెండు, ఊరు నుండి పట్టణం కొచ్చిన అమ్మాయిలు లైఫ్ స్టైల్ మార్చుకుని ఫ్యాషన్లకి అలవాటుపడతారనీ, పెరిగిన ఆర్థిక అవసరాల కోసం, మగ స్నేహితులపై, కుటుంబాలపై ఆధారపడతారనీ, అది సాధ్యంకానపుడు 'సెక్స్ వర్క్' చేస్తారని అనేక మంది అభిప్రాయపడతారు. ఈ అభిప్రాయాలు ఉన్నాయని అమ్మాయిలకు తెలుసు. చెల్లె, చెల్లె అని వచ్చే వాళ్ళు, నోట్స్ కోసం వచ్చే సహాధ్యాయులు, తమ కులమనీ, ప్రాంతమనీ, ఊరనీ అమ్మాయిలని కలవటానికి హాస్టల్‌కి వచ్చే చాలా మంది అబ్బాయిలు మా వెనక ఇలా అన్యాయంగా ఎందుకు మాట్లాడతారో నాకు అర్థం కాదు. ఈ పితృస్వామ్య భావజాలాన్ని జీర్ణించుకున్న అమ్మాయిలు కూడా లేకపోలేదు. వాళ్ళు ఈ భాషని, ఈ అభిప్రాయాల్ని సమర్థిస్తూ మాట్లాడతారు. అంతేకాదు, కొన్నిసార్లు స్త్రీల సంఘాల వాళ్ళు మీటింగులు పెట్టినప్పుడు కూడా అవి పెట్టే వాళ్ళు స్త్రీ వాదులనీ, వాళ్ళు చెప్పింది వింటే అమ్మాయిలు కూడా చెడిపోతారనీ చెపుతూ ఉంటారు.

ఇటువంటి అభిప్రాయాలు బలంగా ఉండటం వల్ల, ఎవరో కొంత మంది జీవితం చూసిన వాళ్ళు తప్ప, చాలా మంది అమ్మాయిలు తాము గూడ ఇటువంటి రూమర్లకు గురవ్వుతామని భయపడతారు. తమ కులం. వూరి, ప్రాంతపు అబ్బాయిలు ఇటువంటి అభిప్రాయాలను తమ కుటుంబానికి చేరవేస్తే తమ భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం పడుతుందో అని ఆలోచిస్తుంటారు. సున్నిత స్వభావం కలిగిన అమ్మాయిలు ఇటువంటి రూమర్లకు చాలా ప్రభావితులవుతారు. అమ్మాయిలు స్వేచ్ఛగా, కొత్త విషయాలని, సమానత్వ భావజాలాన్ని అలవర్చుకోకుండా ఈ వాతావరణం అడ్డుకుంటోంది.

ఇటువంటి సంకుచిత భావ వాతావరణం వల్ల అమ్మాయిలు తమ ప్రపంచాన్ని, తమ జీవితాన్ని కూడా కుంచించుకుపోయేట్లు చేసుకుంటున్నారు. కొంత మంది పాత భావజాల ప్రపంచంలో ఉండి, చదువు పూర్తి కాగానే పెళ్లి చేసుకుని, భర్త ఏ రకంగా చూసినా (కొట్టినా, తిట్టినా) అట్లాగే ఉండిపోతున్నారు. ఇంకొంత మంది ప్రేమలో పడినా, ఒక రకమయిన ఆధారిత సంబంధాలలోకి వెళ్తున్నారు. అంటే, పూర్తిగా అబ్బాయిలు చెప్పింది మాత్రమే చేస్తూ, ఆర్థికంగా వారికి అధికారం అప్పగించేసి, చివరికి పెళ్లి చేసుకోవటానికి నిరాకరిస్తే ఏం చెయ్యాలో, ఎట్లా ఆలోచించాలో తెలియక, ఇంట్లో వాళ్లకి చెప్పలేక, తమని తాము హింసించుకుంటున్నారు.

ఉస్మానియాలో అమ్మాయిల పరిస్థితుల గురించి, స్త్రీ పురుష సంబంధాల గురించిన భావాల గురించి, బహిరంగ చర్చ జరగకుండా ఈ వాతావరణం మారుతుందని నేను అనుకోవట్లేదు. దీనికొక ప్రత్యేక వేదిక అవసరం. యూనివర్సిటీ విద్యార్థులు మరియు మేధావులు అందరు దీని గురించి ఆలోచించటం చాలా అవసరం. చాలా మంది అమ్మాయిలు ఈ రకంగా ఆలోచిస్తారు గాని నేను బయటికొచ్చి చెప్తున్నాను, అంతే తేడా. ఒక సామాజిక బాధ్యత కలిగిన విద్యార్థిగా ఇది చెప్పటం నా బాధ్యత అని నా అభిప్రాయం.

**సునీత :** మరి అమ్మాయిల సమస్యల గురించి జండర్ దృక్పథంతో ఆలోచించే రాజకీయ పరిస్థితులున్నాయా? ఏ రకమయిన సమస్యలని చర్చించాలి?

**సత్తమ్మ :** లేవు, ఎందుకంటే, తమని తాము గురించి తాము ఆలోచించుకునే పరిస్థితులు అమ్మాయిలకి అటు కుటుంబంలో లేవు. యూనివర్సిటీకి వచ్చిన తరువాత కూడా లేవు. యూనివర్సిటీలో ఉన్న వివిధ రకాలయిన విద్యార్థి సంఘాలు కూడా ఈ పరిస్థితులు కల్పించటానికి ప్రయత్నాలు చేయట్లేదనేది నేను గమనించిన విషయం. అన్ని విద్యార్థి ఉద్యమాలలో అమ్మాయిలు పాల్గొన్నప్పటికీ సంఘాలలో పెద్ద భాగస్వామ్యం ఉండదు. వేదికల పైన ఒకరో ఇద్దరో తప్ప వారి సంఖ్యకు, భాగస్వామ్యానికి తగ్గ ప్రాతినిధ్యం ఎక్కడా కనిపించదు. నా ఉద్దేశంలో ఎక్కడో జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా ధర్నాలు, ప్రకటనలు చెయ్యకుండా అమ్మాయిలు రోజు ఎదుర్కునే సమస్యలపై - హాస్టల్‌లో, కాలేజీలో, రోడ్లపై, బస్సుల్లో - ఎలా ఎదుర్కోవాలి అన్న విషయంపై చర్చలు జరపాలి. స్నేహాలు, ప్రేమలు, అన్న - చెల్లెళ్ల, ప్రాంత, ఊరు సంబంధాలు - వీటిలో వస్తున్న సమస్యలపై బహిరంగంగా - చిన్న గ్రూపుల్లో అయినా మాట్లాడగలిగేలా ఆలోచనా పరులైన విద్యార్థులు కృషి చెయ్యాలి. వివిధ విద్యార్థి సంఘాలు కూడా ఈ ప్రయత్నాలకి సహకరిస్తే, అమ్మాయిలకు తమ భవిష్యత్తుపై కొంతైనా అవగాహనా, నియంత్రణ ఉండే అవకాశం ఏర్పడుతుంది. విద్యార్థినులకు విద్యార్థి సంఘాలపైన మరింత నమ్మకం కూడా వస్తుంది. ఫలితంగా తామెదుర్కునే సమస్యలను నిర్మొహమాటంగా చెప్పుకునే అవకాశం కల్పించిన వాళ్ళవుతారు. ప్రస్తుతమున్న సంకుచిత వాతావరణాన్ని విశాల పరిచే అవకాశం కూడా కలుగుతుంది.

*బి. సత్తమ్మ ఉస్మానియా యూనివర్సిటీలో పిహెచ్‌డి చేస్తున్నారు*




# యూనివర్సిటీల్లో దళిత విద్యార్థినుల పరిస్థితి గురించిన ఆలోచనలు

■ **సౌజన్య**

*(నేను 6 సంవత్సరాలు ఇఫ్లూలో చదుకున్నాను. లైంగిక వేధింపుల గురించి నేను చేసిన వ్యాఖ్యలు ఈ క్యాంపస్‌కి సంబంధించినవే, ప్రత్యేకంగా హైదరాబాద్ విశ్వవిద్యాలయం గురించి చెప్తే తప్ప. 'దళిత స్త్రీలకు ప్రత్యేక, రాజకీయ సంఘాలు లేవు' అన్న నా స్టేట్‌మెంట్ 2004-2009ల మధ్య ఇఎఫ్ఎల్‌యుకి సబంధించింది.)*

కుల, లైంగిక రాజకీయాలను తెలుసుకోవడానికి యూనివర్సిటీ క్యాంపస్ అనువైన స్థలం. ఈ చైతన్యమే క్యాంపస్‌లో కుల, లైంగిక గతిశీలతను అర్థం చేసుకోవడాన్ని మరింత క్లిష్టతరం చేస్తుంది. అగ్రకుల స్త్రీలు అట్టడుగు వర్గాల నేపథ్యం ఉన్న పురుషుల చేత లైంగిక హింసకు గురవుతూ ఉంటారని ఒక భావన ఉంది. కానీ అగ్రకుల పురుషుడి చేత లైంగిక హింసకు గురైన దళిత స్త్రీ సునీత లాంటి ఉదాహరణలు చాలానే ఉన్నాయి. (యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన సునీత) ఇఎఫ్ఎల్‌యుల వంటి యూనివర్సిటీ క్యాంపస్‌లలో అమ్మాయిలను లైంగిక వేధింపులకు గురి చేసే వారిలో అటు అగ్రకుల పురుషులు, ఇటు దళిత అబ్బాయిలు అందరూ ఉన్నారు. ధమ్మా మరియు ఇతర రాజకీయ బ్యానర్ కింద దళిత అబ్బాయిలు ఇతర మైనారిటీ విద్యార్థులు సంఘటితమవుతుంటారు. అయితే క్యాంపస్‌లో సాధారణంగా అందరికీ కనిపించే విద్యార్థి సంఘాలు, రాజకీయంగా, సెక్యులర్‌గా కనిపించే సంఘాలు అగ్రకుల విద్యార్థులవై ఉంటాయి. క్యాంపస్‌లో అగ్రకుల విద్యార్థి గ్రూపులకు, దళిత విద్యార్థి గ్రూపులకు సాంస్కృతిక పరంగా మరియు వాళ్ళు ఉండే, కలిసి తిరిగే పద్ధతుల మధ్య చాలా తేడా కన్పిస్తుంటుంది. అగ్రకుల విద్యార్థి సంఘాల్లో స్త్రీ, పురుష విద్యార్థుల భాగస్వామ్యం కన్పిస్తుంది. కానీ దళిత విద్యార్థి సంఘాలు మాత్రం అధికంగా పురుష విద్యార్థులవై వుంటాయి. సాంప్రదాయిక కుల, లైంగిక నిర్మాణాల్లో లాగే అగ్రకుల స్త్రీలు యూనివర్సిటీ క్యాంపస్‌లో దళిత పురుషులతో ఎప్పుడూ అసోసియేట్ కారు. (సాంప్రదాయిక అగ్రకుల స్త్రీలు దళిత పురుషులతో కలిస్తే వారి కుల పవిత్రత పోతుందని సాధారణంగా ఒక అభిప్రాయం ఉంది). అందుకే దళిత పురుషులు వారి దళిత సంఘాలతోనే కలిసి ఉంటారు.

దళిత అమ్మాయిలు పట్ల దళిత పురుషులు ఒక ఆరోపణ చేస్తుంటారు అది ఏమిటంటే దళిత అమ్మాయిలు దళితులుగా గుర్తింపబడడానికి ఇష్టపడరని, అందుకే వాళ్ళు దళిత సంఘాల్లో చేరరని, దళిత అబ్బాయిలతో కలవరని. దళిత స్త్రీలు ఏ రాజకీయ బ్యానర్ కింద పనిచేయని దళిత స్త్రీలతోనే ఎక్కువగా అసోసియేట్ అవుతుంటారు. ఒకోసారి ఒకే భాష, ప్రాంతం నుండి వచ్చిన దళిత స్త్రీలతోనే ఉంటారని. తమకంటూ ఒక రాజకీయ గ్రూపు ఉండకపోవడం వలన 'దళిత స్త్రీ' అనే వర్గానికి క్యాంపస్‌లో ప్రస్తుతం గుర్తింపు, ప్రాధాన్యత లేదు. దళిత స్త్రీలు ఏ దళిత సంఘంలోనూ భాగం కావడానికి సిద్ధంగా ఉండరు ఎందుకంటే తాము చెప్పేది ఎవరూ వినరనే కాదు, లైంగిక వేధింపులకు భయపడి కూడా. ఒక్కసారి దళిత స్త్రీలు దళిత సంఘంలో భాగమయితే వారి దళిత గుర్తింపు బయట పడుతుంది. ఇలా గుర్తింపపడటం వలన ప్రతిష్టాత్మకమైన యూనివర్సిటీలో కులపరంగా, తేలికగా వివక్షకు గురి చేయటానికి అవకాశముంది. ఒక స్త్రీ దళితురాలుగా ఉండడం వలన ఇతరుల నుండి మరియు దళిత పురుషుల నుండి వేధింపులకు గురయ్యే ఆస్కారం ఎక్కువగా ఉంది.

దళిత గ్రూపులు జండర్ గురించి వాళ్ళ మేనిఫెస్టోలో రాయాలనే విషయాన్ని కూడా పట్టించుకోవు. సిద్ధాంత స్థాయిలో గానీ లేదా వ్యక్తిగత స్థాయిలో గానీ దళిత సంస్థలకు లైంగిక వేధింపుల కేసులను డీల్ చేసిన చరిత్ర లేదు. ఈ గ్రూపుల అవగాహనలో కులం అంటే పురుషులకు సంబంధించిన వ్యవహారం. ఆధిపత్య కుల స్పృహ కలిగిన దళిత సంఘంలో దళిత స్త్రీ జీవితాన్ని కుల వ్యవస్థ ఎలా నిర్దేశిస్తుందన్న విషయం నిర్లక్ష్యం చేయబడుతోంది. ఒకవేళ దళిత స్త్రీ ఏదైనా లైంగికవేధింపును ఎదుర్కుంటే వీరికి దళితేతర పురుషుల నుండి గానీ, దళిత పురుషుల నుండి గానీ సపోర్ట్ దొరకటం చాలా కష్టం. ఇటువంటి వేధింపులను వ్యక్తిగత తప్పిదం, గొడవ స్థాయికి దిగజారుస్తారు గానీ, కుల సమస్యగానో, లైంగిక వివక్షగానో అర్థం చేసు కోరు. ఇంకోవైపు దళిత స్త్రీలు కులీన వర్గానికి చెందిన స్త్రీల గ్రూపుల్లో భాగం కారు. క్యాంపస్‌లో దళిత స్త్రీల సంఖ్య చాలా తక్కువ. అందులోనూ కుల అస్తిత్వంతో కూడుకున్న గుర్తింపు, వారిని ఆధిపత్యకుల అధ్యాపకులు మరియు అధికార యంత్రాంగం చేతుల్లో కుల వివక్షకు గురవ్వటానికి దారితీస్తుంది. దళిత స్త్రీ తేలిగ్గా బాధితురాలవుతుంది ఎందుకంటే దళిత సంఘాల్లో కూడా తన స్థానం బలంగా ఉండదు కాబట్టి. దళిత పురుషులు చాలా బలమైన రాజకీయ గ్రూపులను కలిగి ఉంటారు కాబట్టి వారు వివక్షకు గురయితే వారి గ్రూపు వారిని బలపరుస్తుంది. హెచ్.సి.యు మరియు ఇఫ్లూలాంటి యూనివర్సిటీలో చాలా కొద్ది మంది దళిత స్త్రీలు మాత్రం లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా లైంగిక వేధింపుల సెల్‌కు ఫిర్యాదు చేస్తుంటారు. అయితే ఒక్క లైంగిక వేధింపు ఘటనను డీల్ చేసినంత మాత్రాన భవిష్యత్తులో స్త్రీలకు ఇలాంటి ఘటనలు ఎదురుకావని చెప్పలేము. యూనివర్సిటీ సంస్కృతిలో భాగంగా అన్ని సామాజిక వర్గాల్లో జండర్ పట్ల అవగాహనను కలిగించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. దీనిలో భాగంగా తక్కువ కులాలు, దళితులు ఎదుర్కునే బహిష్కరణను కూడా పరిగణనలోనికి తీసుకోవాలి.

*సౌజన్య ఇఎఫ్ఎల్‌యులో చదువుకున్నారు*

***అనువాదం : మిరప మాధవి***

# మహిళా విద్యార్థి వేదిక-గమనాన్వేషణ

■ రేఖా పప్పు

**మా వేదిక** ప్రారంభం కాకముందు కూడా కొన్ని స్త్రీల సమస్యలను మా యూనివర్సిటీలోని విద్యార్థినులు, అధ్యాపకులు వివిధ సందర్భాలలో వ్యక్తిగత స్థాయిలో చేపట్టారు. మా అసలు పుట్టిన రోజు 1990, నవంబర్ నెల. ఒక విధంగా చెప్పాలంటే ఈ ఆందోళనా సంప్రదాయం నుంచే మా 'మహిళా విద్యార్థి వేదిక' పుట్టింది. ఆ నెలలో విద్యార్థి సంఘానికి ఎన్నికలు ప్రకటించారు. ఒక విద్యార్థిని వైస్-ప్రెసిడెంట్ పదవికి నామినేషన్ వేసింది. వెంటనే ఆ అమ్మాయి గురించి వాళ్ళ డిపార్ట్‌మెంట్ గోడల మీద రకరకాల అసభ్యపు రాతలు ప్రత్యక్షమయ్యాయి. అవన్నీ ఆవిడ శీలానికి సంబంధించినవని వేరే చెప్పనక్కరలేదు. వీటికి తోడు బెదిరింపు ఫోన్‌కాల్స్. భయపడి ఆమె తన నామినేషన్ ఉపసంహరించుకుంది. ఈ సంఘటన మాలో చాలా మందిని బాగా కలవరపరిచింది. కొన్ని రకాల బెదిరింపులు (రేప్ వగైరా) స్త్రీల మీద మాత్రమే ప్రయోగించ గలరనే వాస్తవం మరింత బాగా బోధపడింది.

ఈ సమయంలో కొంత మంది విద్యార్థినులు చొరవ తీసుకుని దీని గురించి చర్చించడానికి విద్యార్థుల సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కొత్తగా మళ్ళీ నామినేషన్లకు ప్రకటన యివ్వాలనేది వాళ్ళ ప్రధాన డిమాండ్. బెదిరింపుల కారణంగా ఒక విద్యార్థిని తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నందువల్ల ఈ వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను కొనసాగనిస్తే అవి అన్యాయమైన ఎన్నికలవుతాయని వారి వాదన.
ఈ సర్వసభ్య సమావేశానికి యూనివర్సిటీ చరిత్రలోనే అపూర్వమైన సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. తీవ్ర చర్చలు, గందరగోళం తర్వాత ఆ రోజుసాయంత్రం కొత్త నామినేషన్ల డిమాండ్‌ను ఓటింగ్ ద్వారా నిర్ణయించాలని తీర్మానించారు.

బయటికి వచ్చాక మా చర్చల్లో ఒక గందరగోళ స్థితి నెలకొందని మేము గుర్తించాం. చివరికి వచ్చేసరికి ఆ సమావేశంలో అమ్మాయిలే ఎక్కువగా ఉన్నారు. వారు ఈ సమస్యను స్త్రీల సమస్యగా చూడాలని వాదిస్తున్నారు కానీ, దాన్ని తమ వ్యక్తిగత అభిప్రాయంగా మాత్రమే చెప్పగలుగుతున్నారు. ఒక సమూహంగా మమ్మల్ని మేము వ్యక్తీకరించుకోగలిగితే మా సమస్యకు కొంత న్యాయం జరుగుతుందేమో అనిపించింది. వెంటనే అప్పటికప్పుడు 30 మంది విద్యార్థినులం కలిసి 'మహిళా విద్యార్థి వేదిక'ను ఏర్పరిచాం. ఆనాటి తక్షణావసరాల కోసం మాత్రమే ఏర్పడిన వేదిక అది.

సాయంత్రం ఓటింగ్ ద్వారా నామినేషన్ల నిర్ణయం జరుగుతుందని తీర్మానమయ్యాక మా వేదిక సభ్యులం హాస్టల్స్‌లోని ప్రతి గదికీ వెళ్ళి విషయాన్ని వివరించాం. అంత కష్టపడ్డా ఫలితం దక్కలేదు. సాయంత్రం ఓటింగ్ ఫలితాలు తెలిశాక బాగా నిరాశపడ్డాం. అది మేము ఆశించిన ఫలితం కాదు. కొత్త నామినేషన్లను ఆహ్వానిస్తే మా వేదిక సభ్యులు ఖాయంగా పోటీ చేస్తారని, దానివల్ల వోట్ల లెక్కలు తారుమారవుతాయనీ వివిధ వర్గాల్లో ఏర్పడిన భయాందోళనలే ఆ రోజు మా ఓటమికి ప్రధాన కారణం. ఆనాటి ప్రచారమంతా కొంత మంది అమ్మాయిలు పదవీకాంక్షతో ఈ ఆందోళన నడిపారనేదే.

మొదటి పోరాటంలోనే అపజయం చెందినా, ఆ మొత్తం అనుభవం మాకు ఎంతో ఉపయోగపడింది.

దాన్నించి 'మహిళా విద్యార్థి వేదిక' ఏర్పడడమే కాక ఇతర సమస్యల పట్ల మా అవగాహన గణనీయంగా పెరిగింది. ఇదెలా సాధ్యమైందో చెప్పాలంటే ఎన్నికల ముందు జరిగిన కొన్ని సంఘటనల గురించి యిక్కడ క్లుప్తంగానైనా చెప్పడం అవసరం. మా విద్యార్థి సంఘం ఎన్నికలకు కొంచెం ముందే మండల్ కమీషన్ సిఫార్సులను అమలు చేయబోతున్నట్లు వి.పి.సింగ్ ప్రభుత్వం ప్రకటించింది. వెంటనే క్యాంపస్‌లో (దేశంలో కూడా) మండల్ అనుకూల, వ్యతిరేక, గ్రుపులు ఏర్పడ్డాయి. అగ్రకులాల విద్యార్థులకు దళిత కులాల పట్ల ఉన్న చిన్నచూపు ఆ సమయంలోనే స్పష్టంగా బయటపడింది.

తర్వాత కాలంలో 'మహిళా విద్యార్థి వేదిక'లో చేరిన చాలా మంది అమ్మాయిలు అప్పుడు ఈ మండల్ వ్యతిరేక గ్రూపులో సభ్యులు. ఇలా జరగడానికి మేమంతా అగ్రకులాలకు, అగ్రవర్ణానికి చెందిన వాళ్ళం కావడం ఒక కారణమైతే మాకు తగినంత రాజకీయ పరిజ్ఞానం లేకపోవడం రెండో ముఖ్య కారణం. తెలిసో, తెలియకో మేము ఒంటబట్టించుకున్న ఉదారవాద భావజాలం, పరిమితార్థంలో స్త్రీ సమానత్వ సమస్యను లేవనెత్తడానికి మాత్రమే మాకు అవకాశం యిచ్చింది. దీన్ని ఉపయోగించుకుని మాలో ఎక్కువ మంది - స్త్రీలుగా తాము అనుభవించిన వివక్షల్ని నిరసించారు, వాటికి వ్యతిరేకంగా పోరాడారు. అయితే అవి వ్యక్తిగత చర్యలు మాత్రమే. వ్యవస్థ నిర్మాణంలోనే పాతుకుపోయి ఉన్న అసమానతల గురించి మాకు అప్పటికి ఏమీ తెలియదు. వర్గ, కుల, మత, లింగ అణచివేతలు చాలా సంక్లిష్ట రూపాలలో ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయనే జ్ఞానం, తర్వాత ఎప్పటికో గాని మాకు కలగలేదు. ఈ స్థితిలో ఉన్న మేము మండల్ అనుకూల బృందంలో కొంత మంది సన్నిహిత మిత్రులు ఉన్నప్పటికీ (అప్పటికే వారు 'ప్రగతిశీల విద్యార్థి వేదిక' - పిఎస్‌ఎఫ్‌ను ఏర్పాటు చేశారు) మండల్ వ్యతిరేక బృందంలోనే చేరాము. దాని పేరు మండల్ కమీషన్ వ్యతిరేక వేదిక (ఎఎమ్ఎస్ఎఫ్) తద్వారా మెరిట్‌ని, మా ఉద్యోగావకాశాల్ని రక్షించుకుంటున్నామని మేము అప్పట్లో నమ్మాము.

విద్యార్థి సంఘానికి ఎన్నికలు ప్రకటించిన సమయంలో కూడా మండల్ సమస్య యింకా నలుగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఎవరే పక్షమో అంతా స్పష్టంగానే ఉందనుకున్నాం. కాబట్టి మేము కొత్త నామినేషన్లకు ప్రకటన యివ్వాలని డిమాండ్ చేసినప్పుడు ఎఎమ్ఎస్ఎఫ్ పూర్తి మద్దతు యిస్తుందని ఆశించాం. కాని ఆశ్చర్యకరంగా ఆ విధంగా జరగలేదు. ఎఎమ్ఎస్ఎఫ్ లోని మగవాళ్ళు మా డిమాండ్‌ను ఏమాత్రం బలపరచలేదు. ఇందుకు పూర్తి విరుద్ధంగా నామినేషన్ల మీద జరిగిన చర్చంతటిలోను పిఎస్ఎఫ్ వాళ్ళే మాకు మద్దతు నిచ్చారు. ఆ క్లిష్ట సమయంలో మేము దాన్ని గురించి పెద్దగా ఆలోచించకుండానే పిఎస్ఎఫ్ విద్యార్థుల మద్దతు తీసుకున్నాం.

ఎన్నికల హడావుడి అయిపోయాక తారుమారైన మా ఐక్య సంఘటనల గురించి తీవ్రంగా చర్చించుకున్నాం. ఆ సమయంలో ఎఎమ్ఎస్ఎఫ్ సభ్యులు మమ్మల్ని ద్రోహులుగా పరిగణించడం ఒక రకంగా ఈ చర్చకు ముఖ్య కారణం. ఒక పెద్ద సమస్య మా ఎదురుగా వచ్చి నిల్చున్నప్పుడు మేము దాన్ని వదిలిపెట్టేసి యిలాంటి వాటిని (ఒక విద్యార్థినిని బెదిరించడంలాంటి వాటిని) పట్టించుకోవడం చాలా తప్పని వాళ్ళ ఉద్దేశం. (అంతకు ముందు కూడా మేము పిఎస్ఎఫ్‌లోని మా మిత్రులతో కలిసి తిరగడం వాళ్ళకు ఏమీ నచ్చేది కాదు. బరిలో శత్రుపక్షాలుగా నిలబడ్డాక వాళ్ళతో యింకా స్నేహమేమిటని ఎఎమ్ఎస్ఎఫ్ సభ్యులు మమ్మల్ని అనుమానంగా చూసేవాళ్ళు).

ఈ సమయంలోనే రెండు విషయాలు మాలో పెద్ద మార్పును తీసుకొచ్చాయి. ఒకటి - ఉమెన్స్ స్టడీస్ క్లాసులో మాకు ఫెమినిస్టు సిద్ధాంతంతో, ముఖ్యంగా జాతి, వర్గ సమస్యలను వివరించి చెప్పే మెటీరియలిస్ట్ ఫెమినిజంతో పరిచయం ఏర్పడింది. దీని మీద చాలా చర్చలు జరిగాయి. రెండోది - ఇతర స్త్రీల సంఘాలతో, మండల్ అనుకూల బృందాలతో కూడా చర్చలు జరిపే అవకాశం మాకు లభించింది. అనాలోచితంగా తీసుకున్న మండల్ వ్యతిరేక వైఖరి నుంచి మండల్ అనుకూల సిద్ధాంతానికి నిబద్ధులుగా మారడమనేది మాలో చాలా మందికి చాలా కష్టమైన, బాధాకరమైన అనుభవం. ఉదారవాద బూర్జువా భావాల ప్రభావాల మధ్య పెరిగిన మేము, మాకు కులతత్వం ఉంటుందని గానీ, అసలు కులం గురించిన ఆలోచనలు ఉంటాయని గానీ, ఒప్పుకోలేకపోవడం వలన ఈ మార్పు అంత కష్టమూ, బాధాకరమూ అయింది. అలాగే లింగవివక్ష అణచివేతల గురించి మాట్లాడే మేము, మరోరకం వివక్షను, అణచివేతను మాకు తెలియకుండానే మేము పాటిస్తున్నామని ఒప్పుకోక తప్పలేదు.

వ్యవస్థలో, సామాజిక నిర్మాణ రూపాలలో మార్పు వస్తే తప్ప స్త్రీల సమస్యలు పరిష్కారం కావన్న గుర్తింపు, దాన్ని కుల సమస్యకు కూడా వర్తించుకునేలా చేసి రిజర్వేషన్ల అవసరాన్ని బోధపరిచింది. ఒక విధంగా మా రాజకీయ ఎదుగుదలకు మండల్ సమస్య ఒక ముఖ్యమైన అంశంగా ఉపయోగపడింది. ఈ సమస్య మీద మా వేదిక అనేకసార్లు చీలికకి చేరువైనా (అనేక యితర సంబంధాలలో కూడా యిదే పరిస్థితి) ఈ అనుభవం మా ఆలోచనలకు కూడా పుటం పెట్టింది. స్త్రీల సమస్యకు, కులసమస్యకు వున్న పోలికలు మాకు అర్థమయ్యేలా

చేసింది. లింగపరమైన అణచివేతకు, కులపరమైన అణచివేతకు మధ్య ఉన్న సంబంధం, అవి పరస్పరం ఎలా బలోపేతం చేసుకుంటాయో మాకు అర్థమవడం వల్లనే స్త్రీల హక్కుల కోసం జరిపే పోరాటంలో దళిత సంఘాల మద్దతు తీసుకోవడం అవసరమని గుర్తించాం. ఈ రెండు సమస్యల మధ్య తేడాలు కూడా చాలా ఉన్నాయనే విషయం ఆ తర్వాత ఎప్పటికో గాని మాకు తెలిసి రాలేదు.

ఏదేమైనా ఫెమినిజమే మాకు యితర సమస్యలపై జరిగే చర్చల్లోకి ప్రవేశం కల్పించి మా అవగాహనను, ముఖ్యంగా పితృస్వామ్య వ్యవస్థ పట్ల మా అవగాహనను సమగ్రం చేసింది. ఈ అవగాహనకి రావడానికి మేము సహజంగానే కొంత మూల్యం చెల్లించాల్సి వచ్చింది. మాకందరికీ బాగా గుర్తుండిపోయిన ఒక సంఘటన గురించి చెబుతాను. అది 'ఈవ్‌టీజింగ్'కి సంబంధించినది. చాలా మంది మా క్యాంపస్‌లో ఈ సమస్య లేదనుకుంటారు. కానీ, క్యాంపస్ ఆవరణలోనే కాక క్యాంపస్ బస్సుల్లో కూడా, అమ్మాయిలను ఏడిపించడమనేది చాలా తరచుగా జరిగే విషయం. ఈ ఆకతాయిలకు ఉన్న ఒకే ఒక యిబ్బంది ఏమిటంటే మా క్యాంపస్‌లో విద్యార్థుల సంఖ్య తక్కువ కావడం. దానివల్ల వాళ్ళకు ఆశించినంత అనామకత్వం లభించడం లేదు. (ఈ రకమైన పీడనకు అది చాలా ముఖ్యం).

నేను చెబుతున్న కేసులో ఒకబ్బాయి ప్రవర్తన వల్ల చాలా మంది అమ్మాయిలు యిబ్బంది పడుతుంటే 'మహిళా విద్యార్థి వేదిక' అతని మీద ఫిర్యాదు చేసింది. లిఖితపూర్వకంగా మేము యిచ్చిన ఆ ఫిర్యాదును క్రమశిక్షణా కమిటీకి పంపారు. అది విచారణ జరిపి అతని చేత మా డిమాండ్ ప్రకారమే పబ్లిక్‌గా క్షమాపణలు చెప్పించింది.

ఇటువంటి సంఘటనల్ని ఖండించే విషయంలో పదిమందితో కలిసి వేధించే వాళ్ళని కాక, విడిగా ఆ పనిచేసే వాళ్ళను మాత్రమే మేము గుర్తించి, శిక్షింపచేయగలమనే విషయంలో మా అభిప్రాయాలు యిప్పటికీ అవే కానీ, ఆ వ్యక్తి కులాన్నీ, వర్గాన్నీ మేము పరిగణనలోనికి తీసుకోకపోవడం మాకు ఆ తర్వాత చాలా యిబ్బందిగా అనిపించింది. మేము కేవలం జండర్ దృక్పథంతోనే ఆ విషయాన్ని చూశాం. జండర్‌ను విడిగా చూడవచ్చనీ, దానికదే చాలా స్పష్టంగా ఉన్నదనీ మేము భావించాం. జండర్ మీద కూడా అనివార్యంగా ఉండే వర్గ, కుల, మత, ప్రాంతీయ ప్రభావాలకు మేము అంధులుగా ఉన్నాం.

తర్వాత అనేక వేడి వేడి చర్చల ఫలితంగా, మా అగ్రవర్ణ ఆలోచనల కారణంగానే మాకు అతని ప్రవర్తన అంత దుర్భరంగా అనిపించిందనీ, అతను అగ్రకుల – మధ్య తరగతికి చెందనివాడు కావడం వల్లనే మాకు ఈ విషయంలో పెద్ద ఎత్తున మద్దతు లభించి వుండవచ్చనీ గుర్తించాం. 'లంపెన్ మనుషుల' మీద ఉండే అభిప్రాయమే మా ఫిర్యాదులోనూ వ్యక్తమైంది. ఆ అభిప్రాయం అందరిలో బలపడడానికి కూడా ఈ సంఘటన ఉపయోగపడింది. కొంత మంది మా మగ స్నేహితుల 'సెక్సిస్ట్' వైఖరిని మేము సహించగలగడమే కాక కొన్ని సందర్భాలలో వాటిని కనీసం గుర్తించలేక పోవడం, ఈ సమస్యపై మా అవగాహనను మరింత జటిలం చేసింది. వీళ్ళ ప్రవర్తనా అంతే గర్హనీయమైనా మాకు వాళ్ళ మీద అంత కోపం రాకపోవడానికి కారణం ఏమిటని ప్రశ్నించుకున్నాం. ఈ సందర్భంలోనే మాకు మరో విషయం కూడా స్పష్టమైంది. మన దొంతర్ల సమాజంలో మేము ఫిర్యాదు చేసిన వ్యక్తి ప్రవర్తన లాంటి విషయాలు ఒక రకంగా ఆమోదింపబడిన నిరసన మార్గాలు. అవి వ్యవస్థను కూలదోసేంత ప్రమాదకరమైనవి కావు కాబట్టి, అణిచివేత నిర్మాణాలకు ముప్పు వాటిల్లనంత వరకు, కొన్ని రకాల కోపాలను అదుపుచేయడానికీ, బుజ్జగించడానికీ ఈ నిరసన మార్గాలను అనుమతిస్తారనే విషయం మాకు అర్థమైంది.

మా న్యాయమైన ఆందోళనల్ని పక్కదారి పట్టించగల సమర్థులున్నారని 'పోర్నోగ్రాఫిక్' ఉత్తరాల సమస్యను చేపట్టినపుడు అర్థమైంది. 1991 మార్చిలో కొంతమంది విద్యార్థినులకు అలాంటి ఉత్తరాలు వచ్చాయి. వాటిల్లో అసభ్యకరమైన ఫోటోలు, టైప్‌చేసిన సందేశాలు ఉన్నాయి. కింద ఎవరిపేరూ లేకపోయినా కొంత మంది క్యాంపస్ విద్యార్థులే ఆపనిచేశారనడానికి చాలా ఆధారాలు దొరికాయి. ఈ సంఘటనను ఖండించడానికి మా వేదిక ఒక సభను ఏర్పాటు చేసింది. సభకు చాలా మందే వచ్చారు. అదయ్యాక అందరం కలిసి నినాదాలిస్తూ క్యాంపస్‌లో ఊరేగింపుగా తిరిగాం.

మా ఊరేగింపు ఒక పురుషుల హాస్టల్ దగ్గరకి వచ్చినప్పుడు అక్కడ సెక్స్‌ను సమర్థిస్తూ సెక్స్ అసభ్యకరమైనది కాదు అని రాసిఉన్న పోస్టర్లు అతికించి ఉండటం, వాటి పక్కన ఆ హాస్టల్ విద్యార్థుల్లో ఒకరు ధిక్కారంగా చూస్తూ నిలబడి ఉండడం గమనించాం. పోస్టర్ల కింద 'ఓషో' అనే పేరుంది (ఈ సమస్య చల్లబడగానే ఆ గ్రూపు మటుమాయమైంది) వీళ్ళు మినహా మిగతా క్యాంపస్ అంతా ఆ చర్యను ఖండించింది.

మా నిరసన ఆ ఊరేగింపుతో ఆగిపోయినా పోర్నోగ్రఫీ మీద చర్చ మాత్రం చాలా కాలం కొనసాగింది. దానిని సమర్థించడం గానీ, పూర్తిగా ఖండించడం గానీ, అంత తేలిక కాదన్న ఉద్దేశంతో మేము ఈ సమస్యను అలాంటి ఉత్తరాలు అందుకునే వ్యక్తుల దృష్టిలో నుంచి చూడమనీ, మగవాళ్ళు వాటిని పంపడం వెనక ఉన్న ఉద్దేశాలను గుర్తించమనీ మాత్రమే ప్రధానంగా చెపుతూ వచ్చాం. కానీ 'ఓషో' గ్రూపు మడికట్టుకుని బతకొద్దులాంటి నినాదాలతో ఈ చర్చను నైతిక సమస్యగా మార్చేసింది. వాళ్ళు చెప్పేదాన్ని బట్టి చూస్తే స్త్రీలు విచ్చలవిడిగా గాని, మడికట్టుకుని గాని మాత్రమే ఉంటారు... ఇంకోలా ఉండే అవకాశం లేదు. స్త్రీ పురుషుల పెంపకంలోని తేడాలు, ప్రసార సాధనాల్లో, యితర సాంస్కృతిక రూపాల్లో స్త్రీలెప్పుడూ 'సెక్స్ వస్తువులుగా' చిత్రీకరించబడటం – యివేమీ వాళ్ళు పరిగణనలోకి తీసుకున్నట్లు అనిపించేది కాదు. పరిస్థితులు ఈ విధంగా ఉన్నప్పుడు ఆడపిల్లలకు సెక్స్ ఫోటోలు పంపడమంటే వాళ్ళు 'సెక్స్ వస్తువులనే' అభిప్రాయాన్ని ఖచ్చితంగా బలపరచడమే అవుతుంది. ఆ అమ్మాయిల ప్రైవసీని ఉల్లంఘించడం కూడా అవుతుంది.

ఇక్కడో విషయం చెప్పాలి. 'మహిళా విద్యార్థి వేదిక' ప్రత్యక్షంగా అధికారులతో గొడవ పెట్టుకున్న సంఘటన 1991 మార్చిలో జరిగింది. ఆ నెలలో హాస్టల్‌లో ఉండే అమ్మాయిలంతా తమ రాకపోకల గురించి వార్డెన్‌కు ముందుగానే తెలియపరచాలనే రూల్ కొత్తగా వచ్చింది. బయటికెళ్ళే అమ్మాయిలకు 'ఏదైనా' జరిగితే వాళ్ళ తల్లిదండ్రులు వార్డెన్‌ను నిలదీస్తారు కాబట్టి, వార్డెన్ వాళ్ళకు జవాబుదారీ కాబట్టి, అమ్మాయిలు ఏ ఊరు వెళ్ళేది, అక్కడ ఎంత కాలం ఉండేదీ ఆ వివరాలన్నీ వార్డెన్‌కు ముందుగా చెప్పాలని, పైకి సబబుగానే కనిపించే ఒక కారణం కూడా చెప్పారు. క్యాంపస్ లోపలే అయితే రాత్రి 8 తర్వాత హాస్టల్ నుంచి బయటికెళ్ళే అమ్మాయిలు ఒక రిజిస్టరులో సంతకం చేసి వెళ్ళాలి. అలాగే మళ్ళీ తిరగొచ్చాక టైమ్ వేసి మళ్ళీ సంతకం చేయాలి.

ఈ రూలు వచ్చే వరకు మిగతా ఏ ఉమెన్స్ హాస్టళ్ళలోను లేనంత స్వేచ్ఛను మేము అనుభవించాం. మా 'వేదిక' తరఫున ఒక ప్రతినిధి బృందం వైస్ ఛాన్సలర్‌ను కలిసి ఈ కొత్త రూల్‌కి నిరసన తెలియ జేసింది. ఆయన ఒక ఉపమానం చెప్పి మా కోపాన్ని యింకా పెంచాడు. "ఆడవాళ్ళు పచ్చికలాంటి వాళ్ళయితే మగవాళ్ళు పశవుల్లాంటి వాళ్ళు. కాబట్టి పశువుల్ని దూరంగా ఉంచడానికి పచ్చికకి కంచె వేయించడం తప్పనిసరి" – ఇదీ ఆయన చెప్పిన ఉపమానం.

ముందే చెప్పినట్లు లింగ వివక్షను ఎదుర్కోవడంలో మేము కొంత అనుభవాన్ని సంపాదించాం. కాని ఎన్నికల విషయంలో మాత్రం పూర్తి అనుభవ శూన్యులం. జనసమీకరణ, ఎన్నికల ప్రచార పద్ధతుల గురించి ఏమీ తెలియకుండానే ఎన్నికల్లో మా 'వేదిక' తరపున అభ్యర్థుల్ని నిలబెట్టాలని నిర్ణయించాం. 1992 విద్యార్థి సంఘం ఎన్నికలలో రెండు ముఖ్యమైన – ప్రెసిడెంట్, సెక్రటరీ – పదవులకు మా 'వేదిక' తరఫున అభ్యర్థుల్ని నిలబెట్టాలని నిర్ణయించాం. 1992 విద్యార్థి సంఘం ఎన్నికలలో రెండు ముఖ్యమైన – ప్రెసిడెంట్, సెక్రటరీ – పదవులకు మా 'వేదిక' సభ్యులు పోటీ చేశారు.

1990 అనుభవం రీత్యా ఈ ఎన్నికల్లో పోటీ చేయడం మాకు చాలా ముఖ్యమనిపించింది. చిన్న చిన్న పదవుల కోసం కాక ముఖ్యమైన పదవుల కోసమే పోటీ పడాలని నిర్ణయించాం. మా శక్తి ఏమిటో నిరూపించాలనుకున్నాం. గెలుపూ ఓటముల సంగతెలా ఉన్నా ఈ ఎన్నికల నుంచి మేము చాలా నేర్చుకున్నాం. వీటిల్లో డబ్బు ఎలా పనిచేస్తుందో, ముఠాలు ఎలా ఏర్పడతాయో, అవి ఏ విధంగా పని చేస్తాయో మాకు బాగా అర్థమైంది. అప్పటి వరకు 'రాజకీయాలు' మా జీవితాలలో భాగం కావు. అవి మాకు సంబంధించని విషయం అనుకునే వాళ్ళం. కులం, మతం క్యాంపస్ రాజకీయాలను కూడా ఎలా ప్రభావితం చేస్తున్నాయో తెలుసుకోవడం మాకు ఆ ఎన్నికలలో లభించిన కొత్తజ్ఞానం. మా యిద్దరు అభ్యర్థులూ ఓడిపోయినప్పటికీ రెండు విజయాలను సాధించిన సంతృప్తి మాత్రం మాకు మిగిలింది. ఒకటి – ఈసారి ఎన్నికలలో మహిళా అభ్యర్థుల్ని బెదిరించడానికి ఎవరూ ప్రయత్నించలేదు. రెండు – పోటీ చేసిన ప్రతి అభ్యర్థీ, మహిళల సమస్యల గురించి ప్రత్యేకంగా మాట్లాడాల్సి వచ్చింది.

మా వేదికకు కొన్ని పరిమితులున్నాయి. క్యాంపస్ లోని స్త్రీల సమస్యలను మాత్రమే చేపట్టానేది మా నిర్ణయం. ఈ పరిమితం దృష్ట్యా మేము తీసుకున్నవి ప్రధానంగా మధ్య తరగతి స్త్రీల సమస్యలేనని ఒప్పుకుంటాను. మేము మధ్య తరగతి స్త్రీలం కావడం వల్లనే ఇతర

వర్గపు స్త్రీల సమస్యలు మా దృష్టిలోకి అసలు రాలేదు. దీన్ని మేము గుర్తించి ఇతర వర్గపు స్త్రీల సమస్యల్ని తీసుకుంటున్న సంఘాలతో కలిసి పని చేయడానికి ప్రయత్నించినపుడు, అప్పటి దాకా మాకున్న మధ్య తరగతి మద్దతు మొత్తం తుడిచి పెట్టుకు పోయింది. మా వర్గ ప్రయోజనాలు, అవీ, వేరు వేరు కావడం వల్ల, మేము మా మధ్య తరగతి దృష్టితో వర్గ సమస్యను, కుల సమస్యను మీడియేట్ చేసే ప్రయత్నం చేయడం వల్లా, మా వేదికకు ఎవరి ఆమోదమూ లభించని పరిస్థితి ఏర్పడింది. ఇవ్వాళ ఈ సమస్యను కొంత వరకూ పరిష్కరించుకున్నాం. మాకు తెలిసిన, మాకు సంబంధించిన సమస్యలను మాత్రమే మేము చేపడుతూ, సానుభూతి ఉన్న ఇతర సమస్యల విషయంలో వాటిని చేపట్టే సంఘాలకు మద్దతు యిస్తున్నాం (ఉదాహరణకు వేర్వేరు సిద్ధాంత దృక్పథాలుగల దళిత గ్రూపులు)

విద్యార్థినులలో కూడా ఒక దశలో మా జోక్యాన్ని హర్షించని పరిస్థితి ఏర్పడింది. మేము వేలు పెడితే మంచి బదులు చెడు జరుగుతుందని భయపడే వాతావరణం ఏర్పడింది. ప్రధాన స్రవంతికి భిన్నమయిన ఆలోచనలు చేసే వాళ్ళందరినీ నిర్హేతుకమైన అభిప్రాయాలుగా, పిచ్చి ఆలోచనలుగా, విచ్ఛిన్నకర ధోరణులుగా కనపడడం మామూలే. అయితే ఒక విషయం గుర్తుంచుకోవాలి. నిరసన గొంతుల్ని, భిన్న ఆలోచనల్ని ప్రధాన స్రవంతిలో ఇముడ్చుకోకుండా తిరస్కరించడమంటే, అమలులో ఉన్న కర్కశ అణచివేత నిర్మాణాల కొనసాగింపునకు ఆమోదం యిచ్చినట్టే.

ఇటీవల జరిగిన ఒక ఈవ్ టీజింగ్ సంఘటనలో (1994 ఫిబ్రవరి) ఈ విషయం మాకు బాగా అర్థమైంది. దాన్ని కొంత మంది అమ్మాయిలు చేపట్టారు. పైన చెప్పిన కారణం రీత్యా వారు ఈ విషయంలో మేము ప్రత్యక్షంగా జోక్యం చేసుకోవడానికి యిష్టపడలేదు. మా మీద ఆరోపణలను, వినీవినీ, మేము కూడా వాటిని కొంత వరకు నమ్మి ఉండడం వల్ల సరేలే అని మేమూ ఆ సమస్యలో పెద్దగా వేలు పెట్టలేదు. అయితే జరిగిందేమిటంటే ఆ అమ్మాయిలు కూడా మా వేదిక సభ్యులు గురయిన ఆరోపణలకే గురయ్యారు. అంతకు ముందు వరకు ఆమోదనీయ వ్యక్తులుగా ఉన్నవాళ్ళు, ఎప్పుడైతే తమ నిరసనను స్పష్టంగా తెలియజెప్పారో అప్పుడు వాళ్ళకీ మా పరిస్థితే ఏర్పడింది. ఆమోదనీయమైన విషయాలు, ఆమోదించదగని విషయాలుగా మారే క్రమం ఎలా ఉంటుందో మాకు ఆ సంఘటనలో అర్థమైంది. మా వేదికను పూర్తిగా తిరస్కరించిన సంఘటనలోనే దాని పునరుజ్జీవనానికి బీజం పడింది. ఈ క్రమం అర్థమయ్యాక మా చరిత్రను కూడా మేము బాగా అర్థం చేసుకోగలిగాం. మేము రాజకీయాల్లో అనుభవశూన్యులమే కావొచ్చు. కానీ ఒక సంఘంగా ఏర్పడి పనిచేయటంలో దాని మార్పులు, ఎదుగుదలలో మేము నేర్చుకున్నది చాలా ఉంది. మా అనుభవం మా జీవితాలను చాలా సంపన్నం చేసింది. బలం చేకూర్చింది. ఇవ్వాళ చాలా మంది అమ్మాయిలు మా వేదికలో చేరడానికి ముందుకు రావడం మాలో కొత్త ఆశల్ని రేకెత్తించింది. సమాన హక్కుల కోసం, అవకాశాల కోసం జరుగుతున్న ఈ పోరాటం కొనసాగుతుందనీ విజయం సాధిస్తుందనీ, మాకు నమ్మకం పెరుగుతోంది.

రేఖా పప్పు హైదరాబాద్‌లోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో అధ్యాపకురాలు

# విలింగ లైంగికత, లైంగిక హింస

■ సామియా వాసా

ఈ చిన్న వ్యాసంలో, నేను విశ్వవిద్యాలయాల్లో లైంగిక  వేధింపుల గురించిన చర్చలో ఇప్పటికే బలపడి, చాప కింద నీరులా పనిచేసే రెండు అంశాలని విశ్లేషించే ప్రయత్నం చేస్తాను: బాధితురాలుగానే కాక ప్రతి నాయకురాలిగా ప్రత్యక్షమయ్యే అగ్ర కుల స్త్రీ మూర్తిత్వం; రెండు, రహస్యంగా తోటివారిని వేధించే స్వలింగ లైంగికులైన అబ్బాయిలు. కులం, లైంగికత గురించి మనకున్న పూనికల/ఊహలని ప్రశ్నించి, ప్రస్తుతం లైంగిక హింసపై జరుగుతున్న చర్చల పరిమితుల్ని తడమటం ఈ విశ్లేషణ ఉద్దేశం. ముందుగా ఇఫ్ఎల్ యూనివర్సిటీలో జరిగిన కొన్ని లైంగిక వేధింపుల కేసులని తీసుకుని, ఒక రకమైన పురుషత్వ దళిత రాజకీయాలు అగ్రకుల స్త్రీని ఏ విధంగా అన్ని రకాల హింసకు – దళిత స్త్రీని అగ్ర కుల పురుషులు గురిచేసే హింసకు, దళిత స్త్రీని దళిత పురుషులు గురి చేసే వేధింపులకు, దళిత పురుషులు అగ్ర కుల స్త్రీలను గురి చేసే వేధింపులకు – బాధ్యులని చేసాయో పరిశీలిస్తాను. ఈ రకంగా చర్చ మొత్తం అగ్రకుల స్త్రీ మూర్తికీ, దాన్ని సవాలు చేస్తున్న దళిత పురుష నాయకుల మధ్య జరిగే (విలింగ లైంగిక)  సంవాదంగా మారటంతో, నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో ఒక పక్క అగ్ర కుల పురుషుల స్థానం, రెండో పక్క దళిత స్త్రీల స్థానం ఉన్న చోటే మరింత బలపడి పోవటానికి ఆస్కారం కలుగుతోంది. ముదస్సిర్ కమ్రాన్ మరణానికి క్యాంపస్ స్పందించిన తీరుపై కొన్ని వ్యాఖ్యలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను. లైంగిక వేధింపులకు విలింగ లైంగికతకు వున్న పీటముడి మనం కులపరమైన హింస పట్ల, మగవారిపై మగవారి వేధింపుల పట్ల స్పందించే తీరును శాసిస్తోంది అనేది నా వాదన.

**హింసాపూరితమైన సాక్షాత్కరణలు :**

ఇఫ్ఎల్‌యు క్యాంపస్‌లో దళిత బహుజన విద్యార్థి సంఘాలు, వామ పక్ష విద్యార్థి సంఘాలు, దేశంలోని స్త్రీవాద ఉద్యమాన్ని, దళిత స్త్రీల పై జరిగే హింసని 'ఎప్పటికీ పోస్ట్ పోన్ చేసే అంశంగా' పరిగణిస్తున్నదని నిశిత విమర్శకు గురిచేసారు. ఈ విమర్శతోపాటు, కులపరమైన హింసకు వ్యతిరేకంగా వారు చేపట్టిన కార్యక్రమాల వల్ల క్యాంపస్‌లో విషయాల గురించి గట్టిగా మాట్లాడగలగటమే కాక, వాటి గురించి ఆలోచించే వాతావరణం ఏర్పడింది. ప్రధాన స్రవంతి ప్రచార సాధనాలు కేవలం అగ్రకుల స్త్రీలపై జరిగే హింస గురించి మాట్లాడితే, క్యాంపస్‌లోని విద్యార్థి సంఘాలు దళిత, ఒ.బి.సి, ఆదివాసీ, మైనారిటీ స్త్రీలపై జరిగే హింసను ఎత్తి చూపించాయి. అయితే చాలాసార్లు ఈ రకమైన ఉద్యమ కార్యక్రమాలు, స్త్రీ ద్వేషం, పురుషాధిక్య ధోరణుల వ్యక్తీకరణకు దారితీసాయి; కులపరమైన హింసను వ్యతిరేకించాలంటే, అగ్రకుల స్త్రీమూర్తిపై తిరిగి హింస జరపటం దళిత పురుషులకు అనివార్యమయినట్లు తయారయింది పరిస్థితి. ఆ విధంగా కులవ్యవస్థ, విలింగ లైంగిక వ్యవస్థ పని చెయ్యటానికి అవసరమయ్యే నిర్మాణాలని కూడా తిరిగి బలపరిచినట్లయింది.

2011లో ఒక అగ్రకుల అధ్యాపకుడు యూనివర్సిటీ వసతి గృహంలో, తన ఒ.బి.సి పరిశోధక విద్యార్థిని పై లైంగిక దాడి చేసే ప్రయత్నం చేసాడు. ఆ సాయంత్రం అతన్ని అరెస్టు చేసారు. మర్నాడు, అనేక విద్యార్థి సంఘాలు క్యాంపస్‌లో రాలీ నిర్వహించాయి. 'యూనివర్సిటీ ఉప కులాధిపతే (ఒక స్త్రీ) ఈ అధ్యాపకుడికి లైంగిక దాడి చెయ్యటం నేర్పించార'నే పోస్టర్లు క్యాంపస్‌లో వెలిసాయి. ఆ అధ్యాపకుడు చేసిన హింసపై దృష్టి కేంద్రీకరించటం మాని, ఒక అణగారిన కులానికి చెందిన స్త్రీపై జరిగిన హింసకి ఒక అగ్ర కుల స్త్రీని, భాగస్వామిగా, పూర్తిగా బాధ్యురాలిని చేయటం జరిగింది. ఉద్యమం బలపడ్డానికి అగ్ర కుల స్త్రీ ప్రవృత్తిపరంగా, ఉద్దేశపూర్వకంగా, ఆఖరికి విద్యా బోధనలో కూడా కులహింసలో భాగం పంచుకుంటుంది అనే విషయాన్ని పదే, పదే వైషమ్యభరితంగా చెప్పటం అత్యంత ఆవశ్యకంగా మారింది.

2012లో తమ విద్యార్థి సంఘంలో చేరటానికి నిరాకరించినందుకు, ఒక తెలంగాణా పి.హెచ్.డి విద్యార్థినిని, ఆమె సముదాయానికి చెందిన అయిదుగురు విద్యార్థులు వేధించటం జరిగింది. ఆమెని చాలాసార్లు బెదిరించి, ఎస్.ఎఫ్.ఐ బ్రాంచి మొదలు పెట్టొద్దని భయపెట్టారు. ఆమె తమ కమ్యూనిటి స్త్రీ కాబట్టి, ఆమె చర్యలపై తీర్పు చెప్పే అధికారం తమకుందని అనుకుంటూ, రాజకీయ శత్రుత్వపు క్రీడని, ఆవిడ శరీరంతోటే ఆడాలని చూసారు. వీళ్ళల్లో ఒక నాయకుడు, తాను ఆమెతో ప్రేమలో పడ్డాననీ, కాబట్టి ఆమె తనతో 'సెక్స్'లో పాల్గొనాలని అంటూ లైంగిక వేధింపులకు గురి చేసాడని సమాచారం. ఇంకొక నాయకుడు ఆమెని 'వేశ్య' అని పిలవటమే కాక, ఆమె కదలికల పై నిఘా పెట్టి, ఆమె ఇంటికి ఫోన్ చేసి, ఆమె ఎవరితోనో ప్రేమ వ్యవహారం నడుపుతోందని సమాచారం అందించాడు. ఆమె తల్లి తండ్రులు ఆమెతో మాట్లాడటం మానేసారు. ఇప్పటికీ వూర్లో ఆమె పై సాంఘిక బహిష్కరణ అమలవుతోంది. అనేక మంది కలిసి, ఒకే సమయంలో ఒక అమ్మాయిని వివిధ రకాలుగా వేధించిన ఈ సంఘటన స్త్రీ పై చెలాయించబడే అధికారం, యాజమాన్య భావనల గురించి అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. చాల నెలలు ఈ వేధింపులు భరించిన తరువాత ఈ అమ్మాయి విద్యార్థుల, అధ్యాపకుల సహాయాన్ని ఆర్థించింది. అధ్యాపకులు, తెలంగాణా నాయకులు, విద్యార్థి

సంఘాలు, దళిత స్త్రీ వాద నాయకులతో కూడిన ఒక పంచాయితీ ఏర్పాటయింది. ఈ పంచాయితీలో అప్పటికే జండర్ ఫోరంగా పనిచేస్తున్న మాలో కొంత మందిని 'దళిత పురుషులను విలన్లుగా చూపే ప్రయత్నం' చేస్తున్నారని ఆరోపించటం జరిగింది, అంటే దళిత సోదరులు, సోదరిల మధ్య విభేదాలకి ప్రధాన కారణం – అగ్ర కుల స్త్రీలే అన్న మాట. ఆ దళిత విద్యార్థిని పంచాయితీలో అనర్గళంగా మాట్లాడింది. సంఘటనలు అన్నింటినీ వివరించి చెప్పటమే కాక, పంచాయితీ చివర తనకి ఒక క్షమాపణ లభించవచ్చునేమో కానీ, ఆ క్షమాపణ ఎప్పటికీ తాను ఎదుర్కున్న హింసను తుడిచి పెట్టలేదని చెప్పింది. జండర్ ఫోరం సభ్యులని అగ్ర కుల స్త్రీలు అని ఆరోపించిన పంచాయితీ సభ్యులని తీవ్రంగా విమర్శించి, ఆ ఆరోపణ స్త్రీవాద వ్యతిరేకమయిందని, హింసా పూరితమయిందని చెప్పింది.

ఈ సంవత్సరం మొదట్లో ఒక అగ్ర కుల విద్యార్థిని ఒక దళిత ప్రొఫెసర్ తనను వేధిస్తున్నాడని ఇఫ్ఎల్యులో లైంగిక వేధింపుల కమిటీకి ఫిర్యాదు చేసింది. ఆ దళిత ప్రొఫెసర్ ప్రొక్టరల్ కమిటీకి ఆ అమ్మాయి తనను క్లాస్‌లో అందరి ముందు చెంప దెబ్బ కొట్టిందని ఫిర్యాదు చేసాడు. సంఘటనకి సంబంధించిన ఈ చిన్న వివరణ కూడా వర్గ, కుల అధికార సంబంధాల గురించి అనేక ప్రశ్నలను లేవనెత్తుతుంది. అయితే, కొంత మంది దళిత అధ్యాపకులు, విద్యార్థులు ఈ సంఘటనలో అసలు లైంగిక వేధింపును పరిగణనలోనికి తీసుకోవటానికి కూడా సిద్ధపడలేదు. వారి ఉద్దేశంలో ఇది పూర్తిగా కులపరమైన హింస మాత్రమే. లేకుంటే, ఒక విద్యార్థినికి ఒక ప్రొఫెసర్‌ను క్లాస్‌లో కొట్టే ధైర్యం ఎట్లా వస్తుంది? అన్నది వారి ప్రశ్న. నిబంధనలను అనుసరించి విచారణ జరిగి, ఆ అమ్మాయి నుండి రాతపూర్వకంగా క్షమాపణ తీసుకున్న తరువాత, ఆమెని ఒక అధ్యాపకుడ్ని బహిరంగంగా కొట్టిందనే కారణంతో యూనివర్సిటీ నుండి బహిష్కరించటం జరిగింది. యూనివర్సిటీ వారిచ్చిన ఈ వివరణను మనం సీరియస్‌గా తీసుకోగలమా? క్యాంపస్‌లో కుల వ్యతిరేక రాజకీయా సంఘాలు అగ్ర కుల స్త్రీ ఎప్పుడూ లైంగిక వేధింపుల గురించి అబద్దాలు చెప్తుందనే సంకుచిత, మూసపోసిన అభిప్రాయానికి ఎందుకు వచ్చినట్లు?

దళిత సమూహాల పై జరిగిన అగ్రకుల హింసాచరిత్రను పరిశీలిస్తే, అగ్ర కుల స్త్రీలు దళిత స్త్రీలు, పురుషులపై జరిగే వ్యవస్థీకృత హింసలో భాగస్వాములుగా ఉన్నారనే విషయం స్పష్టంగా తెలుస్తుంది. చాలాసార్లు అగ్ర కుల స్త్రీలపై దళిత పురుషులు వేధింపులకు పాల్పడ్డారనే సాకుతోనే దళిత వాడలపై భయంకరమైన దాడులకు దిగటం జరుగుతుంది. దళిత పురుషులు చుట్టు పక్కల ఉంటే చాలు, తమను వేధిస్తున్నారని భావించటంలో అగ్ర కుల స్త్రీలు చాలపేరు పొందారు. దళిత పురుషులను రౌడీలుగా, స్త్రీలను వేధించే వారిగా మూసపోసి చూపించే ధోరణులు సాంస్కృతిక రంగంలో బలంగా వేళ్ళూనుకుని వున్నాయి. అయితే, వీటన్నిటితో పాటు మన దేశంలో స్త్రీలు ఎదుర్కునే లైంగిక హింస అనుభవాల్ని, ప్రశ్నల్నీ కూడా బలంగా, పద్ధతి ప్రకారం పక్కకి పెట్టేసి, పైకి రాకుండా చేసే సంస్కృతి, చరిత్ర కూడా ఉంది. ఈ నేపథ్యంలో అగ్ర కుల స్త్రీలు లైంగిక వేధింపుల గురించి చేసే ఫిర్యాదుల్ని, ప్రత్యేక కారణం లేకుండా, అసలు పరిగణనలోనికి తీసుకోకుండా పక్కకి నెట్టేయటం సరయినదేనా? ఇదేదో లైంగిక వేధింపులను కుల, వర్గ సంబంధాలతో సంబంధం లేని పవిత్ర వస్తువుగా చూడాలని కాదు. కానీ, లైంగిక అధికార సంబంధాలని పరిగణన లోనికి తీసుకోకుండా, వేధింపులంటే అర్థం తమకి పూర్తిగా తెలుసనీ, వాటి గురించిన జ్ఞానం తమకిప్పటికే ఉందనీ అనుకోవటం ఎంత వరకు సబబు? వ్యవస్థీకృత, కులపరమయిన దౌర్జన్యాల చరిత్ర, పురుషత్వాలనీ, స్త్రీత్వాలనీ ఉత్పత్తి చేసి, ఉన్న రూపాల్లోనే స్త్రీలు, పురుషులు ప్రవర్తించేటట్లు చూసే లైంగిక దౌర్జన్యాల చరిత్రని అక్రమమైనదిగా నిరూపించగలదా? జండర్ ఆధిపత్యాన్ని, కుల ఆధిపత్యం కంటే తక్కువ శ్రేణి ఆధిపత్యంగా మాత్రమే చూడాలనీ, అది మాత్రమే సరయిన పద్ధతి అన్న ధోరణి, సుసంపన్నమయిన కుల వ్యతిరేక ఉద్యమాల చరిత్రను సంకుచితం చేసి, కులానికి, జండర్‌కి మధ్య ఒక అనవసరమయిన పోటీ దారి తీయట్లేదా? కులమూ, జండర్ ఒక దాన్నుండి మరొకటి నీట్‌గా విడగొట్ట గలిగే విషయాలేనా? అంతే కాదు, ఈ రకమయిన పోటీలో, దళిత స్త్రీలు హింస నెదుర్కున్న సందర్భాల్లోనూ, దళిత పురుష నాయకుల రాజకీయాల్లో కూడా, దృష్టి 'అగ్ర కుల స్త్రీ మూర్తి'పైనే కేంద్రీకృతమవుతుంది. మొత్తానికి, దీనివల్ల దళిత స్రీలు ఎదుర్కునే హింస, వేధింపులు, వారి అనుభవాలు, వాటి అర్థాలు పూర్తిగా మరుగున పడిపోతున్నాయి.

కుల వ్యతిరేక ఉద్యమాలు జండర్ గురించి ఇంకా ఆలోచించలేని పరిస్థితులు, స్త్రీవాద ఉద్యమాలు కులాహంకార ధోరణుల్ని ఇంకా విడకుండా ఉన్న ఈ సందర్భంలో, ఈ పరస్పర బహిష్కరణల చరిత్రను మనం ప్రయోజనాత్మకంగా ఎలా చూడాలి? మన రాజకీయాల్లో కూడా వాటినే పునరావృతం చేద్దామా లేక ఈ విమర్శలను సీరియస్‌గా తీసుకుని కులము, జండర్ మూలాల కెళ్ళి ఆలోచిద్దామా? ప్రొఫెసర్‌ని కొట్టిన విద్యార్థిని కుల అహంకారి అనో, ఆ ప్రొఫెసర్ పితృస్వామ్య భావజాలంతోనే ఆమెని వేధించాడనో తేల్చి చెప్పటం ఇక్కడ నా ఉద్దేశం కాదు. అటువంటి 'అంతర్-వర్గ (ఇంటర్ సెక్షనల్) విశ్లేషణ' ఒక మనిషి అస్తిత్వానికుండే సంక్లిష్టత, సంభావ్యత(కంజెస్టెన్సి) రెండూ అర్థం చేసుకోవాలి. ఆ కష్టమయిన కార్యక్రమాన్ని చేపట్టే ముందు, సంఘటన ఎలా జరిగింది, ఏ క్రమంలో జరిగింది, దాన్ని గురించి ఇద్దరూ ఏమనుకుంటున్నారు అన్నది తెలుసుకోవాలి, విశ్లేషణ చేయటానికి సరైన స్పేస్ ఏర్పరచుకోవాలి. ఈ రకమయిన వివరణను కూర్చుకోవటానికి జరపాల్సిన నిజ నిర్ధారణ చెయ్యగలిగే సంస్థాపరమయిన, నిర్మాణపరమయిన ఏర్పాట్లు మనకిప్పుడు లేవు. ఒక సంఘటన జరిగిన వెంటనే, కులపరమయిన హింస అనో, పితృస్వామ్య హింస అనో నిర్ధారించేసే గందరగోళం ఇటువంటి పనికి ఒక అడ్డంకిగా తయారయింది.

### విద్యార్థి రాజకీయాల వెయిటింగ్ లిస్టులో ఉన్న 'గే' రాజకీయాలు:

లైంగిక వేధింపుల చర్చకున్న కొంత సంక్లిష్టత, కొన్ని పరిమితులు ఈ విధంగా ఉంటే, వేధింపులకు గురయ్యే వేరే రకమయిన బాధితుల గురించి అర్థం చేసుకునే భాష కూడా ప్రస్తుతం మనకి ఏ మాత్రం అందుబాటులో లేదు. మగ వాళ్ళని వేధింపులకు గురి చేసే మగ వారి గురించి మాట్లాడితే, 'జండర్ తటస్థ' చట్టాలు కావాలనీ, చట్టాలలోను, బయట కూడా 'జండర్ తటస్థ భాష' అవసరమనీ అనుకుంటారేమో. నేనలాంటిది ఏమీ అనట్లేదు. జండర్ వ్యవస్థ వాస్తవ జీవితాలని, శరీరాలని శాశిస్తున్నంత కాలం, సంస్థాగతంగా జండర్ తటస్థ చట్టాలుగాని, నిబంధనలు గాని తేవటం అన్యాయం. ఈ పరిస్థితుల్లో, స్వలింగలైంగికత పట్లవుండే వ్యతిరేకతకి, వేధింపుకి ఉండే సన్నటి రేఖను గుర్తించటం కూడా కష్టమయ్యే హింసాత్మక ఘటన మనకు ఎదురయిందనుకోండి, ఏం చెయ్యాలి? ముదస్సిర్ కమ్రాన్ మార్చ్ 2013న ఉరి వేసుకుని చనిపోయాడు. చనిపోయే ముందు, అతని 'దగ్గరి స్నేహితుడు', అంతకు ముందు రూంమేట్ అయిన అబ్బాయి ముదస్సిర్ పై ఫిర్యాదు ఇస్తే, ఆ ఫిర్యాదు మేరకు, యూనివర్సిటీ అధికారులు అతడిని పోలీస్ స్టేషన్‌కి పట్టుకు వెళ్ళటంతో తీవ్ర మనస్తాపం చెందటం, అతని మరణానికి తక్షణ కారణం. అప్పటికే ముదస్సిర్ పై ఈ స్నేహితుడు అనేక ఫిర్యాదులు – వెంటపడుతున్నాడని, మానసికంగానూ, మాటలతోనూ వేధిస్తున్నాడని, శారీరకంగా దాడి చేసాడని – చేసి ఉన్నాడు. ముదస్సిర్ స్నేహితుడితో మాట్లాడుతున్నప్పుడు నాకు అర్థమయిందేమిటంటే, ముదస్సిర్ ఆసక్తిని అతడి స్నేహితుడు స్వలింగ సంపర్కులు చేసే పనులుగా అర్థం చేసుకుని అంత అసహ్యించుకున్నాడని. ఒక స్నేహితుడిని వేధింపులకు గురి చెయ్యకూడదు అనే వారిలో నేను ముందుంటాను, కానీ, ఈ అనవసర ట్రాజెడీలో విలింగ లైంగికత పోషించిన పాత్రని గురించి కూడా మనం అంతే సీరియస్‌గా అర్థం చేసుకోవాలి అని నా వాదన. చాలా మంది ఈ విషయం వినంగానే, నేను ముదస్సిర్ ని 'గే' అని అంటున్నాను అని అర్థం చేసుకుంటున్నారు. ఎవరు గే నో కాదో ఆ సత్యాల గురించి ప్రకటించటం ఇక్కడ నా ఉద్దేశం కాదు. 'గే నెస్' అన్నది చనిపోయిన వారిలోనో, బ్రతికి ఉన్న వారి శరీరాల్లో కనుక్కో గలిగే సత్యం కూడా కాదు. నేను చర్చించాలి అనుకున్న విషయం ఏమిటంటే – స్వలింగ సంపర్కులు అని అనుమానించిన వ్యక్తులతో సంస్థలు, రాజకీయ సమూహాలు, వ్యవహరించే తీరు.

ఈ కింద చెప్పిన విషయాలన్నీ ముదస్సిర్ మరణం తరువాతే బయటికొచ్చాయి. చనిపోయే కొన్ని గంటల ముందు, ముదస్సిర్ పై అతని స్నేహితుడు పోలీసులకి (నోటి మాటతో) ఫిర్యాదు చేసాడు. ఇద్దరి మధ్య గొడవ జరిగి, ముదస్సిర్ స్నేహితుడిని గొంతు పిసకటానికి ప్రయత్నించాడని ఆ ఫిర్యాదు. అప్పటికే ముదస్సిర్‌పై ఉన్న ఫిర్యాదులపై అతడికి షో కాజ్ నోటీసులు ఇవ్వటం తప్ప, సంస్థాగతంగా జరగవలసిన పద్ధతిలో (జిఎస్‌క్యాష్‌కు రిఫర్ చెయ్యటం, వారు ఇద్దరినీ పిలిచి మాట్లాడటం మొ.) చర్యలు తీసుకోలేదు. తీసుకోకుండా, చివరికి ముదస్సిర్‌ను పోలీస్ స్టేషన్లో అప్పగించారు. అప్పటికే ఈ విషయంలో జోక్యం చేసుకుని ఉన్న విద్యార్థులు, అధ్యాపకులు కూడా యూనివర్సిటీ అధికారులకు ముదస్సిర్‌ను పోలీసులకి అప్పగించటం ప్రమాదకరమని హెచ్చరించి ఉన్నారు. ముదస్సిర్ ఒక కాశ్మీరీ ముస్లిం అయ్యె. అప్పుడే అఫ్జల్ గురుని వురి తీసారు. దిల్‌షుక్‌నగర్ బాంబు పేలుళ్ళలో ముస్లిం యువకులని అన్యాయంగా ఇరికించి ఉన్నారు. అప్పటి వరకూ ముదస్సిర్ పై చర్య తీసుకోవటానికి సందేహిస్తూ వచ్చిన ప్రొక్టర్ అకస్మాత్తుగా అతడిని పోలీసులకు అప్పగిద్దామనే ఉత్సుకత చూపించాడని, ఆ సంఘటనలో ఉన్న విద్యార్థులు అన్నారు. ముదస్సిర్‌కు కౌన్సిలింగ్ ఇప్పించాలని పదే పదే చేసిన సూచనను ఆయన తోసి

పుచ్చాడు. ముదస్సిర్ పై ఫిర్యాదు చేసిన విద్యార్థి, తాను ఎదుర్కొన్న విషమ పరిస్థితి నుండి తనని బయటపడెయ్యాలని మాత్రమే కోరుకున్నాడట. అయితే, ముదస్సిర్ మాత్రం తను ఎదుర్కొంటున్న విషమ పరిస్థితి నుండి బయట పడలేకపోయాడు. ముదస్సిర్ యునివర్శిటీ అధికారులకి, తన పై వచ్చిన ఫిర్యాదులకు స్పందిస్తూ, మూడు ఉత్తరాలు రాసాడనే వార్తా పత్రిక రిపోర్టు మాత్రమే మనకు మిగిలింది. (టైమ్స్ ఆఫ్ ఇండియా, మార్చ్ 14, 2013). పోలీసు స్టేషన్‌కి తీసుకు వెళ్ళిన గంటలోనే అతడిని విద్యార్థి సంఘాలు విడిపించాయి గానీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎందుకంటే, ఆ మరుసటి రోజే ముదస్సిర్ ఉరి వేసుకుని చనిపోయాడు.

యూనివర్సిటీ అధికారులు ఈ సంక్లిష్టతని గుర్తించగలరని నేను అనుకోవట్లేదు. కానీ, నాకు అత్యంత విస్మయం గొలిపిన సంగతి – ముదస్సిర్ చనిపోయిన దాదాపు ఒక వారం వరకూ జరిగిన తీవ్రమైన నిరసనల్లో, ఎక్కడా కూడా ముదస్సిర్ చేసిన 'తప్పుల' గురించి గాని, అతని మరణంలో 'స్వలింగ లైంగికత' అన్న అంశం ఒక పాత్ర పోషించింది అన్న విషయం గాని – అసలు ప్రస్తావనకు కూడా రాకపోవటం. అధికారులు ఇది 'స్వలింగ లైంగికత'కు సంబంధించిన సంఘటన అని అన్నప్పుడు విద్యార్థులు 'చనిపోయిన వ్యక్తిని దూషిస్తున్నారని' వ్యాఖ్యానించారు. అతని మరణం వెంటనే వచ్చిన డాక్యుమెంట్‌లో దీన్ని ఇద్దరు స్నేహితుల మధ్య జరిగిన 'కొట్లాట'గా వర్ణించారు. మరి కొన్ని డాక్యుమెంట్లలో దాన్ని ఘర్షణ అన్నారు. ఒక విద్యార్థి అయితే ఈ 'సమస్య'ని 'సోదర ప్రేమ'గా గుర్తించాలి అన్నాడు. ఇంకొంత మంది, 'స్వలింగ లైంగికత' అన్న నింద 'ముస్లింవిద్యార్థులందరూ స్వలింగ సంపర్కులే' అన్న మూసపోసిన అభిప్రాయం నుండి వచ్చింది అన్నారు (అది జీవితాంతం తేరుకోలేని అపనింద అన్నట్లుగా!). నాలుగో రోజుకి వచ్చిన నిరసన పత్రాల్లో, స్వలింగ లైంగికత అనే అంశాన్ని ఇప్పటికైనా పట్టించుకోవాలి అని రాసారు, ఒక పక్క జరుగుతున్న నిరసనల్లో అది ముదస్సిర్ మరణంలో అంశం కాదని అంటూనే!

నిరసన పత్రాలు సరయిన రాజకీయ (సాంస్కృతిక) అవగాహన కనపరిచినప్పటికీ, విద్యార్థి ఉద్యమాల రాజకీయ పరిభాషలో మార్పు రాలేదు. మొదటి నుండి చివరి దాకా, ముదస్సిర్ కోసం జరిగిన 'న్యాయ' పోరాటంలో, అతడిని జాతివాద, కుల దురహంకార అధికార యంత్రాంగం చేతిలో అన్యాయానికి గురయిన కాశ్మీరీ ముస్లింగా మాత్రమే చూడటం జరిగింది. స్వలింగ లైంగికత అన్న విషయాన్ని పూర్తిగా పక్కకి పెట్టటం వల్లే ఇటువంటి న్యాయ పోరాటం సాధ్యమయింది. ముదస్సిర్ వెంటపడిన యువకుడిని 'స్నేహితుడని' చెప్పటంలోనే, నిరసన పత్రాలలో భాష కూడా విఫలమయిందని అర్థమవుతుంది. యూనివర్సిటీ అధికారులు, విద్యార్థి నిరసనకారులు, ఇరు పక్షాల వారూ కూడా, ముదస్సిర్‌ని కాశ్మీరీ ముస్లింగానో, లేక దౌర్జన్యంగా ప్రవర్తించే 'స్వలింగ సంపర్కుడు' గానో అర్థం చేసుకున్నారు.

ఈ ఘటనలో భాష ఎన్ని విధాలుగా విఫలమయిందో అర్థం చేసుకోవటం చాలా అవసరం. ముదస్సిర్ మరణం చుట్టూ ఉన్న వ్యక్తులలో, 'స్వలింగ లైంగికత' అన్న ఈ బహుముఖ పదం, వైరుధ్యాలతో కూడిన స్పందనలకు దారి తీసింది. అతని పై ఫిర్యాదు చేసిన అబ్బాయి, ఆందోళన, కోపం, భయం, చిరాకుపడ్డాడు; ప్రాక్టర్ ఎంత అసహనానికి గురయ్యాడంటే, కౌన్సిలింగ్‌కి అవకాశం ఉందా అని కూడా చూడకుండా, పోలీసులకు అప్పగించేటంత; పోలీసులు దాన్ని అతన్ని స్టేషన్‌కి తీసుకు రావటానికి దీనినొక సాకుగా వాడుకున్నారు (కొంత సేపే అయినా, ఈ చర్య అతడి మరణానికి దారి తీసింది); అధికారులేమో, తమ ప్రవర్తనని కప్పి పుచ్చుకోవటానికి మొత్తం విషయాన్ని ముదస్సిర్ చేసిన అతి పెద్ద పాపం – స్వలింగ లైంగికతపైకి తోసేసారు; సంఘటనతో దిగ్భ్రాంతి చెంది, సిగ్గుపడిన యూనివర్సిటీ కమ్యూనిటి, అసలు స్వలింగ సంపర్క లైంగికతకు అవకాశమే లేదని దాన్ని తోసిపుచ్చి, అలా అన్నవారిని తిట్టి, దాన్నుండి బయటపడ్డారు.

మగవారు ఆడవారిపై చేసే హింస, వేధింపుల గురించి వర్ణించటానికి, అవగాహన చేసుకోవటానికి, వివరించటానికి వచ్చిన లైంగిక వేధింపులపై చర్చ ముదస్సిర్ మరణానికి దారితీసిన పరిస్థితులను అర్థం చేసుకోవటానికి బహుశా పనికి రాకపోవచ్చు. బాధాకరమైన విషయం ఏమిటంటే, అటువంటి చర్చ నుండి కనీసం హింస, సంస్కృతి, సంస్థల గురించి కొంత పరిజ్ఞానం అయినా దీన్నర్థం చేసుకోవటానికి లభిస్తుందేమో అనుకుంటే అది కూడా దొరకట్లేదు. ఇటువంటి 'ప్రత్యేక' కేసుల గురించి కూడా వివరించ గలిగే కొత్త సిద్ధాంతాలను రూపొందించుకోవాలని చెప్పటం నా ఉద్దేశం కాదు. నాకేమనిపిస్తోందంటే, లైంగిక హింసని జాతీయత, కులము, వర్గము, కోరిక వంటి భావనలతో 'వివరించి పడేయాలనే' ప్రయత్నం వల్లే, కొన్ని రకాల కథనాలు, వివరణలకి ప్రాధాన్యత లభిస్తోంది. లైంగిక హింసను అర్థం చేసుకోవటంలో, దానికి స్పందించటంలో మనం ఏ స్థానం (లొకేషన్) నుండి, ఏ పరిమితులతో స్పందిస్తున్నాము అని ఆలోచించాలి; అలా చెయ్యాలనే రాజకీయ ఇచ్ఛ మనకి ముందు అవసరం. వేధింపులు, స్వలింగ లైంగికులైన వ్యక్తులంటే ఉండే ద్వేషం, సంస్థాగత ప్రక్రియలు ఏవీ కూడా ఒక క్రమమైన కథనాన్ని మనకు ఇవ్వబోవని అర్థం చేసుకోవాలి. అన్నీ పక్కకి పెట్టినా, మనం కనీసం, 'విలింగ లైంగికత' కి లైంగిక హింసతోను, కుల వ్యవస్థతోనూ ఉండే మౌలిక సంబంధాన్ని గురించి ప్రశ్నలు లేవనెత్తాలి.

సామియా వాసా ఇఫ్‌ఎల్‌యులో విద్యార్థిని

అనువాదం: ఎ. సునీత

## దళిత, బహుజన, ఆదివాసీ మైనార్టీ విద్యార్థి సంఘం (ఇఫ్‌ఎల్‌యు) స్టేట్‌మెంట్

సాధారణంగా లైంగిక హింస (ముఖ్యంగా స్త్రీలపై జరిగేది) పట్ల ఆందోళన వారి 'రక్షణ' గురించి ఒక ప్రత్యేక భావన రూపంలో వ్యక్తమవుతుంది. అది స్త్రీలని తేలిగ్గా హానికి గురయ్యేవారిగా, 'రక్షణ' అవసరమయ్యే వ్యక్తులుగా చూపించగలుగుతుంది. ఆడవాళ్ళనెప్పుడూ చిన్న చూపు చూసే ఈ భావన హింసకి పాల్పడేవారు, గురయ్యే వారు, హింస జరిగే ప్రదేశాలు, ఆడవారికి 'మనం' కల్పించాల్సిన 'రక్షణ', బాధితుల జండర్‌కి సంబంధించిన ప్రశ్నలకి సమాధానాలను ముందే కూర్చి పెడుతుంది. లైంగిక హింస కేవలం ఒక జండర్ లేదా లైంగికత ఉన్న వ్యక్తులకే జరుగుతున్నట్లు అర్థం చేయిస్తుంది. 'స్త్రీల రక్షణ' అంశాన్ని సంక్లిష్టపరిచే కులం, వర్గం, సంస్కృతి, మతం వంటి విషయాలకి దీనిలో చోటుండదు. మనం ఆ విషయాలని సవాలుగా తీసుకుంటే తప్ప కూర్చి పెట్టిన ఈ సమాధానాలని ప్రశ్నించలేము.

లైంగిక హింసను ఆపటానికి చేపట్టే పాలనాయంత్రాంగ చర్యలు, వ్యవస్థీకరణ స్వరూపం, నిబంధనలు, రూపొందే కార్యక్రమాల్లో ఇవే భావనలు 'అణచివేత' రూపాన్ని తీసుకుంటాయి. అంటే ఆడవారిని సమయానికి, స్థలానికి బంధించి ఉంచుతాయి. లైంగిక వేధింపులను, హింసను రూపుమాపాలంటే బహిరంగ ప్రదేశాల పట్ల, స్త్రీల పట్ల, పనిస్థలాల పట్ల ఉన్న స్థిరీకృత ఆలోచనలను ప్రశ్నించాల్సి ఉంటుంది. సమానత్వంతో కూడిన విద్యను అందించాలి, బోధించాలి అని స్థాపించిన కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో ఇటువంటి స్థలపరమైన సమయపాలన గురించిన కట్టుబాట్లు స్త్రీలకి సమానత్వాన్ని పెంపొందించగలవా?

రెండవది స్త్రీలని సంస్కృతికి, ఆచారాలకి, సాంప్రదాయాలకి మూర్తీభవించిన ప్రతినిధిగా భావించి ఆమె శరీరంపై పెట్టే నైతిక కట్టుబాట్లు. ముఖ్యంగా బహిరంగ ప్రదేశాలలో ఏ విధమైన బట్టలు వేసుకోవాలనే విషయం గురించిన నిబంధనలు విలువలు. అంటే కొన్ని రకాలైన దుస్తులే హింసని ప్రేరేపిస్తాయని మనం భావించాలా? మరి వాస్తవం దీనికి విరుద్ధంగా ఉందే!

హింసని తట్టుకుని నిలబడగలగటం గురించి ఆలోచిద్దాం. వేధింపులనేవి 'భద్రత' లేకపోవటం వలన జరగట్లేదు. అసలు విషయం స్త్రీలపట్ల, ముఖ్యంగా హింసకి గురయిన స్త్రీల పట్ల సమాజ ధోరణులు. ప్రచార సాధనాల్లో లైంగిక వేధింపుల చర్చ వచ్చినప్పుడల్లా, సమాజం ఆమెనే దోషిగా నిలబెడుతోంది.

విద్యా సంస్థల్లో స్త్రీ పురుషులని వేరుచేసే విధానాలని కాకుండా, కలిసి చదివే విధానాన్ని ప్రోత్సహించటం, మనకి వీలయ్యే పరిష్కారాల్లో ఒకటి. స్త్రీలను, పురుషులను విద్యారంగంలో క్రియాశీలక పాత్ర పోషించేటట్లు చెయ్యటం, అదే సమయంలో జండర్ పట్ల అవగాహనను కలుగచేయటం దీర్ఘకాలిక పరిష్కారం. మగవారిని చైతన్యపరచటం దీనిలో ముఖ్యమైన మెట్టు, అది మనవెవర్నీ అంత ఉత్సాహపరచక పోయినా సరే!

మతం, కులం, పితృస్వామ్యం కలిసిపోయి రూపం మార్చుకుంటున్న విశాల సామాజిక నేపథ్యాన్ని కూడా పరిగణనలోనికి తీసుకోవాలి. స్త్రీలని, పురుషులని సామాజిక, సాంస్కృతిక, మతపరమైన అస్తిత్వాలకి ప్రతినిధులుగా మాత్రమే చూడని అవగాహనని అలవర్చుకుంటూ, ఆలోచనా పనిముట్లకి పదునుపెట్టి (కొత్త రకమైన) సభ్యతా, సంస్కారాలని అలవర్చుకోవాలి. దాని ద్వారా బహిరంగ ప్రదేశాలని సమానత్వంతో కూడిన పనిస్థలాలుగా పరిగణించటం నేర్చుకోవాలి.

అనువాదం : ఎ. సునీత

# వక్రీకృత దర్పణాలు: లైంగిక హింస

■ పర్నాల్ చిర్మూలే

కుర్రకారు తుళ్ళింతలతో, ఆలోచనలతో కాంటీన్‌లో సమోసాలు తింటూ, టీలు తాగుతూ గడపవలసిన ఒక నవయవ్వన యువకుడు, సమవయస్కురాలైన తన తోటి యువతిని, సహాధ్యాయురాలిని గొడ్డలితో గానీ లేదా వేరే విధంగా గానీ చంపాలని అనుకున్నాడు. కాల్చి చంపెయ్యాలని కూడా అనుకున్నాడు, అయితే ఆ తుపాకి అందుకు సహకరించలేదని వేరే వాళ్ళు అన్నారు. ఆ తర్వాత బ్లేడుతో తనను తాను గాయపరచుకుని, విషం కూడా పుచ్చుకున్నాడు. ఈ రెండింటినీ  చేయగలగటంలో మాత్రం అతను విజయవంతం అయ్యాడు.

అతని చర్యతో తరగతి గదంతా రక్తంతో ప్రవహించి చూస్తున్న ప్రత్యక్ష సాక్షుల మదిలో ఆరని గాయాన్ని మిగిల్చింది. కొంత మంది ధైర్యంగా వెంటనే ప్రతిస్పందించినా, కొంత మంది అక్కడి నుండి పారిపోయారు. అందరి మనసుల్లో ఎన్నో చిక్కు ప్రశ్నలు.

క్యాంపస్‌లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ సంఘటనతో గుండెపట్టేసి నట్టయింది. అది ఏమిటో నేను చెప్పాల్సిన అవసరం లేదు. నాక్కూడా ఇది గుండెపోటు తెప్పించిన అంశమే. కానీ మేమందరం కూడా 'కొన్ని అంగీకారాలకు' రావడానికి, 'అర్థం చేసుకోవడానికి' ప్రయత్నించాం.

జరిగిన దానిని 'ఒక సరైన అర్థంలో ఉంచటం' కోసం తెలివైన అకడమిక్ బుర్రల్లో దాగి ఉన్న ఆలోచనలు ప్రవాహంలా ముందుకు వచ్చాయి. ఇంకా అయోమయంగా తయారు చేసాయి. సవాలక్ష ప్రశ్నలేస్తున్న నా కోతిబుర్రను శాంతపరచి వీటిని విని అర్థం చేసుకోవటానికి చాలా ప్రయత్నించాను. ఎందుకంటే 'సరిగా అర్థం చేసుకోవటానికి' నాకు కూడా పదాల కొరత ఉంది. నాకు కనిపిస్తున్నదంతా అద్దాల మందిరంలో నాట్యమాడుతున్న నీడలు మాత్రమే ఎందుకంటే ఇందుకే:

ఈ సంఘటన ఇక్కడ (జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ క్యాంపస్) జరగటం అనేది అందరికీ ఒక విద్యుద్ఘాతం లాంటిది. ఇప్పటి వరకూ ఈ క్యాంపస్ ఆడవాళ్ళకు 'రక్షణ నిచ్చే కోట'గా ఉండిందనీ, ఇప్పుడు అది కూడా తలకిందులయిందనీ అనుకుంటున్నారు. 'అందమైన జ్ఞాపకం చిన్నాభిన్నమయి పోయిందని' ఎవరో అన్నారు కూడా. ఇది విన్న వెంటనే నాకొచ్చిన ఆలోచన, 'ఓ మూర్ఖపు వ్యక్తీ! నువ్వెప్పుడైనా క్యాంపస్ జీవితాన్ని ప్రపంచాన్ని అందరి కోసం బాగుపరచటానికి మార్గంగా చూసావా? కేవలం నీ కోసం వినోదభరితమైన అందమైన జ్ఞాపకంగా ఉండాలనుకున్నావు తప్ప' అని. అయితే ఈ మాటను నేను గట్టిగా అనలేదు. ఇలాంటి అభిప్రాయాలే మీరు చాలా వింటుండొచ్చు. అందులో కొన్ని, 'మన రోజుల్లో ఇలాంటివి లేవు' లేదా, 'ఈ కాలంలో జనాలకి ఏం జరుగుతోందసలు', లేదా 'ఈ క్యాంపస్‌లో ఇలాంటివి జరగటం ఇదే మొదటిసారి'. అందరికీ ఉన్నట్లుండి 'పాత రోజులు ఎంత బాగుండేవి' అన్న నోస్టాల్జియా ప్రారంభమవుతుంది. విద్యార్థులుగా వచ్చి తమ వేర్లను విస్తరించుకుని ఉపాధ్యాయులైన వారు, 'బయటి ప్రపంచం'లో తమదైన ముద్ర కల్పించుకున్న వారు, ఇక్కడే 'పాతుకుపోయిన' వారు అందరూ 'మా రోజుల్లో ఇలా జరగలేదని' అంటున్నారు. కానీ అప్పుడూ ఇలాంటివి జరిగాయని మనందరికీ తెలుసు. ఎప్పుడూ జరుగుతూనే ఉన్నాయి. మనం కూడా నిజంగానే ఒక స్వర్ణయుగం ఉండేదనీ – అది ఎప్పుడూ లేదని మన చరిత్రకారులే మనకు చెప్పినప్పటికీ – అక్కడ ఇలాంటివేవీ జరగవనీ నమ్ముతున్నామా? మరి ఇటువంటి సంఘటనలేవీ జరగని ఊహాజనిత ప్రదేశంలో బ్రతుకుతున్నట్లు ఎందుకు మాట్లాడుతున్నాం? అసలెందుకిలా చేస్తున్నట్లు మనం? మనం జీవిస్తున్న కాలాన్ని పరాయిదిగానూ, ఎప్పుడో పురాణ కాలాన్ని మనదనీ మనం ఎందుకు మాట్లాడుతున్నాం? ప్రస్తుత సమయం గురించి మాట్లాడాల్సివస్తే, ఇలాంటి వాటిలో భాగస్వాములయి, ఆమోదించే ప్రమాదం ఉందనీ, బహుశా ప్రతిరోజూ ప్రతి ఒక్కరం చేస్తున్నామనీ మన అంతరాళల్లో మనకి తెలుసు.

'ఒకానొక స్వర్ణ యుగం' అన్న భావన ఇటువంటి నింద నుంచి మనల్ని బయటపడవేయటానికి ఉపకరిస్తుంది లేకపోతే అది మనల్ని వదలకుండా గుచ్చుకుంటూనే ఉంటుంది. అయితే అదే భావన మనల్ని ఒక సున్నితమైన, నిజాయితీతో కూడిన కార్యాచరణకు కూడా ప్రేరేపించగలదు. దీనిని మనం చాలాసార్లు మర్చిపోతాం. పైగా, నిజానికి ఏ విధమైన స్వర్ణయుగం లేదు – హింస ప్రతిసారీ జరుగుతూనే ఉంటుంది. వారి బాల్యం ఈ గుణపాఠాలను అందించినా అందించకపోయినా గానీ జనం దానిని ఎదుర్కోవటానికి, భరించటానికి, దాని గురించి చైతన్యమేర్పర్చుకోవటానికి సంసిద్ధులవుతూనే ఉన్నారు. ఈ జ్ఞాపకాల కలబోత నాకు చాలా కోపం తెప్పిస్తోంది. ఎందుకంటే ఇది కేవలం అవతలి వ్యక్తిని నిందించటానికే కాక ఈ క్యాంపస్‌లో వాస్తవంగా స్త్రీలపై జరుగుతున్న హింసను గుర్తించ నిరాకరించి ఒక ప్రమాదకరమైన అంధత్వాన్ని అలవర్చుకోవటానికి కూడా ఉపయోగపడే పనిముట్టు. దీని ద్వారా ప్రత్యేకమైన సంఘటనకు దానివైన కోణాలు దానికున్నాయని, మీ పరిధిలోకి వచ్చే అంశం కాదని కూడా సంఘటన జరిగిన తర్వాత చాలా సులభంగా సూచించే అవకాశం ఉంది. అంటే మరో మాటలో చెప్పాలంటే, పితృస్వామిక / పురుషాధిక్య సంస్కృతుల రూపాలు, సంఘటనల పట్ల చూసీ చూడనట్లు వ్యవహరించాలి. మనం ఈ ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న విషయం తెలియను కూడా తెలియటం లేదు. ఎన్నో సంవత్సరాల తర్ఫీదు తర్వాత కూడా మధ్య తరగతి కుహనా విలువల రొంపితో న్యాయంగా చేయవలసిన పోరాటాన్ని కూడా చేయటం లేదు.

ఇప్పుడు జరిగిన సంఘటనల వంటివి ఈ క్యాంపస్ సంస్కృతికి వ్యతిరేకమయింది అనే అంశం గురించి మాట్లాడుదాం. ఇది కేవలం క్యాంపస్ మాత్రమే, ఒక మతమో లేదా ప్రత్యేక ఉపాసనా విధానమో కాదు. మనకు కేవలం ఒకే ఒక్క క్యాంపస్ సంస్కృతి ఎందుకుండాలసలు? ఈ క్యాంపస్ నుంచి బయటకు వెళ్ళిన అనేక మంది వివేకవంతులు, ఈ క్యాంపస్‌లో ఒక భాగంగా తమను తాము చూసుకుంటున్నారు. నిజానికి ఏంటసలు ఈ క్యాంపస్ సంస్కృతి? ప్రతి ఒక్కరికీ ఉండాల్సిన అవకాశాల కోసం, ఒక మంచి సమాజం కోసం విభిన్నమైన ఆలోచనల మధ్య ఒక అంగీకారానికి వచ్చే విధంగా ఈ క్యాంపస్‌లోని వారు పనిచేశారని అందరకూ తెలిసిందే. అయితే, మధ్య తరగతి ఆదుర్దాలు మిగతా ప్రపంచంతో కలవనివ్వని నిబంధనలను నిర్ణయిస్తాయని వారెప్పుడూ ఊహించి ఉండరు.

నిజానికి, ఈ క్యాంపస్ సంస్కృతి అనే దాని మీద నాలాంటి వారికి చాలా కోపం ఉంది. ఎందుకంటే నైతికత గురించి మాట్లాడటానికి మొదటి మెట్టుగా ఈ అంశం బాగా ఉపయోగపడుతోంది. విద్యార్థులకు నైతిక విలువలు లేకుండా పోయాయని, మనం మెట్ల మీద వెళుతుంటే కనీసం గౌరవంగా పక్కకు కూడా జరగటం లేదని, ఉత్సవ విగ్రహాల్లా అలానే ఉంటున్నారని – ఒక నిస్సహాయ సహాధ్యాయి (నిజానికి అంత నిస్సహాయులేం కాదనేది మీరే చూస్తారు) వాపోతూ, అందుకే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తీర్మానించాడు. నిజానికి దీనికి సమాధానం కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని నాకు తెలుసు. కానీ, గంజాయి, తాగుడు లాంటివే ఇలాంటి సమస్యలకు కారణమవుతున్నాయని తీర్మానించే వాదనలకు ఏమని సమాధానం ఇవ్వగలుగుతాం? ప్రపంచంలోని అత్యున్నత ప్రభావంతమైన, విప్లవ ఉద్యమాలు కూడా కేవలం గణతంత్ర నిలకడ మీద జరగలేదు. గణతంత్ర స్ఫూర్తి ఉద్యమాలలో చాలా చిన్న భాగమే. నిజానికి వర్గ

బేధాలను నిర్ణయించే సంకెళ్ళ నుండి ప్రజలను విముక్తం చేసే సాధనాలతో సంగీతం, పుస్తకాలు, ఆహారం, ప్రేమ, సహానుభూతి, హాస్యం, నమ్మకం లాంటి ఉపకరణాలన్నీ భాగమే. ఇక్కడో విషయం గుర్తు చెయ్యాలి మీకు. మధుపానీయాల మత్తులో స్త్రీలు కూడా ప్రాచీన కాలం నుండే ఊగారు కానీ ఆ మత్తులో ఎప్పుడూ ఆసిడ్‌లో పురుషులని (స్త్రీలని, ఎవరినైనా సరే) ముంచెత్తుదామనీ, వారిపై అత్యాచారాలు చేద్దామనీ, నరుకుదామనీ ప్రయత్నించలేదు. ఎగిసిపడే తీవ్రవాద భావజాలం నుంచీ కరడుగట్టిన సర్దుకుపోయే తరహాగా జరిగే మార్పు ఎంత వేగంగా ఉంటుందంటే వీరుకూడా నైతికత లేని 'పిల్లలు'గా విద్యార్థులకు ముద్ర వేస్తారు. ఇది కేవలం మూర్ఖత్వం కాదు, వయసు మీదపడుతున్న లక్షణం కూడా కాదు, నమ్మకాలను మరింత దృఢపరచుకోవటమే. (వయసు రీత్యా పెద్దవారైనప్పటికీ, నిబద్ధత, మారని సున్నిత స్వభావంతో ఎప్పటికీ నిర్లిప్తులుగా మారకుండా ఉత్సాహం, విశ్వాసాలతో మనల్ని సిగ్గుపడేటట్లు చేసేవారు నాకు చాలామంది తెలుసు). ఇది 'నైతికత' అన్న పదాన్ని మరింత ప్రమాదకరంగా గందరగోళపరచటమే. ఇది మనకు ఉపయోగపడే పదం ఎంత మాత్రం కాదు. ఇది ప్రజల స్వేచ్ఛను నిర్బంధించటానికి మాత్రమే బయటికొచ్చే అంశం. ముఖ్యంగా స్త్రీలకు తమ స్వతంత్రత మీద తమకు హక్కు లేకపోవటమే. స్త్రీల మీద మెదడు మొద్దుబారే స్థాయి హింస జరిగినప్పుడల్లా 'నైతికత' అన్న పదాన్ని ఇష్టమొచ్చినట్లు వాడటం విని నా రక్తం మరిగిపోతూ ఉంటుంది. నైతికత అంటూ ఏదైనా ఉంటే, అది ప్రజల హక్కుల కోసం నిలబడటమే తప్ప మరోటి కాదు.

'ఈ పిల్లలు' అనే పదబంధాన్ని కూడా నేను అసలు వినదల్చుకోవటం లేదు. ఎందుకంటే జండర్ అనే ప్రత్యేకమైన అంశం నుంచి వేరుచేసి, హింసకు పాల్పడే వారినీ, భరించాల్సిన వారినీ ఒకే గాటన కట్టేసే పదబంధం ఇది. ఇది ప్రమాదకరం కూడా. ఎందుకంటే ఇది జండర్ పరమైన హింసను మన సమాజంలో ఒక భాగంగా చూడనివ్వకుండా ఇంకెక్కడికో తీసుకెళ్ళిపోతుంది. అందుకే ప్రతిచోటా జండర్‌ను ఇప్పుడున్న పద్ధతిలోనే గుర్తించటం మనకు చాలా అవసరం. నిజానికి 'పిల్లలు' కూడా జండర్ విభజనతోనే ఉంటారు – ఎలాగంటే, నిజానికి పిల్లలని పిలవాల్సింది ఇంట్లో ఉండే స్వంత పిల్లలనే (ఈ విషయం మీరు ఆలోచించాలి) కానీ తరగతి గదుల్లో, హాస్టళ్ళలో, దాబాలలో ఉండే వయోజనులను కాదు. (మీకు విషయం అర్థం అయి ఉంటుంది, వాళ్లు పిల్లలు కాదు).

పై సంఘటన నా బుర్రలో కలిగిన సానుభూతి పై గందరగోళం కూడా సృష్టించింది. అదృష్టవశాత్తూ మనం సామాజికంగా సానుభూతి విలువ గురించి నేర్చుకున్నాం. నిజానికి ఇది చాలా ఉపయోగకరమైనది. కానీ మనం దాన్ని చాలా సృజనాత్మకంగా జండర్‌ని చూడలేని అంధత్వంతో ఉపయోగిస్తుంటాం. పైసంఘటన గురించి సానుభూతిపరులైన నా సహోద్యోగులు తీసుకుంటున్న వైఖరితో నాకు తీవ్రమైన భేదాభిప్రాయం ఉంది. ఒక విధమైన మనస్థాపంతో దీన్ని ఎలా చెప్తారంటే 'అతను చేసిన దాన్ని మనం ఎప్పటికీ క్షమించలేం, ఇది చాలా భయంకరమైనది, హేయమైనది....అయినప్పటికీ మనం మానవత్వం గురించి కూడా మాట్లాడాలి'. ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడటానికి కారణాలను, సమస్యలను తప్పకుండా అర్థంచేసుకోవాలి. అయితే ఈ విషయంలో బాధ్యత, నిందమొయ్యటానికి నేను సిద్ధంగా లేను. కావాలంటే మీరు తీసుకోండి. నాకా కిరీటం వద్దు. ఈ అంశాలను ఎత్తిచూపాలనుకుంటున్నాను గానీ ఇంకొక స్త్రీ మీద జరిగిన పితృస్వామిక హింసకు నేను నింద పడాలనుకోవటం లేదు. ఆ రకంగా చూస్తే, నేను వ్యవస్థలో భాగం కాదు. జరిగిన ఈ సంఘటనను క్షమించలేకపోయినప్పటికి అందుకు పాల్పడిన యువకుడి 'విషాద మృతి'కి నివాళి సమావేశాన్ని యూనివర్సిటీ డీన్ ఏర్పాటు చేస్తున్నారని సమాచారం. 'అర్థం చేసుకోవటానికి ప్రయత్నించటం'అనేది నాకు కష్టసాధ్యంగా ఉన్నందుకు నాకే ఇబ్బందిగా ఉంది. పై సంఘటనకు పాల్పడిన యువకుడికి తప్పనిసరిగా వ్యవస్థాపరమైన సహాయం తీసుకుని ఉంటే ఉపయోగపడి ఉండవచ్చనే విషయంలో నాకెలాంటి సందేహం లేదు. వ్యక్తిగతంగా నాకుండే సానుభూతి అందరి పట్లా అన్నిసార్లూ నాకుండదు. ఎందుకంటే 'మనిషి' అనే వర్గ వర్ణన ప్రపంచాన్ని జండర్ అంధత్వంతో చూడటానికే ఉపయోగపడుతుంది. నిజానికి ఇక్కడ మనుషులెవరూ లేరు, ఉన్నదంతా స్త్రీలు, పురుషులు, ఆడ లేదా మగ అనే బాక్సుల్లో ఇరికించలేని వాళ్ళు. పిల్లలు కూడా జండర్‌పరంగా విడదీయబడి ఉన్నారు. అలాగే, పెద్దవాళ్ళు, ముసలివాళ్ళు కూడా జండర్‌పరంగా విడదీయబడి ఉన్నారు. స్త్రీలకు వ్యతిరేకంగా జరిగే హింసలో ఒక నేరపూరిత చర్యను చాలా తొందరగా మనస్థత్వీకరించటం అనేదాన్ని, వాటికి తోడుగా వచ్చే రాజకీయ ప్రకటనల ను ఇక్కడ వేలెత్తి చూపకుండా ఉండలేకపోతున్నాను. మనందరం కూడా అర్థం చేసుకోవటానికే ప్రయత్నిస్తున్నాం – అంటే ఒక స్థానం నుండి, ఒక వ్యక్తి దృక్కోణం నుండి అన్నమాట. ఆలోచన స్థాయిలో ఏ స్థానం నుండి, ఎవరి దృక్కోణం నుండి సంఘటనను అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తామనేది మనం నిజ ప్రపంచంలో స్త్రీలపై జరిగే హింసనర్థం చేసుకునే తీరును కూడా నిర్ధారిస్తుంది. నేరస్థుడి బుర్రలో ఏం జరుగుతుందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నించే వాళ్ళు, అది కూడా సానుభూతితో, మనకు చాలా మందే ఉన్నారు. కానీ నా రాజకీయాలు నాకు వేరే చెప్తున్నాయి. నేను ఒక రకమైన దూకుడు స్వభావంతో, పోట్లాటకు దిగే స్త్రీనే. సంఘటనలో తీవ్రంగా గాయపడి, హింసకు గురయి, బతికి బయటపడినప్పటికీ వెలివేతకు గురయిన వ్యక్తి (ఆమె) తరపున నిలబడి మాట్లాడటానికే నేను నిర్ణయించుకున్నాను. ఆ అమ్మాయిని నరకటానికి ఆ అబ్బాయి, కొంత పితృస్వామ్య సంస్కృతి బాధితుడయినప్పటికీ, తీసుకున్న నిర్ణయం లాంటిదే ఇది కూడా. నా నిర్ణయం అంత సులభమయిందీ, కీలకమయిందీ కూడానూ. సానుభూతి నా నిర్ణయాన్నికున్న పదునుని మొద్దుబారుస్తుంది.

ఇంతకీ నేనేం చెప్పాలనుకుంటున్నాను? నైతికత, మనస్థత్వీకరణ, క్యాంపస్ సంస్కృతులు ఇలా ఏ అద్దంలో మనం విషయాన్ని చూస్తున్నామో అవి మనకి మన ప్రతిబింబాలనే చూపిస్తున్నాయనేది నా వాదన. ఈ అద్దాలు మనకు చెప్తున్న ముఖ్య విషయమేమిటంటే స్త్రీలకు వ్యతిరేకంగా జరుగుతున్న హింస పట్ల, జండర్ పట్ల అంధత్వాన్ని మరింత పెంచటానికి ఉపయోగపడే నిర్మాణాలు, సాధనాలే ఇవన్నీ అని. మీరు వాస్తవాలను చూడాలనుకుంటే, అద్దం ముందు నిలబడి చూడకండి. కొంచెం పక్కకి జరిగి, బయటకు వెళ్ళి ప్రపంచాన్ని కొత్తగా చూడండి.

*పర్నాల్ చిర్ములే జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో అధ్యాపకురాలు*

*ఈ వ్యాసం ఆగస్ట్ 4, 2013న డబ్ల్యు.డబ్ల్యు.డబ్ల్యు.కాఫిలా. ఆర్గ్ లో జండర్ వయొలెన్స్ అండ్ ది హాల్ ఆఫ్ మిర్రర్స్ పేరుతో ప్రచురణ అయింది.*

**అనువాదం : కె. సజయ**



# జండర్ చైతన్యం కోసం, అందరినీ కలుపుకునిపోయే ప్రయత్నం: ఒక విమర్శనాత్మక పరిశీలన

■ అనూ ఆంటోనీ, గ్రీష్మా జస్టిన్ జాన్

**పరిచయం:** యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ క్యాంపస్ 2300 ఎకరాల విస్తీర్ణమున్న స్థలంలో, 5000 కంటే ఎక్కువ మంది విద్యార్థులతో ఉంటుంది . యూనివర్సిటీ విద్యార్థులు విభిన్న సామాజిక వర్గాలకు, కులాలకు, జండర్, ప్రాంతీయ, భాష, లైంగిక తీరులకు చెందివుంటారు. విశ్వవిద్యాలయ విస్తీర్ణంలో చాలా తక్కువ శాతం మాత్రమే పబ్లిక్ ప్రదేశంగా గానీ, ఇతరత్రా గానీ వాడుకోబడుతున్నది, క్యాంపస్‌లో ప్రకటిత కర్ఫ్యూ లేనప్పటికీ, సంవత్సరంలో ఉత్సవాలు, వేడుకలు (సంగీత కార్యక్రమాలు, సుకూన్ వార్షిక వేడుకలు, దీపావళి వంటివి) జరుగుతున్నప్పుడు తప్ప, మిగిలిన రోజులలో, రాత్రిపూట రోడ్లు నిర్మానుష్యంగా ఉంటాయి. ఈ అంశాన్ని మనం క్యాంపస్‌లో భిన్నరకాలుగా జరిగే వేధింపులను (ఫిర్యాదు చేసినవి, చేయనివి) అర్థం చేసుకోవటంలో ఉపేక్షించలేము. వేధింపులు రాత్రి సమయంలో మాత్రమే జరుగుతాయని అనుకోవటం సరికాదు. పట్టపగలు కూడా జరుగుతున్నాయి. అంతేకాక, ఈ వేధింపులు జండర్‌తో సంబంధం లేకుండా ఎవరికైనా జరగవచ్చు. విశ్వవిద్యాలయ పరిపాలనా యంత్రాంగం భావించినట్లు, ఇవి చెట్లు ఎక్కువగా ఉన్న ప్రదేశాలలోనో, 'రేవ్' పార్టీలు జరిగే సందర్భంలోనో జరగట్లేదు. అత్యంత ఆశ్చర్యకరంగా ప్రధాన రహదార్లలో, షాపింగ్ కాంప్లెక్స్‌లో, తరగతులలో, ప్రయోగశాలల్లో, డిపార్ట్‌మెంట్లలో జరుగుతున్నాయి.

ఈ వేధింపుల ఘటనలకి క్యాంపస్ కమ్యూనిటీ–విద్యార్థుల సమూహాలు, విద్యార్థి సంఘాలు, జిఎస్‌క్యాష్ పరిపాలనా యంత్రాంగం, విద్యార్థుల రాజకీయ సంఘాల నుంచి వచ్చిన ప్రతిస్పందన నిరాశాజనకంగా ఉంది. దేశంలోనే అత్యున్నత శ్రేణికి చెంది, మూడు దశాబ్దాల కాలంగా, ప్రగతిశీల విశ్వవిద్యాలయంగా పేరు తెచ్చుకున్న విశ్వవిద్యాలయంలో ఇటువంటి ధోరణి, లింగ వివక్షను అర్థం చేసుకొనే వాతావరణాన్ని పెంపొందించటంలో వైఫల్యాన్ని సూచిస్తుంది.
ఈ నేపథ్యంలోనే మనం, 2011–2012 మధ్య కొంత కాలంపాటు క్రియాశీలకంగా పని చేసిన "హైదరాబాద్ విశ్వవిద్యాలయాన్ని జండర్ చైతన్య విశ్వవిద్యాలయంగా మార్చే ధ్యేయంలో విద్యార్థులు" అనే మా విద్యార్థుల సమూహాన్ని చూడవలసి ఉంటుంది. మొదట ఈ బృందం, దాని కార్యకలాపాల చరిత్రను కొంత వివరిస్తాము. తరువాత, మార్చి 9, 2012న ఈ బృందం నిర్వహించిన 'క్యాంపస్ పై హక్కును సాదిద్దాం : ఆయుధాలతో సంబంధం లేని భద్రత పొందుదాం' (రీ క్లెయిమింగ్ యుఓహెచ్ : సేఫ్టీ వితౌట్ పిన్స్) కార్యక్రమంలోని ప్రత్యేకతను వివరిస్తూ దాని గురించి పునరాలోచన చేసి, సమీక్షించటం మా ఉద్దేశ్యం. విశ్వవిద్యాలయంలో జండర్ చైతన్యం తీసుకురావటం కోసం, ఇంతకంటె సమర్థవంతమైన, అందరినీ కలుపుకోగలిగిన పద్ధతులను అన్వేషించాలని మా ఆలోచన.

**సంక్షిప్త చరిత్ర ;** విశ్వవిద్యాలయ పరిపాలనా యంత్రాంగం 16 మే 2011లో జారీ చేసిన సర్క్యులర్‌పట్ల, విద్యార్థి సంఘాలు, రాజకీయ సమూహాలు, క్యాష్‌ల నిశ్శబ్ధమే, ఈ సమూహం ఏర్పడటానికి కారణభూతమైంది. విద్యార్థి సంఘాల ఎన్నికలు దగ్గరలో ఉన్నందున ఈ సర్క్యులర్ విషయమై ఏమైనా (రిజిస్ట్రారు జారీ చేసినది. దీని ప్రధాన ఉద్దేశ్యము. విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో భద్రత. కొందరు విద్యార్థులు ఒక విద్యార్థినిపై దాడి చేసిన సంఘటన పురస్కరించుకొని, ఈ సర్క్యులర్ జారీ చేయబడింది. సర్క్యులర్‌లో కొంత భాగం ఈ విధంగా ఉంది. "....విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో అర్ధరాత్రి విద్యార్థినులు, నిర్మానుష్యంగా ఉండే ప్రదేశాలలో తిరుగుతున్నారనే విషయం, అధికారుల దృష్టికి వచ్చింది. విద్యార్థులు క్యాంపస్‌లో హుందాగా ప్రవర్తించాల్సిన అవసరం ఉంది". ఈ సర్క్యులర్‌కు పెద్దగా ప్రతి స్పందన లభించలేదు.) చేయాలని అనుకున్నాము. ఎన్నికల ముందు జరిగిన విశ్వవిద్యాలయ సాంవత్సరిక సర్వ సభ్య సమావేశంలో కూడా ఈ సర్క్యులర్‌కు సంబంధించి ఎవ్వరూ ప్రశ్నలేవీ లేవనెత్త లేదు. హెచ్.సి.యులో జరిగే ఈ సర్వ సభ్య సమావేశాలు సాధారణంగా అప్రజాస్వామికంగా ఉంటాయి. కీలకమైన అంశాల చర్చ ఎప్పుడూ, రాజకీయ పక్షాలు ఒకరి మీద ఒకరు చేసుకునే ఆరోపణల ప్రవాహంలో కొట్టుకుపోతూ ఉంటాయి. ఈ విధంగా, పైన చెప్పిన సర్క్యులర్ ప్రసక్తి సర్వ సభ్య సమావేశంలో రానేలేదు.

"ఇంట్లో ఉండండి, భద్రంగా ఉండండి?" అనే శీర్షికతో, ఒక గోడ పత్రికను తీసుకొచ్చాము. దానిలో సర్క్యులర్‌ను చర్చిస్తూ 'ఎన్నికలలో పాల్గొంటున్న అన్ని రాజకీయ పక్షాలను రాబోయే ఎన్నికలలో జండర్ అంశానికి తగిన ప్రాముఖ్యతని ఇవ్వమని' కోరాము. "జండర్ చైతన్యం ఉన్న హైదరాబాద్ విశ్వవిద్యాలయం కోసం విద్యార్థులు" అనే పేరుతో ఈ గోడ పత్రికను రాజకీయ పక్షాలన్నిటికీ పంపించాము. ఫలితంగా గత ఐదు సంవత్సరాలలో లేని విధంగా అభ్యర్థులందరు తమ ఎన్నికలలో జండర్ అంశాలను ప్రస్తావించారు.

విద్యార్థి సమూహంగా మేము గ్రహించిన విషయమేమంటే, జిఎస్‌క్యాష్ రాజ్యాంగం మాకు అందుబాటులో లేదు. ఫలితంగా ఫిబ్రవరి 2012 మొదటి భాగంలో జిఎస్‌క్యాష్ రాజ్యాంగం, ఇతర గణాంక వివరాలు, సంస్థ పని తీరును గురించిన కొంత సమాచారాన్ని కోరుతూ సమాచార హక్కు చట్టం కింద నాలుగు దరఖాస్తులను పెట్టాము. వీటికి సమాచారం ఆ సంవత్సరం ఏప్రిల్ నెలలో, సెమిస్టరు చివరికి, మాలో చాలా మంది తమ కోర్సులు పూర్తి చేసుకుని విశ్వవిద్యాలయం వదలి వెళ్ళి పోతూ ఉండే సమయంలో వచ్చింది. దరఖాస్తులు ఇచ్చిన తరువాత, విశ్వవిద్యాలయంలో మిగిలిన వాళ్ళం, జిఎస్‌క్యాష్‌కు సంబంధించి యూనివర్సిటీ యంత్రాంగాన్ని కదిలించటానికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతకడం మొదలు పెట్టాము. ఈసరికి జండర్ అంశాలను గురించి రాజకీయ సంఘాలు, పరిపాలనా యంత్రాంగానికున్న "భద్రతా దృష్టి కోణం" లోని పరిమితులు మాకు అర్థం అయ్యాయి. అయితే అందరి భద్రత దృష్ట్యా భద్రతా సిబ్బంది ఏర్పాటు అవసరమన్నది ఒప్పుకుని తీరాల్సిన విషయం. విద్యార్థులు అనాలోచితంగా భద్రతా సిబ్బంది కోసం చేసిన డిమాండ్‌ను, యూనివర్సిటీ పరిపాలనా యంత్రాంగం ఏమాత్రం జండర్ అవగాహన లేకుండా దయాధర్మం చేసే ధోరణితో మంజూరు చేసింది. ముంబైలోని పరిస్థితి గురించి శిల్పఫాడ్కే రాసిన వ్యాసంలో చెప్పినట్లు, జరగబోయే ప్రమాదాలని నివారించడానికి మనం ఎక్కువ చట్టాలు కావాలి అని అడగటానికి బదులు, అపాయాలను, అభద్రతను, ప్రమాదాలని మనకి మనమే ఎదుర్కొనే హక్కును పునరుద్ఘాటించటం సరైన మార్గమని అన్నమాట మా నమ్మకానికి బలమిచ్చింది. క్యాంపస్‌లో జరుగుతున్న లైంగిక వేధింపుల అంశాన్ని, వేధింపులకు గురవుతున్న అందరినీ దృష్టిలో పెట్టుకుని, జండర్ అవగాహనతో లేవనెత్తాలని మా సమూహం అనుకుంది. అయితే, క్యాంపస్‌లో విద్యార్థులందరికీ బతకటానికి, తిరగటానికి, అవసరమైన కనీస స్థాయి భద్రత సాధించటం మొదటి అడుగు అనే స్పృహ మాకుండింది.

కనీస స్థాయి భద్రత అంటే ఏమిటి? విశ్వవిద్యాలయం క్యాంపస్ (దక్షిణంవైపు, ఉత్తరవైపులో కూడ), లో విద్యార్థుల హాస్టళ్ళు, గ్రంధాలయం, 24/7 పఠన కేంద్రాలు, ప్రయోగశాలలు, గేట్లు, ఏటిఎం, ఆరోగ్య కేంద్రం, కంప్యూటర్ కేంద్రం, క్యాంటీన్లు వంటి వాటి మధ్య సులభంగా, నిర్భయంగా తిరగటానికి అవకాశం, కనీస స్థాయి భద్రతలో భాగం. వీటిలో గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, క్యాంటీను వంటివి రాత్రింబవళ్ళు పని చేస్తాయి. ఇవి ముఖ్యమైనవని చెప్పటంలో మా ఉద్దేశం, మిగిలిన ప్రదేశాల ప్రాముఖ్యతను, అవసరాన్ని తక్కువ చేసి చూపటం గానీ, తీరిక అవసరాన్ని తక్కువ చేసి చూపటం గానీ, తీరిక వేళల్లో వెళ్ళే ఇతర ప్రదేశాలకు లెక్కలోకి తీసుకోకపోవటం కాదు. కానీ పైన పేర్కొన్న ప్రదేశాలు అందరికీ అందుబాటులో ఉండటం ప్రస్తుతం అత్యవసరమైనదని మా గ్రూపు భావిస్తోంది.

ముందే చెప్పినట్లు వేధింపులు అడవులలోనూ, నిర్మానుష్యమైన ప్రదేశాలలో గాక పైన చెప్పిన ప్రదేశాలలోనే జరిగాయి. క్యాంపస్‌లో వీధి దీపాల వెలుతురు వంటి కనీస సౌకర్యాలు లేవు. వేధింపుల మాట అటుంచి, రోడ్డు మీద పాములు తిరుగుతున్నా, ఎదురుగా సైకిలుగానీ, మనుషులు గానీ వస్తున్నా కనిపించదు. క్యాంపస్‌లో రాత్రిళ్ళు స్నేహపూర్వకమైన వాతావరణం ఉండదు. అందువలన, బయటి కెళ్ళే ఆసక్తి ఉన్నవారు కూడా తప్పనిసరిగా, గదుల లోపలే ఉండవలసి వస్తుంది. క్యాంపస్‌లో సౌకర్యాలను వాడుకునే ఉద్దేశ్యం ఉన్న వాళ్ళు కూడా మౌలికమైన వసతులు లేకపోవటం వలన ఆ పని చేయలేక పోతున్నారు. ఈ సందర్భంలోనే "క్యాంపస్ పై హక్కును సాధిద్దాం, ఆయుధాల్లేని భద్రత పొందుదాం" అనే ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించాము.

ఈ ప్రచార కార్యక్రమాన్ని, జండర్‌తో నిమిత్తం లేకుండ క్యాంపస్ విద్యార్థులందరినీ విశ్వవిద్యాలయం వీధులలోకీ పబ్లిక్ ప్రదేశాలకు రప్పించటంతో ప్రారంభించాలని అనుకున్నాము. దీని కోసం ప్రత్యేకంగా ఒక రోజును కేటాయించి, ఆ రోజు విద్యార్థులు తమ సంఘీభావాన్ని వార్తా పత్రికల కాగితంతో గుండె ఆకారంలో తయారు చేసిన బాడ్జిను పిన్నుతో రోజంతా ధరించమని కోరటం జరుగుతుంది. అలా వేసుకున్న బాడ్జీలను అర్థరాత్రి సమయంలో విద్యార్థులు ముందుగానే నిర్దేశించిన ప్రదేశాలలో ఈ కార్యక్రమానికి గుర్తుగా వదలి పెట్టడం ద్వారా ఆయా ప్రదేశాలపైన తమ హక్కును ప్రకటించగలుగుతారు. దీని కోసం మేము మార్చి 9ని ఎంపిక చేసుకున్నాము. ఈ కార్యక్రమానికి ముగింపుగా, క్యాంపస్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లో, విద్యార్థులు ధరించిన బాడ్జిలను తయారుచేసి, ఆటలు, పాటలు ఇతర కార్యక్రమాల ద్వారా పాల్గొనటానికి ఆహ్వానించాం. ఈ సందర్భంలో మేము నృత్య ప్రదర్శనలను, కవితా పఠన కార్యక్రమాన్ని నిర్వహించాము. దీనిలో సుమారు 200 మంది పాల్గొన్నారు.

మా కార్యక్రమం మరింత సమర్థవంతంగా అంటే (అందరినీ ప్రభావితం చేసేదిగా), మరింత ఎక్కువ మందిని కలుపుకుని ఉండాలంటే ఏమి చేసి ఉండవచ్చు అనే అంశాన్ని ఇప్పుడు సమీక్షించాల్సిన అవసరం ఉంది. షాపింగ్ కాంప్లెక్స్‌లో మేము నిర్వహించిన కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది కానీ, అదే రోజు ఇతర పబ్లిక్ ప్రదేశాలలో మేము నిర్వహించిన కార్యక్రమాలకు స్పందన లేదు. ఈ ప్రదేశాలు ఎప్పటిలాగా నిర్మానుష్యంగానే ఉన్నాయి. అర్థరాత్రి మేము నిర్వహించిన కార్యక్రమం, ఒక 'విచిత్ర సంఘటన'గా మిగిలి పోయింది. ఎందుకంటే, క్యాంపస్‌లోని విద్యార్థులలో కొద్ది మంది మాత్రమే పాల్గొన్నారు (పాల్గొన్న వారు సాధారణంగా రాత్రిపూట క్యాంపస్‌లో తిరగటానికి అలవాటుపడ్డవారనీ, ఇటువంటి కార్యక్రమాలు, విద్యార్థులలో వ్యతిరేకతకు దారి తీయవచ్చుననీ విమర్శకులు అభిప్రాయపడ్డారు.) అంతే కాకుండా పాల్గొన్నవారు ఈ ప్రదేశాలలో నిర్వహించబడే కార్యక్రమాలలో సాధారణంగా పాల్గొనే వారే. దీని వలన మనకు అర్థమయ్యేదేమిటంటే, మా పోరాటం, క్యాంపస్‌లో చాలా మంది విద్యార్థులను ప్రేరేపించ లేకపోయింది. ఈ విధంగా షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర ఒక ఉత్సవంగా కాకుండా, క్యాంపస్‌లోని పబ్లిక్ ప్రదేశాలకు విద్యార్థులను మామూలుగా తీసుకుని వెళ్ళడం ద్వారా మేము వాళ్ళను ఎక్కువ శక్తివంతులుగా చేయగలిగి ఉండే వాళ్ళమేమో! ఇలా చూసినప్పుడు మా కార్యక్రమం విఫలమైందని, తమాషాగా మిగిలిపోయిందని మాత్రమే అనిపిస్తుంది. మేము చేసిన పోరాటం ఉద్దేశ్యం క్యాంపస్‌లోని పబ్లిక్ ప్రదేశాలను ఒక్కొక్క విద్యార్థి నిర్భయంగా అర్థరాత్రి అయినా వినియోగించుకోగలగాలి. అయితే, షాపింగ్ కాంప్లెక్స్‌లో మేము నిర్వహించిన కార్యక్రమం, మా అసలు ఉద్దేశ్యాన్ని మరుగుపరిచేసింది. ఎందుకంటే ఆ రోజు మిగిలిన ప్రదేశాలలో మాకు కొన్ని బాడ్జీలు మాత్రమే కనిపించాయి.

మేము చెప్పదలచుకున్న దేమిటంటే జండర్ చైతన్యమే లక్ష్యంగా పని చేస్తున్న ఉద్యమాలు అందరినీ కలుపుకుని పోగలిగినవై ఉండాలి. ఉద్యమంలో ఉండే సమూహాలు వత్తిడి తేగలిగినవై ఉండి చైతన్యవంతమైన స్పృహను, వ్యక్తిగతంగా పాల్గొనే స్ఫూర్తినీ కలిగించే విధంగా పని చేయాలి. ఉదాహరణకు హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో పబ్లిక్ ప్రదేశాలపై హక్కును సంపాదించటం అనే కార్యక్రమం విద్యార్థులను ఒక్కొక్కరిగా కలుసుకుని, పాల్గొనాలని వాళ్లను ప్రేరేపిస్తూ, కార్యక్రమ ఉద్దేశ్యాన్ని వాళ్ళకు వివరించటం వంటి వ్యూహాలను ఉపయోగించుకుని ఉంటే ఒక రాజకీయ రూపం తీసుకొనగలిగేది. జండర్ చైతన్యం మతం, వర్గం వంటి అనుభవాలకు సంబంధించిన చైతన్యం నుండి విడివడి ఉండదు. మా అభిప్రాయంలో ఈ గ్రూపు ఈ అంశాలను పోరాటంలో కలుపుకోవటం గానీ, వాటికి సరైన ప్రాతినిధ్యం కల్పించడం గానీ చేయలేకపోయింది. అందరి భద్రతా అవసరాలను కలుపుకోలేక పోవటం వలన మా కార్యక్రమం కేవలం ఒక వేడుకగా, వింత సంఘటనగా మాత్రమే మిగిలిపోయింది. (ఛాందస భావాలున్న గ్రామాల్లో కూడా, దేవాలయ ఉత్సవాల వంటి సాంస్కృతిక వేడుకలకు మహిళలు తమ కుటుంబాలతో వెళ్ళటం చూస్తాము)

బహుశా మేం ఓడిపోయిన పోరాటం వ్యక్తులు ఒంటరిగా నడవగలగటం కోసమేనేమో. దానిలో మొదటి మెట్టయిన కనీస భద్రతా అవసరాలు కూడా ఇప్పటికీ తగిన రీతిలో సమకూరలేదు. మౌలికంగా, మా పోరాటం సాధారణ రాత్రుల కోసం, మౌలిక అవసరాల కోసమూను!

వ్యాసంలో పేర్కొన్న సర్క్యులర్ 16 మే, 2011 జారీ అయ్యింది. (UH/RG/2011/13 u)

శిల్పా ఫాడ్కే వ్యాసం వివరాలు: ఫాడ్కే.ఎస్ (2007) "ప్రమాదకరమైన సంబంధాలు, ముంబైలో ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ VII XLII, No. 17, ఏప్రిల్ 28, ఈ వ్యాసం మా దృష్టికి తీసుకుని వచ్చిన (హైదరాబాద్ విశ్వవిద్యాలయం సోషియాలజీ విభాగంలోని ప్రొ.సుజాతా పటేల్‌కు మా కృతజ్ఞతలు.)

*అనూ ఆంటోని, గ్రీష్మా జస్టిన్ జాన్‌లు హైదరాబాద్ యూనివర్సిటీ విద్యార్థినులు*

***అనువాదం: పి. మాధవి***









# లైంగిక న్యాయం పట్ల ఉన్న 'ఆదరణ': కొన్ని ప్రశ్నలు

■ చందు

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో జండర్‌కు సంబంధించిన వివిధ సంఘటనల పట్ల వ్యక్తులూ, సంఘాలు ఆసక్తి, ఆదరణ చూపారు; విశ్లేషించారు కూడా. అయితే అసలు ఈ 'ఆదరణ' లోనే కొన్ని సమస్యలున్నాయని నేను అభిప్రాయపడుతున్నాను. ఆదరణ చూపుతున్న వ్యక్తుల మనసుల్లో జండర్ పట్ల కొన్ని అపోహలు, ఉన్న ఊహలతోపాటు అవగాహనల్లో చాలా వైవిధ్యం కూడుకొని ఉంది. వీటిలో కొన్ని తార్కికమైనవి, మరికొన్ని పూర్తిగా అసమంజసమైనవి. అయితే అవి లైంగిక హింస, వేధింపులు లాంటి అంశాల పట్ల వారు చేపట్టాల్సిన చర్యలను ప్రభావితం చేస్తాయి. నేను ఈ క్యాంపస్‌లో ప్రత్యక్షంగా చూసిన, విన్న, అనుభవించిన సంఘటనలు, వాటికి క్యాంపస్‌లో వచ్చిన స్పందన, ఈ విషయాల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జిఎస్‌క్యాష్ కమిటీ విధి విధానాలు, దాని కార్యాచరణ వల్ల నాలో కలిగిన అయోమయం వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకొని నేను ఈ విషయాన్ని ఇక్కడ విశ్లేషిస్తున్నాను.

లైంగిక వేధింపులు, లింగ సమానతకు సంబంధించిన ఇతర అంశాలు మగవాళ్ళకీ, ఆడవాళ్ళకీ సమానంగా వర్తిస్తాయని నా ఉద్దేశం. అందువల్ల ఈ క్యాంపస్ వాసులందరూ జండర్ అంశాలు అమ్మాయిలకే వర్తిస్తాయన్నట్లు ప్రవర్తిస్తుంటే వారిని ఎట్లా అర్థం చేసుకోవాలో తెలియడం లేదు. అబ్బాయిలకి సంబంధించిన అంశాలు సర్వసాధారణమైనవే కాబట్టి వాటి గురించి చర్చించాల్సిన అవసరం లేదనా వారి అభిప్రాయం? క్యాంపస్‌లో లైంగిక అల్ప సంఖ్యాక వర్గాల (సెక్సువల్ మైనార్టీలు) నామోదించే వాతావరణం లేదనుకోవాలా? లేదా ఎన్నికల సందర్భం మనస్సులో పెట్టుకొని అమ్మాయిల సమస్యల గురించి మాట్లాడితే తమకి ఓట్లు పడతాయని విద్యార్థి సంఘాలు ఆశిస్తున్నాయా? లైంగిక వేధింపులకి గురైన వారి కుల-వర్గ అస్తిత్వాల ఆధారంగానే ఈ సమస్యలను పరిష్కరించాలనుకుంటున్నారా? ఆమోదయోగ్యమైన స్త్రీ-పురుష సంబంధాలకి అతీతంగా జరిగే వుండే జండర్ అంశాలు ఉన్నత వర్గాలకు పరిమితమయ్యుంటాయి కాబట్టి మనం వాటి గురించి ఆలోచించనవసరం లేదని ఇక్కడి విద్యార్థి, ఉపాధ్యాయుల సంఘాలు, వారి సభ్యులు భావిస్తున్నారా? ఈ ప్రశ్నలు లేవనెత్తే జండర్ కోణాల గురించి ఈ క్యాంపస్‌వాసులకి సరైన స్పృహ, విశ్లేషణాత్మకమైన ఆలోచనలు ఉన్నాయా?

ప్రస్తుతం మన సమాజంలో ప్రబలి వున్న పితృస్వామ్య భావజాలంలో పాత్ర వహించేది ఎక్కువ శాతం మగవాళ్ళే అనడం సమంజసమే. నిజానికి ఈ భావనకి చాలా పెద్ద చరిత్ర ఉంది కూడా. అయితే మన దృష్టి పితృస్వామ్యంలో స్త్రీలు అనుభవించిన బాధలపై కేంద్రీకరిస్తే, వాటి చరిత్రలో అదే పితృస్వామ్యంలో మగవాళ్ళు, లైంగిక అల్ప సంఖ్యాకులయిన ప్రజల పీడనని చూసీచూడనట్లు వదిలివేయడం జరుగుతుంది. ఈ మరుపు, పక్కన పెట్టడం వారిని తమ పీడన గురించి మాట్లాడనియ్యదు. చూపాల్సిన సామాజిక 'ఆదరణ' స్త్రీల మానసిక, శారీరక పీడనకి మాత్రమే దొరికేటట్లు




చేస్తుంది. ఇటువంటి అవగాహనా చట్రంలో ఈ విశ్వవిద్యాలయంలో జరిగిన కొన్ని సంఘటనల్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే రోజు రోజుకీ లింగానికి సంబంధించిన మూల అంశాలు, అర్థాలు గట్టిపడి ఇతర ఆలోచనల్ని ఇముడ్చుకోలేక పోతున్నాయి. మగవాళ్ళు, లైంగికంగా అల్ప సంఖ్యాకులయిన ప్రజల పీడన గురించి రచనలు, వ్యాఖ్యానాలకి చరిత్రలో చోటు లేకుండా పోతోంది. వీటిని గతం నుంచి తవ్వి బయటికి తీయాల్సిన అవసరం ఈనాడు మన ముందు ఉంది. లింగ బేధాల గురించిన స్పృహని పెంపొందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పరచిన జిఎస్‌క్యాష్ లాంటి సంస్థలకి వాటి విశ్లేషణలో ఆచరణల్లో లేని ఈ అంశం పట్ల అవగాహన ఏర్పర్చుకోవలసిన అవసరం ఉంది.

ఈ విశ్లేషణ నేపథ్యంలో కొట్టొచ్చేటట్లు కనిపించే వాటిని గుర్తించి, కనపడని వాటిని వదిలేసే క్యాంపస్ కమ్యూనిటీని ఎలా అర్థం చేసుకోవాలి? అగుపించని వ్యక్తులని వెలుగులోకి తీసుకు రావడంలో ఎదురుపడే అడ్డంకులు ఏమిటి? వారనుభవించే హింసల్ని జిఎస్‌క్యాష్ సంస్థ దృష్టికి తెచ్చి వాటికి పరిష్కార మార్గాలు ఏవిధంగా వెతకాలి? అసలు ఇటువంటి సంస్థలు, కమిటీలు, శిక్షణల గురించి అమల్లోకి వచ్చిన సూత్రాల చరిత్రని పరిశీలిస్తే ఇవన్నీ స్త్రీలనుభవించిన హింసకి సంబంధించిన సంఘటనల నుంచే పుట్టాయని అర్థమవుతుంది. అవి చాలా ఘోరమైన, క్రూరమైన హింసకి సంబంధించినవై ఉంటాయి; ఏదో ఒక వర్గానికి, కులానికి సంబంధించినవైతే మధ్య తరగతికి పరిమితమైన మన ప్రసార మాధ్యమాల దృష్టికి వస్తాయి దానితో ఒక నిజ నిర్ధారణ కమిటీ వేస్తారు. సుప్రీంకోర్టు ఏదో ఒక పరిష్కార మార్గం సూచిస్తుంది. మళ్ళీ ఇంకో ఘోరమైన సంఘటన జరిగితే కానీ ఈ విషయాల పట్ల 'చర్చ' జరగదు. విశ్వవిద్యాలయాల్లో కూడా ఇదే పునరావృతమవుతోంది.

ఈ సమస్యల్ని పరిష్కరించడానికి ఏర్పరచిన సంస్థల దృష్టికి అసలు సమస్యకున్న ఒక కోణం ఏ విధంగా రావడం లేదో, దాంతో వారు కలిపించే లైంగిక న్యాయ స్పృహ పాక్షికమైనదిగా ఎలా తయారవుతుందో పరిశీలిద్దాం.

హైదరాబాద్ విశ్వవిద్యాలయంలోని జిఎస్‌క్యాష్‌కు ఏమాత్రం లింగ వివక్ష గురించిన స్పృహ లేదు సరికదా, వారి పక్ష పాత వైఖరి ఇతరులను పక్క దారి పట్టిస్తోంది. ఉదాహరణకి గత సంవత్సరం జులై నెలలో జిఎస్‌క్యాష్ ఒక పోస్టర్ తీసుకు వచ్చింది. లైంగిక వేధింపులని ఆంగ్లంలో 'సెక్సువల్ హరాస్‌మెంట్' అంటారు. దానిలో ఉన్న 'మెన్' అక్షరాలని మాత్రమే ఎరుపు రంగులో ముద్రించారు (ఎందుకనో?) ఈ సంవత్సరం ఇంకో బ్రహ్మాండమైన ఆలోచన ముందుకు వచ్చింది. పోస్టర్లలో ఈసారి చాలా బొమ్మలు సంఖ్యలతో కూడిన చార్టులు ఉన్నాయి. ఒకమ్మాయి కిందికి తొంగి చూస్తోంది. ఒకబ్బాయి ఆమెను వెనకనుండి పొడుస్తున్నాడు. లైంగిక వేధింపులని ఎదుర్కొనడం గురించి పోస్టర్‌లో వున్న విషయాలు మనం ఇటువంటి బొమ్మల నేపథ్యంలో అర్థం చేసుకోవాలన్నమాట.

దాన్లో తప్పేంటి అంటారా? పోస్టర్లో లేని విషయం గురించి మనం ఆలోచించాలి. వేధింపులంటే అబ్బాయిలు అమ్మాయిలను ఏడిపించడమేనా? మరి కొంత మంది అబ్బాయిలు అమ్మాయిలతో కలిసి కొంచెం 'ఆడంగి'లా ఉండే అబ్బాయిని ఏడిపించడం సంగతేంటి? 'అబ్బాయి'లా దుస్తులేసుకొనే అమ్మాయిని వేధించవచ్చా? స్వలింగ సంపర్కుల పట్ల చాలా మందికుండే అసహ్యం, అవహేళనా భావాల గురించిన ప్రస్తావన ఈ పోస్టర్స్‌లో ఎందుకు ఉండటం లేదు? వేధించేది ఎప్పుడూ మగవాడేనా? అలా అనుకుంటే మన ఒక మూస భావాన్ని సమర్థించిన వాళ్ళం అవుతాం కదా! ఇవి లింగపరమైన సున్నితత్వాన్ని క్యాంపస్‌లో పెంపొందించ లేకపోవటమే కాదు, మగవాళ్ళు మాత్రమే ఆడపిల్లల్ని వేధిస్తున్నారనే పాత భావన అందరిలో నాటుకుపోయేటట్లు చేయటంలో దోహదపడుతున్నాయి. అంతేకాదు ఎటువంటి వేధింపుని ఈ పోస్టర్‌లో ముందు పెడుతున్నారో కూడా పరిశీలించాలి. ప్రత్యక్షంగా అందరి దృష్టిలో కొచ్చేదే వేధింపా? మరి చిన్న పాటి ఎగతాళి

లాంటి వేధింపులు మనం పట్టించుకోనవసరం లేదా?

లైంగికత గురించిన అవగాహన మనలో మారుతూ ఉంటుంది. పైన నేను విశ్లేషించిన అంశాలు నాకు సంబంధించినవి కాబట్టి సంస్థాపరమైన మద్దతు నాకొస్తుందని నేను ఆశించడం లేదు. లింగం గురించి సాంఘికమైన ఒత్తిడి మనందరి మీద, మనల్ని పెంచి పెద్దవాళ్ళని చేసే మన తల్లిదండ్రుల మీద చాలా ఉంది. అయితే లైంగికత గురించి మనలో క్రమంగా, సహజంగా వచ్చే మార్పులకి లింగ బేధాల పట్ల వుండే దృఢమైన సామాజిక భావజాలం అడ్డుకట్ట అవుతోంది.

లైంగికత గురించి మనలో జరిగే మార్పులు జీవితంలో వివిధ దశల్లో వివిధ రీతుల్లో ఉంటాయి. సంస్థలు, కమిటీలు ఈ మార్పుల గురించి ఆలోచించాలి, ఆదరించాలి. లైంగిక సంపర్కం గురించి ఒక వ్యక్తి ఎంచుకునే మార్గాన్ని ఏ కమిటీలు నిర్ణయించలేవు, మలచలేవు. అలా చేస్తాయని ఎవరూ అనుకోరు. కానీ, సాంఘిక ఒత్తిడి వారిని తమ ఆలోచనలనీ, అస్పష్టతలనీ ఇతరులతో పంచుకోలేకుండా చేయవచ్చు. లింగ బేధాల పట్ల సున్నిత భావాలని పెంపొందించాలని అనుకొనే కార్యక్రమాలు ఇటువంటి వ్యక్తుల స్వతంత్ర్యతకి అడ్డురాకుండా, ఈ విషయం చుట్టూ పేరుకున్న నిశ్శబ్దాన్ని బద్దలుకొట్టే పాత్ర పోషించవచ్చు.

లైంగిక వేధింపులకు పాల్పడ్డ వ్యక్తి పట్ల చర్యలు తీసుకోవాలి తప్ప ఆ వ్యక్తి లైంగికతను ప్రశ్నించేటట్లు ఉండకూడదు. రక్షణ దళాల సంఖ్యని పెంచడం, చుట్టూ కెమెరాలని ఏర్పాటు చేయటం బదులు విద్యార్థుల్లో లైంగికత, లింగ బేధాల గురించి అభ్యుదయ ఆలోచనా శక్తిని చేకూర్చే కార్యక్రమాలు చేపట్టాలి. విశ్వవిద్యాలయాలు ఇటువంటి కార్యక్రమాలని విద్యార్థుల కోసమే పరిమితం చేయకుండా, ఉపాధ్యాయులని, బోధనేతర సిబ్బందిని కలుపుకోవాలి. స్త్రీలు, పురుషులు, లైంగిక అల్ప సంఖ్యాకుల మధ్య సమానత్వం వంటి విషయాలకు సంబంధించిన చర్చను ముందుకు పెట్టాలి.

క్యాంపస్‌లో ప్రతి ఒక్కరిని ఆలోచింప చేయగలిగిన పోస్టర్స్, పాటలు, స్లోగన్స్, పెయింటింగ్స్ బహిరంగ ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలి. విద్యార్థినులు రాత్రిళ్ళు బయటకు వెళ్ళకుండా నిర్బంధించటం, రాత్రిపూట క్యాంటిన్‌లు తెరవకూడదని ఆలోచించే బదులు అటువంటి అవకాశాలు మరింతగా కల్పించి రాత్రిళ్ళే హింసలు, వేధింపులు జరుగుతాయనే భయాన్ని అందరి నుంచి పోగొట్టాలి. అలా చేసినప్పుడే క్యాంపస్ తేజోవంతమౌతుంది. లింగ బేధాల గురించి, లైంగికత గురించి, హింస గురించి స్వలింగ లైంగికత లాంటి విషయాల గురించి స్వేచ్ఛగా మాట్లాడుకొనే ధైర్యం, సాహసం కలుగుతుంది. అప్పుడే 'లింగం' అన్న పదం వర్తించే ప్రజా సమూహాలందరికి న్యాయం జరుగుతుంది. వైయుక్తికంగా లైంగికత గురించి ఏర్పర్చుకున్న భావనలకి అడ్డుపడకుండా ప్రతి ఒక్కరు లింగ స్పృహతో వ్యవహరించ కలిగే వాతావరణాన్ని సృష్టిస్తుంది.

*చందు హైదరాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థి*

**అనువాదం : డి.వసంత**

# పోస్టుమార్టం పోస్ట్‌పోన్ అవుతూనే వుంది!!

## ■ చల్లపల్లి స్వరూపరాణి

అంటరాని అత్యాచారం
నేను మీరంతా మర్చిపోయిన
అనగనగా
ఓ 'అంటరాని సునీత'ను మాట్లాడుతున్నాను
అంటరానిదాన్నని
ఎందుకు అడ్రస్ చేసుకుంటున్నానంటే
ఈ దేశంలో
అంటరాని ఆకలీ
అంటరాని దోపిడీ లాగే
అంటరాని (ఆత్మ)హత్యలూ
అంటరాని అత్యాచారాలూ ఉంటాయి కాబట్టి
మీకు ఆశ్చర్యం కలగవచ్చు గానీ
యోగేశ్వర్రెడ్డిపై నా ప్రేమసాక్షిగా
నాది అంటరాని ఆత్మహత్యే...!
మరికాకపోతే నేను కూడా
వార్తాపత్రికల వెనుక ఖననం కాకుండా
పార్లమెంటు డైనింగ్ టేబుళ్ళ మీద
తందూరీ ఘుమఘుమలా ఘాటెక్కేదాన్నే..!
ఇక్కడ చదువుకీ
ప్రేమకీ పెళ్ళికీ
కులం రంగూ, రుచీ, వాసనా వుండబట్టే
మొన్న మా నిర్మల చావు
అతి 'సహజ మరణం' కింద కొచ్చింది
నిన్నటి మా చంటిదాని మాటకొస్తే
దాని కులం తక్కువ కళ్ళు
విజ్ఞానంతో ఎక్కడ ప్రకాశిస్తాయోనని
బడిలో నాలుగక్షరాలు నేర్చుకుందో లేదో
పంతులమ్మ గురుదక్షిణ కోసం
దాని కన్ను మీద మోజు పుట్టింది
హాస్పిటల్లో అలగా నర్సుల సంగతి
ఇక చెప్పనవసరం లేదు
కళ్ళల్లో ప్రేమ వత్తులు వెలిగించుకుని
రేయింబవళ్ళు రాచపుళ్ళకు మందేస్తే
ఫ్లోరెన్స్ నైటింగేల్
ప్రశంశా పత్రానికి బదులు
ఆమె 'సిస్టర్' మనసుపై
క్యాన్సర్ క్రిమిలా పాకుతారు
ఇక్కడ మా మాన ప్రాణాలకు
అపుడపుడూ
నష్టపరిహారం కూడా చెల్లిస్తారు
విచిత్రం ఏమిటంటే
ఇక్కడ మేము (చంపబడి) చచ్చిపోయి కూడా
పిడికెడు గౌరవానికి నోచుకోకపోగా
'ఎవడు తిరగమన్నాడు' 'ఎవడు చావమన్నాడు'
మాటల ఈటెలతో
మా ఆత్మను కుళ్ళబొడిచి
మళ్ళీ చంపుతారు
ఇపుడు చెప్పండి
ఈ దేశంలో హత్యలకీ
అత్యాచారాలకీ సైతం
అంటరానితనం లేదంటారా..?

సునీత స్మృతికి

మంకెన పువ్వు సంకలనం నుండి

స్వరూపరాణి నాగార్జున విశ్వవిద్యాలయంలో అధ్యాపకురాలు

# దళితేతర స్త్రీలు! కులం పని చేస్తుంది!
# దళిత ఫెమినిస్టు మ్యానిఫెస్టో

***అలీసమ్మ** ఉమెన్స్ కలెక్టివ్ మార్చి 2002లో అగ్రకుల స్త్రీవాదానికి కులం పట్ల ఉండే అంధత్వాన్ని ప్రశ్నిస్తూ మొదలైన దళిత స్త్రీవాద కలెక్టివ్. ఈ వేదిక ప్రారంభం కావడానికి దారితీసిన పరిస్థితులను స్వాతి మార్గరేట్ బ్రాడ్‌షీట్‌లోని వివరణను గురించి "చరిత్రని సందర్శిస్తున్నా" వ్యాసంలో చదవచ్చు.*

ప్రియమైన అక్కాచెల్లెళ్ళారా! మీ అందరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. దళిత స్త్రీలమైన మాకు ఈ ప్రత్యేకమైన సందర్భంలో మా గొంతును విన్పించడానికి సవాలక్ష కారణాలున్నాయి. పితృస్వామ్యంలోని కులం-వర్గం వైవిధ్యాలు, వాటి చరిత్రల నేపథ్యంలో అస్తిత్వ రాజకీయాలను తగిన విధంగా సాధ్యం చేయడం కోసం భిన్నత్వాలనూ, స్థానాలనూ గురించి ఆలోచించడం ఎంతో అవసరం. భారత మహిళా లోకాన్ని కులతత్వ పితృస్వామ్యం చీల్చి వేసిన విషయాన్ని గుర్తించవలసిందిగా హిందూ స్త్రీలనూ, దళితేతర స్త్రీలనూ మేం కోరుతున్నాం, కులవ్యవస్థ అటు అదిపత్య వ్యవస్థగానూ, ఇటు రాజకీయ నిర్మాణంగానూ, భారత మహిళా ఐక్యతకు వ్యతిరేకంగా పని చేస్తుంది. శతాబ్దాలుగా ఈ దృశ్యం మారలేదు. 1999లో హ్యూమన్ రైట్స్ వాచ్ తన నివేదికలో "కులం, వర్గం, జండర్ నిచ్చెన మెట్లకు దళిత స్త్రీ అట్టడుగున పడి ఉంటుంది. ఎక్కువ శాతం నిరక్షరాస్యులుగా, దళిత పురుషుల కన్నా తక్కువ వేతనాలు తీసుకుంటూ, అత్యధిక దళిత స్త్రీలు వ్యవసాయ కూలీలుగా, పాకీ పనివారుగా పనిచేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గణనీయమైన సంఖ్యలో దళిత స్త్రీలు బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెట్టబడుతున్నారు. లేదా నగరాల్లోకి వేశ్యలుగా అమ్మేయబడుతున్నారు. అగ్రవర్ణ స్త్రీలకంటే ఎక్కువగా దళిత స్త్రీలే భూస్వాముల, పోలీసుల బారిన పడుతున్నారు. దళిత స్త్రీల అణగారిన పరిస్థితి వలన ఏ శిక్షా లేకుండా దాడుల్ని కొనసాగిస్తున్న ఆధిపత్య వర్గాల వారు తమ దోపిడీని సాగిస్తున్నారు" అని పేర్కొంది. అందుకే దళిత స్త్రీలమైన మేము భారతదేశంలో కేవలం పురుషాధిపత్యం మాత్రమే కాదు కులతత్వ పితృస్వామ్యం పని చేస్తుందన్న విషయాన్ని గుర్తించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాం. భారతీయ మహిళల్లో కొనసాగుతున్న భిన్నత్వం (బహుళత్వం) యొక్క రాజకీయ ప్రాధాన్యతను గుర్తించవలసిందిగా కోరుతున్నాం. మీరు రూపొందుతున్నారు. మేము ధ్వంసమవుతున్నాం. మిమ్మల్ని గుడిలో ప్రతిష్టిస్తున్నారు. మమ్మల్ని రేయింబవళ్ళు పని చేయమని పొలాల్లోకి విసిరేస్తున్నారు. మిమ్మల్ని 'సతి'గా మార్చుతున్నారు. మమ్మల్ని వేశ్యలుగా మార్చుతున్నారు.

ప్రియమైన అక్క చెల్లెళ్ళారా, మా మాటల్ని కొంత పైకి వచ్చిన దళిత స్త్రీల ఉద్విగ్నమైన మాటలుగానో, సంకుచితమైన మాటలుగానో తీసుకోకండి. ఏ ప్రజాస్వామిక రాజకీయాలైనా భిన్నత్వాన్ని గుర్తించడం అతి ప్రాథమికమైన విషయం. మనం అణగారిన మాట నిజమే. కానీ కులతత్వ పితృస్వామిక అధికారిక సంబంధాలలో మన స్థానాలు, ప్రాతినిధ్యం వేరు వేరు స్థానాల్లో ఉన్నాయి. ఈ వ్యవస్థలో మనం కేవలం స్త్రీలుగా లేము. రకరకాల వర్గాలుగా, పాకీ స్త్రీ, వ్యవసాయ స్త్రీ, ప్రొఫెషనల్ స్త్రీ ఇలా రకరకాలుగా ఉన్నాం. ప్రతి రకమూ మన సామాజిక పరిస్థితిలోని నిర్దిష్టతను ప్రతిఫలిస్తుంది. నిజమైన జీవితం ఈ అన్నికోణాల సంక్లిష్టత నుండి వ్యక్తమవుతోంది. ప్రజాస్వామిక స్త్రీ వాదం ఏదైనా దాని లక్ష్యం జండర్, కులం, వర్గం మొదలైన అధికార నిర్మాణాల్లో యిమిడి ఉన్న సామాజిక బంధాలను మార్చడం. దళిత స్త్రీవాదం చాలా స్పష్టంగా ఈ ఆలోచనా స్రవంతికి చెందింది. ఈ ప్రపంచాన్ని జీవించడానికి అనకూలమైనదిగా మార్చాలంటే చైతన్యాన్ని ప్రజాస్వామీకరించడం ఎంతో అవసరం. దళిత స్త్రీ వాదం ఈ దిశగా పయనించడం ఇప్పటికే ప్రారంభించిందని మేము నిస్సంకోచంగా ప్రకటిస్తున్నాం. చాలా మంది దళిత పురుషులు, దళితేతర స్త్రీలు, పురుషులు 'భిన్నత్వాలు' మాట్లాడడానికీ, పునరాలోచించడానికి ఖచ్చితమైన ప్రయత్నాలు చేస్తున్నారన్న విషయాన్ని మేం మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాం. ఈ అద్భుతమైన సందర్భం - మహిళా దినోత్సవం మన ఉమ్మడి అంశాలనే కాక తేడాలను కూడా చర్చించుకునేందుకు మనల్ని మరింత దగ్గరకు చేర్చుతుందని ఆశిస్తున్నాం. దళిత స్త్రీలనే కాక, దళిత పురుషులు, దళితేతర స్త్రీ పురుషుల్ని కూడా తన రాజకీయాల్లో భాగస్వామ్యం కావలసిందిగా ఆలీసమ్మ ఉమెన్స్ కలెక్టివ్ ఆహ్వానిస్తోంది. ఇది దళిత స్త్రీవాద సిద్ధాంతం, ఆచరణ కేంద్రంగా పనిచేస్తుంది. కారంచేడు దళితుల ఊచకోతకు ప్రత్యక్ష సాక్షి, బాధితురాలు అయిన ఆలీసమ్మ పేరును మాకు మేం పెట్టుకున్నాం.

వందనాలు
ఆలీసమ్మ విమెన్స్ కలెక్టివ్
సౌజన్య రామన్, రత్న వెలిశల,
స్వాతి మార్గరేట్ మద్దెల, ఇందిరా జెల్లీ

***కలేకూరి ప్రసాద్ నల్లపొద్దు సంకలనం కోసం చేసిన అనువాదం***

# ఐడెంటిటి కార్డ్

**ఎస్. జోసఫ్**

నేను చదువుకునే రోజుల్లో
ఆ అమ్మాయి నవ్వుతూ వచ్చింది
ఆమె మోసుకొచ్చిన బువ్వ చేపల కూరను
కలుపుతూ మా చేతులు కల్సిపోయినయి.
బెంచి మీద కూర్చున్న మేము
హిందూ క్రిస్టియన్ కుటుంబమయినం.
నెరుడా కవిత్వాన్ని చదువుతూ
ఆ తన్మయత్వపు కాలాన్ని గడిపాను;
ఆ మధ్య నా ఐడెంటిటీ కార్డు
ఎక్కడో దాచి మర్చిపోయిన.

కార్డును నా చేతికిస్తూ
ఆమె అన్నది;
'నీ స్టైఫండ్ లెక్క
అక్కడ ఎరుపులోకి ప్రవేశించింది'.
ఒక అమ్మాయి అబ్బాయి ప్రేమలో మునిగిపోవడం
ఇంక నేనెప్పుడూ చూడను
కొంత సేపటికి వారు వెళ్ళిపోవచ్చు
వారు కలిసిపోయినా నాకు ఆశ్చర్యం లేదు.
వారి ఐడెంటిటి కార్డుల్లో
రెడ్ మార్క్ ఉండదు కదా

కె.సత్యనారాయణ సూజీ తారు రచించిన
'నో ఆల్ఫా బెట్ ఇన్ సైట్' పుస్తకం నుండి పే.454-455

**అనువాదం: గోగు శ్యామల**

# సంవాద్ లక్ష్యాల, ఉద్దేశాల పరిచయం

***(అక్టోబరు 2011లో సంవాద్ ఒక జండర్ వేదికగా ఆవిర్భవించింది. జండర్, ప్రత్యామ్నాయ లైంగికతల సమస్యల గురించి పని చేయటం దాని ప్రధాన ఉద్దేశం. సంవాద్ పుట్టుక గురించి ఈ సంచికలోని 'చరిత్రను సందర్శిద్దాం' వ్యాసంలో కావ్య కృష్ణ చర్చించారు.)***

సంవాద్ పరిచయ కార్యక్రమాన్ని కొయ్యకి తగిలించి, ఎప్పటికైనా వాడుకోవచ్చుని మూలపడేసిన వివిధ రకాల చరిత్రల మధ్య నిలబడి చెయ్యాలి. ఈ యూనివర్సిటీలో జరిగిన వివిధ పోరాటాల చరిత్ర; జండర్, ఎల్.జి.బి.టి వేదికలు నడపడానికి జరిగిన విఫల ప్రయత్నాల చరిత్ర: ఈ ప్రాంతంలో, దేశంలోని స్త్రీవాద రాజకీయ ఉద్యమాల చరిత్ర: ఈ వేదిక నిర్వహించిన వ్యక్తుల వ్యక్తిగత చరిత్రలు(........)

'సంవాద్' కేవలం మహిళల సమస్యలు మాత్రమే ఎదుర్కోవటానికి ఏర్పడిందా అని కొందరు, మీరు బుర్ఖాను వ్యతిరేకిస్తారా అని మరికొందరు అడిగారు. ఇప్పటికే వివిధ విద్యార్థి సంస్థలతో నిండిపోయిన క్యాంపస్‌లో మళ్ళీ ఇంకొక వేదిక అవసరం ఏమిటి అని కొందరు ప్రశ్నించారు. ఒక స్త్రీవాద సంస్థ స్థాపనకి వివిధ అర్థాలున్నాయి. ఏ రకమైన స్త్రీవాదాన్ని సంవాద్ ఆచరిస్తుంది? లేదా దేనికొరకు పనిచేస్తుంది? ఇవన్నీ మాకు విభిన్న స్థానాల్లోంచి వచ్చిన చాలా క్లిష్టమైన ప్రశ్నలు. ఈ దశలో సంవాద్ తరపున కేవలం తాత్కాలిక వ్యాఖ్యలు మాత్రమే చేయగలం. ముందుగా చెప్పేది సంవాద్ కేవలం ఒక మహిళల సముదాయమే కాదు, ఇది ఒక లింగ పరమైన ఫోరమ్ అని. మేము ఈ వ్యత్యాసం ద్వారా నొక్కి చెప్పదల్చుకున్నదేమిటంటే స్త్రీలను కార్యక్రమాల ద్వారా మార్చగలిగే 'లక్ష్యాలు'గా మాత్రమే చూసే స్రీవాద దృక్పథంతో మేం పని చేయదలచుకోలేదు. ఇప్పటి వరకు లింగ బేధాల గురించి, లైంగికత గురించి ప్రబలిపోయిన భావాలను కదిల్చి వేయడమే మా లక్ష్యం అంటే బెల్ హుక్స్ అన్నట్లు 'స్త్రీవాదం ప్రతి ఒక్కరి కోసం' అని మా నమ్మకం.

మన సమాజంలో మరియు క్యాంపసులో ఉన్న వివిధ అధికారిక నెట్‌వర్క్‌లను గుర్తించి, వాటితో చర్చలు జరిపే సామర్థ్యం జండర్ ఫోరంకు ఉందని మా విశ్వాసం. హాస్టళ్ళలో స్త్రీ, పురుషుల గురించి మామూలుగా మూసభావజాలంతో చేసే వ్యాఖ్యలను, క్యాంపస్‌లో లైంగిక వేధింపులను ఎదిరించటం, ప్రత్యామ్నాయ లైంగికత్వాల చుట్టూ పేరుకు పోయిన నిశ్శబ్దాన్ని ఛేదించటం. వీటన్నింటిలో సంవాద్ పోషించాల్సిన పాత్ర సంక్లిష్టమయింది, ఈ పాత్రను ప్రజా సమీకరణ, చర్చ, సంవాదం, చైతన్యపరచటం ద్వారానే కాక పద్ధతులలో మార్పులు తేవడం ద్వారా, నిరసనల ద్వారా కూడా పోషించదలచుకున్నాం. జాతి, కుల, మత, సాంస్కృతిక పోరాటాలు క్యాంపస్ లోపల మరియు బయట జరుగుతున్న సందర్భాన కులం, వర్గం, అస్తిత్వం, సంస్కృతి, జండర్ చిక్కుపడి సంక్లిష్టంగా తయారయిన పరిస్థితులను ఒక విమర్శనాత్మక కోణంలో విశ్లేషించగలిగే స్త్రీవాద సంస్థ అవసరం చాలా ఉందని మేమందరం భావించాము. కేవలం యూనివర్సిటీలోపలే కాక బయట జరిగే ఎన్నో పోరాటాలకు సంవాద్ సంఘీభావం తెలుపుతూ సమంగా పాల్గొంది. ఇందులో తెలంగాణా పోరాటం, ముఖ్యంగా దానిలో స్త్రీల పాత్ర ఆర్మ్‌డ్ పోలీస్ స్పెషల్ పవర్ చట్టానికి వ్యతిరేకంగా ఇరోం షర్మిల పోరాటం, కార్పొరేట్ పెట్టుబడిదారి శక్తులకు వ్యతిరేకంగా జరిగిన ఎన్నో భూ పోరాటాలు, మారుతి సుజుకి పెట్టుబడుదారులకు వ్యతిరేకంగా మానేసర్‌లో కార్మికుల పోరాటాలు వీటిలో చెప్పదగినవి.

వివిధ రీతులలో సంవాద్ ఈ సమస్యలను ఎదుర్కొనే ఉద్దేశంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా రీడింగులు, చర్చలు, చిత్ర ప్రదర్శనలు, వర్క్‌షాపులు మరియు అనేక సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విషయ ప్రచారాలు, ప్రతి నెలా జరుగుతాయి. ఇవే కాక యూనివర్సిటికి చెందిన వివిధ వర్గాల వ్యక్తుల సమస్యలను, అందరూ ఎదుర్కొనే సాధారణ సమస్యలను కూడా చేపడుతుంది. ముందుగా, మేము మూడు అంశాలపై దృష్టి సారిద్దామని అనుకుంటున్నాం.

1. లైంగిక వేధింపుల నిరోధక కమిటీ: యు.జి.సి నిబంధనలు ఉన్నప్పటికీ, జివిస్‌క్యాష్ యూనివర్సిటీ ప్రాంగణంలో క్రియాశీలతతో పనిచేయట్లేదు. లైంగిక వేధింపుల ఘటనలో, సంబంధిత అధికారులను సంప్రదించడానికి ఫోన్ నంబర్లు కానీ, లైంగిక వేధింపుల నిరోధక విధానం గురించి గానీ సమాచారం లేదు. నిజానికి చాలా మందికి ఎటువంటి చర్యలను లైంగిక వేధింపులు అంటారో తెలియదు. ఇటువంటి సమయంలో సంవాద్, జివిస్‌క్యాష్ పునరజ్జీవనంలో మరియు కార్యాచరణలోను ముఖ్య పాత్ర పోషిస్తుందని ఆశిస్తున్నాము.

2. రెండవ సమస్య మహిళల హాస్టల్స్‌కు సంబంధించింది. బి.ఎ. విద్యార్థులు మరియు ఇతర విద్యార్థులు ఉండే హాస్టల్లో పది గంటల వరకే సందర్శకుల ప్రవేశం ముగుస్తుంది. పది గంటల పాలన అగస్టు నుండి అమలు చెయ్యబడింది, అదీ బాయిచందా హాస్టల్‌లోనే అమలు అయింది. అక్కమహాదేవి హాస్టల్లో మాత్రం పాత పదకొండు గంటల నిబంధన కొనసాగుతోంది. దీని విషయమై హాస్టల్ వాసుల అభిప్రాయాలు తెలుసుకొని, నిబంధనలపై చర్చలు సులభతరం చేయటానికి ప్రయత్నిస్తాం.

3. చివరగా, మేము ఈ ప్రాంగణంలో విద్యార్థి ఎన్నికలు అవసరాన్ని నొక్కి చెపుతున్నాము. విద్యార్థులకు ప్రజాస్వామ్య ప్రక్రియలు మరియు ఒక సాధికారిక వేదిక ఎంతో అవసరం. ఈ విశ్వవిద్యాలయం మనగలగటానికి విధానాలు మరియు వ్యవస్థలపై నియంత్రణా చర్యలు కూడా చాలా అవసరం.

వీటికంటే ముఖ్యమైన ఒక విషయం గురించి ఇక్కడ మాట్లాడాలి. భవిష్యత్తులో సంవాద్ ఈ విషయంపై పని చెయ్యాలనుకుంటోంది. అది ఏమనగా ఈ ప్రాంగణంలో పని చేసే బోధనేతర సిబ్బందిలోని మహిళలకు కావలసిన ప్రాథమిక సౌకర్యాలు కలిపించటం. మహిళా కార్మికులకు ఆరోగ్య  సమస్యలు ఎదురైనప్పుడు విశ్రాంతి స్థలం లేదు. అక్కడ తగినంత స్నానపు గదులు లేవు, ఉన్నా నీటి సరఫరా ఉండదు, లేక సరైన మరమ్మత్తులు ఉండవు. ఇవి కేవలం పరిపాలనా వైఫల్యాలుగా చూడక సైద్ధాంతిక నిర్ణయాలుగా చూస్తున్నాము. ఈ విశ్వవిద్యాలయం బోధనేతర సిబ్బందికి కల్పించే పని స్థలం ఎటువంటిదని మేము ప్రశ్నిస్తునాము. ఈ విషయాన్ని ప్రధానంగా తీసుకొని, అన్ని విభాగాల ప్రజల అభిప్రాయంతో ఈ విశ్వవిద్యాలయ విధానాన్ని మార్చటానికి ప్రయత్నిస్తాము. (........)

చిత్రం ఇంకా గజిబిజిగా ఉందని మాకు తెలుసు. కానీ దీన్నుండి కొత్త ఆలోచనలు పుడతాయని అశిస్తున్నాము. ఇంకా చెప్పాలంటే, మా అసంపూర్ణత వల్ల క్యాంపస్‌లో భిన్న సంభాషణలకు చోటు ఏర్పడుతుందని మా ఆశ.

*సంవాద్ లక్ష్య ప్రకటన నుండి కొన్ని భాగాలను*
*ఈ వ్యాసం కోసం తీసుకున్నాం*

**అనువాదం : నిర్మల బిలుక**

# ఒక తల్లీ కూతుళ్ళ సంభాషణ

■ లీలా గౌతమ్, గీతా రామస్వామి

**గీత :**

నా యూనివర్సిటీ చదువు 1970 దశకపు తొలి రోజుల్లో, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సాగింది. యూనివర్సిటీ కొన్ని మార్పులకు గురి అవుతున్న కాలమది. అప్పటి దాకా పై చదువులకై పెద్ద సంఖ్యలో ఆ యూనివర్సిటీకి వచ్చే ముస్లిమ్ బాలికల సంఖ్య త్వరితగతిన తగ్గిపోసాగింది. అదే సమయంలో తెలంగాణాలోని అగ్రకులాలకు చెందిన కుటుంబాలు తమ కొడుకులను చదువు కోసం ఈ యూనివర్సిటీకి పంపసాగారు. అయితే, వారు ఆడపిల్లలను మాత్రం పంపేవారు కాదు. అందుకే కాబోలు, మా గణిత విభాగంలో మొత్తం యాభై మంది అబ్బాయిలుంటే, అమ్మాయిలం ముగ్గురమే ఉండే వాళ్ళం.

ఆ రోజుల్లో, కాలేజ్ క్యాంపస్‌లో మెసలటమనేది, ఒక అమ్మాయికి అంత తేలికైన విషయం కాదు. అటు ఇంట్లో తల్లితండ్రులు, ఇటు కాలేజీలో పురుషాధిక్య భావజాలంతో నిండిన మనుషులూ, అందరూ ఒక ఆమ్మాయి ఏ గొడవా, అప్రతిష్ట కాకుండా, కాలేజ్ చదువు పూర్తి చేసుకోవటం పూర్తిగా ఆమె బాధ్యతే అని నమ్మేవారు. ఆమె ఒంటరిగా ఎప్పుడూ ఎటూ వెళ్ళకూడదు. వెళితే తన తోటి స్నేహితురాళ్ళతో, గుంపుగా మాత్రమే వెళ్ళాలి. తలెత్తి వాళ్ళని, వీళ్ళని చూడకుండా, తలొంచుకుని బుద్ధిగా నడవాలి. ఆమెకి మగ స్నేహితులు ఉండకూడదు. కాలేజీ వేళలు దాటాక, ఒక్క నిముషం కూడా కాలేజీలో ఉండకూడదు. అన్నింటికీ మించి కష్టపడి చదువుకోవాలి!

ఇన్ని చేసినా, ఒక వేళ ఆమె లైంగిక వేధింపులకు గురి అయితే (ఆ రోజుల్లో దానిని 'ఈవ్-టీజింగ్ అనేవారు. అసలు ఆ పదమే ఎంత అవమానకరంగా, ఆధిపత్య ధోరణిలో ఉంటుంది కదా), అది ఖచ్చితంగా ఆమె తప్పే! ఎందుకంటే ఆమె ఉండకూడని చోట, ఉండకూడని సమయంలో అసభ్యకరమైన దుస్తులు వేసుకుని, కలవకూడని వ్యక్తులతో కలిసి, అభ్యంతరకరంగా ప్రవర్తించి ఉంటుందని నమ్మేవారు.

**లీల :**

మా అమ్మ దృష్టిలో లైంగిక వేధింపు అంటే ఏమిటో విన్నప్పుడు, అది నాకు సంబంధం లేని విషయంలా అనిపించింది. ఎందుకంటే, ఆ విధమైన వేధింపుకి నేను ఎప్పుడూ గురి కాలేదు కనుక. రోడ్లపై నడిచేటప్పుడు, ఏవో కారుకూతలు తప్ప, ఢిల్లీలో నేను ఎప్పుడు వేధింపుకు గురి కాలేదు. రద్దీగా ఉండే ఢిల్లీ బస్సుల్లో మెట్రోల్లో, నేను నిత్యం ప్రయాణించినా, ఎప్పుడూ, ఎవరైనా నన్ను అసభ్యంగా తాకటం, తడమటం వంటివి నాకు ఎదురు కాలేదు.

ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని కాలేజీలు నియంతృత్వ ధోరణిలో ఉంటాయి. ముఖ్యంగా డిగ్రీ చదివే అమ్మాయిల పట్ల. దేశమంతా ఇలాగే ఉంటుందా తెలీదు కానీ నా విషయంలో మాత్రం ఖచ్చితంగా అంతే. మా అభిప్రాయాలను ఏ మాత్రం గౌరవించకుండా, పరిశీలించకుండా, పై పెచ్చు మమ్మల్ని చిన్న పిల్లల్లాగా చూసేవాళ్ళు.

విద్యార్థులంతా 'ఓపెన్ క్యాంపస్' ఉండాలని కోరారు. నిజానికి ఈ డిమాండ్‌తో ముడిపడి చాలా విషయాలు ఉన్నాయి. విద్యార్థినులు, ఎప్పుడైనా రాత్రి హాస్టల్లో కాకుండా బయట ఉండాలనుకున్నప్పుడు, వారిని లక్ష ప్రశ్నలతో వేధించకూడదు. తల్లితండ్రుల నుండి ఒక లేఖ తెస్తే సరిపోయేటట్టు ఉండాలి. (నిజానికి ఇదే ఒక వైరుధ్యం, ఎందుకంటే ఒక 'పురుష విద్యార్థి, అలా బయట ఉండాల్సి వస్తే, దానికెవరి అనుమతీ అవసరం లేదు.) అలాగే రాత్రి పది గంటల తర్వాత అమ్మాయిల హాస్టల్ బ్లాకులు తాళం వేయకూడదు. ఇవి మా కోరికలు. నిజానికి ఇప్పుడు ఆలోచిస్తే, మా కోరికలను ఒప్పుకుంటే ఏ విధంగా అమలు పరిచేవారా? అని ఆశ్చర్యం వేస్తుంది. ఎందుకంటే అవన్నీ చాలా వైరుధ్యాలతో కూడుకున్న విషయాలు.

మా కాలేజీలో, అమ్మాయిల హాస్టల్ బ్లాకులు, ఒక 'జనానా' లాగా ఉండేవి. బయట వారికి లోపల వరండాలు, బహిరంగ ప్రదేశాలు కనపడకుండా చుట్టూరా ఇటుక గోడ ఉండేది. హాస్టల్ లోపలికి వెళ్ళే రెండు ద్వారాలకి ఎప్పుడు కాపలా ఉంటుంది. కాపలా లేనిదెప్పుడు అంటే, రాత్రి పది గంటల నుండి పొద్దున ఆరింటికి వరకూ అది తాళం వేసి ఉన్నప్పుడు. అబ్బాయిల హాస్టళ్ళకి, మా వాటికీ, బాహ్యంగా కనపడే ఈ తేడాలకి తోడుగా, లోపల కూడా కొన్ని తేడాలు ఉంటాయి. అవి ఏంటంటే, ప్రతి బ్లాక్‌కి విధిగా ఒక వార్డెన్ ఉంటుంది. రాత్రి బయటకెళ్ళాలంటే, ఆమె అనుమతి కావాలి. మమ్మల్ని సంరక్షించే కాలేజీకి, మాకు మధ్య వారధి లాంటిది ఈ వార్డెన్!

**గీత :**

ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య మేము మనగలిగామంటే కారణం, మేము చదువుకు అంత విలువ ఇచ్చాం కాబట్టి. అలాగే మహిళలమైనా సరే, మాకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు, వ్యక్తిత్వం విలువ గుర్తించి వాటికై పోరాడటం నేర్చుకున్నాము.

అవి భారత దేశంలో స్త్రీవాదం క్రమంగా బలం పుంజుకుంటున్న రోజులు. నిజానికి ఆ వాదం అంతా మా ఆలోచనలకే పరిమితమై ఉండేది. బయటికి వెళ్ళినపుడు, జాగ్రత్తగానే వ్యవహరించాల్సి వచ్చేది.

ఆ రోజుల్లో ఇద్దరు మహిళలు నాకు ఆరాధ్య దేవతల్లాగా తోచేవారు. ఒకరు, సత్యమ్మ శ్రీనాథ్ అని రెడ్డి కాలేజీలో అధ్యాపకురాలు. ఆవిడ రోజూ తార్నాకలోని తన ఇంటి నుండి కాలేజీకి స్కూటర్‌పై వచ్చేవారు. ఇంకొకరు మా డిపార్ట్‌మెంట్‌లో గణితం బోధించే వనజా అయ్యంగార్. ఆవిడ స్టాఫ్ రూంలో కూర్చుని అలవోకగా సిగిరెట్ కాలుస్తుండేవారు. కొంత కాలం తర్వాత ఈ హీరోయిన్ల జాబితాలోకి వీణా శతృఘ్న, రమా మేల్కొటే కూడా చేరారు. కారణం వారిద్దరు స్లీవ్‌లెస్ బ్లౌజులు ధరించేవారు.

కానీ ఇప్పుడిది రాస్తుంటే హాస్యంగా అనిపించవచ్చు. ఎందుకంటే నేటి స్త్రీలు స్కూటర్లే కాదు కార్లు నడుపుతున్నారు, అన్ని రకాల దుస్తులు ధరించి స్వేచ్ఛగా తిరుగుతున్నారు. కానీ ఆ రోజుల్లో వారు ఎందుకు ఆదర్శమయ్యారంటే, వారు ఇతర స్త్రీల కన్నా, భిన్నంగా, స్వతంత్రంగా ఉండటమే కాక, తమ భిన్నత్వాన్ని నాలుగు గోడలకే పరిమితం చేయక సమాజంలో నలుగురి ఎదుట ప్రదర్శించే ధైర్యం చేశారు కనుక.

**లీల :**

ఒక యువతిగా నీ శరీరాన్ని ఏ విధంగా అలంకరించుకోవాలి ఎలా ప్రదర్శించాలి అనే దానికి మన సమాజం ఒక పద్ధతిని నిర్దేశించింది అన్నది నిజం. అయితే, దానికి కొంత శ్రమ అవసరం. ఒక కాలేజీ విద్యార్థినికి నిజానికి అంత సమయం ఉండదు. మన సమాజపు దృష్టిలో ఒక అందమైన యువతికి కావాల్సిన నాజూకు రూపం, అవాంఛిత రోమాలు లేని నున్నటి శరీరం వగైరాలు కావాలంటే దానికి నిరంతరం శ్రమించాలి. కానీ నేను నా చదువులో, ఆశయ సాధనలో తలమునకలై, టి.విల్లో, పత్రికల్లో, ప్రకటనల్లో కనపడే, అందమైన తారల గురించి, ఏ మాత్రం స్పృహ లేకుండా హాయిగా బతికేస్తుంటాను. ఎందుకంటే, అలాంటి వారు, మనకి నిజ జీవితంలో ఎదురుపడే సందర్భాలు చాలా అరుదు కాబట్టి!

'ఓపెన్ క్యాంపస్' కావాలన్న మా డిమాండ్, స్వతంత్ర భావాలకి ప్రతీక. విచక్షణ గల యుక్తవయస్కులైన విద్యార్థులుగా (వారు ఆడైనా, మగైనా సరే) మేము కొంత స్వయం ప్రతిపత్తికి, కొంత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు అర్హులమనే మౌలిక ప్రాతిపదికపై ఆధారపడింది. ఈ స్వేచ్ఛ అనేది బాలురకి, బాలికలకి ఇద్దరికి సమానంగా వర్తించాలనేదే మా ఉద్దేశ్యం! కానీ అది సాధ్యపడలేదు. ఆ వాదన వీగిపోయింది. దానికి పాక్షికంగా మన సమాజంలోని అసమానతలు, వైరుధ్యాలు ఒక కారణం కాగా, ముఖ్య కారణం విద్యార్థుల తల్లిదండ్రులు మంచి ఉద్యోగమూ, డబ్బు సంపాదన కన్నా ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు విలువైనవి అనే లాంటి భ్రమలేవీ పెట్టుకోకపోవడమే. వాళ్ళ ఉద్దేశ్యంలో చదువు యొక్క పరమావధి సంపాదనే, ఆ లక్ష్యానికి అడ్డు వచ్చే వేటినీ వారు సహించరు.

యూనివర్సిటీల్లో విద్యార్థినులపై నియంత్రణ చాలా దారుణమైన స్థాయిలో ఉంటుంది. వాళ్ళ కదలికలపై

వారి కేమాత్రం స్వేచ్ఛ ఉండదు. ఒక రాత్రి హాస్టలు బయట గడపాలంటే లెక్కలేనన్ని అనుమతి పత్రాలు కావాలి. తల్లిదండ్రుల నుండి లేఖ, అక్కడ ప్రాంతీయంగా ఉండే సంరక్షకుల నుండి ఒక లేఖ...వగైరా వగైరా. ఈ లేఖలన్నింటినీ వార్డెన్ ఆమోదించాలి. ఆపై వీటికి డీన్ అనుమతి కూడా తప్పని సరి!

పవిత్రమైన మా హాస్టల్ గదుల్లోకి ఒక్క మగ పురుగు కూడా రావటానికి వీల్లేదు. మగ స్నేహితులు ఉన్న అమ్మాయిల పరిస్థితి చాలా లజ్జాకరంగా మారుతుంది. వారు తమ ప్రేమ ప్రకటనలు, ముద్దు ముచ్చట్లు బహిరంగంగానే చేసుకోవాల్సి ఉంటుంది. లేదా ఏ తుప్పల్లో, పొదలో వెతుక్కోవాలి. అది వారిని ఇంకా ఘోరమైన ఒత్తిడికి గురి చేస్తుంది.

అమ్మాయిలు నిరంతరం తమ రాకపోకలపై సవాలక్ష ప్రశ్నలు ఎదుర్కోవాలి. ఎటు వెళ్తున్నారు? ఎవరితో వెళ్తున్నారు? ఎందుకు వెళ్తున్నారు? ఎప్పుడు వస్తారు? ఇలా. తన సోదరునితో కలిసి వెళ్తున్నా అన్న నాస్నేహితురాల్ని ఏదీ? ఆ సోదరుణ్ణి తెచ్చి చూపియ్యమని అడిగారు మా కాలేజీ వాళ్ళు.

వీధుల్లో జరిగే హింసలాగే, మహిళలను అణచివేయటానికి ఇదీ ఒక మార్గం. దీని ఫలితాలు మాత్రం బాగానే ఉన్నాయి. యూనివర్సిటీలోని అమ్మాయిల్లో ఒక్కరు కూడా రాజకీయ చైతన్యం కలిగి చురుగ్గా ఉన్న వారు లేరు. ఢిల్లీ యూనివర్సిటీలో నా అన్నేళ్ళ అనుభవంలో అక్కడున్న బలమైన విద్యార్థి సంఘాలలో పొరపాటున కూడా ఎక్కడా ఆడ వాసన తగలలేదు. వాళ్ళల్లో ఒక్క మహిళా నాయకురాలు కూడా లేరు.

**గీత :**

నేను ఢిల్లీలో నిర్భయపై జరిగిన దాడి సంఘటన విన్నప్పుడు, ఆమె పై జరిగిన ఘాతుక హింసకి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఒక పంథొమ్మిదేళ్ళ కూతురి తల్లిగా, నిర్భయ అంత రాత్రి వేళ జన సమ్మర్థం లేని ఆ నల్లద్దాల బస్సు ఎక్కే ధైర్యం చేయటం నాకు వణుకు కలిగించింది. ఆ బస్సులో కేవలం అయిదుగురు యువకులు మాత్రం ఉన్నారు. తన వెంటనున్న తన స్నేహితుడు తన రక్షణకి సరిపోతాడని ఆమె అనుకొని ఉండవచ్చు. నిర్భయకి స్త్రీ సహజమైన ఆత్మరక్షణా అప్రమత్తత లేదా?

నా కూతురు లీల చదివే సెయింట్ స్టీఫెన్ కాలేజ్‌లో అమ్మాయిల హాస్టళ్ళు మాత్రం రాత్రి పదింటికల్లా తాళం వేయబడతాయి. ఈ వివక్షాపూరిత నిబంధనకి వ్యతిరేకంగా వారు జరిపిన పోరాటానికి నేను మద్దతు తెలిపినా, ఈ నిబంధన కారణంగా సురక్షితం కాని, క్రూరమైన ఢిల్లీ వీధుల్లో తమ పిల్లలు రాత్రివేళ తిరిగే అవకాశం లేదన్న వాస్తవం చాలా మంది అమ్మాయిల తల్లులకు ఊరటని, నిశ్చింతని కలగ చేస్తుందని చెప్పగలను.

నలుగురిలో పొగ్రత్రాగటం లాగే, ఇవాళ శరీరం కనబడేలా దుస్తులు వేసుకోవటమనేది ఆధునికతకి, సరికొత్త పోకడలని నిదర్శనంగా భావిస్తున్నారు. రొమ్ముల మధ్య చీలిక కనపడేలా బ్లౌజులు, కాళ్ళు కనబడేలా కురచ దుస్తులు, బిగుతైన లెగ్గింగులు నేడు సాధారణం అయిపోయాయి. వర్గ, కుల అసమానతలకు ఆలవాలమైన మన దేశంలో పేదవారికి ఒక పక్క లభించాల్సిన ఏ సదుపాయమూ, సబ్సిడీలు లభించకపోగా, ధనిక వర్గం ఎంత ఆడంబరంగా విచ్చలవిడిగా ఖర్చు చేస్తూ జీవిస్తున్నారనేది సినిమాల్లో, టీవీల్లో, భారీ షాపింగ్ మాళ్ళల్లో, మహానగరాల వీధుల్లో తిరిగే కార్లల్లో, నిత్యకృత్యంగా కనిపిస్తూ వారి పేదరికాన్ని వెక్కిరిస్తుంటాయి.

అలాంటి పరిస్థితుల్లో స్త్రీల వస్త్రధారణ దేన్ని ప్రతిబింబిస్తుంది? అట్టడుగు వర్గాలను అణగదొక్కే ఈ సమాజ సంస్కృతిలో మధ్య తరగతి, ఇంకా ధనిక వర్గ స్త్రీ పురుషులంతా భాగస్వాములే.

ఆధునిక వస్త్రధారణ వలన పాశ్చాత్య దేశాలలో స్త్రీత్వానికి ప్రతీకగా భావించే దుస్తులు, పద్ధతులు మన మహిళలపై రుద్దబడ్డాయి. కాళ్ళు, చేతులు, బాహు మూలాల్లోని రోమాలు తొలగించి, యవ్వనంలో కూడా అసహజమైన పసితనపు నున్నటి చర్మాన్ని ప్రదర్శించటం, ఎక్కడా అనవసర కొవ్వు, ఒంపులు లేని సన్నటి శరీరాకృతిని పొందటం, రొమ్ముల మధ్య చీలిక కాళ్ళు కనపడుతూ రెచ్చగొట్టే వస్త్రధారణ, ఇవన్నీ నేడు మన దేశ మహిళలు అనుసరిస్తున్నారు.

**లీల :**

మహిళలపై హింస ఒక వర్గ వివాదం అనేది నేడు విస్తృతంగా వినవస్తున్న వాదన. ధనిక వర్గాలకు చెందిన మహిళల వస్త్రధారణ రెచ్చగొట్టే విధంగా ఉంటుందని వీరంటారు.

బ్రతుకు పోరాటం చేసే కార్మికుడికి రోజూ టి.విల్లో, సినిమాల్లో, పోస్టర్లపై, వాణిజ్య ప్రకటనల్లో, ధనిక వర్గ స్త్రీలు ఖరీదైన దుస్తుల్లో, ఆధునిక అలంకరణలో దర్శనమిస్తూ ఉంటారు. ఆ కార్మిక వర్గంలో ఉండే వర్గ వ్యతిరేకతని, కసిని ప్రదర్శించటానికి ఈ మహిళల దేహాలే భూమికగా మారతాయి. (ధనిక వర్గ స్త్రీలు స్త్రీత్వానికి, సౌందర్యానికి, పాశ్చాత్యులు ఇచ్చే నిర్వచనాన్ని అనుసరించి, ఇలాంటి వస్త్రధారణ అలంకరణ చేసుకుంటారని ఇంకో విమర్శ. అది వేరే విషయం.)

అయితే ఇలాంటి (ప్రధాన స్రవంతి) బహుళ ప్రాచుర్య సంస్కృతికి వ్యతిరేకంగా జరిగే పోరాటం, కాలేజీలో స్వేచ్ఛ లేని క్యాంపస్‌కి వ్యతిరేకంగా నా పోరాటం ఒకటేనని భావిస్తున్నాను.

భారతదేశంలో ఇలాంటి బహుళ ప్రాచుర్య సంస్కృతి, మన పితృస్వామ్య వ్యవస్థని బలపరిచేదిగా ఉంటుందని నేను ఒప్పుకుంటాను. కానీ ఈ సినిమాలు తీసేదెవరు? స్త్రీని వస్తువుగా చూపే ఈ సినిమాల్ని నిర్మించేదెవరు? (నేను దిగువ తరగతి పురుషులతో నిండిన సినిమా హాల్లో కూర్చుని, కొన్ని బాలీవుడ్ సినిమాలు చూడటం జరిగింది. ఆ సినిమాల్లోని దృశ్యాలు, అవి వ్యాపింపచేసే ఆలోచనాధోరణి, వాటికి హాల్లోని జనాల స్పందన, ఇవన్నీ నన్ను చాలా నిర్ఘాంతపరిచాయి. వాటిల్లో స్త్రీని కేవలం ఒక శృంగార భోగ వస్తువుగా చిత్రీకరిస్తున్నారు. ఆమెపై శృంగారపరమైన, మోటు వెకిలి హాస్యంతో కూడిన చేష్టలు, దృశ్యాలు చూపిస్తున్నారు). ఇందులో నటించే నటులు ఎవరు? వీటి నిర్మాతలు, దర్శకులు ఎవరు? అసలు సెన్సార్ బోర్డులో కూర్చుని వీటిని ఆమోదించిన ఆ సభ్యులెవరు?

మా ఓపెన్ క్యాంపస్ డిమాండ్‌ని, ఒకవేళ అమలు పరిస్తే, దానికి ఎంత అదనపు ఖర్చు అవుతుందో, మా ప్రొఫెసర్ ఒకాయన చెప్పారు. ఆయన మేధత్వాన్ని, వాక్చాతుర్యాన్ని నేను ఎంతగానో ఆరాధించేదాన్ని.

'అమ్మాయిల హాస్టళ్ళకు తాళాలు పెట్టకపోతే, బయట రౌడీ కాలేజీల నుండి, రౌడీ మూకలు, మన కాలేజీ క్యాంపస్‌ను ముంచెత్తుతాయి. ఒక్కసారి ఆలోచించు, అన్నారాయన. అమ్మాయిల రక్షణకై గార్డులు, సి.సి.టివి నిఘా కెమెరాలు, తదితరాల ఖర్చు ఎంత పెరుగుతుంది. మరి ఆ ఖర్చు భారాన్నంతా, ఆడపిల్లలకి అదనపు రక్షణ కల్పించినందుకు, వారి నుండి వసూలు చేయగలమా? లేదు కదా? అంటే అమ్మాయిలకి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలంటే, దానికి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది'. ఈ విషయం పై నేను ఎదుర్కొన్న వాదనల్లో ఇది అతి ఉదారమైంది. కాకపోతే అదీ సాపేక్షికంగా చూసినప్పుడు మాత్రమే, ఒక విద్యార్థి సంఘ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, మా ప్రిన్సిపాల్ "అసలు అమ్మాయిల్ని, అబ్బాయిల్ని ఒకే లాగా ఎలా చూస్తాం? వారిద్దరి మధ్య కోడిగుడ్డుకి, బండరాయికి ఉన్నంత తేడా ఉంది! ఒక ఆపిల్‌కి, కమలాపండుకి ఉన్నంత వ్యత్యాసం ఉంది. కాబట్టి వారిద్దరినీ ఒకలా చూడటం కుదరని పని" అన్నారు.

**గీత :**

మహిళల దేహాల గురించి చాలా యుద్ధాలు జరిగాయి. లోతైన మెడలు, కురచ దుస్తులు, సౌకర్యవంతంగా భావిస్తూ తమ స్వేచ్ఛని ప్రదర్శించే యువతులు, బయటి సమాజపు యుద్ధ భూమిని మరచిపోతున్నారా? వారు తమ ఆత్మరక్షణని గూడా మరచిపోతున్నారా? ఈ ప్రశ్నలు వేస్తున్నప్పుడు నా ఆలోచనా తీరుని గురించి నాకే సందేహాలు కలుగుతున్నాయి. నా మాటల్లోని ఉద్దేశ్యం ఈ పితృస్వామ్య సమాజంలో ఆడవారు ఏ తిరుగుబాటైనా, నాలుగ్గోడల మధ్యే చేయాలి. బయట బహిరంగంగా కాదనా? ఒకవేళ దుస్తులు అనేవి కేవలం బాహ్య ఆడంబరాన్ని తప్ప మరి దేన్ని సూచించని పక్షంలో, నేను పంథొమ్మిదేళ్ళ వయసులో స్లీవ్‌లెస్ బ్లౌజులు వేసుకున్న స్త్రీలని ఎందుకు ఆరాధించాను?

**లీల :**

మా అమ్మ దృష్టికోణం ఇప్పుడు నాకు బాగా అర్థం అవుతోంది. ఒక స్త్రీకి, బయట సమాజంలో తిరగటం ప్రమాదకరం. అంతే. రెండో మాట లేదు. ఒక పని చేసుకుని బతికే దిగువ తరగతి స్త్రీతో పోలిస్తే, ధనిక, మరియు ఎగువ మధ్య తరగతి స్త్రీలకు స్వేచ్ఛ కానీ అవకాశాలు కానీ చాలా ఎక్కువ. మన దేశంలోని దిగువ తరగతి పురుషులు కన్నా కూడా ఎక్కువ! అలాంటప్పుడు, నాపై జరిగే హింసని (అసలు, అలాంటిది ఏమన్నా, నేను ఎదుర్కొని ఉంటే), ఒక రిక్షాతొక్కే వ్యక్తి శరీరంపై జరిగే హింసని(అతని శరీరం ఉపయోగించే కదా, రెండు రూకల కోసం మనల్ని మోసుకుంటూ ఒక చోటి నుండి మరొక చోటికి చేర్చేది?) నేను ఎలా మర్చిపోగలను. దురదృష్టవశాత్తు, పేద కుటుంబంలో పుట్టటమే అతను చేసిన నేరమా?

నేను ఇంతకు ముందే చెప్పినట్టు, చిత్రంగా, నేను ఢిల్లీ వీధుల్లో ఎప్పుడూ వేధింపు కానీ, వివక్ష గానీ, ఎదుర్కొన లేదు. ఇతర బహిరంగ ప్రదేశాలైన తరగతి గదుల్లాంటి వాటిలో నాకు అసలు ఏ సమస్యా రాలేదు. ఏ క్షణంలో కూడా అక్కడ నేను స్త్రీనైనందున ఈ కొరత కానీ సమస్య కానీ వచ్చిందనుకునే సందర్భం రాలేదు.

కానీ నా ఆంతరంగిక ప్రదేశం అయిన నా హాస్టల్ గదిలో మాత్రం ఈ వివక్షని ప్రతి క్షణం అనుభవిస్తుంటాను. నేను ఢిల్లీలో ఉన్నంత కాలం నా హాస్టల్ గదే కదా నా ఇల్లు. నేను అలిసిపోయి తిరిగొచ్చేది అక్కడికే, ఏ విషయానికైనా బాధపడ్డప్పుడు, సేద తీరేది అక్కడే, నా చదువు, తిండి, నిద్ర అన్నీ చేసేది అక్కడే. కానీ నాకు అక్కడ ఉన్నన్ని ఆంక్షలు ఇంక ఎక్కడా ఉండవు అనిపిస్తుంది. ఒక సంస్థ అధీనంలో ఉంటూ, కాలేజ్ హాస్టల్ లాంటి ప్రదేశంలో మనం ఉన్నప్పుడు ఒక నియమావళికి కట్టుబడి ఉండాలని, అది ఆ సంస్థ సక్రమంగా నడవటానికి ఉపయోగపడుతుందని (నాకు నచ్చకపోయినా) నేను ఒప్పుకునే నిజం. అందుకే వాటిని నేను పాటిస్తాను.

కాకపోతే నేను రోజూ ఎదుర్కొనే ఇంకో చేదు నిజం ఏమిటంటే, ఈ నియమావళిలో ఏ ఒక్కటి మా తోటి మగ విద్యార్థులకు వర్తించవు.

ఏ ప్రమాదకర సంఘటనలూ జరక్కుండా ఉండాలంటే, అమ్మాయిలను గదుల్లో బంధించటమే మార్గమా? అదే సరైనదా? తమ గదుల్లోకి, తమ మగ స్నేహితులని, అమ్మాయిలు తీసుకురాలేక పోవటం మంచిదా? కాదు! అది సరైనది కాదు! ఇవి చిన్న చిన్న స్వేచ్ఛలే కావచ్చు, కానీ ఆ కట్టుబాట్లేమీ లేని పురుషులకి, వీటి విలువ ఏంటో బాగా తెలుసు.

నిజానికి మహిళలకి ఉండే అవకాశాలు, ఎంపికలే తక్కువ. అలాంటప్పుడు వారి నుండి ఈ చిన్న స్వేచ్ఛలు కూడా లాగేసుకుని వారిని నియంత్రించటం ఎంత వరకు సబబు? నీ చిన్ని ప్రపంచమైన హాస్టల్ గదిలోనే నీకు స్వేచ్ఛ లేకపోతే ఎలా? నీ అధీనంలో ఉండాలి కదా.

మా కాలేజ్‌లో మొత్తం ఆరు హాస్టల్ బ్లాకులున్నాయి. అందులో మూడింటిని, పరదాలతో మూసేసి తాళం వేసి గట్టి నిఘాతో ఉంచుతారు. మిగతా మూడు బ్లాకులు, బాహాటంగా, స్వేచ్ఛగా ఏ నియమ నిబంధనలు లేకుండా ఉంటాయి (నిబంధనలేవైనా ఉన్నా, అవి కేవలం కాగితాలకే పరిమితం, ఎందుకంటే అవి అమలు పరచటానికి అడ్డు చెప్పటానికి, వారిపై నిఘాకి ఒక వార్డెన్ ఉంటేకదా!)

ఈ పరిస్థితులని, వ్యత్యాసాలని అందరూ చాలా సహజంగా భావిస్తున్నారు. ప్రిన్సిపాల్ ఈ విధానాన్ని పొగుడుతారు. మేము గౌరవించే ప్రొఫెసర్లు దీనిని పొగుడుతున్నారు. పాలనా యంత్రాంగంలోని అందరూ పొగుడుతున్నారు.

నిజానికి చాలా మంది అమ్మాయిలు ఎదుర్కొనే దాడుల్లో అతి క్రూరమైనవి, అతిగా గాయపర్చేవి వారికి అత్యంత సన్నిహితులైన వ్యక్తుల నుండి ఎదుర్కొన్నవే! చాలా అత్యాచార సంఘటనల్లో రేప్ చేసిన వ్యక్తి బాధితురాలికి పరిచయమైన వ్యక్తే అయి ఉంటారు. అసలు అత్యాచారం దాక ఎందుకు? లైంగిక అణచివేత గురించి చెప్పుకుందాం. దీనిని, ప్రతి రోజూ తమ భర్తల నుండి, స్నేహితుల నుండి, కుటుంబ సభ్యుల నుండి మహిళలు ఎదుర్కొనట్లేదా? అలాంటప్పుడు ఎక్కడో చీకట్లో నుండి, ఎవరో ఆగంతకుడు వచ్చి రేప్ చేసి పారిపోతాడన్న భయం ఎక్కడి నుండి వచ్చింది?

ఇక్కడ ఇంకో ఆసక్తికరమైన విషయం ఉంది. అది అధికారం యొక్క సమతౌల్యం. నేను హాస్టల్ గదికి పది తర్వాత ఒక్క నిముషం ఆలస్యంగా వచ్చినా, బయటి స్నేహితురాలిని ఎవరినైనా వెంట తెచ్చినా (ఆ తెచ్చింది స్నేహితుడినైతే, ఇంక చెప్పక్కర్లేదు. ఆ తెచ్చిన పిల్లని అందరూ గుంపుగా చేరి కిరసనాయిలు పోసి తగలబెట్టెయ్యగలరు.) ఈ అధికార సమతౌల్యం ఒక్కసారిగా తలకిందులౌతుంది. నాకన్నా పేదవాడైన, తక్కువ చదువుకుని కేవలం ఒక వార్డెన్ ఉద్యోగం చేసే వ్యక్తి, ఆ క్షణంలో సర్వ శక్తిమంతుడు అవుతాడు. అతనికి నా మీద అరవటానికి, అవమానపరచటానికి సర్వాధికారాలు వచ్చేస్తాయి.

దమ్మిడీ సంపాయించే గార్డు కూడా హఠాత్తుగా మిమ్మల్ని తిట్టి అవమానపరిచే హక్కుని పొందుతాడు. అంటే వాళ్ళు మగ విద్యార్థులపై అరవరని కాదు. కానీ అమ్మాయిల విషయానికొచ్చేసరికి, మంచి అమ్మాయిలు, చెడ్డ అమ్మాయిలు అని రెండు వర్గాలుగా విడగొట్టి, నువ్వు సిగ్గుపడి, బాధపడేలా చేయగలరు. ఒక ఎగువ మధ్య తరగతి వ్యక్తిగా, అన్ని అవకాశాలు, లాభాలు ఉన్న మహిళగా, నేను రోజువారీ ఎదుర్కొనే వైరుధ్యం ఇది. నేను చెప్పే వాస్తవాలు, మా అమ్మ పేర్కొన్న వాస్తవాల కన్నా భిన్నంగా ఉన్నట్టు అనిపిస్తాయి. కానీ నిజంగా ఆ రెంటిలో భిన్నత్వం ఏమీ లేదు... అవును నిజంగా ఏమీ లేదు...

*గీతా రామస్వామి, లీలా గౌతమ్‌లు రాసిన రెండు వేర్వేరు వ్యాసాలను క్రోడీకరించి, ఈ 'సంభాషణ'ను తయారు చేయటం జరిగింది -సంపాదకులు*

**అనువాదం: సింగరాజు రమాదేవి**

# స్త్రీలు పనిచేయు ప్రదేశాలలో లైంగిక వేధింపుల (నిరోధం, నిషేధం మరియు పరిహారం) చట్టం, 2013

**నేపథ్యం :**

భారత ప్రభుత్వ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇచ్చిన వివరణ ప్రకారం:

ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర రంగాల్లోని ఏ సంస్థలో పనిచేసే స్త్రీలయినా ఈ చట్టం కింద రక్షణ పొందవచ్చు. "విశాఖ మరియు రాజస్థాన్ ప్రభుత్వం, 1997" కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన లైంగిక వేధింపుల పై నిర్వచనాన్ని ఈ చట్టం ప్రాతిపదికగా తీసుకుంది. ఈ చట్టం కింద స్కూల్ మరియు కాలేజీ విద్యార్థులు, హాస్పిటల్స్‌లోని రోగులు, ఉద్యోగస్తులు, ప్రాంతీయ అధికారులు అందరు ఫిర్యాదుల కమిటీలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి. అలా చేయని పక్షంలో ఆ సంస్థ యజమానికి 50,000/-రూ॥ల ఫైన్ వేయబడుతుంది. ఇది తక్షణమే అమలులోకి తేబడుతుంది. మరియు ఇండియా గెజిట్‌లో అసాధారణ విభాగం కింద 2వ భాగం, ఒకటవ సెక్షన్, చట్టం నంబరు 14గా 23, ఏప్రిల్ 2013న ప్రచురించడమయింది.

**ముఖ్య సూచనలు:**

ఈ చట్టం లైంగిక వేధింపు అంటే ఏమిటో వివరించడంతోపాటు ఫిర్యాదులు పరిష్కరించడానికి ఒక వ్యవస్థను కూడా రూపొందించింది. అంతేకాక తప్పుడు మరియు అన్యాయమైన కేసులు పెట్టే వారిపై చర్యలు తీసుకునే వెసులుబాటు ఇస్తుంది.

స్త్రీలు తమ వయసుతోను, పనిచేసే వృత్తితోను సంబంధం లేకుండా తాము పనిచేసే ప్రదేశం ప్రైవేటు సంస్థ అయినా, పబ్లిక్ సంస్థ అయినా, చివరకు ఇళ్ళలో పనిచేసే చోటయినా లైంగిక వేధింపులు ఎదురైతే ఈ చట్టం కింద రక్షణ పొందడానికి వీలుగా "అన్యాయం జరిగిన స్త్రీలు" అన్న పదానికి విస్తృతమైన నిర్వచనాన్ని ఈ చట్టం కల్పిస్తుంది. అయితే విశాఖ నిబంధనలలో 'పనిచేయు ప్రదేశం' అనేది సంప్రదాయ పద్ధతిలో యజమాని - ఉద్యోగి సంబంధం ఉన్న కార్యాలయాలకు మాత్రమే వర్తిస్తుంది. ఈ చట్టం ఇంకా ముందుకు వెళ్ళి ఉద్యోగార్థమై ఒక ఉద్యోగి వెళ్ళే ఏ ప్రదేశమైనా అది ఆఫీసు కావచ్చు, స్కూల్ లేదా హాస్పిటల్ కావచ్చు ఆ ప్రదేశంలో లైంగిక వేధింపు ఎదురైతే ఈ చట్టం కింద రక్షణ కోరే విస్తృత అవకాశాన్ని ఈ చట్టం కల్పిస్తుంది. అలాగే ఉద్యోగ ప్రదేశాలలో ఏర్పడ్డ కమిటీలు 90 రోజుల్లో ఎంక్వైరీని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఎంక్వైరీ పూర్తి కాగానే కేసు రిపోర్టుని జిల్లా కలెక్టర్‌కు గాని, సంస్థ యజమానికి గాని పంపించాల్సి ఉంటుంది. రిపోర్టు అందిన 60 రోజుల్లో వారు చర్యలు తీసుకోవాలి. పది లేదా అంతకన్నా ఎక్కువ మంది ఉద్యోగస్తులు కలిసి ప్రతీ ఆఫీసులోను ఒక అంతర్గత ఫిర్యాదు కమిటీ ఏర్పరచుకోవాలి. బ్లాకు లెవల్లో కాని, జిల్లా లెవల్లో కాని ప్రతి జిల్లా అధికారి ఒక స్థానిక ఫిర్యాదుల కమిటీని ఏర్పాటు చేయాలి.

సాక్ష్యాలను సేకరించడానికి ఒక సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఫిర్యాదుల కమిటీకి ఉంటాయి.

ఉద్యోగస్తులకు నిర్దేశించబడిన పెనాల్టీలు వర్తిస్తాయి. ఈ చట్టాన్ని అతిక్రమించిన వారికి 50,000/-రూ॥ల దాక ఫైన్ ఉంటుంది. ఒక పరిధికి మించి అతిక్రమిస్తే అంతకన్నా ఎక్కువ పెనాల్టీ వేయడంతోపాటు సదరు సంస్థకున్న లైసెన్సుని, రిజిస్ట్రేషన్ లాంటివి రద్దుచేయడం జరుగుతుంది.

**పీనల్ కోడ్**

ఈ చట్టం ప్రెసిడెంట్ అనుమతి పొందిన తరువాత లైంగిక వేధింపు అనేది ఎందుకు నేరం అవుతుందో వివరిస్తూ దానికి పాల్పడ్డ పురుషులకి విధించే పెనాల్టీలకు సంబంధించి ఒక సెక్షన్‌ని భారతీయ శిక్షాస్మృతికి జత చేయడమయినది. కేసుని బట్టి శిక్షలు వేయబడతాయి. కొన్ని కేసులకి ఫైన్ మాత్రమే వేయబడితే కొన్నింటికి ఒకటి లేదా మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించబడుతుంది

బ్రాడ్‌షీట్ పాఠకుల కోసం వికీపీడియా సైట్ నుంచి సమాచారం సేకరించి ఇవ్వబడింది

అనువాదం - డి.సుజాత

# హైదరాబాదులో మహిళల అర్ధరాత్రి కవాతు ఒక నివేదిక

■ మరనాథా వహ్లాంగ్, తేజస్విని మాడభూషి

లైంగిక వేధింపుల నెదుర్కొనే మనందరికీ, వాటి నుండి తప్పించుకోవడానికి కొన్ని సమయాల్లో కొన్ని ప్రదేశాలనుండి దూరంగా ఉండటమే సరైన మార్గమని చెప్తూ వస్తున్నారు. వేధింపుల గురించి నిశ్శబ్ధంగా వుండటం ద్వారా ఈ సమస్యకు సమాజం ప్రచారం ఇస్తోంది. ఎప్పుడూ నైతికపరమైన, విలువలకు సంబంధించిన ప్రశ్నలు స్త్రీ స్వేచ్ఛ గురించే కానీ మగవాళ్ళ ప్రవర్తన గురించి ఉండవు. అందువల్ల మనం ఎప్పుడూ సమాజంపెట్టిన నిబంధనలనే మన రక్షణ కోసం పాటిస్తున్నాం. ఎందుకంటే మనకు అలా ఉండటమే నేర్పించారు. మన చదువులు, అవకాశాలు, విజయాలు, ఆత్మస్థైర్యం ఇవన్నీ కూడా అటువంటి అనుభవాలనెదుర్కొనే సమయం వచ్చేసరికి నీరుగారి పోతున్నాయి. ఒక రాత్రివేళ బర్కత్‌పురలోని మా ఆఫీసుకి తిరిగి వస్తున్నప్పుడు మాకది అనుభవంలోకి వచ్చింది. అది రాత్రి 11 గంటల సమయం. ముగ్గురు లేక 4గురు మనుషులు ఉన్న ఒక వాహనం మా వైపుగా వచ్చి ఆగింది. కిటికీలు తెరిచి మగవాళ్లు మామూలుగా వాడే  పదజాలంతో మా గురించి వ్యాఖ్యలు చేశారు. మొదట్లో  మేము కోపంతో ఎదురు తిరగటానికి ప్రయత్నించాం. ఆ తర్వాత భయంతో నిర్మానుష్యమైన రోడ్డుమీద పరిగెత్తాం. ఇలాంటి సందర్భాలనెదుర్కొనే చాలా మంది స్త్రీలలాగే మమ్మల్ని కూడా నిస్సహాయత, భయం కమ్ముకున్నాయి. అయితే ఆ రాత్రి మేము ఇటువంటి అవమానాలకు, నిశ్శబ్దానికి ఎదురు తిరగాలని నిర్ణయించుకున్నాం. ఇలాంటి సందర్భాలు ఎదురుకావటానికి  కారణాలేంటంటే ఆ సమయాల్లో, ఆయా స్థలాల్లో సాధారణంగా స్త్రీలు తిరగకపోవడమే. ఎక్కువ సంఖ్యలో స్త్రీలు రాత్రి వేళల్లో బయటికి వచ్చి, ఇది మామూలు విషయంగా అన్పిస్తే బహుశా మార్పు రావచ్చు.

ఆ రాత్రి మా మధ్య జరిగిన చర్చకి ఒక స్వరూపం వచ్చింది: అదేమిటంటే పది, పదిహేను మందితో, కొంత మంది స్నేహితులతో రాత్రిపూట కలిసి నడవడం. ఒకసారి ఈ ఆలోచనను వ్యక్తులతోను, సమూహాలతోను చర్చించాక ఇది స్వచ్ఛంద ప్రణాళికగా రూపాంతరం చెంది చాలా మంది దీనిలో పాల్గొనటానికి ఉత్సాహం చూపించారు. ఢిల్లీలో గ్యాంగ్ రేప్ సృష్టించిన కోపం, భయం ఈ 'అర్ధరాత్రి కవాతు' కు తక్షణ కారణమైంది. వివిధ రంగాలలో పనిచేసే సంస్థలు మరియు వ్యక్తులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ ఆలోచనను ముందుకు తీసుకు వెళ్ళే దశలో, ప్రణాళిక వేయటంలో, ప్రజలను సమీకరించటంలో వారి సమయాన్నీ, శక్తినీ వెచ్చిస్తూ అనేక వారాలపాటు తోడ్పడ్డారు. మా భావనల ప్రతి 'రాత్రి స్వగతం'(నైట్‌మోనోలాగ్)తో పాటు దీనికోసం ప్రచురించిన ఒక కరపత్రాన్ని కూడా ప్రముఖ స్త్రీవాద పత్రికా విలేఖరి వసంతలక్ష్మి అనువదించడంతో పాటు దినపత్రికలో ప్రచురించారు. ఈ 'అర్ధరాత్రి కవాతు' కు రెండు వారాల ముందు సృష్టించిన ఫేస్ బుక్ పేజీ, 'కవాతు' రోజుకు 800కి పైగా సభ్యులను సంపాదించింది. ఇందులో సంస్థలు ప్రముఖ పాత్ర పోషించినప్పటికీ ఈ ఉద్యమంలో అందరికీ స్థానాన్ని కల్పించవలసిన ఆవశ్యకతను గుర్తుంచుకొని ఏ సంస్థ కూడా తమ బ్యానర్‌లను తీసుకురాదని అభ్యర్థించడమైంది. దీంతోపాటు ఈ ఉద్యమాన్ని ('అర్ధరాత్రి కవాతు' ను) మహిళలకే పరిమితం చేయకుండా ఇంకా చాలా మంది సమాజంలోని లింగ వివక్షకు గురయ్యే వ్యక్తులను, విద్యార్థులను కూడా ఇందులో పాలుపంచుకునేలా చేయడమైంది. ఎల్.జి.బి.టి సంఘాల సభ్యులు, పురుష సెక్స్ వర్కర్స్‌తోను, బాలల హక్కుల పరిరక్షణ కోసం పనిచేసేవారు, నగరంలో పనిచేసే ముస్లిం స్త్రీల మరియు కొన్ని దళిత సంస్థలు ఆ తర్వాత కలిశారు. పోస్టర్లను అన్వేషి ఆవరణలో వర్క్‌షాప్ నిర్వహించి కవాతుకు ముందుగా ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్ మరియు హిందీ భాషలలో రెండు వందలకు పైగా తయారు చేశాము. ముందుగానే ఊహించి మేము అనుకున్న పథకం ప్రకారం శిక్ష, న్యాయం, తల్లీ, చెల్లీ, కూతుర్ల గౌరవాలకు సంబంధించిన నినాదాలను నిలువరించగలిగాము. ఢిల్లీ జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ విద్యార్థుల తరహాలో నినాదాలను  స్వేచ్ఛ' చుట్టూ ఉండేలా తెలుగు, హిందీ, ఇంగ్లీష్‌లలో తయారు చేశాము. ఎవరైనా, ఎప్పుడైనా పై రకమైన నినాదాలు ఇస్తే మార్చ్ పొడుగునా నడిచిన వాలంటీర్లు వెంటనే స్వేచ్ఛకు సంబంధించిన నినాదాల్ని లేవనెత్తారు. ఆ నినాదాల్ని అందుకుని కవాతు ముందుకు సాగింది.

ముగింపు సమయంలో పేరు పొందిన స్త్రీవాదుల మరియు మహిళా నాయకుల ప్రభావిత ప్రసంగాలతో స్త్రీ ఉద్యమంలో వివిధ చారిత్రాత్మక ఘట్టాలను గుర్తు చేసుకున్నాము. ఇందులో భాగంగా రమీజాబిపై జరిగిన లైంగికదాడికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం గురించి కూడా గుర్తు చేసుకున్నాము. చాలా మంది యువతకు ఆ అర్ధరాత్రి – దేశంలో, రాష్ట్రంలో జరిగిపోయిన మరియు ప్రస్తుతం జరుగుతున్న మిగతా ఉద్యమాలను గురించి తెలుసుకోవడానికి అవకాశం కల్పించింది.

**ప్రజా సమీకరణ :**

ట్యాంక్ బండ్ మీదనున్న కొమరం భీము విగ్రహం వద్ద జనవరి 5వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ప్రజలు సమావేశం కావడం మొదలైంది. మా అంచనా ప్రకారం 500 మంది వరకు వస్తారని, అవసరమైన వారికి సహాయపడడానికి 15 మంది స్వచ్ఛంద సహాయకులను ఉంచాము. కవాతు  ప్రారంభానికి ముందే వివిధ టెలివిజన్ ఛానెల్స్ వారు హాజరయ్యారు. ప్రారంభంలో మందకొడిగా 200 మందితో ప్రారంభమయింది. స్త్రీలను, చిన్న పిల్లలను ముందు వరసలో ఉండమని, పురుషులను వారి వెనుక నడవమంటూ అభ్యర్థించమని వాలంటీర్లకు చెప్పటమయింది. సమావేశమయిన వారు 'స్వేచ్ఛ' నినాదాలతో మొదలు పెట్టారు. వీరందరికీ నినాదాల ప్రతులను పంచటం జరిగింది. రాత్రి 11 గంటలకు కవాతు మొదలయింది. హైదరాబాద్‌లోని చాలా మంది మహిళలకు, ఆ సమయంలో నడుచుకుంటూ వెళ్ళడం మొదటిసారి. అయినా వారిలో ఉత్సాహం ప్రస్ఫుటంగా కనిపించింది. నడక ముందుకు సాగుతున్న కొద్దీ అనుసరిస్తున్న వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. 12కు పైగా టెలివిజన్ ఛానెల్స్ వందలాది మంది ప్రదర్శకులను ఇంటర్వ్యూ చేశాయి. సమయం అర్ధరాత్రి 12 గంటలు కాగానే 'అర్ధరాత్రి స్వతంత్ర్యం మా హక్కు. మా హక్కు' అంటూ ముక్త కంఠంతో వెలుగెత్తి చాటారు. విమలక్క లాంటి గాయనులు కవాతు కోసం ప్రత్యేకంగా రాసిన పాట పాడుతూ ప్రదర్శనలో ముందుకు సాగారు. 12.45 సమయంలో కనీసం 2000 మంది అంబేద్కర్ విగ్రహం దాటి లుంబినీ పార్కుకు చేరి ఒంటి గంటకు ముగించారు. ప్రదర్శకులలో ఎక్కువ శాతం హైదరాబాద్ మధ్య తరగతికి చెందినవారయినప్పటికీ భిన్న వర్గాల

'లైంగికత' 'అంగవైకల్యం' మధ్య ఏమాత్రం పొత్తు లేదు అనే భావన అసమగ్రమైనది. ఎందుకంటే అది శరీరాకృతిలో లోపాలున్న స్త్రీలకి లైంగికమైన కాంక్షలుండవని, వారికి శారీరక సుఖం అవసరం లేదనే వాదనలకి దారితీస్తుంది. యుక్తవయసు చేరే క్రమంలో నేను కూడా అలాగే అనుకునే దాన్ని. ఈ అభిప్రాయాన్ని ఇంతకు ముందు 1998లో నేను రాసిన ఒక వ్యాసంలో వెలిబుచ్చాను కూడా. ఆ రోజుల్లో అబ్బాయిలు రోడ్ల మీద అమ్మాయిల్ని చూస్తూ ఈలల వేస్తూ అసభ్యకరంగా వ్యాఖ్యానాలు చేసే వారు. దాన్ని "లైంగిక వేధింపు" గా పరిగణించేవారు. (ఆ మాటకి ఇప్పడున్న నిజమైన అర్థాన్ని ఊహించడం ఎవరి వల్ల కాదు.) స్త్రీవాదులైన నా స్నేహితురాళ్ళు స్త్రీలనుభవించే ఈ 'వేధింపు' గురించి ప్రతిఘటించినప్పటికీ, నేను మాత్రం వాళ్లతో ఏకీభవించలేకపోయాను. లైంగిక కాంక్షతో కూడిన ఆ అబ్బాయిల దృష్టి నా శరీరంలో ఇంకిపోతే బాగుండునని కోరుకునేదాన్ని. అంగవైకల్యం ఉన్న నా ఒకే ఒక స్నేహితురాలూ, నేను, ఆ అబ్బాయిలన్న ప్రతి బూతు మాటని ఆనందంగా ఆస్వాదించే వాళ్ళం.  - అనితా ఘాయ్

Excerpt from Anita Ghai (Dis)Embodied Form: Issues of Disabled Women, (New Delhi: Shakti, 2003).

అనువాదం : డి.వసంత

నుంచీ వచ్చారు. నినాదాల పట్ల భిన్నాభిప్రాయాలు వెల్లడయ్యాయి.

**ప్రసార మాధ్యమాలు :**

ఈ కవాతుకి మీడియాలో విస్తృత ప్రాచుర్యం రావడం వల్ల చాలా మంది కొత్తవారు దీనిలో పాల్గొనటానికి ఆస్కారం కలిగింది. తెలుగు ఛానెల్స్ అనేక మంది ప్రదర్శకులను ఇంటర్వ్యూ చేయడంతోపాటు ఆ వార్తల్ని 'ప్రధాన సమయం'లో ప్రత్యక్ష ప్రసారం చేశాయి. ది హిందూ, నమస్తే తెలంగాణ లాంటి పత్రికలు ప్రదర్శకులకు ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తూ ప్రత్యేక నివేదికలను ప్రచురించాయి. వార్తా ప్రసారంలో నాణ్యత లోపించినప్పటికీ ప్రాచుర్యం మాత్రం మెచ్చుకో తగినది. అయితే దీనికి కవరేజి ఇస్తున్న అనేక మంది రిపోర్టర్లు 'బహిరంగ ప్రదేశాలపై మహిళల హక్కు' అన్న 'కవాతు' స్ఫూర్తిని అర్థం చేసుకోలేక, చట్టం, శిక్ష, హింస అనే అంశాల గురించే వ్యాఖ్యానిస్తూ వార్తల్ని ప్రసారం చేశారు. దృశ్య ప్రసార మాధ్యమాలు వ్యక్తులపై కేంద్రీకరించడం వల్ల 'కవాతు' ఒక సమిష్టి ఉద్యమమనే గుర్తింపు రావటం కష్టతరం అయింది.

అయితే బాధ కలిగించే ఇంకో అంశమేమిటంటే ఒక టి.వి.ఛానెల్ వారు కవాతు తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు సూచిస్తూ ఒక బ్యానర్‌ను వారితోపాటు తెచ్చారు. బ్యానర్‌ను తమతోపాటు తెచ్చుకోవడానికి వారు ముందుగానే అనుమతి కోరినప్పటికీ అది తిరస్కరించబడింది. వీరు బ్యానర్‌లను ప్రదర్శించిన ప్రతిసారీ నిర్వాహక కమిటీ సభ్యులు వద్దని వారించినప్పటికీ కవాతు చివరి వరకూ ఇది పునరావృతం అవుతూనే ఉండింది. దీన్ని చూసి ఆ తర్వాత ఇతర సంస్థలు కూడా తమ బ్యానర్‌లను ప్రదర్శించారు.

**తదనంతరం :**

తర్వాత కొన్ని నెలలకు కావాతులో పాల్గొన్న కొంత మంది యువత కలిసి 'హైదరాబాద్ ఫర్ ఫెమినిజం' అనే ఫేస్ బుక్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ గ్రూప్ ప్రధాన లక్ష్యం మహిళలకు, స్వలింగ లైంగిక వ్యక్తులు మరియు అల్ప సంఖ్యాకులకు సంబంధించిన విషయాల మీద చర్చల ద్వారా, క్రియాశీలక కార్యక్రమాల ద్వారా స్త్రీవాదం పై అవగాహన కల్పించడం.

**ముగింపు :**

ఢిల్లీ గ్యాంగ్ రేప్ తర్వాత ప్రజానీకం మొత్తం సలహాల పర్వంలో మునిగిపోయారు. వారి చర్చలన్నీ మహిళల రక్షణ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి. రక్షణ, న్యాయ వ్యవస్థ సంస్కరణలు, భయపెట్టే కఠిన శిక్షలు, తరిగిపోతున్న భారతీయ విలువలు, వినోద సాధనాల్లో స్త్రీలను చూపిస్తున్న తీరు లాంటి విషయాల మీద సమాజంలో చర్చలు సాగుతున్నాయి. స్త్రీలు బహిరంగ ప్రదేశాల్లో స్వేచ్ఛగా సంచరించే విషయం మాత్రం చర్చకు రావడం లేదు. కవాతు ఈ విషయాన్ని ప్రధానాంశంగా మారుస్తుందని ఆశిద్దాం.

ఈ 'అర్థరాత్రి కవాతు' అనేది ప్రజల్లో కేవలం అవగాహన కల్పించే కార్యక్రమం కాకుండా, పురుషాధిపత్యం పై మార్పు తెచ్చే ఉద్యమంగా గుర్తించాలి.

*మరనాథా హైదరాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థిని, తేజస్విని యుగాంతర్ సంస్థలో పనిచేస్తారు*

**అనువాదం : ఎల్.వి.లక్ష్మి**

# ఎస్.ఎమ్.ఎస్‌లతో వేధింపులు

**■ జనని**

వేధింపులు అనేవి అనేక రకాలుగా జరుగుతాయి. ఎస్.ఎమ్.ఎస్‌లతో జరిగిన వేధింపు సూక్ష్మమైనదిగా కన్పించినా భయంకొల్పుతుంది, ప్రమాదకరమైంది కూడా. ఏదో ఒక రోజు ఈ సంఘటన ఆగిపోతుందిలే అనే ఆశతో ఎక్కువగా స్త్రీలు ఈ విషయంలో ఫిర్యాదు చేయరు. కాని కొన్ని సార్లు ఇవి ఆగవు. విషయం ఏమిటంటే ఈ అసభ్యకరమైన ఎస్.ఎమ్.ఎస్‌లను చూసిచూడనట్లుగా వదిలేసినంత మాత్రాన ఈ అపరాధ ప్రక్రియ ఆగదు. ఫోన్ల ద్వారా నీచమైన, అసభ్యకరమైన మేసేజులు పంపడం అనేది లైగింక వేధింపుల కిందకొస్తుందని మనం గుర్తుంచుకోవాలి. భారత దేశంలో ఇది ఒక బెయిల్ దొరకని నేరం, దీనికి గాను రెండేళ్ళ జైలు శిక్ష పడుతుంది.

చాలా మంది ఎస్.ఎమ్.ఎస్‌ల ద్వారా వేధించటం చాలా తేలిగ్గా చెయ్యగలిగే అపరాధంగా భావిస్తారు. పది నెంబర్ల ఫోను దగ్గరపెట్టుకుంటే అసలు ఐడెంటిటీ ఎవరికీ తెలియకుండా ఉంటుందనుకుంటారు. ఇందువల్లే, అవసరంలేకున్నా మాట్లాడడం, వెంటాడడం, పరువుతీసే విధంగా లైంగిక వేధింపులు చేయడానికి సెల్ ఫోన్‌లని వాడటం బాగా ఎక్కువయింది. చాలా ఆసక్తి కరమైన విషయం ఏమంటే ఇవి చేసేవారందరికి ఇలా చేయడం నేరమని తెలుసు. ఆపకుండా అలాగే కొనసాగించడానికి కారణం బాధితురాలు ఫిర్యాదు చేయదులే అనే నమ్మకం మాత్రమే.

ఈ ఎస్.ఎమ్.ఎస్‌లు పంపించడానికి పెద్ద కారణాలు మాత్రమే అవసరం లేదు, ఒక సందర్భంలో నేను చేసినట్లు, ఒక టీచరుగా క్లాసుకు లేటుగా వచ్చిన విద్యార్థులను మందలించడం కూడా కావచ్చు. రెండవ రోజు నాకు కొన్ని అశ్లీలమైన, నిందాపూరితమైన కొన్ని మెసేజులు నా విద్యార్థిని(అమ్మాయి) పేరుమీద ఒక తెలవని నెంబరు నుంచి వచ్చాయి. అశ్లీలమైనవి, నీచమైనవి పంపడమే కాకుండా బెదిరించే ధోరణిలో విద్యార్థులు లేటుగా వచ్చినందుకు మందలించడం ఆపివేయకపోతే తీవ్రమైన ఫలితాలు ఎదుర్కోవలిసి ఉంటుందనే మెసేజులు వచ్చాయి. ఈ ఎస్.ఎమ్.ఎస్‌లు చూసి అసహ్యం వేసింది, అజ్ఞాత వ్యక్తిగా కాకుండా తన పేరుతో ధైర్యంగా పంపించడాన్ని చూసి ఆశ్చర్యపోయాను. వెంటనే యూనివర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్ళాను. ఏ అమ్మాయి పేరుమీదైతే మెసేజులు వస్తున్నాయో ఆమెకు యూనివర్సిటీ సాధారణ నోటీసు ఇచ్చింది. ఆ అమ్మాయి తన పేరుమీద ఎస్.ఎమ్.ఎస్‌లు వస్తున్నాయని తెలుసుకొని నివ్వెరపోయింది. తన పేరును ఉపయోగించుకుని తనకు అపకీర్తి తెచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని యూనివర్సిటీ అధికారులకు ఫిర్యాదు చేసింది. మన నేరస్థుడు రెండు రకాల నేరాలు చేసాడు. అశ్లీలమైన ఎస్.ఎమ్.ఎస్‌లు పంపడం, ఒక మహిళ పేరును ఉపయోగించుకుని ఆమె పరువుతీయడం. యూనివర్సిటీ అధికారులు సైబర్ క్రైమ్ సెల్‌ను సంప్రదించే వరకూ ఈ మెసేజులు వస్తూనే ఉన్నాయి. ఒక వారం తర్వాత నేరస్థుడు పట్టుబడ్డాడు, అతని దగ్గర నుండి సెల్ ఫోన్, సిమ్‌లను లాక్కొన్నారు. నేను నమ్మలేక పోయాను. ఈ 17-18 సంవత్సరాల అబ్బాయి, ఆ అమ్మాయి క్లాస్‌మేట్. సైబర్ క్రైమ్‌సెల్ ముందు, యూనివర్సిటీ అధికారుల ముందు నేరాన్ని అంగీకరించాడు. ప్రవర్తన బాగాలేని కారణంగా యూనివర్సిటీ నుండి బహిష్కరింప బడ్డాడు.

ఎస్.ఎమ్.ఎస్‌లు పంపడానికి నా మందలింపు మాత్రమే కారణం అనుకుంటే, ఈ అబ్బాయి లేటుగా వచ్చి ఉండాలి కదా. ఈ అబ్బాయి రోజూ రెగ్యులర్‌గా వస్తుంటాడు, ఆరోజు కూడా వచ్చాడు కాని, నేను కోపగించుకుంది లేటుగా వచ్చిన అతడి మిత్రులని. నిజానికి ఈ విద్యార్థి ఎప్పుడూ చెడుగా ప్రవర్తించడం గానీ, ఇబ్బంది పెట్టింది కానీ ఎప్పుడూ లేదు. ఎస్.ఎమ్.ఎస్‌లు పంపడంలో అతని ఉద్దేశం నాకిప్పటికీ అర్థం కాలేదు. ఒక టీచరుగా పనిలో భాగంగా చేసిన చర్యకి ఎవరైనా ఇంతదూరం వెళ్ళి తన కోపాన్ని వ్యక్తపరుస్తారని, ఇలా అగౌరవపరుస్తారని నేను ఎన్నడూ అనుకోలేదు. ఒక విషయం అర్థమయి నాకు చాలా బాధేసింది: చిన్న వయసులోనే మగపిల్లల మనసుల్లో స్త్రీల గురించి ఒక మూసపోసిన చిత్రం ముద్రించబడుతోంది-పని చేసే మహిళలు లైంగికంగా విచ్చలవిడిగా ఉంటారనో లేక ఈ ఇబ్బందులను నిశ్శబ్దంగా భరిస్తూ, బహిరంగంగా న్యాయం కోసం అడగరనో. ఈ ఎస్.ఎమ్.ఎస్‌లలో విషయం చూసినపుడు ఈ మూసపోసిన అభిప్రాయాలు కనిపిస్తాయి కానీ ఈ ఎస్.ఎమ్.ఎస్‌ల వివరాలు ఇక్కడ వెల్లడించదలుచుకోలేదు.

లైంగిక వేధింపులకు గురైన బాధితుల పైనే బండలు వేసే సమాజంలో, చదువుకున్న తోటి ఉద్యోగులు కూడా అశ్లీల ఎస్.ఎమ్.ఎస్‌లు ఈ విధంగా రావడంలో ఉండే బాధను పట్టించుకోరు. నిజం చెప్పాలంటే ఈ విషయం బయటికి వచ్చిన తర్వాత నాతోటి ఉద్యోగస్తులు నా ఎదురుగా, చాటుమాటుగా నా వయసు గురించి, నా రూపం గురించి చేసిన వ్యాఖ్యలు నన్ను చాలా బాధపెట్టాయి. ఆ అబ్బాయి నాకు ఎస్.ఎమ్.ఎస్ లు పంపడానికి అతడికి నాపై ఉన్న అమాయకమైన ప్రేమే కారణమని, ఇది వ్యక్తిగతంగా తీసుకోవడం నాతప్పు అనేంత వరకూ ఓ టీచరు వెళ్ళాడు. ఇంకో టీచరు, లైంగిక వేధింపులు మహిళలకు 'వృత్తిపరమైన ఉపద్రవం' (ఆక్యుపేషనల్ హజార్డ్) అని నేను గుర్తించి దానితో డీల్ చేయ్యాలని అన్నాడు. అంటే ఫిర్యాదు చెయ్యటం నా తప్పు అన్నమాట. వృత్తి పరమైన ఉపద్రవం కాబట్టి అసలు అపరాధమే జరగలేదన్న మాట (రాబోయే మహిళా టీచర్‌లారా జగ్రత్త!). ఇంకొంత మంది సెలవు పెట్టి ఈ సంఘటన, ఈ వేదన మరచిపోయే వరకు ఇంటి వద్ద విశ్రాంతి తీసుకోమ్మని సలహా ఇచ్చారు. ఇంకా కొందరు ఇటువంటి సంఘటనలను బహిరంగంగా తీసుకెళ్ళడం నాకే మంచిది కాదని చెప్పారు. ఈ మాటలు విని నేను ఆశ్చర్యంతో 'క్లీన్‌బౌల్డ్ ' అయ్యాను. నాకు అర్థమైన వాస్తవం ఏమిటంటే ఈ అకడమిక్ కమ్యూనిటీ అపరాధిపై భద్రతా కవచాన్ని కప్పేసి అపరాధాన్ని సమర్థిస్తుంది. లైంగిక వేధింపుల నేరానికున్న తీవ్రతను, విస్తృతత్వాన్ని ఈ రెడీమేడ్ సమాధానాలతో కొట్టిపడేసి స్త్రీలను వేధించే పురుషాధిక్య సమాజాన్ని బలపరుస్తుంది.

జనని ఇఫ్ఎల్‌యులో అధ్యాపకురాలు

**అనువాదం. ఆర్. శ్రీవత్సన్, ఏశాల శ్రీనివాస్**

# హైదరాబాదులో నాగా విద్యార్థులు క్యాంపస్ రాజకీయాలు

■ ఎలికా అస్సుమి

మేము ప్రత్యేకంగా కనిపిస్తాము, మా దుస్తులు వేరుగా ఉంటాయి. బయటి వారితో ముఖ్యంగా మా సముదాయం కాని వారితో సంబంధాలను పెట్టుకోవటానికి కూడా కాస్త వెనకాడతాము. మాలో కొందరిని అంటిముట్టనట్లుగా వుంటారనుకోవడంలో తప్పులేదు, అయితే మాచోటుకాని పరాయి నగరంలోను, యూనివర్సిటీలో మేమిలా జీవించటానికి మా కారణాలు మాకున్నాయి. మేమిక్కడికి చెందమనే భావన మమ్మల్నెప్పుడూ వెంటాడుతుంటుంది. దానికి కొంతవరకు మా రూపం కారణమయితే మా స్వంత పట్టణాల్లో మా జీవితానుభవం కూడా మరికొంత కారణం. మేము 'బయటివాళ్ళం' అనే భావన మావైపు చూసే చూపుల్లో, ఎగతాళి, గిల్లటాల్లో, చింకీ అని మా రూపం గురించి వినపడే వ్యాఖ్యల్లో, బయటవారి పిలుపులో నిబిడీకృతమయింది. ఇటీవల నాగాల్యాండ్ కు చెందిన నా స్నేహితురాలు తాను సల్వార్, కుర్తా వేసుకున్నప్పుడు యూనివర్సిటీలో గాని, నగరంలో గాని మగవాళ్లు అంతగా తనవైపు దొంగ చూపులు చూడరు అని వ్యాఖ్యానించింది. ఆమె అన్న దానితో నేను ఏకీభవించక తప్పలేదు.

హైదరాబాదులో ఇప్పటికి దాదాపు పది సంవత్సరాల నుంచి ఉండటం వల్ల నగరంలో నేనొక నాగా పెద్దను అయ్యాను. ఏమైనా, నేను మొదటిసారి ఇక్కడకు వచ్చినపుడు ఈ నగరంలో నివాసం ఏర్పరచుకున్న వారితో కలిపి 100 మందికి మించి నాగా ప్రజలం లేము. మాలో చాలా మంది యూనివర్సిటీలో చదువుకునే విద్యార్థినులమే. దక్షిణ భారత పట్టణాలలో నాగాల జనాభా క్రమంగా పెరగటం వాస్తవం. అలాగే ఇటీవలి కాలంలో ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వచ్చే నాగా విద్యార్థినుల సంఖ్య అధికమవుతోంది.

ఇప్పుడనిపిస్తోంది, సీఫెల్ రాజకీయాలతో మా పరిచయమే సవ్యంగా జరగలేదని. ఎందుకంటే, అక్కడ పనిచేస్తున్న దళిత, ఆదివాసీ, బహుజన, మైనార్టీ విద్యార్థుల సంఘం తీసుకున్న కొన్ని అంశాలతో ఏకీభవించడం మాక్కొంచెం కష్టమయింది. షెడ్యూల్డు తెగల విద్యార్థులుగా మేము ఆ సంఘంలో సభ్యులమయిపోయాం. దాని రాజకీయాలతో కలిసి పని చేయాలని అందరు భావించాం, అయితే మేం నాగాలవటం వల్ల, మా రాజకీయాల స్వరూపం భారత దేశంతో మా సంబంధాల చరిత్రతో ముడిపడి ఉంటుంది. మా ప్రాతినిథ్యంతో వున్న సంఘం లేవనెత్తిన అంశాలకు మేము సరిగ్గా స్పందించలేదు. చాలా సార్లు సమస్య వారు రాజకీయాలు చేసే తీరు వల్ల వచ్చింది. అంతే కాదు మేము ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులను కూడగట్టడంలో పూర్తిగా విఫలమయ్యాం. మా ప్రాంతాల్లో విద్యార్థి రాజకీయాలతో మాకున్న సంబంధం, ముఖ్యంగా నాగా విద్యార్థులకి, కమ్యూనిటీ నిర్మాణానికి (విద్యార్థి వేడుకలు, సెమినార్లు మొ) లేదా విధాన నిర్ణయాలకి (విద్యార్థి సంఘాల రాజ్యాంగానికి కట్టుబడి వుండటం) లేదా విద్యార్థుల సమస్యలకి సంబంధించి చర్చలు జరపడానికి పరిమితమయింది. హైదరాబాదుకి వచ్చిన తర్వాత మాత్రమే మాకు ఒక 'ఆదివాసీ విద్యార్థి'గా ఎలా ఉండాలి, ఉన్నత విద్యా సంస్థల్లో ఆదివాసీ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యల గురించి అవగాహన ఏర్పడింది.

అయినప్పటికీ మాకు ఎదురయ్యే కొత్త సమస్యలను పరిష్కరించుకోగల పూర్తి సామర్థ్యం మాత్రం మాకు సమకూరలేదు. మాకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించటానికి విద్యార్థి సంఘాలు ఉన్నప్పటికీ, యూనివర్సిటీ యంత్రాంగాన్ని ఎదుర్కొనే పద్ధతులు మాత్రం మాకు చాలా కొత్తవి. మా 'ఇంటి బయటి' యూనివర్సిటీలో ఈశాన్య ప్రాంత ఎస్.టి.విద్యార్థులుగా పని చేయగల రాజకీయ మార్గాలు మేము ఇంకా నేర్చుకోవలసి ఉంది. కనుక నైతికంగా క్యాంపస్ లోని ఎస్.సి., ఎస్.టి., అల్పసంఖ్యాక వర్గాల విద్యార్థి వర్గాలను సమర్థించాం. కానీ క్రమంగా మేము అలా పాల్గొనటం కూడా తగ్గిపోయింది. క్యాంపస్‌లోను, నగరంలోనూ మాకు ఎదురయ్యే సమస్యలను 'నాగా పెద్దల సమితి', 'నాగా క్రైస్తవ సోదర సంస్థ(ఎస్.సి.ఎఫ్)' ద్వారా పరిష్కరించుకోవటం మొదలయింది.

చాలా సందర్భాలలో మా విద్యార్థుల సమస్యలు విద్యాపరమైనా, వ్యక్తిగతమైనా, చట్టపరమైనా వాటిలో నాగా పెద్దల సమితి జోక్యం చేసుకొని పరిష్కరించినవి ఉన్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఒక నాగా విద్యార్థినిని లైంగిక దాడికి గురికావటం ఇటీవల జరిగిన సంఘటన. దీనిని గురించి నాగా పెద్దల సమితికి తెలియజేసిన తక్షణమే, ఆమె వివరాలు బహిర్గతం కాకుండా కాపాడటానికి, ఆ బాలికను సురక్షిత ప్రాంతానికి తరలించటం జరిగింది. అన్వేషి సభ్యుల ద్వారా అందిన సకాల సహాయంతో అవసరమైన వైద్య సహాయం పొందగలిగింది. ఆ సమయంలో చాలా సంస్థలు, వర్గాలు నాగా సమితి నుంచి ఒక ప్రకటన కావాలని కోరారు. అయినా నాగా పెద్దల సమితి ఆ అమ్మాయి గుర్తింపుని కాపాడాలని, బహిరంగం చేయటం వల్ల వచ్చే 'నైతిక' ప్రశ్నల నుండీ, గుచ్చే చూపుల నుండి ఆమెని కాపాడాలని ఆ బాలిక కుటుంబ సభ్యులు గట్టిగా వేడుకున్న కారణంగా ఆ అమ్మాయి గురించి సమాజానికి తెలియజేయలేదు. ఆ బాలిక, ఆమె స్నేహితురాళ్లతో కలిసి మొదట కేసును స్థానిక పోలీసు స్టేషన్లో నమోదు చేసింది. ఆమె తన ఫిర్యాదుపై గట్టిగా నిలబడి కేసును న్యాయస్థానానికి తీసుకుపోవాల్సిందేనన్నది. నాగా పెద్దల సమితి తాను కేసు చేపట్టటానికి సుముఖంగా ఉన్నప్పటికీ, కుటుంబ సభ్యుల సహకారం లేనందున ముందుకు పోలేక పోయింది. ఆ దశలో 'నాగా పెద్దల సమితి' వెనకడుగు వేసి తదుపరి జోక్యం చేసుకోలేదు. కేసును ఉపసంహరించుకోవాలనే కుటుంబసభ్యుల వత్తిడి వల్ల, బాలిక ఫిర్యాదు చేయటానికి తగినంతగా ధైర్యం కూడగట్టుకున్నప్పటికీ, న్యాయం కోసం చట్ట మార్గాన్ని ఎంచుకోవాలని ఆమె వాదించినప్పటికీ ఆమె కుటుంబం ఆమె నోటిని నొక్కివేసింది. ఆమె మేలు కోరి తన కుటుంబం అలా చేయవలసి వచ్చిందనటంలో అనుమానం లేదు. ఎటువంటి హేతుబద్ధ, తార్కిక వాదం కూడా వారి నిర్ణయాన్ని మార్చలేదనేది వాస్తవం.

కాని వాళ్లు ఎందుకు అలా ప్రవర్తించారో నాకు స్పష్టంగా అర్థమయింది. చాలా మంది మహిళల నుండి మనం పదే పదే వినే విషయమే ఇది. ఇటీవల జాతీయ నేరాల రికార్డుల కేంద్రం ద్వారా విడుదలైన – క్రైమ్ ఇన్ ఇండియా – అనే 2012 సంచికలో తెలిసిన విషయం ప్రకారం మహిళలకు భారతదేశంలో నాగాల్యాండ్ అత్యంత సురక్షిత ప్రదేశం. అక్కడ 2011లో 23 లైంగిక దాడుల కేసులు నమోదు కాగా 2012 నాటికి ఆ సంఖ్య 21కి తగ్గిపోయిందట. అయితే, మనం గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే లైంగిక దాడులు, లైంగిక హింస, వేధింపులు వంటి నేరాలు జరిగినవన్నీ నమోదు కావటం లేదని. అంతేకాదు, నాగాల్యాండ్‌లో క్రైస్తవ నైతిక సూత్రాలచే ప్రభావితమైన సామాజిక ప్రమాణాల వల్ల అత్యాచారం పట్ల చిన్న చూపు మరింత అధికంగా ఉంటుంది. వివాహానికి ముందు లైంగిక వాంఛ, సంబంధం తప్పుగా భావించబడే సమాజంలో అత్యాచారమూ నిషేధమే. ఎవరూ దాని గురించి నోరు విప్పరు కూడా. అందువల్ల అక్కడ అత్యాచారం అనేది కానరాదు. నాగాల్యాండ్ లో ఇలాంటి సంఘటనలు చాలా ఉన్నాయని నేను విన్నాను. లైంగిక దాడికి గురిఅయిన మహిళను కొంత కాలం పాటు తలదాచుకోవడానికి దూరంగా ఉన్న వాళ్ల బంధువుల ఇళ్లకు పంపుతారు. ఆ సంఘటనను దాచటానికి కుటుంబ సభ్యులు ప్రయత్నించటం వల్ల ఈ కేసులు అక్కడ నమోదు కావటం లేదు. ఒకవేళ నమోదు అయినప్పటికీ చాలా సందర్భాలలో ఆ కేసులు న్యాయస్థానానికి వెలుపల ఇరుపక్షాల వారి మధ్య పరిష్కరింపబడతాయి. అంతేకాక హత్య వంటి చాలా తీవ్ర నేరాలకు సంబంధించిన కేసులు కూడా స్థానిక గ్రామపెద్దల ద్వారానే, సంప్రదాయ న్యాయసూత్రాల ప్రకారం పరిష్కరించబడతాయి. నేరాలు చేసిన వాళ్లు తరచుగా నామమాత్రపు జరిమానాతో, రాతపూర్వకంగా లేదా నోటిమాట ద్వారా చెప్పిన క్షమాపణతో తప్పించుకుపోతారు. వాళ్లు విధించే అతి తీవ్రమైన శిక్ష నేరస్తుడిని ఆ గ్రామం నుంచి లేదా తెగనుంచి కొన్ని

సంవత్సరాల పాటు వెలివేయటమే. కనుక నాగాల్యాండ్ లో మహిళలపై జరిగే అత్యాచారాల సంఖ్య తగ్గినట్లు చెప్పటం కపట చర్య. అది మోసం చేసే గణాంకం. రాష్ట్ర యంత్రాంగాన్ని పక్కన పెట్టినప్పటికీ లైంగిక అత్యాచారం అనే అంశం పౌర సమాజ సభ్యుల మధ్య, మరీ ముఖ్యంగా హైదరాబాద్‌లో నివసించే నాగాల మధ్య చర్చించటం చాలా కష్టమైన సమస్య. ఇటువంటి నేపథ్యంలోనే నాగా క్రిష్టియన్ ఫెడరేషన్ నాగా ప్రజలకు ప్రాతినిథ్యం వహించటం ఎంత సమస్యాపూరితమో అర్థం చేసుకోవచ్చు. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో గత అక్టోబరులో హైదరాబాదు నగరంలో నాగాలందరికి ఒక సంఘం ఏర్పడటానికి ఒక తీర్మానం ఆమోదించబడింది. ఈ సంఘ ప్రధాన ఆశయం హైదరాబాద్‌లోని నాగా లందరి కోసం, వారి తరఫున జరిగేటువంటి కేసులను చేపట్టటం: అవి సంక్షేమం, క్లిష్ట స్థితి నుంచి కాపాడటం, విద్యార్థుల విషయం, న్యాయపరమైన సలహాలు, మొదలైనవి ఏవైనా కావచ్చు. మా స్వస్థలంలో రాజకీయాలకీ 'కొత్త ఇల్లు'గా భావించే హైదరాబాదు రాజకీయాలకి పెద్ద తేడా లేదనే విషయం స్పష్టంగా తెలిసింది.

బహుశా హైదరాబాద్‌లో నాగాలు ఇటువంటి తమ సమస్యలను పట్టించుకోవటానికి అనధికార మార్గాలని అవలంబించారు. కాని ఢిల్లీలో అలాకాదు. అక్కడ ఈశాన్య ప్రాంతాల వారిచే ఒక సంఘటిత అంతర్జాలం ఏర్పాటయింది. ఆలంబన కేంద్రాలు, సహాయ కేంద్రాలు నడుపుతున్నారు. కొన్ని విషయాలను బహిరంగంగా వెల్లడించకుండా రహస్యంగా ఉంచి అదుపులో ఉంచాలని కొందరంటే, మరికొంత మంది హైదరాబాద్ లోని నాగా విద్యార్థులు తమ సమస్యలను రాజకీయం చేయాలంటారు, వాటిపై బహిరంగంగా ప్రజాభిప్రాయాలను కూడగట్టాలంటారు. ఏదిఏమైనా సందర్భాలను బట్టి భిన్నమైన పరిష్కార మార్గాలు అవసరం అవుతాయి. అదే హైదరాబాద్‌లో ఉండే నాగాలు ఇంత వరకు అనుసరిస్తున్న వ్యూహం.

అది కాలక్రమంలో మరింత మంది నాగాలు నగరానికి వచ్చే కొద్దీ, ముఖ్యంగా కొత్త సంఘం ఏర్పడింది కాబట్టి, ఖచ్చితంగా మారుతుంది. మా జనాభా అధికం అయ్యే కొద్దీ మా సమస్యల రూపం మారటం తప్పనిసరి. కనుక హైదరాబాద్‌లో ఉంటున్న నాగా వర్గం వారు వేయవలసిన మలి అడుగు అల్పసంఖ్యాక వర్గాల విద్యార్థి సంఘాల వారితో సంబంధ బాంధవ్యాలను ఏర్పరచుకోవటం, వాటిని పటిష్టపరచుకోవటం. నాగా భూమిని విడచి వచ్చి బయట భూమిలో నివసిస్తున్న నాగాలుగా మనం ఎదుర్కొంటున్న సమస్యలను, మన భయాలను వారు అర్థం చేసుకోగలరు. కేవలం నాగాల కోసమే కాదు, విశ్వవిద్యాలయాల్లో ఈశాన్య ప్రాంతాల వారి విభిన్న సమస్యలను విస్తృతంగా చర్చించే స్థలాలు కావాలి. మన సంగీతం, ఆహారం, నగర జీవన విధానం, ఫ్యాషన్‌ల పట్ల అభిమానమే కాక మన రాజకీయాల పట్ల కూడా మిగిలిన వారికి ఆసక్తి పెరగటం అవసరం.

ఎలికా అస్సుమి, ఇఫ్ఎల్‌యులో పరిశోధక విద్యార్థిని

**అనువాదం : పెద్ది సాంబశివరావు**

# కనిపించని వేధింపులు - దృష్టి లోపం గల ఒక స్త్రీ దృక్పథం

## ■ రీమ్ శంషుద్దీన్

ఒక స్నేహపూరితమైన మరియు ఆరోగ్యవంతమైన క్యాంపస్‌లో ఉన్నప్పుడే ఒక విద్యార్థిని తన కలల్ని నిజం చేసుకోగలదు. ఒక ప్రజాస్వామిక వాతావరణం ఉన్నప్పుడే కొత్త ఆలోచనలు, కొత్త సిద్ధాంతాలు రూపుదిద్దుకుంటాయి. విభిన్న సంస్కృతుల సమ్మేళనంలో కొత్త సంబంధాలు మొగ్గ తొడుగుతాయి. అయితే ఈ వాతావరణం ఎప్పుడైతే ప్రతికూలమవుతుందో అప్పుడే ఒకలాంటి అభద్రతా భావం మొదలవుతుంది. ముఖ్యంగా మానసికమైన భౌతికమైన వేధింపులు ఎదుర్కోవలసి వచ్చినప్పుడు ఈ భావం మరింత ప్రబలుతుంది.

దృష్టి లోపం గల వ్యక్తులు ముఖ్యంగా స్త్రీలు ఈ క్యాంపస్‌లో ఎక్కడకు వెళ్ళాలన్నా భద్రత విషయంలో అత్యంత జాగరూకతతో ఉండాల్సిన అవసరం ఉంది. క్యాంపస్‌లో ముఖ్యంగా బయటి నుంచి వచ్చే వారితో చాలా ఇబ్బందుల్ని స్వయంగా ఎదుర్కొన్న సంఘటనలు ఉన్నాయి. ఒకసారి నన్ను నా స్నేహితురాల్ని కొంత మంది బయటి వారు కారులో వచ్చి కారులోకి బలవంతంగా లాగబోయారు. ఇలాంటి సంఘటనలు దృష్టి లోపం గల స్త్రీలను అత్యంత కలవరపరుస్తాయి. అంతేకాక కొంత మంది తమను తాము పరిచయం చేసుకోకుండా మా దగ్గరకు వచ్చి మాట్లాడటానికి ప్రయత్నిస్తారు. ఎంతో విశాల దృక్పథం మరియు సున్నితత్వం ఉంటుంది అని మనం ఊహించే క్యాంపస్‌లో కొంత మంది నుంచి ఇలాంటి వ్యవహారశైలిని ఎదుర్కోవలసి వస్తుంది. మనకు తెలియని వారి దగ్గర్నించి ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, పరిచయం లేకుండా ఫేస్‌బుక్ లాంటి సైట్లలో వ్యక్తిగత వ్యవహారాలలో అనవసరంగా కలగచేసుకోవడం లాంటి చర్యలు మనల్ని ఎవరో అనుసరిస్తున్నారు అన్న భయాన్ని కలిగిస్తాయి. ఇలాంటివి ఎవరికైనా భయం కలిగించే చర్యలే అయినా దృష్టి లోపం గల మహిళలకు రెట్టింపు భయం ఉంటుంది.

నా హక్కులని నేను పొందాలి అనుకున్న ప్రతిసారీ నేను అధికారుల నుంచి విచిత్రమైన అనుభవాన్ని ఎదుర్కొన్నాను. కొన్నిసార్లు నాకు సంబంధించిన హక్కులు ఏ చట్టంలో, ఏ క్లాజులో ఉన్నాయో సాక్ష్యాలు చూపించమని అడుగుతారు.

అంగవైకల్యం గల వ్యక్తులు ఎవరూ కూడా ఇలాంటి చేష్టలని ఎదురు తిరిగి ప్రశ్నించరు – మౌనంగానే తమ సాక్ష్యాలను అధికారులకి సమర్పిస్తారు. దృష్టి లోపం గల మహిళలు బాహ్య సమాజంలో కలవాలంటే ఎంతో కష్టపడాల్సి వస్తుంది. సాంఘికంగాను, సాంస్కృతికంగాను మరియు విద్యాపరంగా ఆమెను గుర్తించడం, మరియు అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతున్న సమాజంలో ఆమెను కలుపుకోవడం చాలా కష్టంతో కూడుకున్న పని. దృష్టి లోపం గల స్త్రీలు అనేక రకాల అవమానాలు ఎదుర్కోవలసి వస్తుంది. వారికి ఏ పనీ చేయడం రాదని రోజువారీ పనులు కానీ, పిల్లల్ని పెంచడం, ఇంటి పని చేయడం లాంటివి కానీ వాళ్ళు చేయలేరని ఒక అపవాదు ఉంది. అంతేకాక వీరిని, ఏమీ తెలియని అమాయకులని, అసహాయులను చేసి, వీరికి చుట్టు ఉన్న ప్రపంచంపై ఎలాంటి పరిజ్ఞానం లేని వారిగా జమ చేయడం జరుగుతుంది. తెలిసో, తెలియకో బహిరంగంగానే వీరిని హేళన చేయడం సాధారణమైన విషయమే. ఇందులో ఎక్కువ చేసి చెప్తున్నది ఏమీ లేదు. ఇలా హేళన చేసే వారిలో ఇదే కమ్యూనిటీకి చెందిన పురుషులు కూడా ఉంటారు. ఎందుకంటే కొన్ని అపవాదులు స్త్రీలపై మోపడానికి కారణం కొన్ని రకాల పనులు కేవలం స్త్రీలే చేయాలని సమాజం కోరుకుంటుంది కాబట్టి. ఇతర స్త్రీలకు లాగానే దృష్టి లోపం గల స్త్రీలు కూడా వివాహం మరియు ఇతర సంబంధాలలో మోసపోవడం లాంటివి జరుగుతాయి. చెప్పాలంటే, ఇలాంటి ఉచ్చులో పడ్డ ఈ స్త్రీల సంగతి చాలా దారుణంగా ఉంటుంది.

*రీమ్ శంషుద్దీన్ హైదరాబాదు విశ్వవిద్యాలయ విద్యార్థిని*

**అనువాదం : డి. సుజాత**

# కుచ్ కుచ్ హెూతాహై

## ■ అంజలి పాథియాత్

కుచ్ కుచ్ హెూతాహై (1998)లో కరణ్ జోహర్ రచన మరియు దర్శకత్వంలో షారూఖ్ ఖాన్, కాజోల్ మరియు రాణి ముఖర్జీలతో రూపొందించిన ఒక హిందీ ప్రేమకథా చిత్రం. ఈ సినిమాలో రాహుల్, అంజలి మరియు టీనా అనే ముగ్గురి మధ్య జరిగే ఒక ముక్కోణపు ప్రేమ కథను, వారి కాలేజీ జీవితం, తరువాత జరిగే సంఘటనల నేపథ్యంలో వర్ణించటం జరుగుతుంది.

1990లలో, కొత్త రకమైన సినిమా తీసే ప్రక్రియలతో 'కొత్త తరం' దర్శకులు అని పేరు పొందిన ట్రెండ్‌ని మొదలు పెట్టిన దర్శకుడు కరణ్ జోహర్. అన్ని జోహర్ సినిమాల్లో లాగే దీనిలో కూడా, విదేశీలోకేషన్స్, పట్టణ కాస్మోపాలిటన్ సంస్కృతి, ఉన్నత మధ్య తరగతికి చెంది పాశ్చాత్య దుస్తులు ధరించినప్పటికీ, మనసు మాత్రం 'భారతీయత'కే అంకితం చేసే యువతరం మనకు కన్పిస్తుంది. భారతీయ సంస్కృతిలో ఒకమ్మాయి, ఒకబ్బాయి ఎప్పటికి 'స్నేహితులుగా' మాత్రమే ఉండటం అసాధ్యం అంటూ భారతీయులు చాలా ఇష్టపడే సూరజ్ బర్జత్య తీసిన సినిమాలతో విభేదించి వారు 'ప్రాణ స్నేహితులు' కావచ్చని చాటి, సంప్రదాయ జండర్ పాత్రలను కూలదోసిందీ సినిమా. సినిమాలో అంజలి పాత్రకి స్కర్టుల కన్నా జీన్స్, అల్లికల కన్నా బాస్కెట్ బాల్ ఆడటం ఎక్కువ ఇష్టం, అందువల్ల రాహుల్‌కి అమె అంటే ప్రేమాసక్తి ఉండదు. ఎప్పుడైతే ఆమె ఈ రూపాన్ని వదిలి ఒక అచ్చమైన భారతీయ స్త్రీలా చీరకట్టి, పొడవాటి జుట్టు పెంచుకుంటుందో అప్పుడు అతడు ఆమెకి ఆకర్షితుడవుతాడు. స్త్రీ, పురుష పాత్రలలో వచ్చిన ఈ మార్పులు ఒక అధునాతన, ఆధునిక, ప్రగతిశీల దర్శకుడిగా పేరున్న వ్యక్తి తీసిన సినిమాలు మనం గమనిస్తే, మన సమాజంలోని జండర్ నిబంధనల దృఢత్వం గురించి మనకి అవగాహన వస్తుంది. 'ఒక ఆడపిల్లకి ఉండ వలిసిన లక్షణాలు' అంజలి పాత్రలో లేకపోవడం వల్ల, అంజలికీ, రాహుల్‌కీ, 'లైంగిక ఆకర్షణ' లేని స్నేహం కుదుర్తుంది. కొన్ని సంవత్సరాల మార్పుల తరువాత, ఇద్దరూ ఎప్పుడైతే కలుస్తారో, అప్పుడు ఒకరికొకరు ఆకర్షితులవుతారు. అది చూపించటానికి వర్షం, వర్షంలో నృత్యాలు, జాలువారే చీరలు, చలి గాలులు వంటి వాటిని సినిమా బాగా వాడుకుంది. మాటరాని మౌనాలు, దొంగ చూపులు చాలవన్నట్లు. అంతేకాదు, ఇద్దరికీ స్వంత వ్యక్తిత్వాలు ఉన్నప్పటికీ పురుషుడు మాత్రమే ప్రేమ విషయంలో ముందడుగు వెయ్యటం గమనార్హం.

చాలా సంవత్సరాల తరువాత ఈ సినిమాని మళ్ళీ చూసినప్పుడు నాకు అర్థమయిందేంటంటే, ఈ సినిమా నీతి ఒకటే- సామాజిక కట్టుబాట్లు, శృంగారం, ప్రేమ వంటి విషయాలపై సంఘంలో, సినిమా ద్వారా కూడా వ్యాపించబడే ఆధిపత్య పూరిత ఆలోచనలు, నైతిక విలువలు కలిసి, ఏ అమ్మాయి అయినా సమాజం చెప్పే స్త్రీత్వానికి కట్టుబడకపోతే, ఆమెని ఒక 'ఫ్రెండ్ జోన్' (అంటే ఆకర్షణీయంగా లేని స్త్రీ)లోకి నెడతాయి అని. మరోలా చెప్పాలంటే, ఈ సామాజిక, లైంగిక కట్టుబాట్లకు లోబడని స్త్రీలకు ప్రేమ దొరకటం, పెళ్ళి జరగటం చాలా కష్టమవుతుంది అన్నమాట. పాత్రలని ఆధునిక, పట్టణ ప్రాంత భారతీయ యువతగా చూపినా, చివరకు సినిమా సుఖాంతం అయ్యేది సవాలు చేసిన లైంగికతను, సంబంధాన్ని 'లైన్లోకి' తెచ్చి, భారతీయ సంస్కృతిని పునరుద్దరించి, ఆధిపత్య ధోరణి స్త్రీ-పురుష సంబంధాలకి పెద్దపీట వేయటం తోటే. కొన్ని విషయాల్లో పాశ్చాత్య, ఆధిపత్య ధోరణి చూసినా, జండర్ వైవిధ్యం విషయంలోనూ, మరికొన్ని సందర్భాలలోను పురాతన, సాంప్రదాయ దృక్పధమే కనిపిస్తుంది ఈ సినిమాలో.

*అంజలి ఫాథియాత్ ఇంగ్లీష్ మరియు ఫారన్ లాంగ్వేజస్ యూనివర్సిటి విద్యార్థిని*

**అనువాదం- నిర్మల బిలుక**

## మౌలానా ఆజాద్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థినుల అభిప్రాయాలు

### అంబిలి

మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీలో కొత్తగా చేరిన విద్యార్థినిగా ఈ యూనివర్సిటీలోని ఇతర అమ్మాయిలు ఈ యూనివర్సిటీ గురించి ఏ విధంగా ఆలోచిస్తున్నారో తెలుసుకోవాలనుకున్నాను. ఇంటర్మీడియట్ అమ్మాయిలు తమ హాస్టల్‌కు సాయంత్రం ఏడు గంటల వరకు, రీసెర్చ్ స్కాలర్స్ ఎనిమిది గంటల వరకు చేరుకోవాలి. ఇలాంటి నిబంధనల వల్ల అమ్మాయిలు హాస్టల్‌కు చేరుకోవలసిన సమయం గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారు. రజియ (పేరు మార్చబడింది) స్పందిస్తూ "హాస్టల్‌కు చేరుకోవలసిన సమయం అనే అన్యాయమయిన నిబంధనల వల్ల లైబ్రరీని ఉపయోగించుకొనే అవకాశం కోల్పోతున్నాం. అమ్మాయిలు లైబ్రరీని సాయంత్రం ఏడు గంటలకు వదిలివేయాలి కానీ అబ్బాయిలు మాత్రం రాత్రి పన్నెండు గంటల వరకు చదువుకోవచ్చు". గీత అభిప్రాయాలు భిన్నంగా ఉన్నాయి. "హాస్టల్‌లో ఉన్నంత సేపు ఇంట్లో ఉన్నట్టుగా అనిపిస్తుంది. సరయిన కార్యనిర్వహణ కోసం మనందరి ఇళ్ళలో కూడా నిబంధనలుంటాయి" అని అభిప్రాయపడింది. "మేము ఈ క్యాంపస్ మరియు హాస్టల్‌లో చాల సేఫ్‌గా ఉన్నామంటే సమర్థవంతమయిన సెక్యూరిటీ, కఠినమైన నిబంధనలే కారణము" అని ఉమయిజా కూడా అభిప్రాయపడింది.

యూనివర్సిటీ ఆరోగ్య కేంద్రం యొక్క సమయం ఇంకొక సమస్య. ఇది పని దినాలలో పగలు పది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేస్తుంది. శనివారం నాడు పగలు రెండు గంటలు పనిచేస్తుంది. ఆదివారం సెలవు. సాయంత్రం మూడు గంటల నుండి ఐదు గంటల వరకు మాత్రమే లేడీ డాక్టర్ అందుబాటులో ఉంటారు. "ఆరోగ్య కేంద్రం సేవలు పనిదినాలలో రాత్రిపూట, సెలవు రోజులలో వంటి అత్యవసరమయిన సమయాలలో అందుబాటులో లేవు"అని అయేషా విచారం వ్యక్తం చేసింది. ఈ అభిప్రాయంతో యూనివర్సిటీ లోని చాలా మంది అమ్మాయిలు ఏకీభవించారు.

ఇక్కడ అమ్మాయిలు బుర్కా లేదా హెడ్ స్కార్ఫ్‌లను ధరించడానికి ప్రాధాన్యత నిస్తారు. నేను వారి అనుభవాలను తెలుసుకోవాలనుకున్నాను. "పరదా వేసుకోకుంటే అమ్మాయిలను తొందరగా గుర్తిస్తారని, వారిని అదేపనిగా చూస్తారని, అనుచితమయిన కామెంట్స్ చేస్తారని" ఒక విద్యార్థిని చెప్పింది. కానీ ముస్లిమేతర అమ్మాయిలకు ఇలాంటి సమస్య లేదు. "సరయిన పరదా లేకుండా, హెడ్ స్కార్ఫ్ మాత్రమే ధరించే కొంత మంది అమ్మాయిలను తరగతి గదులలో మరియు లైబ్రరీలోను తదేకంగా చూస్తారు, కొంత మంది విద్యార్థులు వారిని ఆశ్చర్యంగా కూడా చూస్తారు" అని సెరీన చెప్పింది. ఇక్కడ అమ్మాయిల పరదా, అబ్బాయిలని నిరుత్సాహపరుస్తుందని, తమకు అదే రక్షణ అనే భావనతో ఉన్నారు.

యూనివర్సిటీ చాలా సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమాల్లో పాల్గొనటానికి స్త్రీలను కూడా ప్రోత్సహిస్తారు. "అమ్మాయిలు, అబ్బాయిలకు కూడా ఆటస్థలాలు ఒకటి కావటంతో మేము ఈ కార్యక్రమాలలో పాల్గొనేటప్పుడు అబ్బాయిలు మాపై కామెంట్స్ చేస్తారు. చాలా మంది అమ్మాయిలు ఈ విధమయిన అసభ్య వ్యాఖ్యలు చేస్తారనే భయంతో మరియు సిగ్గుతో ఈ ఆటలలో పాల్గొనటానికి ఇష్టపడరు. క్రీడా విభాగంలోని అధికారుల వైఖరి కూడా అమ్మాయిలకు వ్యతిరేకంగా ఉంది" అని మరియా చెప్పింది. అమ్మాయిల హాస్టల్‌లో టేబుల్ టెన్నిస్, టెన్నిస్, జిమ్ సదుపాయాలు ఉన్నప్పటికీ ఎవరూ కూడా వాటిని ఉపయోగించుకోవటం లేదు. అమ్మాయిలకు ఇలాంటి ఆటలతో పరిచయం లేకపోవడం వారు ఆడకపోవడానికి కారణం కావచ్చు. "యూనివర్సిటీ అమ్మాయిల ఇష్టా అయిష్టాలను తెలుసుకుని, అందుకు అనుగుణంగా మాత్రమే సదుపాయాలను కల్పించాలి. వారికంతగా పరిచయం లేని అబ్బాయిల ఆటలను ప్రవేశ పెట్టడం అమ్మాయిలను ప్రోత్సహించదు" అని ఒక విద్యార్థిని వ్యాఖ్యానించింది. మౌలానా ఆజాద్ విశ్వ విద్యాలయం అమ్మాయిలకు రక్షణ కల్పించినప్పటికీ, సరైన భద్రత కల్పించినట్టు లేదు. ఈ యూనివర్సిటీ అమ్మాయిల మరియు అధికారుల అవగాహనలు కూడా విస్తరించాల్సిన అవసరం చాలా ఉంది. ఇది యూనివర్సిటీలోని అమ్మాయిల సర్వతోముఖ అభివృద్ధికి దోహదపడుతుంది.

*అంబిలి-మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయ విద్యార్థిని*

అనువాదం : రాజ్‌కుమార్ ఎలిగెడి

# క్యాంపస్‌లో స్త్రీ పురుషుల అస్థిత్వ రూపకల్పన : 'సై' మరియు 'హ్యాపీడేస్' చిత్రాలలో ఆకర్షణ, అధికారం

■ వెన్నెల

'క్యాంపస్ అనగా నేడు మనం చెప్పుకుంటున్న అర్థం, ఒక కాలేజ్ లేదా విశ్వవిద్యాలయం యొక్క భవంతులు మరియు మైదానాలు. ఈ పదం యొక్క భాషాశాస్త్ర పూర్వోత్తరాలు గమనిస్తే, 'క్యాంపెయిన్' మరియు 'ఛాంపియన్' వంటి పదాలతో దగ్గర సంబంధాలున్నాయి. అయితే ఈ సంబంధం తటస్థమైంది కాదు. ఈ పదానికున్న చరిత్ర 'క్యాంపస్'కు 'యుద్ధభూమి'కి గల అంతర్గత సంబంధాన్ని సూచిస్తుంది.

క్యాంపస్ అనే దానికి, ఇతర నిర్వచనాలతో పాటు, ప్రధానంగా విద్యార్థీ, విద్యార్థినుల, అస్తిత్వాల రూపకల్పన చాలా చురుగ్గా సాగుతూ, మారుతూ, తిరిగి సరికొత్తగా రూపొందింపబడే క్షేత్రంగా చెప్పవచ్చు.

అసలు 'క్యాంపస్' అంటే ఏమిటి? అనేది నేడు హఠాత్తుగా అందరికీ ఆసక్తి కొలుపుతున్న ప్రశ్న. ఎందుకంటే కాలంతోపాటు క్యాంపస్ అర్థం కూడా మారుతూ వచ్చింది. అలాగే స్త్రీ పురుషులను, ఒక సమాజంగా మనం చూసే దృష్టిలో కూడా చాలా మార్పు వచ్చింది. విద్యార్థులకు, యాజమాన్యాలకి మధ్య, మళ్ళీ స్త్రీ, పురుషుల మధ్య గల అధికార అసమతౌల్యత సమస్యాత్మకంగా మారింది. నేడు క్యాంపస్‌లో రూపుదిద్దుకునే విద్యార్థుల ప్రవర్తన, వారి ఆలోచనాధోరణి, అక్కడితో ఆగిపోవు అవి సమాజంలో వ్యాప్తి చెందుతాయి.

1950వ దశకం నుండి నేటి వరకు, క్యాంపస్ నేపథ్యంలో ఎన్నో జనాదరణ పొందిన తెలుగు సినిమాలు వచ్చాయి. రాజకీయ కుట్రలు, చారిత్రక ప్రేమ గాథలు, హృదయానికి హత్తుకునే స్నేహబంధాలు మరియు సమసమాజ నిర్మాణాన్వేషణ వంటి అనేక అంశాలు ఈ క్యాంపస్ నేపథ్యంలో కథలుగా, చిత్రాలుగా మలచబడ్డాయి. మన చలన చిత్రాలలో స్త్రీ పురుష వ్యక్తిత్వ చిత్రీకరణ ఏ రకంగా ఉంది, నిజ జీవితంలో ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే అంశాలు విశ్లేషించటమే ఈ వ్యాస ఉద్దేశ్యం. ప్రత్యేకించి 'సై' మరియు 'హ్యాపీడేస్' అనే రెండు ఇటీవల విజయవంతమైన చిత్రాలలో, జండర్ రాజకీయాల గూర్చి చర్చిద్దాం.

'సై' కి అర్థం అవును. తయారు. అని. రెక్కలు (వింగ్స్), గోళ్ళు(క్లాస్) అనే రెండు వైరి వర్గాలుగా విడిపోయిన క్యాంపస్ కథ ఇది. భిక్షు యాదవ్ అనే రౌడీ క్యాంపస్‌ను అక్రమంగా ఆక్రమించాలని పథకం వేయడంతో, ఈ కథ ఊహించని మలుపు తిరుగుతుంది. 'వింగ్స్'కు చెందిన పృథ్వీ (చిత్ర కథా నాయకుడు), 'క్లాస్' కు చెందిన శశాంక్ తమ అంతర్గత కలహాలను ప్రక్కన బెట్టి, భిక్షూయాదవ్‌ను, ఒక ఫుట్‌బాల్ ఆటలో ఓడించి తమ క్యాంపస్‌ను ఎలా రక్షించుకుంటారనేది కథలో ప్రధానాంశం.

కథానాయిక ఇందు, వేరే కాలేజీ నుండి బదిలీ అయి వచ్చి, వీళ్ళ కాలేజీలో చేరుతుంది. విద్యార్థులకు, రౌడీలకు మధ్య జరిగే ఉత్కంఠ భరిత పోరాట సన్నివేశాల నడుమ, ఇందూ, పృథ్వీల ప్రేమ సన్నివేశాలు కాస్త హాయిని కలిగించి, హాస్యాన్ని పండిస్తాయి. ఈ సినిమా ఆరంభంలోనే, కాలేజ్ క్యాంపస్, 'వింగ్స్'కి, 'క్లాస్' కి మధ్య జరిగే యుద్ధానికి క్షేత్రం అని, ఇది అక్కడ అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం అని వీక్షకులకు సూత్రధారి తెలియ చేస్తాడు. క్యాంపస్ అనేది చదువు కోసమే కాక, వ్యక్తిగత కక్షలు తీర్చుకునే స్థలం అనే విషయం విశదపరిచాక, కథనాయిక ఇందూని పరిచయం చేస్తారు. తన తండ్రికి కోఎడ్యుకేషన్ కాలేజీలు అంటే భయమని, అక్కడ చదివిస్తే తాను ఎవరితోనైనా ప్రేమలో పడతానని ఆయన భయం అని ఇందూ తన స్నేహితురాలికి చెపుతుంది. అంటే కోఎడ్యుకేషన్ కాలేజ్‌లో చదివే అమ్మాయి, నిత్యం తన తల్లితండ్రుల నిఘాని ఎదుర్కోవలసి ఉంటుంది. తండ్రంటే భయపడే ఇందు పృథ్వీ తన వెంట పడి వేధిస్తున్నా, తండ్రికి ఎదురు పడి చెప్పలేక, అనుమానపు తండ్రి వద్ద ఈ విషయం దాచిపెట్టి పృథ్వీ అల్లరిని భరిస్తూ ఉంటుంది.

'వింగ్స్' కి, 'క్లాస్'కి ఉన్న పాత కక్షలకు తోడు ఇందూ తన ప్రమేయం లేకుండానే కొత్త కక్షలకు కేంద్ర బిందువుగా మారటాన్ని చిత్రంలో చూడవచ్చు.

ఒక ఉద్రిక్తపరిచే సన్నివేశంలో ఇందూని, 'క్లాస్' జట్టుకి చెందిన విద్యార్థులు బస్సులో వెంటాడి పట్టుకుని, ఆమెను తిడుతూ తరగతి గదికి ఈడ్చుకు రావటం, ఆమె వాళ్ళని ఎంత ఏడ్చి మొత్తుకుని వేడుకున్నా వదలకుండా ఆమె వీపు కింద భాగంలో ఒక పచ్చబొట్టు పొడవటం చూపిస్తారు. 'వింగ్స్' జట్టు వాళ్ళు, ఆమె తమ జట్టులో కాబోయే సభ్యురాలు అని ఆమెను వచ్చి రక్షించేలోపే ఇవన్నీ జరిగిపోతాయి. బలవంతంగా పచ్చబొట్టు పొడవటమనేది, శారీరకంగా బాధించే విషయమే కాక, మానసికంగా గాయపర్చే అవమానకర చర్య. ఆ తర్వాత ఆ సినిమాలో, ఎక్కడా ఈ పచ్చబొట్టు ప్రస్తావన రాదు. కానీ ఆ సన్నివేశంలో పచ్చబొట్టు పొడిచిన పృథ్వీ, శశాంక్‌తో 'ఇంక అరవకు నీ సరుకుని నేను కల్తీ చేసేశా... నేను మగవాడిని కాబట్టే, ముద్ర వేయగలిగా అంటాడు'. తన మగతనాన్ని, బలాన్ని నిరూపించుకోవటానికి ఒక స్త్రీ శరీరాన్ని వాడుకోవటం అనేది ఈ సినిమాలో చాలా సన్నివేశాల్లో కనపడే దురదృష్టకర అంశం.

సినిమా అంతా పృథ్వీని తెలివిగల వాడిగా, చిలిపి వాడిగా, ఎత్తుకు పై ఎత్తు వేయగల వాడిగా చూపిస్తారు. ఇందూని మాత్రం మందమతిగా, లైంగికేచ్ఛ లేని చిన్నపిల్లలా చూపిస్తారు. చాలా తెలుగు సినిమాల్లోలాగే ఇక్కడ కూడా కథానాయిక శృంగారపరంగా ఆకర్షణీయంగా ఉంటూనే, లైంగికేచ్ఛ ఎరుగకపోవటం, కవ్వించే శరీరాన్ని కలిగీ, అమాయకంగా ఉండటం, ఏదైనా పసితనం వదలకపోవటం, వంటి గుణాలన్ని కలిగి ఉంటుంది. ఇందూకి, పృథ్వీకి మధ్య గల బలవంతపు ప్రేమాయణం, వీక్షకులకు ఒక ఆదర్శప్రియురాలి గూర్చి చాలా ఇబ్బందికరమైన సంకేతాలను అందిస్తుంది. ప్రియుడి ప్రేమను పొందాలంటే ఇందూ లాంటి వాంఛనీయమైన యువతి కూడా కొద్దో గొప్పో అవమానాలు, హింస భరించి సర్దుకు పోవల్సిందే అని చెప్తుంది.

క్యాంపస్, విద్యార్థులు హింసని మౌనంగా ప్రేక్షకుల్లా చూసి భరించే స్థలం అవుతుంది. క్యాంపస్‌లో ఒక అబ్బాయి శక్తివంతమైన మగవాడిగా నిరూపింపబడాలంటే ఒకమ్మాయి ప్రేమని గెల్చుకుని ఉండాలి. అలాగే అమ్మాయిలు క్యాంపస్ లో ప్రేమింపబడాలంటే అవమానాలను, హింసను భరించే శక్తిగలవారై ఉండాలి.

ఇందు, పృథ్వీని ప్రేమించటం మొదలుపెట్టాక అసలు తిప్పలు మొదలవుతాయి. ఇందూ ఉన్న గ్రూప్ లీడర్ అయిన శశాంక్ ఆమె తన గ్రూప్‌లో సభ్యురాలు అయినందున ఆమెని తన ఇంటి మనిషిలా మందలిస్తూ 'నీకు మన శత్రువర్గం వాడైన పృథ్వీతో ప్రేమ ఏంటి?' అని నిలదీస్తాడు. తమ కక్షలు, పగలు తీర్చుకోవటానికి స్త్రీలను పందెపు పావులుగా, సరిహద్దులు నిర్ధేశించే రేఖలుగా వాడుకోవటం సినిమాల్లో కొత్తేం కాదు. కానీ ఇదే పాతబడ్డ సూత్రాన్ని క్యాంపస్ లాంటి సామాజిక స్థలంలో పెట్టినపుడు – క్యాంపస్‌లో అన్నిటికన్నా శక్తివంతమైనది, ఆకర్షించేది, అసూయగొల్పేది, ఒక అమ్మాయిని పొందటమే అన్న విషయం బలంగా ప్రతిపాదితమవుతుంది. ఒక అమ్మాయిని గెల్చుకోవడం అంటే ఆమె ప్రేమను పొందటం, చాలా చొరవ గల, తెలివిగల, అసూయ పుట్టించే విషయంగా చిత్రీకరింపబడింది.

ఒక పురుషుడి మగతనాన్ని, శక్తిని ఈ విధంగా నిరూపించే ప్రయత్నంలో స్త్రీ ఉనికి కేవలం ప్రేక్షకురాలిగా, మధ్యవర్తిగా మిగిలిపోతుంది. చిత్రంలోని సన్నివేశాలన్నీ ఒక పురుషుడు హీరో అవ్వాలంటే, ఈ ప్రవర్తనే సరి అయినదని బలంగా నిర్దేశిస్తుంటాయి.

2007 సంవత్సరంలో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన 'హ్యాపీడేస్' చిత్రం ప్రేక్షకులకు ఒక భిన్నమైన క్యాంపస్‌ను దర్శింపచేస్తుంది. ఇంజనీరింగ్ కాలేజ్‌లో చదువుకునే ఒక స్నేహితుల జట్టు కథ ఇది. వారు చదువుకున్న ఆ నాలుగేళ్ళ కాలంలో క్యాంపస్‌లో వారి జీవితం ఎలా మొదలయ్యి ఏఏ మలుపులు తిరిగింది అనేది చిత్ర కథాంశం. ఈ సినిమాలో సీనియర్ విద్యార్థులు కొత్త విద్యార్థులను ర్యాగింగ్ చేయటం, ఇంజనీరింగ్ చదువులో తరచూ వాడే పదజాలం లాంటి సుపరిచిత అంశాలన్నీ ఉంటాయి. ఫ్రెషర్స్ పార్టీలు, పరీక్షల ఒత్తిడి, స్నేహితుల మధ్య త్యాగాలు, తగాదాలు, కొట్లాటలు, వెన్నుపోట్లు ఇవన్నీ కథలో ఇమిడి ఉంటాయి.

ఒక ఇంజనీరింగ్ కాలేజ్ క్యాంపస్‌లో గడిపే నాలుగేళ్ళ కాలంలో ఒక విద్యార్థి వ్యక్తిత్వం ఏ విధంగా రూపుదిద్దుకుంటుంది అనేది హ్యాపీడేస్ చిత్ర కథ.

‘హ్యాపీడేస్’ చిత్రం చూపించే కాలేజ్ క్యాంపస్ స్త్రీ, పురుషుల గురించి అనేక రకాల మూస ధోరణులతో నిండి ఉంటుంది. ప్రధాన పాత్రలో ముగ్గురమ్మాయిలు ఉండగా, మాధురిది కథానాయిక పాత్ర. ఇంకొక అమ్మాయి అప్పు. కళ్ళజోడు, పొట్టిజుట్టు, ప్యాంటు, షర్టులతో అబ్బాయిలా ఉంటుంది. అత్యాధునికంగా పాశ్చాత్య దుస్తులు ధరించే ‘శ్రావ్స్’ హాట్ అండ్ సెక్సీగా పిలువబడుతుంది. మధు, చందు చిత్రం చివరలో కలుసుకుంటారు. అప్పు, రాజేష్ కూడా తమ మధ్య ప్రేమని చిత్రం చివరి భాగంలో తెలుసుకుంటారు. శ్రావ్స్ మాత్రం ఎప్పుడూ తన వెంట తిరిగే తన జూనియర్ టైసన్ ప్రేమను చిత్రం పొడుగుతా తిరస్కరిస్తూనే ఉంటుంది. ఆమెకి అప్పటికే తన క్లాస్ అబ్బాయి బాయ్ ఫ్రెండ్‌గా ఉంటాడు. ఈ జంటలన్నీ ఎలా ప్రేమను, స్నేహాన్ని కనుగొంటారు, ఒక బంధంలోని సంక్లిష్టతలను ఏ రకంగా అర్థం చేసుకుని ప్రవర్తిస్తారు అనే అంశాల చుట్టూ చిత్ర కథ తిరుగుతుంటుంది.

మొదటి రోజు కాలేజీ కొచ్చిన అప్పుని ఆమె సీనియర్స్ అబ్బాయిల వేషం ఎందుకు వేసుకున్నావని ఏడిపిస్తారు. ‘నేను ప్యాంట్, షర్టు వేసుకోను’ అని ఆమెతో ఇంపొజిషన్ రాయిస్తారు. ర్యాగింగ్‌ని ఒక హాని లేని ఆటగా తీసుకున్నా, ర్యాగింగ్ అంశాన్ని తేలిగ్గా తీసిపారేయలేం, ఎందుకంటే, ఆ సంఘటన అమ్మాయిలు ధరించే దుస్తులపై నియంత్రణను తెలియజేస్తుంది. అమ్మాయిలు ఏం ధరించాలి? అప్పుకి ఆమె సీనియర్స్ చీర ధరించాలని చెప్తారు. అసలు అమ్మాయిలు ప్యాంట్ షర్టులు వేసుకుంటే ఏమవుతుంది? అబ్బాయిల్లా కనపడతారు. కథానాయిక మధుని కూడా మొదటి రోజు ర్యాగ్ చేస్తారు. ఆమెను కాలేజీకి ఓణీ వేసుకురావాలని చెప్తారు.

ర్యాగింగ్ పేరుతో ఆడవాళ్ళు వేసుకునే దుస్తులపై ఆంక్షలు పెట్టటమనేది అంతర్గతంగా ఆడవాళ్ళు ఒక అపరిచిత ప్రేక్షక జనానికి ఎలా కనపడాలి అనే విషయంతో ముడిపడి ఉంది. ఈ అపరిచిత ప్రేక్షక జనం అంటే కేవలం పురుషులే కాదు. స్త్రీలు, పురుషులు ఇంకా సమాజంలో వర్గప్రతీకలుగా నిలిచే జనాలందరి సమూహం. చిత్రం కొంత నడిచాక ఒక సన్నివేశంలో రాజేష్, వేరే అమ్మాయి వెంటపడుతున్నాడని తెలిసి అప్పు అసూయ చెందుతుంది. ఆకర్షణీయంగా కనపడాలనే తపనతో కళ్ళజోడు తీసేసి, పెదవులకు రంగు వేసుకోవాలని ప్రయత్నిస్తుంది. కానీ ఆ ప్రయత్నం మధ్యలోనే దు:ఖం పట్టలేక ఏడ్చేస్తుంది. సౌందర్యం పై సమాజం అంతర్లీనంగా పంపే సందేశాలు శక్తివంతమైన మెదళ్ళను కూడా కదిలిస్తాయి. అలాంటిది లేత ప్రాయంలో ఉన్న ఒక అమ్మాయి, అందమైన ఆకర్షణీయమైన స్త్రీత్వానికి సమాజం ఇచ్చే ఈ కఠిన నిర్వచనాల్ని ఎలా భరించి అర్థం చేసుకుని ఎదుర్కొనగలుగుతుంది? కానీ, చిత్రం తరువాత భాగంలో అప్పు తన పూర్వపు వస్త్రధారణనే కొనసాగిస్తుంది.

నాణేనికి ఒకవైపు ‘అప్పు’ అయితే మరో వైపు ‘శ్రావ్స్’. ఆమె ఎప్పుడూ పాశ్చాత్య దుస్తులు ధరిస్తుంది. అందువల్ల గుణం లేని దానిగా కూడా ముద్ర పడుతుంది. ఒక మగ విద్యార్థి అంటాడు ‘ఆమె చాలా ‘ఓపెన్‌రా’ అందుకే అలాంటి బట్టలు వేసుకుంటుంది’ అని. అంటే లైంగికపరంగా ఆమెకి పెద్ద పట్టింపులు లేవు అని స్ఫురించేలా మాట్లాడతాడు. ఇలాంటి వ్యాఖ్యలు మన ముందు ఒక ప్రశ్నని ఉంచుతాయి. అసలు ఒక విద్యార్థిని వేసుకోదగ్గ దుస్తులు ఏమిటి? ఒక అమ్మాయి ‘మగరాయుడు’ అనో ‘గుణం లేనిది’ అనో ముద్రని తప్పించుకోవాలంటే సంప్రదాయ దుస్తులు ధరించటమే ఉత్తమం!

‘సై’ సినిమా లాగే ‘హ్యాపీడేస్’లో కూడా క్యాంపస్ అనేది విద్యార్థుల బల నిరూపణకు కేంద్రంగా మారుతుంది. పురుషులు, స్త్రీల ప్రవర్తన, నడవడిక పై పెత్తనం చూపించే స్థలం అవుతుంది. అసలు అమ్మాయిలు ఎవరితో స్నేహం చేయాలి? ఒక అమ్మాయి, తన బాయ్‌ఫ్రెండ్ కలిసి బయట తిరగచ్చా? ఒక వైరి వర్గంలోని అబ్బాయితో ఆమె స్నేహం చేస్తే దాని పర్యవసానం ఎలా ఉంటుంది?

మధుతో ఆమె సీనియర్ ఒకతను, నువ్వు ఇంకొకరితో స్నేహంగా ఉండటం నచ్చట్లేదు అని చెప్పబోతే ఆమె ‘నాకిష్టమైన వారితో స్నేహం చేసే హక్కు నాకుంది’ అని చెపుతుంది. ఈ సన్నివేశం మళ్ళీ వీక్షకులకి స్త్రీలను సరిహద్దు రేఖలుగా వాడుకోవటం అనే ఆ పాతబడ్డ ధోరణిని గుర్తుకు వస్తుంది. సీనియర్ విద్యార్థులందరికీ మధు ఒక సవాలుగా, గెల్చుకోతగ్గ బహుమతిగా, తమ శక్తియుక్తులకు పరీక్షగా నిలుస్తుంది. ఒక అమ్మాయి ఎవరితో స్నేహం ఉండాలో, ఎవరిని ప్రేమించాలో, పరాయి వాళ్ళు నిర్దేశించే ఈ క్యాంపస్ సంస్కృతి మనలని సామాజికంగా ఒక స్థితికి తీసుకొచ్చి నిల్చోపెడుతుంది. ఒక అమ్మాయికి క్యాంపస్‌లో తన కదలికలపై స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేవా? తన స్నేహితులని, ప్రియుడిని ఆమె తన అభీష్టం మేరకు ఎంచుకుంటే ఏమౌతుంది? అది సహజం కాదా? ఆమె అలా తన స్వయం నిర్ణయాల్ని తీస్కోవటం, తెలుగు సినిమా క్యాంపస్ సంస్కృతి సమర్థిస్తుందా? ఇక ముందు ‘క్యాంపస్’ పై జరిగే ఏ చర్చలోనైనా, పై విషయాలు పరిగణించి, విశ్లేషించాలి.

ఈ వ్యాసం చర్చించిన రెండు సినిమాలు సింధువులో ఒక బిందువు మాత్రమే. పై సినిమాల్లోని మూస ధోరణులు, పాత్రల ప్రవర్తన నిజానికి స్త్రీ పురుష సంబంధాలలో అంతకన్నా ప్రమాదకరమైన, రెచ్చగొట్టే ధోరణులున్న తెలుగు క్యాంపస్ సినిమాలలో ఒక చిన్న పార్శ్వం మాత్రమే !

శివ(1989), మాస్టర్(1997), చిత్రం(2000), దిల్(2003) కొత్త బంగారు లోకం (2008), 100 % లవ్ (2011) వంటి సినిమాలన్నింటిలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, బలమైన వ్యక్తిత్వం లేని నిస్సహాయ స్త్రీలనే ఆ వర్గ ప్రతీకలుగా చిత్రీకరిస్తున్నారు.

నిజానికి క్యాంపస్ అనేది విద్యార్థి, విద్యార్థినుల సొంత వ్యక్తిత్వాలు ఏర్పరుచుకుని పౌరులుగా ఎదిగే నిత్య చైతన్య స్థలి! అలాంటప్పుడు, ఇప్పటికే సమాజంలో ప్రచారంలో ఉన్న లింగ వివక్షను, అసమానతలను, క్యాంపస్‌కి కూడా వర్తింపచేసే కన్నా, మునుపు ఎన్నడూ వినని కొత్త గొంతుకలకు, భావాలకు క్యాంపస్ ఒక ప్రతీక కావాలి, ఒక సుక్షేత్రం కావాలి!

వెన్నల హైదరాబాద్ యూనివర్సిటీలో పరిశోధక విద్యార్థిని

**అనువాదం : సింగరాజు రమాదేవి**

# సావిత్రి బాయి ఫూలే అధ్యయన వేదిక ఆవిర్భావ సదస్సు

ప్రియమైన మిత్రులారా!

సావిత్రి బాయి ఫూలే ఆధునిక భారత దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని. స్త్రీలు బయట అడుగు పెట్టకూడదనే మనువాద భావజాలాన్ని ధిక్కరించి మహాత్మా జోతిబా ఫూలేతో అడుగులో అడుగువేసిన సహచరి. బ్రాహ్మణ సమాజం వెలివేసిన విధవలకే కాక సమాజం విద్య నేర్వకూడదనే బహుజన, దళిత బాలికలకి విద్య నేర్పడానికి పూనుకున్నది. వీధుల్లో అవమానాలకు, సామాజిక వెలివేతకు గురైనా సరే తాను చేపట్టిన పని నుంచి వెనక్కి తగ్గలేదు. అలాంటి సావిత్రి బాయి ఫూలే స్ఫూర్తితో ఆమె వర్ధంతి రోజైన మార్చి 10, 2013న ఉస్మానియా యూనివర్సిటీ మహిళా విద్యార్థినులు, ‘సావిత్రి బాయి ఫూలే అధ్యయనం వేదిక’ను ప్రారంభిస్తున్నాం.

ఈ వేదిక ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలను పలు కోణాలలో పరిశీలించి తదనుగుణ కార్యక్రమాలను చేపడుతుంది. విద్యార్థినులకు రోజువారి జీవితంలో అవసరమయ్యే ఇంగ్లీష్ భాషా నైపుణ్యం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించే కార్యక్రమాలను చేపడుతుంది. సామాజిక చైతన్యంతో పాటు వ్యక్తిగత చైతన్యం, స్థైర్యం, విలువలను పెంపొందిస్తుంది. విద్యార్థులు తమను తాము నిలబెట్టుకోవడానికి, టీచర్లు, ఎస్.ఐ.లు, కానిస్టేబుళ్ళు వంటి క్రింది స్థాయి ఉద్యోగాలతో సంతృప్తి చెందకుండా Civil Services, Group - I. Group - II, DL, JL, Bank Services, Central Services వంటి ఉన్నత స్థాయి ఉద్యోగాల సాధనను లక్ష్యంగా ఏర్పరుచుకునేందుకు అన్ని విధాల సహాయం చేస్తుంది. యూనివర్సిటీలో దళిత, బహుజన విద్యార్థులు తమ ఉన్నత ఆశయాలను, లక్ష్యాలను చేరుకునేందుకు అవసరమైన అధ్యయన వాతావరణాన్ని కల్పించడానికి కృషి చేస్తుంది.

మహాత్మ జోతిబా ఫూలే, సావిత్రిబాయి, అంబేద్కర్, పెరియార్ వంటి మేధావులు హిందూ పితృస్వామ్య వ్యవస్థను ధిక్కరించి చేసిన స్త్రీవాద విశ్లేషణలను ముందుకు తీసికెళ్ళే ప్రయత్నం చేస్తుంది. దళిత బహుజన సంస్కృతులను కలుషితం చేస్తున్న హిందూ పితృస్వామ్య భావజాలాన్ని తిప్పికొట్టి, దళిత బహుజన స్త్రీలను అణచివేతకు గురి చేస్తున్న వరకట్న వ్యవస్థ, గృహ హింస, బహిరంగ ప్రదేశాల్లో వివక్ష, హింస, ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకంగా పోరాడతాం!

సావిత్రి బాయి ఫూలే అధ్యయన వేదిక

# యూనివర్సిటీ క్యాంపస్‌లలో మారుతున్న కోరికల, హింసల చిత్రపటం

■ అపర్ణా నంద కుమార్

ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జె.ఎన్.యు)లో ప్రేమికురాలు తన ప్రేమని వద్దన్నదన్న కారణంతో ఆమెని దారుణంగా పొడిచి, తరువాత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఈ మధ్య స్త్రీలపై జరుగుతున్న అనేక హింసాత్మక దాడుల్లో ఒకటి మాత్రమే. అయితే, రాజధాని నట్టనడుమ, రాడికల్, ప్రగతి శీల క్యాంపస్ అని పేరున్న కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ఈ హింసాత్మక సంఘటన జరగటం దేశం మొత్తాన్నీ (అందరినీ) దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ సంఘటన తరువాత జరిగిన అనేక ఉద్వేగ భరితమయిన చర్చలలో, ఎన్.డి.టి.వి, సోషల్ నెట్ వర్క్ లో జరిగిన చర్చా కార్యక్రమం కూడా ఒకటి. ఈ కార్యక్రమంలో పలు విశ్వవిద్యాలయాలకి చెందిన పరిశోధక విద్యార్థులు – జె.ఎన్.యు నుండి శివాని నాగ్, సుమతీ పణిక్కర్, ఈ.ఎఫ్.ఎల్.యు నుండి మోహన్ ధరావత్–లతో పాటు రీనా నాథ్ వంటి థెరపిస్టులు కూడా పాల్గొన్నారు. జె.ఎన్.యులో జరిగిన విషాద సంఘటనతోపాటు, అనేక యూనివర్సిటీల్లో అంచులకి నెట్టివేయబడ్డ సామాజిక వర్గాల నేపథ్యం నుండి వచ్చిన విద్యార్థుల ఆత్మహత్యలు, కాశ్మీరీ విద్యార్థి ముదస్సిర్ కమ్రాన్ మరణం, వీటన్నింటిలో విశ్వవిద్యాలయ అధికార యంత్రాంగ పాత్ర, లైంగికత, కౌన్సిలింగ్ వంటి అంశాలన్నీ చర్చకు వచ్చాయి. ఈ చర్చలో ప్రకటితమయిన కొన్ని అభిప్రాయాలు, భావనలను చర్చించి ఈ క్రింది అంశాల విశ్లేషణని ముందుకు తీసుకువెళ్ళే ప్రయత్నం ఈ వ్యాసంలో చేస్తాను.

1) స్త్రీలపై జరిగే రోజు వారి హింసను ప్రేరేపించటంలో 'పాపులర్ సంస్కృతి' పాత్ర;

2) రొమాన్సును, అబ్సెషన్‌ను పరస్పర వ్యతిరేక విషయాలుగా అర్థం చేసుకోవటం;

3) యూనివర్సిటీ క్యాంపస్ అంటే – జండర్ పరంగా సామాజిక అస్తిత్వాలని, సంబంధాలని కొత్తగా రూపొందించుకొని, వ్యక్తీకరించుకునే పద్ధతి, కుల, ప్రాంత వర్గ పరంగా పునర్నిర్మించుకుంటున్న స్వీయవ్యక్తీ కరణ తీరులతో కలిసి పోయి ఉన్న ఒక ప్రత్యేకమైన స్పేస్.

**పాపులర్ సంస్కృతిలో కోరిక, హింస:**

జండర్ పరమయిన హింసపై జరిగే ఏ చర్చలో అయినా మొదట బలయ్యేది పాపులర్ సంస్కృతే. 2012 డిసెంబర్‌లో ఢిల్లీలో జరిగిన గ్యాంగ్ రేప్ తరువాత, ఉద్రేకం చెందిన మధ్య తరగతి ప్రజలు, పంజాబీ పాప్ గాయకుడు యో యో హనీ సింగ్ స్టేజి ప్రదర్శనలని నిషేధించాలనీ, స్త్రీల పట్ల ద్వేషంతో కూడిన పాటలు, పోర్నోగ్రాఫిక్ పాటలు రాసి, పాడినందుకు అతన్ని అరెస్టు చేసి కేసులు పెట్టాలనీ వాదించారు. జె.ఎన్.యు విషాద ఘటన తరువాత సోషల్ నెట్వర్క్ కార్యక్రమంలో కూడా చాలా మంది ఈ మధ్యే విడుదలయిన 'రాంఝనా' సినిమాని వేలెత్తి చూపించారు. రాంఝనా సినిమాలో (ఆనంద్ ఎల్.రాయ్ నిర్దేశించిన చిత్రం, 2013లో విడుదలయింది) తమిళ బ్రాహ్మణ కుర్రాడు, కాశీలో గుళ్ళో పూజారి కొడుకు, బ్రతక నేర్చిన తెలివి తేటలున్న కుందన్ (ధనుష్ పోషించాడు ఈ పాత్రని)కు మధ్య తరగతి ముస్లిం అమ్మాయి జోయా పట్ల ఉన్న 'అపరిమిత/పిచ్చి ప్రేమ' విషాదాంతమవుతుంది. జె.ఎన్.యు ఘటన జరగక ముందే చాలా మంది అంతర్జాల సమీక్షకులు, ఈ సినిమా అమ్మాయిలను వెంటబడి వేధించటాన్ని, ఉన్మాదభరితమయిన ఏకపక్ష ప్రేమను గొప్పగా చూపించి, దాన్ని ప్రోత్సహిస్తోందని తీవ్రంగా విమర్శించారు. సమీక్షకుల ఉద్దేశంలో పాపులర్ సంస్కృతికి, ముఖ్యంగా సినిమాకి ప్రజల చర్యలని, వారి పరస్పర, వ్యక్తిగత సంబంధాలని ప్రభావితం చేసే శక్తి ఉంది. పాపులర్ సంస్కృతి పితృస్వామ్యాన్ని, స్త్రీ ద్వేషాన్ని పాటించదని చెప్పటం ఇక్కడ నా ఉద్దేశం కాదు. అయితే ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే – నిజ జీవితంలో ఒక విషాద ఘటన జరగంగానే పాపులర్ సంస్కృతిని – ముఖ్యంగా ఒక సినిమాని – వేలెత్తి చూపించి – దాన్ని నిషేధించమనో, లేకుంటే దాని కంటే మంచి సినిమాలు తియ్యాలనో అనటం పరిపాటయి పోయింది. మనలో చాలా మంది సినిమాను నిషేధించటం లేదా సెన్సార్ చెయ్యటానికి అభ్యంతరపెడతామేమో గానీ, మంచి సినిమాలు తీసి స్త్రీలని సరిగ్గా చూపించటం అన్న డిమాండుని న్యాయమయింది గానే పరిగణిస్తాము. స్త్రీలను సరిగ్గా చూపించాలి అన్న డిమాండు ఆసక్తికరమయింది. అలా జరిగితే సమాజంపై అది ప్రభావం చూపుతుందని కాదు. ఈ డిమాండు సామాజిక ప్రపంచంలోని లోపాల్ని, ప్రస్తుత సామాజిక నిర్మాణాల్లోని వక్రతని, ఖాళీలని ఎత్తి చూపుతుంది కనుక. తమకనిపించే ఆయా ఖాళీలని, సినిమా సాంస్కృతిక ప్రపంచం, బయటి నుండి తెస్తున్న విలువలతో పూరించే దుస్సాహసపూరిత ప్రయత్నాలు చేస్తోంది కనుక.

తమిళంలో ధనుష్ నటించిన సినిమాలని ఆవరించుకున్న ఒక ప్రాపంచిక దృక్పథమే రాంఝనా సినిమాలో కూడా కనిపిస్తుంది. హీరో, హీరోయిన్ల మధ్య ఉండే సామాజిక సంబంధాల పట్ల స్పష్టమయిన అవగాహన కలిగి ఉండే ఈ సినిమాలు, కోరికలని, హింసని ఈ సంబంధాల మాత్రికలోనే / నేపథ్యంలోనే స్థాపిస్తాయి. నల్లగా, పొట్టిగా, సన్నగా ఉండే ధనుష్ సినిమా వ్యక్తిత్వం (పోషించే పాత్రలన్నీ), సమాజంలో క్రింది స్థాయికి చెంది, బ్రతక నేర్చిన తెలివి తేటలు, కొంత హింసాత్మక ధోరణితో, సమాజంలో తమ కంటే కొన్ని మెట్లు పైనున్న హీరోయిన్లతో, గాఢమయిన, సంక్లిష్ట సంబంధాలు కలిగి ఉండే యువకుల పాత్రలపైనే నిర్మితమయింది. తాను అనాధనయినా, ధనవంతురాలయిన తన క్లాస్ మేట్‌ని ఉన్మాద భరితంగా కోరుకునే, మానసిక వైకల్యం (సైకోటిక్) ఉన్న పాత్రను పోషించి కాదల్ కొందన్ (నేను ప్రేమలో పడ్డాను, సెల్వరాఘవన్, 2003)లో ఒక్క సారిగా స్టార్ అయిన దగ్గర నుండి '3' సినిమాలో అత్యంత పాపులర్ అయిన 'వై దిస్ కొలవరి' పాట రచన (ఐశ్వర్య ధనుష్, 2012 – జాతీయ స్థాయిలో అతనికి పేరు తెచ్చి రాంఝనా సినిమాలో హీరో పాత్ర రావటానికి కారణమయిన) వరకు, మనకు ధనుష్ పోషించిన పాత్రలలో ఒక స్పష్టమయిన క్రమం కనిపిస్తుంది. అవన్నీ తెల్లగా మెరుస్తూ, అగ్రకుల/వర్గానికి చెంది, అతని 'ప్రేమని' తిరస్కరించే (సినిమా మొదట్లోనో, కొంత మేరకయినా) హీరోయిన్‌లతో హింసా పూరితమయిన , ఉన్మాద భరితమయిన సంబంధం. ఇటువంటి సామాజిక సంబంధాల సంక్లిష్టతా చిత్రాన్ని కాదల్ కొందన్ సినిమా తెరపైకి తెచ్చినంత బాగా రాంఝనా హిందీ సినిమా తెరపైకి, ఆ సినిమా భావ మైదానంలోకి తేలేకపోయింది. అందువల్ల ఇక్కడ హింస, కోరిక, ఉద్వేగం, నిరాశ అన్నీ వ్యక్తిగత మయినవిగా మారిపోయి, పాత్రల సామాజిక నేపథ్యానికీ, సినిమాలో జరిగే విషాదభరిత కథనానికీ సంబంధం లేకుండా ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ సంక్లిష్టత, లోతు లోపించటం వల్లే, కేవలం స్త్రీ ద్వేషాన్ని, స్త్రీల పట్ల హింసను ప్రోత్సహించే సినిమాగా మాత్రమే రాంఝనాను చూడటం జరుగుతోంది. అయితే, ఈ పై (బాహ్య) పొరని పక్కకి తీస్తే, వేరు వేరు సామాజిక నేపథ్యాల నుంచి వచ్చి, పరస్పరం సంఘర్షించుకుంటున్న యువతీ యువకుల కోరికలు, ఉద్వేగాల కథలు మా గురించి చెప్పండంటూ గొడవ పెడుతూ కనిపిస్తాయి.

**ఉన్మాదభరిత ప్రేమా లేక వివేకంతో కూడిన ప్రేమా?**

సోషల్ నెట్ వర్క్ చర్చలో పాల్గొన్న సుమతీ పణిక్కర్ మాట్లాడుతూ, అబ్బాయిలు అమ్మాయిల వెంట పడటం (స్టాకింగ్ చెయ్యటం) తామంటే వారికీ ఇష్టం (ఏక పక్ష ప్రేమ) అనుకోవటం మానేసి, పరస్పరం మాట్లాడుకునే స్పేస్ కల్పించు కోవటానికి, ఒకరి నొకరు అర్థం చేసుకోవటానికి, తెలుసుకోవటానికి ప్రయత్నించాలనీ చెప్పారు. వినటానికి చాలా బాగుంది అనిపించే ఈ ప్రతిపాదనకు ఆచరణలో ఉండే సాధ్యాసాధ్యా లేమిటి? 'స్టాకింగ్' లేదా వెంటపడటం అనేది అనేక రకాల చర్యల గురించి మాట్లాడటానికి 'షార్ట్ కట్'గా ప్రస్తుతం వాడుతున్నాం. మొట్టమొదటి సారి తాను ఇష్టపడిన అమ్మాయిని దొంగతనంగా చూడటానికి అబ్బాయిలు పడే నానా ఇబ్బందుల దగ్గర్నుండి, ఉన్మాదపు అంచులలో సంచరించే అబ్బాయిల చర్యలతోపాటు, ఇంకో పక్క నేరం చెయ్యటానికి కూడా సిద్ధపడే అబ్బాయిలు సంసిద్ధత వరకూ – అన్నింటినీ 'స్టాకింగ్' అనటం వల్ల దీనిపై చర్చ కష్టంగా తయారయింది. నా స్నేహితురాలు ఒకసారి పిచ్చాపాటి మాటలు మాట్లాడుతూ, ఒకబ్బాయి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లైబ్రరీ లోపలి వరకు తన వెంట వచ్చి 'నా ఫ్రెండ్' అవుతావా? అని (అంటే తన రొమాంటిక్ ఆసక్తిని వ్యక్తపరుస్తూ) అడిగాడని చెప్తూ, 'నా కెంత కంపరమూ, భయమూ

వేసాయో తెలుసా?" అన్నది. "నా స్నేహితుడు అవ్వాలని నిజంగా అతడు భావిస్తే, బహిరంగ ప్రదేశంలో నాతో మాట్లాడవచ్చు కదా? లైబ్రరీలో పుస్తకాల ర్యాక్స్ మధ్య, ఎవరూ లేని చీకటి సందు చూసుకుని ఎందుకు అడగాలి నన్ను?" అనేది ఆమె ప్రశ్న.

ఆ సంభాషణ జరిగి కొన్ని సంవత్సరాలు అయింది. మళ్ళీ దాని గురించి ఆలోచిస్తే, నాకేమనిపిస్తోందంటే,

(1) చాలా మంది అబ్బాయిలకి తమ ప్రేమా–ఆసక్తిని వ్యక్తం చేయటం వల్ల అమ్మాయిలకి ఎప్పుడు, ఎందుకు అసౌకర్యమూ, భయం కలుగుతాయో అర్థం కాదనీ:
(2) అబ్బాయిల గుంపుల్లో – అమ్మాయిలకి 'ప్రపోజ్' చెయ్యటం, దానికి అమ్మాయిల ప్రతిస్పందనా తీరు బట్టి – ఆయా అబ్బాయిల విలువ, గౌరవం వెలకట్టబడతాయని, అందువల్ల అబ్బాయిలు రొమాన్స్ విషయంలో విపరీతమయిన 'వత్తిడి'కి లోనవుతారనే సంగతి అమ్మాయిలకి అర్థం కాదనీ. అబ్బాయిలు, అమ్మాయిలూ కలిసి చదువుకునే కళాశాలల్లో, సీనియర్లు, జూనియర్లని ర్యాగింగ్ పేరుతో, పెద్ద గుంపు మధ్య, ఒక అమ్మాయికి ప్రపోజ్ చెయ్యమని అడగటం చాలా మామూలు. ఇటువంటి పరిస్థితులున్నప్పుడు, వివేకపూరిత ప్రేమ, లేదా పరస్పర అవగాహనతో కూడిన రొమాన్స్, ప్రేమ కేవలం తమ మీద తమకి అత్యంత నమ్మకం ఉండి, పెట్టి పుట్టిన నేపథ్యం నుండి వచ్చిన యువతీ యువకులకి మాత్రమే అందుబాటులో ఉండే 'విలాసం' తప్ప వేరే వారికి సాధ్యమయ్యేవేనా?

దీనికి తోడు యుగాల తరబడి 'స్త్రీ' అనే భావన చుట్టూ గసి తేలిన అర్థాలన్నీ కలిసి 'స్త్రీ'ని మగతనం, సామాజిక ఎదుగుదల, విజయం గురించిన కథనాలన్నిటి కేంద్ర బిందువుగా నిలబెట్టాయి. ఏ పురుషులైనా ఈ కథనాల నుండి తప్పించుకోవటం కష్టం. పురుషులకి 'స్త్రీ అనే భావన' ప్రేరేపించే రక రకాల భావాలు, అనుభూతులని 'స్వాధీనం/యాజమాన్యం' పదంతో మాత్రమే అర్థం చేసుకోవటం కష్టం. ఒక యువకుడు స్త్రీ మనసుని గెలుచుకోవాలంటే, చాలా రకాల సామర్థ్యం చూపించాలి: ఆమె దృష్టిని ఆకర్షించుకోగలగాలి; తన మాటలతో ఆమెని నవ్వించగలగాలి; ఆమె దృష్టిని, వేరే వంద విషయాల మధ్యలో, తన మీదకి తిప్పుకుని, ఉంచుకోవాలి. విద్య, ఉద్యోగపరమయిన అనేక వత్తిళ్ళ మధ్యలో ఇది చెయ్యటం ముఖ్యంగా మొదటి తరం విద్యార్థులకు చాలా పెద్ద భారంగా పరిణమిస్తుంది. (స్వలింగ లైంగిన తీరువున్న పురుషులకి ఈ భారం ఇంకా ఎక్కువగా ఉంటుంది. దాన్ని అర్థం చేసుకోవటానికి వేరే చర్చ అవసరం)

**క్యాంపస్ – ఒక జండర్ స్పేస్ :**

క్యాంపస్‌లలో జరిగే జండర్ పరమయిన హింస అనేక రకాల ప్రతిస్పందనలకు దారితీస్తుంది. క్యాంపస్ సమూహాల్లో ఒక బలమయిన అభిప్రాయం ఏమిటంటే – ఇటువంటి హింస, సంఘర్షణతో కూడిన స్త్రీ పురుష సంబంధాలు అన్ని చోట్లా ఉంటాయనీ, క్యాంపస్‌లు కూడా వాటిలో భాగమేననీ, అందువల్ల యూనివర్సిటీ యంత్రాంగంగానీ, అధ్యాపకులు గానీ పెద్దగా దీని గురించి చేసేదేమీ లేదనీ; ఇంకొంత మంది క్యాంపస్ సంస్కృతి అతి స్వేచ్ఛని, ప్రగతి శీలతని, అక్రమ సంబంధాలనీ ప్రోత్సహిస్తుందనే స్టాండు తీసుకుని 'క్యాంపస్ సంస్కృతి'ని విమర్శించటానికో, కాపాడటానికో కంకణం కట్టుకుంటారు. ఇంకొంతమంది తమ కాలంలో 'ఇటువంటి' సంఘటనలు ఎప్పుడూ జరగలేదని, పాత రోజులే మంచి వనే 'నోస్టాల్జియా' కథనాల్లో బ్రతుకుతూ ఉంటారు. సోషల్ నెట్ వర్క్ కార్యక్రమంలో శివాని నాగ్ 'జె.ఎన్.యు క్యాంపస్‌లో ప్రవేశించగానే ఎవరు అకస్మాత్తుగా ప్రగతి శీలులుగా మారిపోరు' అని వ్యాఖ్యానించారు. నోస్టాల్జియా భావనని విమర్శిస్తూ చేసిన ఈ వ్యాఖ్యలో జె.ఎన్.యు అనే 'ప్రగతి శీల', ప్రజాస్వామిక ప్రాంగణం'లోకి బయటి నుండి వచ్చే విద్యార్థులు పితృస్వామిక, స్త్రీ ద్వేష భావనల్ని తీసుకు వస్తున్నారనే భావన అంతర్లీనంగా ఉంది. జరుగుతున్న సంఘర్షణలను కేవలం 'ప్రగతి శీలత' మరియు 'తిరోగామి' భావజాలాల మధ్య జరుగుతున్న సంఘర్షణగా అర్థం చేసుకుంటే, అకస్మాత్తుగా, అందరికీ తెలిసేటట్లు జరిగే హింసాత్మక ఘటనల నీడలో జరిగే రోజువారీ హింస యొక్క సంక్లిష్టతని అర్థం చేసుకునే ప్రయత్నాలకి గండి కొట్టినట్లవుతుంది. ఒక పక్క క్యాంపస్‌ని సమాజంలో భాగంగా చూడాలనే విశ్లేషకులు కూడా, ఒక దానికి ఒకటి ముడిపడి ఉన్న – పితృస్వామ్యం, పురుషుల కుండే హక్కులు, అధీన భావనలు, ఉన్మాదపూరిత ప్రేమని రొమాంటిక్ గా చూపించటం – వంటి నిర్దిష్టత లేని విస్తృతార్థంలో వాడబడే భావనలని విశ్లేషణల్లో ఎక్కువగా ఉపయోగించటం వల్ల ఈ విషయాలపై నిర్దిష్టమయిన, లోతయిన చర్చ జరగటం కష్టంగా పరిణమించింది.

జె.ఎన్.యు ఘటన వంటివి జరిగినప్పుడు పురుషాధిక్య భావజాలంతో జరిగినవనీ లేదా వ్యక్తిగత మానసిక వైకల్యాల వల్ల జరిగినవనీ అర్థం చేసుకోవటం ప్రస్తుతం కామన్ సెన్స్‌గా మారింది. వ్యక్తులు తమ తమ స్థాయిల్లో కృషి చేస్తే, ఈ భావజాలం నుండి, వైకల్యాల నుండి బయటపడొచ్చని ఈ రెండు దృక్కోణాలు నమ్ముతున్నాయి. అయితే ఈ ఘటనలని అర్థం చేసుకోవటానికి అడగాల్సిన అతి ముఖ్యమయిన ప్రశ్నని వెయ్యటానికి ఈ రెండు ఆలోచనా ధోరణులు ఉపయోగపడవు. అది ఏమిటంటే – ప్రేమలో తిరస్కరించబడితే జీవిత మంతా వృధా అనీ, ఈ తిరస్కారం వల్ల కలిగే అవమానాన్ని తనను తిరస్కరించిన యువతి రక్తం చిందించి మాత్రమే తీర్చుకోగలమనే భావన ఒక యువ విద్యార్థికి ఎందుకు కలుగుతోంది?

గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల నుండి పెద్ద పట్టణాల్లో ఉండే విశ్వవిద్యాలయ ప్రాంగణాలకి వలస వచ్చిన యువతీ, యువకులు ఇద్దరూ కూడా తాము పెరిగిన ప్రదేశాలని (హబిటాట్) మాత్రమే కాక, తమ తమ ప్రపంచాల్ని కట్టి పడేసి ఉంచిన సామాజిక నిర్మాణాలని కూడా వదిలేసి వస్తారు. అలా వదిలివేయబడిన నిర్మాణాలలో పితృస్వామ్యం, కులం, అవి పోషించే సామాజిక సంబంధాలు కూడా భాగమే. విశ్వవిద్యాలయ ప్రాంగణం కొత్త ఆశయాలను, కొత్త కోరికలను తీర్చగలిగే ప్రదేశంగా కనిపిస్తుంది. తమని తాము పునర్ నిర్వచించుకుంటూ ఈ కొత్త (ఊహా) ప్రపంచంలో తమని తాము స్థాపించుకోవటానికి వారు చేసే ప్రయత్నంలో ప్రేమను వ్యక్తీకరించటం కూడా ఒక భాగమవుతుంది. అయితే ఈ కొత్త స్పేస్‌లో ఆయా భావాలను సరిగ్గా వ్యక్తీకరించటానికి, వాటిని సమర్థించటానికి అవసరమయిన సామాజిక, భావజాల పరమయిన నిర్మాణాలు ఇంకా పూర్తిగా ఏర్పడలేదు. అసంపూర్ణ స్థితిలోనే ఉన్నాయి.

గత కొన్ని దశాబ్దాలలో, భారత దేశంలో స్త్రీవాద ఉద్యమం, స్త్రీలకు తమపై జరిగే హింసను గురించి మాట్లాడటానికి – ఇంట్లో అయినా, పని స్థలాల్లో అయినా, క్యాంపస్‌లో అయినా –హక్కులు ఉన్నాయనే విషయాన్ని అందరి దృష్టికీ తీసుకు వెళ్ళటంలో సఫలీకృతమయింది. దీని ఫలితంగా చాలా క్యాంపస్‌లలో జండర్ హింస, లైంగిక వేధింపులపై కమిటీలు ఏర్పాటయ్యాయి. కానీ ఈ కమిటీలు చాలా వరకు పని చేయవు, చేసినప్పుడు సమ న్యాయాన్ని పాటించవు. వేధింపులకు పాల్పడిన అగ్ర కుల, వర్గ పురుషులని వదిలేసి, ఈ వర్గాలకు, కులాలకు చెందని మగవారిని శిక్షిస్తాయి. అంతే కాక క్యాంపస్‌లలో ఉండే విద్యార్థి సంఘాలలో పితృస్వామిక భావజాలం ఉన్న నాయకులు ఒకరినొకరు బెదిరించుకోవటానికి లైంగిక వేధింపులను సాకుగా వాడుకోవటం వల్ల పరిస్థితులు మరింత జటిలంగా తయారయ్యి స్త్రీలు క్యాంపస్‌లలో ఎదుర్కొంటున్న హింస అజెండా నుండి కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడింది. అయితే దీనికి పరిష్కారం లైంగిక వేధింపుల చట్టాలను పక్కన పెట్టటమో లేదా వేధింపులకు గురయ్యే బాధితుల్ని పరిస్థితులని 'అర్థం' చేసుకోమని చెప్పటమో లేదా వేధింపులకు పాల్పడిన వారి సామాజిక నేపథ్యాన్ని, భవిష్యత్తుని దృష్టిలో పెట్టుకోమని చెప్పటమో కాదు. తమ రోజువారీ జీవితాలను, సంబంధాలను శాశించే అధికార మాత్రికని అర్థం చేసుకోవటం స్త్రీలకి, పురుషులకి కూడా అవసరమే. అయితే, చాలా సంస్థల్లో అనుసరించే విషయాలను తొక్కి పట్టి లేదా 'సెటిల్' చేద్దామని చూసే విధానం వల్ల ఎవరికీ న్యాయం జరగట్లేదు. 'సెటిల్మెంట్' లేదా 'ఇద్దరినీ సమానంగా శిక్షించే' పద్ధతులతో కేవలం అప్పటికప్పుడు విషయాన్ని ఎలాగోలా పరిష్కరించటం పై దృష్టి పెట్టటం జరుగుతోంది.

ఇటువంటి పరిస్థితుల్లో, విశ్వవిద్యాలయ అధికార యంత్రాంగాన్ని ఈ హింసాత్మక ఘటనలకు బాధ్యత వహించాలని మనం ఎందుకు అడుగుతున్నాం? వాళ్ళేం చెయ్యగలరు? ఇటీవల కాలంలో యూనివర్సిటీ యంత్రాంగానికి 'సమర్థవంతమైన పాలన' అన్నది మంత్రంగా మారింది. స్కాలర్‌షిప్‌లు ఇవ్వటం, రిజర్వేషన్లు కల్పించటం, అంగ వైకల్యం ఉన్నవారికి ఫెలోషిప్ ఇవ్వటం, ర్యాగింగ్‌లకు, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా కమిటీలు వెయ్యటం, కౌన్సిలింగ్ సెంటర్లు ఏర్పాటు చెయ్యటం అన్నింటినీ, వేగంగా మారుతున్న విద్యార్థి నేపథ్యాలని అర్థం చేసుకోకుండా, విధానాల్లో, బోధనా పద్ధతుల్లో నిర్మాణాత్మక మార్పులు తేకుండా యాంత్రికంగా అమలు చేస్తున్నారు. దీనివల్ల, క్యాంపస్లు, వివిధ వర్గాల, కులాల, లింగాల, లైంగిక తీరులు ఉండే విద్యార్థులు ఒకరినొకరు తెలుసుకుని, ప్రభావితం చేసుకుని, అర్థం చేసుకునే స్పేస్‌గా కాకుండా, యూనివర్సిటీ యంత్రాంగానికి అనుగుణంగా 'సమర్థవంతమైన పాలన' పేరుతో విద్యార్థులను కొన్ని 'వర్గాలకు' కుదించి వేసే స్పేస్‌గా మారుతున్నాయి. ఈ పాలనాపరమైన ఆత్రుత, అనేక కాలేజి, యూనివర్సిటీ క్యాంపస్‌లలో విద్యార్థినుల కదలికలపై, తరగతి గదుల బయట అబ్బాయిలు, అమ్మాయిలు మాట్లాడుకోవటం పై ఆంక్షల రూపంలో వ్యక్తమవుతుంది. యూనివర్సిటీ పాలనా యంత్రాంగం విద్యార్థులని ఒకరి నుండి ఒకరు నేర్చుకోగలిగే పరిణితి చెందిన, చెందుతున్న వ్యక్తులుగా చూడటానికి ఇష్టపడకుండా, వారిపై పాత సామాజిక విలువల్ని పై నుండి రుద్దటానికి నిబంధనలు, సూత్రాలు, విధానాలపై ఆధారపడటమే క్యాంపస్ సంస్కృతిలో మార్పుని ఆపుతున్న అతి పెద్ద అడ్డంకి!

అపర్ణ ఇఫ్లూలో పరిశోధక విద్యార్థిని

**అనువాదం : ఎ.సునీత**